అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
మంగళవారం 08-10-2024 సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 280 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



వైద్యశాస్త్రంలో అమెరికన్ శాస్త్రవేత్తలకు నోబెల్



వివరాలు 6లో..

సహకరించుకుందాం

ద్వైపాక్షిక సంబంధాల పటిష్టతే లక్ష్యం : ప్రధాని మోడీతో మాల్దీవుల అధ్యక్షుడు ముయిజు భేటీ



వివరాలు 6లో..

దౌత్య వైఫల్యం సిగ్గుచేటు

పశ్చిమాసియాలో వార్‌పై పోప్ ఫ్రాన్సిస్ వ్యాఖ్యలు



వివరాలు 6లో..

మారణహోమం ఆపాలి

అమెరికా మార్గాన్ని అనుసరిస్తున్న మోడీ సర్కార్ :

పాలస్తీనా సంఘీభావ ఆందోళనలో ప్రకాశ్‌కరత్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పాలస్తీనాపై ఇజ్రాయిల్ మారణహోమాన్ని ఆపాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు, సమన్వయకర్త ప్రకాశ్‌కరత్ డిమాండ్ చేశారు. పాలస్తీనాపై ఇండియాకు అనాదిగా ఉన్న వైఖరిని మోడీ సర్కార్ పలుచన చేస్తోందని విమర్శించారు. గాజాలో ఏడాదిగా ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణ హోమానికి నిరసనగా సోమవారం వామపక్ష పార్టీలు దేశవ్యాప్తంగా పాలస్తీనా సంఘీభావ దినాన్ని నిర్వహించాయి. తక్షణ కాల్పుల విరమణ చేయాలని, ఇజ్రాయిల్‌కు ఇండియా ఆయుధ ఎగుమతులను నిలిపివేయాలని, స్వతంత్ర పాలస్తీనా రాజ్య స్థాపన కోసం ద్విపాక్షిక పరిష్కారాన్ని రూపొందించడానికి ఇండియా జోక్యం చేసుకోవాలని పిలుపునిచ్చాయి. వామపక్ష పార్టీలతోపాటు ప్రజా సంఘాలు, సివిల్ సొసైటీ గ్రూప్‌లు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి. ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు, సమన్వయకర్త ప్రకాశ్‌కరత్ మాట్లాడుతూ మోడీ నేతత్వంలోని బీజేపీ ప్రభుత్వం అమెరికా మార్గాన్ని అనుసరిస్తోందని విమర్శించారు. "గాజాలో గతేడాదిలో 42 వేల మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ఇది అధికారిక లెక్క, వాస్తవ సంఖ్య ఎక్కువగా ఉండొచ్చు" అని ప్రకాశ్‌కరత్ అన్నారు. "చంపబడిన వారిలో ఎక్కువ మంది మహిళలు, చిన్న పిల్లలు ఉన్నారంటే ఇది ఎలాంటి యుద్ధమో రుజువు చేస్తోంది. ఇది మొత్తం సమాజాన్ని అంతం చేయడానికి ఉద్దేశించిన మారణహోమం" అని పేర్కొన్నారు. ఇప్పుడు గాజాను మాత్రమే లక్ష్యంగా చేసుకోవడం లేదని, ఇజ్రాయిల్ ...13లో

చెరువులను, మూసీని కాపాడొద్దా?

మాది గడీల పాలన కాదు



తలుపులు తెరిచే ఉంచాం

రండి...ఏం చేద్దామో చెప్పండి

తప్పుడు ప్రచారం చేయొద్దు :

హైడ్రాపై బీఆర్ఎస్ నేతలకు

డిప్యూటీ సీఎం భట్టి సూచన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

చెరువులను, మూసీని కాపాడి భవిష్యత్ తరాలకు హైదరాబాద్‌ను సురక్షిత నగరంగా అందించొద్దా? అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రశ్నించారు. హైడ్రా, మూసీ రిజర్వాయర్ ప్రక్షాళనపై ప్రతిపక్షాలు అపోహలు సృష్టించి రాష్ట్ర ప్రభుత్వం, పాలనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని విమర్శించారు. సోమవారం ...13లో

విదేశీ కంపెనీలతో సింగరేణి ఉమ్మడి భాగస్వామ్యం

ఖనిజాన్వేషణ సహా నూతన రంగాల్లోకి ప్రవేశం

ఖాళీ ప్రదేశాల్లో గ్రీన్ ఎనర్జీ ప్లాంట్లు

సింగరేణి ఉద్యోగులకు లాభాల వాటా పంపిణీ

కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి 6లో..

మావోయిస్టులు అభివృద్ధి నిరోధకులు

ఎనిమిది కోట్ల మందికి కనీస సౌకర్యాల్లేకుండా చేయడం మానవ హక్కుల ఉల్లంఘనే

నిర్మూలనకు శాశ్వత పరిష్కారం చేపట్టాలి



మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల హోం మంత్రులతో కేంద్రమంత్రి అమిత్ షా సమీక్షా సమావేశం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో మావోయిస్టుల ప్రభావం తగ్గిందని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. సోమవారం నాడిక్కడ విజ్ఞాన్ భవన్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా అధ్యక్షతన మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల హోం మంత్రుల సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల అభివృద్ధికి మావోస్టుల ప్రభావం అతిపెద్ద అడ్డంకి మాత్రమే కాదనీ, మానవాళికి శత్రువని అన్నారు. దాదాపు ఎనిమిది కోట్ల మందికి కనీస సౌకర్యాల్లేకుండా చేయడం మానవ హక్కులను ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. మావోయిస్టులు అమర్చిన మందుపాతరలతో వేలాది మంది అమాయక గిరిజనులు చనిపోయారని, ఈ కారణంగా ఈ ప్రాంతాల్లో అభివృద్ధి ఆగిపోయిందని తెలిపారు. మావోయిస్టుల ప్రభావాన్ని పూర్తిగా నిర్మూలించడానికి, ఈ ముప్పును శాశ్వతంగా తొలగించడానికి చర్యలు చేపట్టాలని అన్నారు. 2026 ఏప్రిల్ నాటికి ప్రజల సమిష్టి బలంతో రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం కలిసికట్టుగా పని చేసి మావోయిస్టుల ముప్పును పూర్తిగా ...5లో



హైదరాబాద్ సీఎస్ఎంపీని అమృత్ 2.0లో చేర్చండి

సీఎస్ఎంపీ, మూసీలపై డీపీఆర్ అందజేత

మెట్రో రైలు రెండో దశకు మద్దతు ఇవ్వండి :

కేంద్ర మంత్రి ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి వినతి

వివరాలు 6లో..

వరద నష్టం పనులకు రూ.11,713.49 కోట్లు ఇవ్వండి

రాష్ట్ర పునర్విభజన సమస్యలు పరిష్కరించండి

ఎల్‌డబ్ల్యూఈలో ఆ మూడు జిల్లాలను తిరిగి చేర్చండి

ఐపీఎస్ అధికారుల సంఖ్యను పెంచండి :

కేంద్ర మంత్రి అమిత్ షాకు సీఎం రేవంత్ రెడ్డి వినతి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణలో భారీ వర్షాలతో దెబ్బతిన్న మౌలిక వసతుల పునరుద్ధరణ, మరమ్మతులకు రూ.11,713.49 కోట్లను సత్వరమే విడుదల చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం నాడిక్కడ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ ...3లో

అమానుష దాడి

అమెరికా మద్దతుతోనే ఇజ్రాయిల్ దురాగతాలు

భారత ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలి : 6లో..

హైదరాబాద్‌లో వామపక్షాల నిరసన




కోటా ఫుల్...రేషన్ నిల్

2011 జనాభా లెక్కలతోనే కోటా నిర్ణయం

ఫలితంగా పీడీఎస్‌కు దూరమైన 13 కోట్ల మంది పేదలు

మరోవైపు ఆహార నిల్వలు పుష్కలంగా ఉన్నాయంటూ ప్రధాని గొప్పలు

న్యాయస్థానం ఆగ్రహించినా చలనం లేని ప్రభుత్వం



దేశంలో ఆహార ధాన్యాల నిల్వలు పుష్కలంగా ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోడీ చెబుతున్నారు. కానీ నేటికీ 13 కోట్ల మంది పేదలకు ప్రజా పంపిణీ వ్యవస్థ అందుబాటులో లేదు. ఆ కుటుంబాలన్నీ అర్థాకలితో అలమటించాల్సి వస్తోంది. దేశ జనాభా పెరిగిపోతున్నా రేషన్ కోటా మాత్రం పెరగడం లేదు. జనగణన జరిగే వరకూ కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేమని ప్రభుత్వం తెగేసి చెబుతోంది. అత్యున్నత న్యాయస్థానం అక్షింతలు వేసినా, ఆగ్రహించినా, డెడ్‌లైన్లు విధించినా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. పైగా రేషన్ కార్డులు ఉన్న వారందరూ ఈ-కేవైసీ సమర్పించాల్సిందేనని తాఖీదులు పంపుతోంది. లేకుంటే కార్డులు రద్దవుతాయని భయపెడుతోంది.

న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికలకు ముందు జనవరి 12వ తేదీన భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) దేశంలోని తన 26 ప్రాంతీయ కార్యాలయాలకు ఓ సమాచారం పంపింది. బియ్యం బస్తాల సరఫరా కోసం టెండర్లు పిలవాలని, ఆ బస్తాలపై ప్రధాని నరేంద్ర మోడీ లోగో ముద్రించి ఉండాలని సూచించింది. మోడీ లోగోతో ఉన్న బస్తాలలోనే ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై) పథకం కింద పేదలకు ఆహార ధాన్యాలు పంపిణీ చేయాలని నిర్ణయించారు. కొన్ని నెలల తర్వాత ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో మోడీ ప్రసంగిస్తూ 2020 నుంచి పేదలకు ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత రేషన్ గురించి గొప్పగా చెప్పుకొచ్చారు. అన్నార్తుల బాధలు తనకు తెలుసునని, వారి పట్ల సానుభూతి ఉన్నదని మొసలి కన్నీరు కార్చారు. దేశంలోని ఎనిమిది కోట్ల మంది పేదలకు రేషన్ కార్డులు లేవని గత సంవత్సరం ఆగస్టులో కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. అంటే దీనర్థం ఆ ఎనిమిది కోట్ల మందికి పీఎంజీకేఏవై కింద ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదు. అయితే ఈ సంఖ్య 13 కోట్ల వరకూ ఉంటుందని స్వతంత్ర పరిశోధకుల అంచనా. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా గ్రామీణ జనాభాలో 75 శాతం మందికి, పట్టణ జనాభాలో 50 శాతం మందికి సబ్సిడీపై ఆహార ధాన్యాలు అందజేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. 2013వ సంవత్సరపు జాతీయ ఆహార భద్రతా చట్టం కింద దేశ జనాభాలో మూడింట రెండు వంతుల మంది...అంటే 67 శాతం మందికి ప్రయోజనం చేకూరాల్సి ఉంది. దీని ఆధారంగానే రేషన్ కోటాను ...13లో

మూతపడిన కంపెనీలో విద్యుద్ఘాతం

మేడ్చల్ జిల్లాలో ఇద్దరు కార్మికులు మృతి..ఆరుగురికి గాయాలు

నవతెలంగాణ-మేడ్చల్

మూతపడిన కంపెనీలో నిచ్చెనను తీస్తుండగా విద్యుద్ఘాతంతో ఇద్దరు కార్మికులు ప్రాణం కోల్పోయారు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ పారిశ్రామికవాడలోని హిందుస్థాన్ యూనిలివర్ లిమిటెడ్ కంపెనీ ఇటీవల శంషాబాద్‌కు షిఫ్ట్ అయింది. కంపెనీ ఆవరణలో ఉన్న 15 అడుగుల ఇనుప ...13లో

కాశ్మీరంలో పీడీపీ కీలక పాత్ర ?

నేడు ఎన్నికల ఫలితాలు 5లో..



దళితుడి ఇంట్లో రాహుల్ వంట

మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో కాంగ్రెస్ అగ్రనేత ములాఖాత్



వివరాలు 13లో

బొగ్గు గనిలో పేలుడు..ఏడుగురు మృతి

పశ్చిమబెంగాల్ బీర్‌భూమ్‌లో ప్రమాదం

బీర్‌భూమ్ : పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఘోర ప్రమాదం సంభవించింది. బీర్‌భూమ్ జిల్లాలోని ఓ బొగ్గు గని లో సోమవారం భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. బీర్‌భూమ్‌లోని లోక్‌పూర్ ప్రాంతంలో ఉన్న గంగారామ్‌చక్ మైనింగ్ ప్రయివేట్ గనిలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ పేలుడు ధాటికి ఏడుగురు ప్రాణాలు కోల్పోగా.. పలువురు గాయపడ్డారు. సమీపంలో పార్క్ చేసిన వాహనాలు సైతం ధ్వంసమయ్యాయి. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు.



రేపే డీఎస్సీ అభ్యర్థులకు నియామకపత్రాలు

- సాయంత్రం 4 గంటలకు ఎల్బీస్టేడియంలో ఇవ్వనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- నేడు 1:1 జాబితా విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి జిల్లా నియామక కమిటీ (డీఎస్సీ)కి 1:1 చొప్పున ఎంపికైన అభ్యర్థుల మంగళవారం విడుదల కానుంది. సోమవారం అర్ధరాత్రి డీఈవో కార్యాలయాలకు పాఠశాల విద్యాశాఖ సంచాలకుల కార్యాలయం పంపించనుంది. ఎంపికైన అభ్యర్థులు అన్ని జిల్లాల్లోని డీఈవో కార్యాలయాల వద్ద ఉదయం ఏడు గంటలకే చేరుకోవాలని పలువురు డీఈవోలు ప్రకటించడం గమనార్హం. వారికి గుర్తింపు కార్డు (ఐడీ)ను అందజేస్తారు. ఆ తర్వాత బుధవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా నియామకపత్రాలను అందుకునే కార్యక్రమానికి హాజరు కావడానికి అవకాశముంటుంది. బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేస్తారు. ఇప్పటికే అన్ని జిల్లాల్లో ధ్రువపత్రాల పరిశీలన ముగిసింది. 25,924 మంది అభ్యర్థులను ఎంపిక చేస్తే, వారిలో 24,466 మంది అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 29న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. జులై 18 నుంచి ఆగస్టు ఐదో తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా కంప్యూటర్ ఆధారిత విధానం (సీబీఆర్టీ)లో డీఎస్సీ రాతపరీక్షలను నిర్వహించింది. గతనెల 30న డీఎస్సీ ఫలితాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విడుదల చేసిన విషయం తెలిసిందే.

స్పెషల్ ఎడ్యుకేషన్ అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన జరపండి

- విద్యాశాఖ కార్యాలయం వద్ద అభ్యర్థుల నిరసన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మిగిలిపోయిన జిల్లాల్లోనూ స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయ అభ్యర్థులకు 1:3 నిష్పత్తి చొప్పున ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించాలని కోరారు. ఇందుకు సంబంధించి సోమవారం పాఠశాల విద్యాశాఖ సంచాలకుల కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయ అభ్యర్థులకు సంబంధించి 20 జిల్లాల్లో ధ్రువపత్రాల పరిశీలన చేపట్టారని వివరించారు. మిగిలిన 13 జిల్లాల్లో మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు అభ్యర్థులు టెట్‌ను మినహాయించాలంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను ఆపాలంటూ ఎలాంటి స్టే లేదని అభ్యర్థులు వాపోయారు. కోర్టులో కేసు వేసిన అభ్యర్థులు ఉన్న జిల్లాల్లోనూ ధ్రువపత్రాల పరిశీలన జరిగిందని వివరించారు. అయితే మిగిలిన జిల్లాల్లో నిర్వహించకపోవడం వల్ల ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని న్యాయం చేయాలని కోరారు. కొందరు అభ్యర్థులు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డిని కలిశారు. హైకోర్టులో కేసు ఉన్నందున ధ్రువపత్రాల పరిశీలన చేపట్టడానికి అవకాశం లేదని వారు వివరించినట్టు తెలిసింది. ఈనెల 24న ఆ కేసు విచారణకు వస్తుందనీ, హైకోర్టు తీర్పు ఆధారంగానే ముందుకెళ్తామని చెప్పినట్టు సమాచారం. లేదంటే కోర్టును ఆశ్రయించిన అభ్యర్థులు ఆ కేసును ఉపసంహరించుకుంటే ధ్రువపత్రాల పరిశీలన చేపట్టి అభ్యర్థులను ఎంపిక చేయడానికి ఎలాంటి అడ్డంకులు ఉండబోవని స్పష్టం చేసినట్టు తెలిసింది. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో లక్ష్మీనారాయణ, భాస్కర్‌రావు, గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ-2008 అభ్యర్థులకు న్యాయం చేయండి

- విద్యాశాఖ సంచాలకులు నరసింహారెడ్డికి వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డీఎస్సీ-2008లో నష్టపోయిన బీఎడ్ అభ్యర్థులకు న్యాయం చేయాలని టీఎస్‌టీటీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు ఇస్లావత్ లక్ష్మణ్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. 28 జీవో వల్ల బీఎడ్ అభ్యర్థులు నష్టపోయారని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారి జాబితాను ప్రకటించారని వివరించారు. 28 జీవో వల్ల నష్టపోయిన అభ్యర్థుల పేర్లను ప్రకటించలేదని పేర్కొన్నారు. అధికారుల తప్పిదం వల్ల మళ్లీ నష్టపోయే ప్రమాదముందని తెలిపారు. డీఎస్సీ-2008 అభ్యర్థులకు న్యాయం చేస్తామని నరసింహారెడ్డి హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ధనసరి వెంకటేశ్వర్లు, బానోత్ భాస్కర్, నునవత్ పూర్ణ, గుగులోత్ రవి, రాందాస్, తాటి అశోక్, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రచారకర్తగా సచిన్



నవ తెలంగాణ - హైదరాబాద్

ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా (బిఒబి) తన గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ క్రికెటర్ సచిన్ టెండుల్కర్‌ను నియమించుకుంది. సచిన్‌తో ఒప్పందం తమ ప్రయాణాన్ని మరో దశకు తీసుకెళ్లనుందని ఆ బ్యాంక్ విశ్వాసం వ్యక్తం చేసింది. ఇందులో భాగంగా 'ప్లే ది మాస్టర్ స్ట్రోక్' పేరుతో నూతన ప్రచారాన్ని ప్రారంభిస్తున్నట్లు బిఒబి ఎండి, సిఇఒ దేబదత్త చంద్ తెలిపారు.

సహకరించండి

- ఏఓయూ ఉద్యోగులకు జేఎన్ఏఎఫ్ఏయూ పూర్వ విద్యార్థుల విజ్ఞప్తి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ (జెఎన్ఎఎఫ్ఏయూ)కి రాష్ట్ర ప్రభుత్వం పది ఎకరాల భూమిని కేటాయించడంపట్ల పూర్వ విద్యార్థులు, పూర్వ ప్రిన్సిపల్స్, పూర్వ ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ (ఏఓయూ)కి చెందిన పది ఎకరాల భూమిని తమకు కేటాయించారనీ, దీనిపై ఏఓయూ ఉద్యోగులు ఆందోళనలు చేయవద్దని కోరారు. దాదాపు 70 ఎకరాల స్థలం ఏఓయూలో నిరుపయోగంగా ఉన్నదనీ, దాన్ని సద్వినియోగం చేయడం కోసమే సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. తమ యూనివర్సిటీ కేవలం మూడు ఎకరాల్లో ఉన్నదనీ, దాన్ని విస్తరించే ప్రయత్నాల్లో రాజకీయ కోణాలు చూడొద్దని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ ఆర్ట్స్ సొసైటీ అధ్యక్షులు రమణారెడ్డి అధ్యక్షతన సోమవారంనాడిక్కడి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం జరిగింది. జేఎన్ఏఎఫ్ఏయూ మాజీ ప్రిన్సిపల్స్ ప్రొఫెసర్ ఎస్ఆర్ పీరస్, దశరథరెడ్డి, పూర్వ విద్యార్థులు పసునూరి దయాకర్ (మాజీ ఎంపీ), రవీందర్‌రెడ్డి, జె వెంకటేశ్వర్లు, బస్వరాజ్, నరేందర్, సదానంద్ తదితరులు మాట్లాడారు. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఉద్యోగులు ఫైన్‌ఆర్ట్స్ యూనివర్సిటీ విస్తరణను అడ్డుకోవద్దనీ, సానుకూలంగా స్పందించాలని కోరారు. దీనివల్ల అంబేద్కర్ యూనివర్సిటీకి కూడా మంచిపేరు వస్తుందనీ, ఆ ప్రాంగణాన్ని కూడా తాము మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో చిత్రపరిశ్రమ వేగంగా విస్తరిస్తున్నదనీ, ఫలితంగా వేలాది మందికి ఉపాధి అవకాశాలు దొరుకుతున్నాయని చెప్పారు. తమ యూనివర్సిటీ ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ)లో శిక్షణ ఇచ్చి, మరింతమందికి ఉపాధి అవకాశాలు కల్పించే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ యూనివర్సిటీలో చదువుకొనే చిత్రలేఖకులు ప్రకృతినే కాన్వాస్‌గా మార్చి, అద్భుతమైన కళాఖండాలను సృష్టిస్తారని తెలిపారు. భూ కేటాయింపుపై ఎలాంటి వివాదాలకు తావివ్వవద్దని వారు కోరారు.

ఎఐతో కొత్త ఆవిష్కరణలకు ఊతం

- బ్లూ క్లౌడ్ సాఫ్ట్‌టెక్ కొత్త అప్లికేషన్ల అభివృద్ధి : మంత్రి శ్రీధర్ బాబు



నవ తెలంగాణ - హైదరాబాద్

హైదరాబాద్‌లో ప్రధాన కార్యాలయం కలిగిన బ్లూ క్లౌడ్ సాఫ్ట్‌టెక్ (బిసిఎస్) నాలుగు కొత్త కృత్రిమ మేధస్సు (ఎఐ)- ఆధారిత ఉత్పత్తులను-బ్లూహెల్త్ అప్లికేషన్, బ్లురా, ఎడ్యు జెనీ, బయోస్టర్‌లను ఆవిష్కరించింది. వీటిని సోమవారం తెలంగాణ ఐటి శాఖ మంత్రి డి శ్రీధర్ బాబు ఆవిష్కరించారు. ఎఐ కొత్త ఆవిష్కరణలకు ఉత్ప్రేరకంగా ఉంటుందన్నారు. "చికిత్సను వ్యక్తిగతీకరించవచ్చు. మెరుగైన ఫలితాలను సాధించవచ్చు, అంతిమంగా ఆరోగ్య సంరక్షణను ప్రతి వ్యక్తికి సమర్థవంతంగా, మరింత అందుబాటులోకి తీసుకురావచ్చు. కలిసికట్టుగా, మనం ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు మార్గం సుగమం చేస్తున్నాము" అని మంత్రి పేర్కొన్నారు. కృతిమ మేధస్సును ఉపయోగించుకోవడంలో బ్లూ క్లౌడ్ సాఫ్ట్‌టెక్ నిబద్ధతలో ఈ ప్రయోగం ఒక ముఖ్యమైన మైలురాయిని గుర్తించిందన్నారు. విప్లవాత్మక డిజిటల్ పరిష్కారాలతో భవిష్యత్తును ముందుకు తీసుకెళ్లడంలో ఇది తన విజయాన్ని ప్రదర్శించనుందన్నారు.

ఈ కార్యక్రమంలో బ్లూ క్లౌడ్ సాఫ్ట్‌టెక్ సొల్యూషన్స్ లిమిటెడ్ (బిసిఎస్) ఛైర్మన్ జానకి యార్లగడ్డ పాల్గొన్నారు.

లాట్ మొబైల్స్‌లో దసరా, దీపావళి ఆఫర్లు



నవ తెలంగాణ - హైదరాబాద్

మొబైల్ రిటైల్ చెయిన్ లాట్ మొబైల్స్ దసరా, దీపావళి పండగల సందర్భంగా ప్రత్యేక ఆఫర్లను అందిస్తున్నట్లు ప్రకటించింది. స్మార్ట్‌ఫోన్లు, టివిలు, ల్యాప్‌టాప్‌లు, ఎలక్ట్రానిక్స్ పరికరాల కొనుగోళ్లపై ఇది వరకు ఎప్పుడూ లేని విధంగా 40 శాతం వరకు తగ్గింపును అందిస్తున్నామని ఆ సంస్థ డైరెక్టర్ ఎం అఖిల్ తెలిపారు. రూ.9,999 వరకు విలువ చేసే ప్రతీ కొనుగోలుపై ఖచ్చితమైన బహుమతులు పొందవచ్చన్నారు. కొనుగోళ్లపై 10 శాతం వరకు తక్షణ క్యాష్ బ్యాక్, జీరో డౌన్ పేమెంట్, నోకాస్ట్ ఇఎంఐ ఫైనాన్స్ స్కీమ్స్, ఎస్‌బిఐ క్రెడిట్ కార్డుపై 5 శాతం వరకు తగ్గింపు అందిస్తున్నామన్నారు. వినియోగదారులు దగ్గరలోని లాట్ మొబైల్స్‌ను సందర్శించి ఆఫర్లను పొందవచ్చని లాట్ మొబైల్స్ డైరెక్టర్ ఎం సుప్రజా పేర్కొన్నారు.

విషపు తిండి

భారత్‌ను భయపెట్టిస్తున్న కొన్ని వ్యాధులలో డయాబెటిస్ (మధుమేహం) ఒకటి. దేశంలో మారుతున్న ఆహారపు అలవాట్లు డయాబెటిస్ వ్యాధికి భారత్‌ను రాజధానిగా మారుస్తున్నాయి. ఈ విషయంలో వైద్యులు, ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● డయాబెటిస్‌కు పలు ఆహార పదార్థాలు ఆజ్యం ● విపరీతంగా వేయించిన, అల్ట్రా ప్రాసెస్ ఫుడ్‌తో మధుమేహం ● ఐసీఎంఆర్, ఎండీఆర్ఎఫ్ అధ్యయనం ● తిండి, ఆరోగ్య పట్ల అప్రమత్తత అవసరం

హెచ్చరిస్తున్న వైద్య, ఆరోగ్య నిపుణులు



న్యూఢిల్లీ : బయట దొరికే కేకులు, చిప్స్, కుకీలు, వేయించిన, కాల్చిన ఆహార పదార్థాలు, వనస్పతి, అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్, అడ్వాన్స్‌డ్ గ్లైసేషన్ ఎండ్ ప్రోడక్ట్స్ (ఏజీఈలు)తో పాటు పలు ఆహార పదార్థాలు భారత్‌ను ప్రపంచ డయాబెటిక్ రాజధానిగా చేస్తున్నాయని వారు అంటున్నారు. చెన్నైలోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్), మద్రాస్ డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఎండీఆర్ఎఫ్)తో సహా వివిధ సంస్థల పరిశోధకులు నిర్వహించిన ఇలాంటి తొలి రకం క్లినికల్ ట్రయల్‌లో ఇది వెల్లడైంది. ఈ అధ్యయనాన్ని ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ఫుడ్ సైన్సెస్ అండ్ న్యూట్రిషన్‌లో ప్రచురించారు.

ఈ అధ్యయనం ప్రకారం.. వేయించిన, కాల్చిన, అల్ట్రా-ప్రాసెస్డ్ ఆహార పదార్థాలు భారత్‌లో డయాబెటిస్ వ్యాధికి కారణమవుతున్నాయి. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, తక్కువ కొవ్వు పాలు వంటి తక్కువ ఏజీఈలు ఉన్న ఆహారాన్ని తీసుకోవటం ద్వారా అధిక బరువు, ఊబకాయం ఉన్న వ్యక్తుల శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. దీని ద్వారా ఊబకాయం సంబంధిత టైప్ 2 మధుమేహం భారాన్ని తగ్గించే సామర్థ్యాన్ని కలిగి ఉన్నదని పరిశోధకులు వివరించారు. ఏజీఈ రిజ్ ఫుడ్స్, వాటికి ఏయే ప్రక్రియలు అధిక మొత్తంలో ఏజీఈలను కలిగి ఉంటాయో అర్థం చేసుకోవటం మధుమేహంతో పోరాడటంలో భారత్ వ్యూహానికి కీలకమని ఎండీఆర్ఎఫ్ చైర్మెన్, రచయితల్లో ఒకరైన డాక్టర్ వి. మోహన్ తెలిపారు.

పది కోట్ల మందికి పైగా ప్రజల్లో మధుమేహం

ఐసీఎంఆర్, ఎండీఆర్ఎఫ్ అధ్యయనాన్ని.. 2008 నుంచి 2020 మధ్య 31 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో చేసిన సర్వే ఆధారంగా నిర్వహించారు. 2021లో భారత్‌లో డయాబెటిస్ 11.4 శాతంతో ఎక్కువగా ఉన్నట్టు ఇందులో తేలింది. అంటే, దాదాపు పది కోట్ల మందికి పైగా భారతీయులు మధుమేహంతో బాధపడుతున్నారని అంచనా. కొవ్వు, చక్కెర, ఉప్పు, ఏజీఈలలో అధికంగా ప్రాసెస్డ్ చేయబడిన ఆహారాన్ని తీసుకోవటం ద్వారా దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదం ఎక్కువ ఉన్నదని పాశ్చాత్య దేశాల గత అధ్యయనాలు నిరూపించాయి. భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో చోటు చేసుకున్న వేగవంతమైన పోషణ పరివర్తన, శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు, కొవ్వులు, జంతు ఉత్పత్తులను ఎక్కువ తీసుకోవటానికి దారి తీసింది. అయితే, ఇలాంటి ఆహారపు అలవాట్లు, చలనంలేని జీవనశైలితో కలిపి.. ఊబకాయం, మధుమేహం, సంబంధిత రుగ్మతల ప్రాబల్యాన్ని మరింత పెంచుతుందని పరిశోధకులు అంటున్నారు. భారతీయ ఆహారంలో ఏజీఈలపై సమాచార కొరత ఉన్నదనీ, భారతీయులు ఇన్సులిన్ నిరోధకతకు ఎక్కువ అవకాశం ఉన్నందున ఇలాంటి సమాచారం విలువైందని అధ్యయనం తెలిపింది. దీంతో, భారత్‌లో అధిక బరువు, ఊబకాయం ఉన్న పెద్దల్లో గ్లూకోజ్, లిపిడ్ జీవక్రియ, ఆక్సీకరణ ఒత్తిడి, అధిక ఏజీఈ ఆహారాల ప్రభావాలను కొత్త అధ్యయనం పరిశోధించింది. పండ్లు, కూరగాయలు, పచ్చి ఆకుకూరలు, తృణధాన్యాలు వంటి ఆరోగ్యకరమైన ఆహారాలు, ప్రాసెస్ చేయనివి తక్కువ ఏజీఈని కలిగి ఉన్నాయని సాక్ష్యాధారాలతో కనుగొన్నట్టు డాక్టర్ మోహన్ వివరించారు. ఆహారాన్ని ఉడకబెట్టి, వేయించటం, గ్రిల్ చేయటం, కాల్చటం, దానికి నూనె, నెయ్యి లేదా ఇతర లిపిడ్లను జోడించటం వంటివి చేయకపోతే.. ఆ పదార్థానికి తక్కువ ఏజీఈ ఉంటుందని చెప్పారు. సాధారణంగా, వేయించిన, కాల్చిన ఆహార పదర్థాలు అత్యధిక ఏజీఈ స్థాయిలను కలిగి ఉంటాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. డ్రైనట్స్, కాల్చిన వాల్‌నట్స్, పొద్దుతిరుగుడు విత్తనాలు, వేయించిన చికెన్, బేకన్, గొడ్డు మాంసం వంటి ఆహారా పదార్థాల్లో ఎక్కువ ఏజీఈ స్థాయిలు ఉంటాయని చెప్తున్నారు.

వరద నష్టం పనులకు రూ.11,713.49 కోట్లు ఇవ్వండి

(మొదటిపేజీ తరువాయి)

అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించి వివిధ అంశాలపై వినతిపత్రం అందజేశారు. తెలంగాణలో ఆగస్టు 31 నుంచి సెప్టెంబరు 8 వరకు కురిసిన భారీ వర్షాలు, వరదలు రాష్ట్రంపై తీవ్ర ప్రభావం చూపాయని అన్నారు. దీంతో 37 మంది ప్రాణాలు కోల్పోయారని, లక్షకుపైగా పశువులు, ఇతర మూగజీవాలు మృత్యువాత పడ్డాయని తెలిపారు. 4.15 లక్షల ఎకరాల్లో పంట నష్టంతో పాటు రోడ్లు, కల్వర్టులు, కాజ్‌వేలు, చెరువులు, కుంటలు, కాలువలు దెబ్బతిన్నాయని కేంద్ర మంత్రి అమిత్ షా దృష్టికి సీఎం తీసుకెళ్లారు. మౌలిక వసతుల పునరుద్ధరణ, మరమ్మతులను తాము వెంటనే చేపట్టామని వివరించారు. ఆయా పనులకు రూ. 5,438 కోట్లు విడుదల చేయాలని సెప్టెంబరు 2న లేఖ రాసిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో పంట, ఇతర నష్టాలపై కేంద్ర బృందం పర్యటించి భారీ వర్షాలు, వరదలకు రూ.11,713 కోట్ల మేర నష్టం వాటిల్లిందని సెప్టెంబరు 30న నివేదిక సమర్పించిందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. వెంటనే ఆ నిధులు విడుదల చేయాలని కేంద్ర మంత్రి అమిత్‌షాను కోరారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి ఎస్‌డీఆర్ఎఫ్ మొదటి, రెండో విడతల కింద తెలంగాణకు కేంద్రం రూ.416.80 కోట్లను విడుదల చేసిందని, వీటిని పునరుద్ధరణ, మరమ్మతులకు విడుదల చేసే నిధులతో ముడిపెట్టవద్దని విజ్ఞప్తి చేశారు. ఎస్‌డీఆర్ఎఫ్‌కు సంబంధించిన నిధులను ఈ ఆర్థిక సంవత్సరంలోనే ఖర్చు చేయనున్నట్టు తెలిపారు.

ఆ మూడు జిల్లాలను ఎల్‌డబ్ల్యూఈలో కొనసాగించాలి

వామపక్ష తీవ్రవాద ప్రభావిత (ఎల్‌డబ్ల్యూఈ) జిల్లాల నుంచి తొలగించిన ఆదిలాబాద్, మంచిర్యాల, కుమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలను ఎల్‌డబ్ల్యూఈలో తిరిగి చేర్చాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఎల్‌డబ్ల్యూఈ ప్రభావిత రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లతో తెలంగాణకు సరిహద్దు ఉండటంతో రాష్ట్ర భద్రతపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. అంతర్గత భద్రతను దృష్టిలో ఉంచుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం కొండవాయి, ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఆలుబాక గ్రామాల్లో సీఆర్‌పీఎఫ్, జేటీఎఫ్ క్యాంపులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎస్పీవోలకు చెల్లించాల్సిన నిధుల్లో కేంద్రం వాటా 60 శాతం నాలుగేండ్లుగా పెండింగ్‌లో ఉందని, ఆ మొత్తం రూ.18.31 కోట్లు విడుదల చేయాలని కోరారు. 1,065 మందిని ఎస్పీవోల్లో చేర్చుకోవడానికి నిబంధనలు సడలించాలని కోరారు. తెలంగాణ సరిహద్దుల్లోని ములుగు జిల్లా పేరూరు, ములుగు, కన్నాయిగూడెం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పలిమెల, మహ ముత్తారం, కాటారం వంటి పోలీస్ స్టేషన్లను బలోపేతం చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. తెలంగాణ పోలీస్ శాఖ కొత్తగా నియమితులైన పోలీసు సిబ్బందికి గ్రేహౌండ్స్ ద్వారా తీవ్రవాద వ్యతిరేక వ్యూహాల్లో (ఏఈటీ) శిక్షణ ఇప్పిస్తున్నట్టు సీఎం తెలిపారు. 2024-25 సంవత్సరంలో ఈ రకమైన శిక్షణకు అదనపు బడ్జెట్ రూ.25.59 కోట్లు అవసరమని, ఆ మొత్తాన్ని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆధునిక అవసరాలకు అనుగుణంగా పోలీసు దళాలను తీర్చిదిద్దే పనులకు ఉద్దేశించిన ప్రత్యేక మౌలిక వసతుల పథకాని(ఎస్ఐఎస్)కి తెలంగాణకు అదనంగా రూ.23.56 కోట్లు విడుదల చేయాలని కోరారు.

పునర్విభజన సమస్య పరిష్కరించాలి

పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర పునర్విభజన సమస్యల పరిష్కారానికి సహకరించాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. షెడ్యూల్ 9లోని (చట్టంలోని 53, 68, 71 సెక్షన్ల ప్రకారం) ప్రభుత్వ భవనాలు, కార్పొరేషన్ల పంపిణీ, షెడ్యూల్ 10లోని సంస్థల వివాదం (చట్టంలోని 75 సెక్షన్ ప్రకారం) సామరస్యపూర్వక పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. పునర్విభజన చట్టంలో ఎక్కడా పేర్కొనని ఆస్తులు, సంస్థలను ఆంధ్రప్రదేశ్ క్లెయిమ్ చేసుకుంటు న్నందున, వాటిలో తెలంగాణకు న్యాయం జరిగేలా చూడాలని కేంద్ర మంత్రి అమిత్ షాను సీఎం కోరారు.

29 అదనపు ఐపీఎస్ పోస్టులు కేటాయించాలి

రాష్ట్రానికి 29 అదనపు ఐపీఎస్ పోస్టులను కేటాయించాలని సీఎం కోరారు. రాష్ట్ర పునర్విభజన సమయంలో తెలంగాణకు కేవలం 76 మంది ఐపీఎస్ అధికారులను మాత్రమే కేటాయించారని తెలిపారు. ఐపీఎస్ క్యాడర్‌పై వెంటనే రివ్యూ చేపట్టాలని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నల్లగొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి శేషాద్రి, డీజీపీ జితేందర్ పాల్గొన్నారు.



అమెరికాలో సీతారాం సంస్మరణ సభ

ఏచూరి స్ఫూర్తితో ప్రజాస్వామ్య విలువల కోసం పోరాటం

డెమోక్రటిక్ పార్టీ కోలిన్ కౌంటి అభ్యర్థి సందీప్ శ్రీవాత్సవ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అమెరికాలోని డల్లాస్ నగరంలో టెక్సాస్ ఇండియా సంకీర్ణం, డల్లాస్ ప్రొగ్రెసివ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో సోమవారం సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డెమోక్రటిక్ పార్టీ కోలిన్ కౌంటి అభ్యర్థి సందీప్ శ్రీవాత్సవ మాట్లాడుతూ సీతారాం ఏచూరి గొప్ప మేధావి అని ఆయన సేవలను కొనియాడారు. అమెరికా, భారతదేశం రెండు పెద్ద ప్రజాస్వామ్య దేశాలని చెప్పారు. భారతదేశంలోని ప్రజాస్వామ్య విలువల కోసం ఏచూరి ఎలాగైతే పోరాడారో, అదే స్ఫూర్తితో తాము కూడా అమెరికాలో ప్రజాస్వామ్య విలువల కోసం పోరాడుతున్నామని అన్నారు. నార్త్ అమెరికా తెలుగు సొసైటీ (నాట్స్) మాజీ అధ్యక్షులు బాపయ్య మాట్లాడుతూ సీతారాం ఏచూరి భారతదేశానికి అందించిన సేవలు చాలా గొప్పవని అన్నారు. జేకే వెంకట్ మాట్లాడుతూ మతోన్మాదానికి వ్యతిరేకంగా ఆయన చేసిన అవిశ్రాంత పోరాటాన్ని ప్రశంసిం చారు. పార్లమెంటులో ప్రజల హక్కుల కోసం ఆయన మాట్లాడిన తీరుని స్మరించుకుంటున్నామని అన్నారు. శ్రీనివాస్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి భారతదేశానికి అందించిన సేవలను, సంకీర్ణ ప్రభుత్వాల ఏర్పాటులో ఆయన చేసిన కృషిని కొనియాడారు. కార్మిక, కర్షక, విద్యార్థి, మహిళల ప్రయోజనాల కోసం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆయన నిర్వహించిన పాత్రను గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, కర్నాటకతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన వందలాదిమంది హాజరై ఏచూరి చిత్రపటానికి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్, రాజా, చైతన్య, మార్టిన్, లెనిన్, నగేష్, అఖిల, అతుల్ షిండే, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోంది

కేంద్రంపై తేజస్వి మండిపాటు

'ల్యాండ్ ఫర్ జాబ్' కేసులో బెయిల్

న్యూఢిల్లీ : 'ఉద్యోగం కోసం భూమి' కేసులో బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన కుమారులు తేజస్వి యాదవ్, తేజ్ ప్రతాప్ యాదవ్‌లకు ఢిల్లీ కోర్టు సోమవారం బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో నిందితులందరికీ లక్ష రూపాయల వ్యక్తిగత పూచీకత్తుపై బెయిల్ మంజూరు చేస్తూ ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే ఆదేశాలు జారీ చేశారు. తదుపరి విచారణను ఈ నెల 25వ తేదీకి వాయిదా వేశారు. బెయిల్ పొందిన అనంతరం తేజస్వి విలేకరులతో మాట్లాడుతూ రాజకీయ ప్రతీకారం తీర్చుకోవడానికి కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. రాజకీయ కుట్రతోనే తమపై కేసు పెట్టారని చెప్పారు. కాగా న్యాయస్థానంపై తమకు నమ్మకం ఉన్నదని లాలూ ప్రసాద్ అన్నారు. ఈ కేసులో తమకు న్యాయం జరుగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మధ్యప్రదేశ్‌లోని జబల్పూరులో వెస్ట్ సెంట్రల్ రైల్వే జోన్‌లో గ్రూప్-డీ ఉద్యోగాలు ఇవ్వడం కోసం లాలూ ప్రసాద్ తన మంత్రి పదవిని దుర్వినియోగం చేసి ముడుపులు దండుకున్నారని సీబీఐ, ఈడీలు కేసు నమోదు చేశాయి. ఉద్యోగాలు ఇచ్చినందుకు బహుమతిగా లాలూ కుటుంబ సభ్యులు అభ్యర్థుల నుంచి భూమిని తీసుకున్నారని ఆరోపించాయి.



తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేశాం

ఇజ్రాయిల్-హమాస్ యుద్ధంపై ఓ జర్నలిస్ట్

యూఎస్ శ్వేతసౌధం బయట నిప్పంటించుకున్న వైనం

న్యూయార్క్ : సరిగ్గా ఏడాది క్రితం ఇజ్రాయెల్-హమాస్ మధ్య యుద్ధం మొదలైంది. గతేడాది అక్టోబర్ 7 నుంచి భయానక పరిస్థితులు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా, ఇజ్రాయెల్ కయ్యానికి కాలు దువ్వుతూ.. పాలస్తీనాపై విరుచుకుపడుతూ వచ్చింది. గాజాపై కాల్పులు జరుపుతూ ఇజ్రాయెల్ తన ఉన్మాదాన్ని ప్రదర్శించిందనీ, అది ఇప్పటికీ కొనసాగుతున్నదని అంతర్జాతీయ విశ్లేషకులు అంటున్నారు. ఇజ్రాయెల్ ఆగడాలకు అడ్డుకట్ట వేయకపోవటంతో, ఆ యుద్ధోన్మాదాన్ని లెబనాన్, ఇరాన్ వంటి దేశాలపై చూపెడుతున్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇక గాజాలో కాల్పుల విరమణపై ప్రపంచవ్యాప్తంగా డిమాండ్‌లు వినిస్తున్నాయి. అనేక చోట్ల ఆందోళనలు, నిరసనలు కొనసాగుతున్నాయి. ఈ ఆందోళనల్లో హక్కుల కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల నాయకులు, జర్నలిస్టులు.. ఇలా ప్రతీ రంగానికి చెందినవారూ పాల్గొంటున్నారు. ఇజ్రాయెల్ యుద్ధ పిచ్చిని తీవ్రంగా తప్పుబడుతున్నారు. గాజాలో కాల్పుల విరమణ చేయాలని గొంతెత్తుతున్నారు. తొలుత ఇజ్రాయెల్‌కు మద్దతు ఇచ్చినవారు కూడా, ప్రస్తుతం పశ్చాత్తాపపడుతుండటం గమనార్హం.

గతంలో ఇలాగే భావించిన ఒక జర్నలిస్టు.. ప్రస్తుతం యూఎస్‌లో జరుగుతున్న ఆందోళనల్లో పాల్గొన్నాడు. గాజాలో కాల్పుల విరమణకు డిమాండ్ చేస్తూ వాషింగ్టన్ నుంచి లాస్ ఏంజెల్స్ వరకు సాగిన నిరసన మార్చ్‌లో వేలాది మందితో కలిసి నడిచాడు. అయితే, ఆ సమయంలో సదరు జర్నలిస్టు తనకు తాను నిప్పంటించుకున్నాడు. శ్వేత సౌధం బయట నిప్పంటించుకున్న తర్వాత ఆయన మాట్లాడుతూ.. " నేను జర్నలిస్టును. మేము నిర్లక్ష్యంగా వ్యవహరించాం. మేము తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేశాం" అని చెప్పినట్టు ఒక వార్త సంస్థ వివరించింది. నిరసన ప్రారంభమైన రెండు గంటల తర్వాత ఈ ఘటన చోటు చేసుకోవటం గమనార్హం. కాగా, నిరసనల్లో పాల్గొన్న వ్యక్తులు, స్థానికులు, పోలీసులు సదరు వ్యక్తికి అంటుకున్న మంటలను ఆర్పే ప్రయత్నం చేసి, ఉపశమన చర్యలకు దిగారు. బాధితుడికి చికిత్స అందుతున్నదనీ, ఆయన ప్రాణానికేమీ ప్రమాదం లేదని పోలీసులు చెప్పారు.

ఎంఎంటీఎస్ రైళ్ల వ్యవస్థ నిర్వీర్యం

రైళ్ల సంఖ్యను పెంచడంతోపాటు సమయపాలనకు చర్యలు తీసుకోవాలి

కేంద్రమంత్రికి సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ బహిరంగ లేఖ

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ నగరంలో సామాన్య ప్రజలకు అత్యంత అందుబాటులో, చౌకగా ప్రయాణించగలిగే ఎంఎంటీఎస్ రైళ్లు ప్రజలకు దూరవుతున్నాయని, రైళ్ల సంఖ్య తగ్గిపోతోందని సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. ఎంఎంటీఎస్ రైళ్లు సమయపాలన పాటించడం లేవని, మరమ్మతుల పేరుతో రైళ్లు నిరంతరం రద్దవుతుండటంతో ఎంఎంటీఎస్ పట్ల ప్రయాణీకులు, ప్రజలు విశ్వాసం కోల్పోతున్నారని పేర్కొన్నారు. ఎంఎంటీఎస్ ఫేజ్-3కి సంబంధించిన 4 రూట్లలో రోజుకు ఒక రెండు రైళ్లు మాత్రమే నడుస్తున్నాయన్నారు. ఫలక్‌నుమా-లింగంపల్లి మార్గాల్లో సైతం రోజుకు రెండు రైళ్లు మాత్రమే నడుపుతున్నారన్నారని పేర్కొన్నారు. సికింద్రాబాద్ స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోవటంతో ఎంఎంటీఎస్ రైళ్లు స్టేషన్ బయట చాలా సేపు ఆగాల్సి వస్తోందని, దాంతో ఎంఎంటీఎస్ చాలా ఆలస్యంగా గమ్యం చేరుతున్నాయని తెలిపారు. ఎంఎంటీఎస్ మొదటి దశ రూట్లలో ప్రతిరోజూ లక్ష 80 వేల మంది ప్రయాణించేవారని, రెండో దశ రూట్లతో కలుపుకొని ప్రతిరోజూ 5 లక్షలకు పైగా ప్రయాణించగలిగే పరిస్థితి ఉన్నప్పటికీ ప్రస్తుతం రోజుకు 40 వేల మంది మాత్రమే ప్రయాణిస్తున్నారని పేర్కొన్నారు. ఎంఎంటీఎస్ రైళ్ల నిర్వహణలో తీవ్ర వైఫల్యం కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. రెండో దశ అభివృద్ధి కోసం రూ.900 కోట్లు ఖర్చుపెట్టినా ఏమాత్రం ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను త్వరలో ప్రారంభించబోతున్నారని, 25 రైళ్లు అదే స్టేషన్ నుంచి ప్రారంభమై అక్కడికే చేరనున్నాయని లేఖలో వివరించారు. చర్లపల్లి స్టేషన్ నుంచి ఎంఎంటీఎస్ రైళ్లను సరిపడా వేయడంతోపాటు రెగ్యులర్‌గా నడిపించాలని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎంఎంటీఎస్ రైళ్ల సంఖ్యను పెంచాలని, రెండో దశలో నిర్మించిన రూట్లన్నింటిలో తగినన్ని రైళ్లు నడపాలని పేర్కొన్నారు. రైళ్ల సమయపాలన పాటించాలని, మరమ్మతుల పేరుతో నిరంతరం రైళ్లను రద్దు చేయడం ఆపాలని రైల్వే అధికారులను ఎన్నిసార్లు కోరినా ఎలాంటి ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించి ఎంఎంటీఎస్ వ్యవస్థను గాడిన పెట్టేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు.





జీఓ 317పై త్వరగా నిర్ణయం తీసుకోండి

క్యాబినెట్ సబ్ కమిటీకి తెలంగాణ ఉద్యోగుల జేఏసీ విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉద్యోగులకు గుదిబండగా మారిన జీవో నెంబర్ 317పై త్వరగా నిర్ణయం తీసుకోవాలని క్యాబ్‌నెట్ సబ్‌కమిటీకి తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటి విజ్ఞప్తి చేసింది.

ఈ మేరకు కమిటీ చైర్మెన్ వి.లచ్చిరెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం కమిటీ చైర్మెన్ దామోదర రాజనర్సింహ, సభ్యులు శ్రీధర్ బాబును కలిసి వినతి పత్రం అందించింది. గత ప్రభుత్వం తెచ్చిన జీఓ వల్ల ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను సావధానంగా విన్న కమిటీ సానుకూలంగా స్పందించిందని జాయింట్ యాక్షన్ కమిటీ పేర్కొంది. త్వరలో జీవోపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు కె.రామకృష్ణ, జి.నిర్మల, రమేష్ పాక, స్పౌజ్ ఫోరం ప్రతినిధులు వివేక్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న

గాజా అనుకూల నిరసనలు

పలు ప్రముఖ నగరాల్లో ఆందోళనలు

న్యూఢిల్లీ : పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో అంతర్జాతీయ సమాజం స్పందిస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా పలు నగరాల్లో గాజా అనుకూల నిరసన ప్రదర్శనలు వేలాదిగా జరిగాయి. యూరోప్‌లోని పలు దేశాల రాజధానులు, వాషింగ్టన్, న్యూయార్క్‌లతో పాటు జకార్త, ఇస్తాంబుల్, రబత్‌లలో ఆందోళనలు సాగాయి. పాలస్తీనా ప్రతిఘటనకు మద్దతు ఇవ్వటానికి మేము ఇక్కడకు వచ్చామని ఇస్తాంబుల్ నిరసనల్లో పాల్గొన్న అహ్మెట్ ఉనల్ అన్నారు. వేలాది మంది నిరసనకారులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. ఇండోనేషియా రాజధాని జకార్తాలో వందలాది మంది ఆందోళనకారులు యూఎస్ ఎంబసీ ముందు గుమిగూడారు. ఇజ్రాయెల్‌కు ఆయుధాల సరఫరాను అడ్డుకోవాలని అమెరికాను వారు డిమాండ్ చేశారు. ఆస్ట్రేలియాలోనూ ఆందోళనలు సాగాయి. సిడ్నీలో వేలాది మంది ఆందోళనకారులు లెబనాన్, పాలస్తీనా జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా పోలీసులు అక్కడ భారీగా మోహరించారు. రబత్‌లో వేలాది మంది మొరాకన్‌లు మార్చ్ నిర్వహించారు. గాజా, లెబనాన్‌లో హింసకు ముగింపు పలకాలని వారు డిమాండ్ చేశారు. ఇజ్రాయెల్‌తో దౌత్య సంబంధాలు తెంచుకోవాలని నిరసనకారులు అన్నారు. పాలస్తీనాకు అనుకూలంగా నినాదాలు వినిపించారు. ఈ నిరసనల్లో హక్కుల కార్యకర్తలు, అడ్వొకేట్లు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

బీదర్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం

● బైక్‌ను ఢీకొట్టిన బస్సు ● ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి

నవతెలంగాణ-న్యాల్కల్, జహీరాబాద్

జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్కల్ మండల పరిధిలోగల బీదర్ రోడ్డుపై సోమవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పొలం పనులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వస్తున్న వారిని.. ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అక్కడికక్కడే మృతిచెందారు. జహీరాబాద్ రూరల్ సీఐ హనుమంతు తెలిపిన వివరాల ప్రకారం..



సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలంలోని గణేష్‌పూర్ గ్రామానికి చెందిన గూనెల్లి సిద్ధప్ప(70), ఆయన అల్లుడు బిర్దార్ జగన్నాథ్ (40), కూతురు రేణుక(30), మనవడు వినయ్(14) సోమవారం పొలం పనికెళ్లారు. సాయంత్రం తిరిగి నలుగురూ బైక్‌పై ఇంటికి బయల్దేరారు. ఈ క్రమంలో జహీరాబాద్ వైపు నుంచి అతివేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు వారి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సిద్ధప్ప అక్కడికక్కడే మృతిచెందాడు. జగన్నాథ్, రేణుక, వినయ్ కుమార్ తీవ్ర గాయాలతో రోడ్డు పక్కన ఉన్న పంట పొలాల్లో పడిపోయారు. కొన ఊపిరితో ఉండగా వారిని బీదర్ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ముగ్గురూ మృతిచెందారు.

వారి మృతదేహాలను కర్నాటక రాష్ట్రంలోని బీదర్ ప్రభుత్వ వైద్యశాలలో ఉంచారు. సంఘటన స్థలంలోనే చనిపోయిన సిద్ధప్ప మృతదేహాన్ని జహీరాబాద్ కమ్యూనిటీ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్న రూరల్ సీఐ హనుమంతు తెలిపారు. గ్రామానికి చెందిన ప్రజలు పెద్దఎత్తున ఘటనా స్థలానికి తరలివెళ్లారు. మృతదేహాలను చూసి కన్నీటి పర్యంతమయ్యారు.

అనాథలైన ముగ్గురు బాలికలు..

గూనెల్లి సిద్ధప్పకు పిల్లలు పుట్టకపోవడంతో రెండు వివాహాలు చేసుకున్నాడు. రెండో భార్యకు ఒక్కగానొక్క కూతురు రేణుక సంతానం. దీంతో రేణుకకు దగ్గరి బంధువైన జగన్నాథ్‌తో వివాహం చేసి ఇల్లరికం తెచ్చుకున్నారు. జగన్నాథం- రేణుకకు ముగ్గురు అమ్మాయిలు, కుమారుడు సంతానం. ఈ ప్రమాదంలో సిద్ధప్ప, కుమార్తె, అల్లుడు, మనవడు ప్రాణం కోల్పోవడంతో ఆ కుటుంబం దు:ఖ సముద్రంలో మునిగిపోయింది. బీదర్ రోడ్డుపై ఉన్న స్వామి నారాయణ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వినయ్.. తల్లిదండ్రులతో కలిసి పొలం చూసేందుకు వెళ్లి.. వారితోపాటే ప్రమాదంలో ప్రాణం కోల్పోయాడు. తాత, తల్లిదండ్రులు, సోదరుని మృతితో మిగతా ముగ్గురు బాలికలు దిక్కులేని వారయ్యారు. బాలికలు గుండెలవిసేలా రోదిస్తుండగా.. వారి చూసిన గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు.

బహిరంగంగా కన్పించే మురికి గుంటలకన్నా మనసులో మాలిన్యంగల వ్యక్తులవల్లే జాతికి ఎక్కువ ప్రమాదం - సర్వేపల్లి రాధాకృష్ణన్

సంపాదకీయం

ప్రభుత్వ పురుషాధిక్యచూపు



"చరిత్రలో ఎన్నో కథలు కాగితాల మీద కనపడవు. ఎందుకంటే, అవి స్త్రీల శరీరాల మీద, మనసు మీద రాయబడతాయి" అంటారు ప్రముఖ రచయిత్రి అమృతా ప్రీతం. ఆడపిల్లగా పుట్టినందుకు వివిధ దశలన్నీ కలిపి వంద మార్కులు వేసే పురుషాధిక్య సమాజం మనది. తరతరాలుగా స్త్రీల శరీరాలు, మనసులు ఇలా ఉండాలి అలా ఉండాలి అంటూ తెరలు కట్టి, హద్దులు గీసి, వారి స్వేచ్ఛకు, హక్కులకు కట్టుబాట్లనే శృంఖలాలు వేసిందీ సమాజం. భార్య అనుమతి లేకుండా భర్త ఆమెతో శారీరక సంబంధం పెట్టుకోవడాన్ని క్రిమినల్ నేరంగా పరిగణించాలన్న వినతిని కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకించింది. దాన్ని కూడా లైంగికదాడిగా గుర్తించి అందుకు అనుగుణంగా శిక్ష వేస్తే అది అత్యంత తీవ్రమైన చర్య అవుతుందని తెలిపింది. ఈ మేరకు ఈనెల 3న సుప్రీంకోర్టుకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ 49 పేజీల అఫిడవిట్‌ను అందించింది. దానిపై సర్వత్రా విమర్శలూ వస్తున్నాయి. ముఖ్యంగా, మహిళా లోకం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. కేంద్రం వాదనలను మహిళా న్యాయ వాదులు, మహిళా సంఘాల నాయకులు, హక్కుల కార్యకర్తలు తీవ్రంగా తప్పుబడుతున్నారు.

> "సెక్స్ విషయంలో భార్య ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా భర్త తనకు అన్నిటికీ అనుమతి ఉన్నట్టుగా వ్యవహరించి తన శారీరకవాంఛ తీర్చుకుంటే అది వైవాహిక లైంగికదాడే అవుతుంది. అలాంటి ప్రవర్తనకు శిక్ష విధించ లేనప్పటికీ అది శారీరక, మానసిక క్రూరత్వం కిందకే వస్తుంది" అని కేరళ హైకోర్టు తీర్పునిచ్చింది. భార్య శరీరం తనదేనని భర్త భావించడమే ఈ దారణాలకు కారణమవుతోందన్న కోర్టు...ఆధునిక సామాజిక న్యాయశాస్త్రంలో ఇలాంటి భావనకు చోటు లేదు అని స్పష్టం చేసింది.

నారీ శక్తి, బేటీ బచావో- బేటీ పఢావో...లాంటి నినాదాలు ప్రధాని నుంచి కమలం పార్టీ చిన్నా చితకా నేత వరకూ అలవోకగా జాలువారుతూనే ఉంటాయి. భారతమాత పుత్రికల కన్నీళ్లను తుడవడంలో, వారి మాన ప్రాణాలనూ, గౌరవాన్ని కాపాడటం మాత్రం తమ పని కాదంటూ తాజా అఫిడవిట్ సమర్పించడంతో తమ పని అయిపోయినట్టు మోడీ సర్కారు చేతులు దులిపేసుకుంది. అంతే కాదు వైవాహిక లైంగికదాడి సామాజిక సమస్య అని, చట్టపరమైన అంశం కాదని కూడా పేర్కొంది. ఒకవేళ దీన్ని క్రిమినల్ నేరంగా గుర్తిస్తే అది సమాజంపై ప్రభావం చూపిస్తుందని తెలిపింది. భార్యకు ఇష్టంలేని శృంగారాన్ని నేరంగా పరిగణిస్తే భర్తల మీదకు అనవసరమైన కేసులు వచ్చిపడతాయని కొందరు వాదిస్తున్నారు.

'అసహజమైన సెక్స్'తో లైంగికదాడికి పాల్పడినట్టు ఒక మహిళ, తన భర్తపై ఆరోపణలు చేసింది. "భారతీయ చట్టం వైవాహిక లైంగికదాడి గుర్తించనందున ఆ వ్యక్తి అసహజ సెక్స్ పద్ధతులు ప్రయత్నించినప్పటికీ ఆయన్ను నేరస్తుడిగా పరిగణించి తీవ్రమైన శిక్షలు విధించలేం" అని ఛత్తీస్‌గఢ్ హైకోర్టు తన నిస్సహాయతను వ్యక్తం చేస్తూ తీర్పు ఇచ్చింది. "న్యాయస్థానాలు ఇంకెప్పుడు మహిళల కోణం నుంచి సమస్యను పరిగణిస్తాయి?" అని ఆ తీర్పుపై సోషల్ మీడియాలో తీవ్ర వ్యతిరేకత ఎదురైంది.

"సెక్స్ విషయంలో భార్య ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా భర్త తనకు అన్నిటికీ అనుమతి ఉన్నట్టుగా వ్యవహరించి తన శారీరకవాంఛ తీర్చుకుంటే అది వైవాహిక లైంగికదాడే అవుతుంది. అలాంటి ప్రవర్తనకు శిక్ష విధించలేనప్పటికీ అది శారీరక, మానసిక క్రూరత్వం కిందకే వస్తుంది" అని కేరళ హైకోర్టు తీర్పునిచ్చింది. భార్య శరీరం తనదేనని భర్త భావించడమే ఈ దారణాలకు కారణమవుతోందన్న కోర్టు...ఆధునిక సామాజిక న్యాయశాస్త్రంలో ఇలాంటి భావనకు చోటు లేదు అని స్పష్టం చేసింది.

లైంగిక చర్యకు భార్య సమ్మతి ఉండాలని వివాహ బంధం సూచిస్తుంది. భర్త కోరికలను భార్య తిరస్కరించరాదంటూ సమాజంలో పాతుకుపోయిన నమ్మకం ఉండడంతో వైవాహిక లైంగికదాడి అనేది సాధారణంగా మారిపోయింది. కానీ చాలా ఏండ్లుగా, ప్రపంచవ్యాప్తంగా ఈ అంశాన్ని సవాలు చేస్తున్నారు. 100కు పైగా దేశాలు దీన్ని చట్టవిరుద్ధం చేశాయి. దీనిపై సుదీర్ఘ కాలంగా ఉద్యమాలు జరుగుతున్నప్పటికీ, 36 దేశాల్లో ఇది కేవలం చట్టంగానే మిగిలిపోయింది. అందులో భారత్ కూడా ఉంది. 31 శాతం మంది వివాహితలు అంటే కనీసం ముగ్గురిలో ఒకరు... తమ భర్తల కారణంగా శారీరక, మానసిక హింసలకు గురవుతున్నట్టు ఓ సర్వేలో తేలింది.

మహిళలపై లైంగికదాడులు, దారుణాలకు పాల్పడుతున్నట్టు అభియోగాలు ఎదుర్కొంటున్న వారు చట్టసభలకు ఎన్నికవడం సిగ్గుచేటు. ఇలాంటివారు ప్రజాస్వామ్యానికే తలవంపు. కాబట్టే ఇలాంటి అఫిడవిట్‌లను నిస్సిగ్గుగా, నిర్లజ్జగా న్యాయస్థానాలకు ఇచ్చింది కేంద్ర ప్రభుత్వం. అందుకే వ్యవస్థలపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లింది. స్త్రీలు ఇలాగే ఉండాలని చెప్పే పురుషాధిక్య కట్టుబాట్ల సంకెళ్లను తెంచుకొని తమ ఆత్మ గౌరవాన్ని నిలుపుకోవాలి. తమ ఇష్టాలకు బిగించిన కంచెలను, కంచుకోటలను తుత్తునియలు చేయాలి. ఆ దిశగా మహిళ అడుగులేయాలి. సమాజంలోని అభ్యుదయ శక్తులు అటువంటి వారితో భుజం భుజం కలపాలి. స్త్రీ, పురుష సమానత్వం అన్నింటా వెలుగొందాలి. అప్పుడే సమాజం పురోగమిస్తుంది.

ఈ దేశంలో ఆడపిల్లగా పుట్టకూడదని శోకించేంతగా మారుతున్న పరిస్థితులకు కారణం ఎవ్వరు? లైంగికదాడి జరిగితే నిందితులను శిక్షించాల్సిన ప్రభుత్వమే విభజన రేఖలు గీస్తూ...అవి వాటికిందకు రావు.. ఇవి వీటి కిందకు రావు అంటూ సర్వోన్నత న్యాయస్థానాలకు తెలియజేస్తూంటే ఈ దేశంలో ఆడబిడ్డల జీవితాలకు రక్షణ ఎక్కడిది? ఇలాంటి పరిస్థితుల్లో దేశం ఉండటం సిగ్గుచేటు. ఇప్పటికైనా ప్రభుత్వం తన వాదనను వెనక్కితీసుకోవాలి

జాలిపడాల్సిన జాతి

మంత్రగాళ్లే తత్వవేత్తలుగా
గుంటనక్కలే మహా నాయకులుగా
అతుకులు, అనుకరణలే కళలుగా
పరధవిల్లే జాతిని చూసి
నా మిత్రులారా జాలిపడండి!

కలల్లో చీదరించుకొనే కాంక్షలకే,
మెలుకువలో లొంగిపోయే జాతిని
పశుబలంతో విర్రవీగే వాణ్ణే
రారాజుగా కీర్తించి,
విజేతల కిరీటపు ధగధగల్లో
సౌందర్యాన్ని తిలకించి పరవశించి
పాదాక్రాంతమయ్యే జాతిని చూసి
జాలిపడండి.

శవయాత్రలో తప్ప
గొంతెత్తలేని జాతిని
శిథిలాలలో తప్ప వైభవాలను
చాటుకోలేని జాతిని
శిరస్సులు తెగిపడే
ప్రాణాంతక సందర్భాన తప్ప,
తిరగబడలేని జాతిని చూసి
జాలిపడండి.

తాను నేయని బట్టల్ని తొడిగి
షోకులెల్లే జాతిని
తాను పండించని ,పంటల్ని
తెగమెక్కే జాతిని
తను కాయని మధువుల్ని తాగి
తూగులాడే జాతిని చూసి
జాలిపడండి.

మూఢ విశ్వాసాలు తప్ప
మతమే లేని జాతిని
జయ జయనాదలతో
స్వాగతించినవాడినే ఛీత్కరించి
మరొకరిని నెత్తికెక్కించుకొని
కేరింతలు కొట్టే జాతిని చూసి
జాలిపడండి

తలపండిన విజ్ఞులంతా
మూగవాళ్లుగా
శక్తివంతులంతా ఊయలలో
పసికందులుగా
మిగిలిపోయిన జాతిని చూసి
జాలిపడండి

శకలాలు శకలాలుగా విడిపోయి
ఒక్కొక్క శకలమే ఒక్కొక్క జాతిగా
చలామణీ అయ్యే జాతిని చూసి
నా మిత్రులారా నా సహ
యాత్రికులారా
జాలిపడండి

మూలం: ఖలీల్‌జిబ్రాన్
అనువాదం : కలేకూరి ప్రసాద్

మాంద్యంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ



ప్రభాత్ పట్నాయక్

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వేగం 2008 ఆర్థిక సంక్షోభం తర్వాత తగ్గిందన్నది నిస్సందేహం. అమెరికాలోని కొందరు మితవాద ఆర్థికవేత్తలు సైతం 'ఇది దీర్ఘకాలిక మాంద్యం' అంటున్నారు (ఆ పదానికి వారిచ్చే నిర్వచనం వింతగా ఉంటుంది). ఈ అంశాన్ని కొన్ని గణాంకాల ద్వారా వివరించడం ఈ వ్యాసం ఉద్దేశం.

జీడీపీని (స్థూల జాతీయోత్పత్తి) లెక్కించే విధానాలు ఆయా దేశాల్లో చాలా వరకూ విశ్వసనీయత కలిగినవి కావు. ఇక మొత్తం ప్రపంచానికి సంబంధించి ప్రత్యేకంగా చెప్పనవసరమే లేదు. భారత దేశంలో అధికారిక లెక్కలను అనేకమంది పరిశోధకులు ప్రశ్నిస్తున్నారు. అధికారులేమో ఏడు శాతం, ఆ పైబడి వృద్ధిరేటు ఉన్నట్టు చూపుతున్నారు. కాని ఈ పరిశోధకులు అది నాలుగుశాతం నుండి 4.5 శాతానికి మించదని, ఈ పరిస్థితి గత కొన్నేండ్లుగా ఇదే మాదిరిగా ఉంటోందని గట్టిగా చెప్తున్నారు. ప్రభుత్వ నియం త్రణలో ఆర్థిక వ్యవస్థ కొనసాగిన గత కాలంతో పోల్చి నయా ఉదారవాద విధానాల కాలంలో జీడీపీ వృద్ధిరేటు గురించి చంకలు గుద్దుకోవడం అర్థం లేనిది. గతకాలంతో పోల్చితే వృద్ధిరేటు పెరిగింది పెద్దగా లేదు. పైగా అసమానతలు బాగా పెరిగిపోతున్నాయి. పోషకాహార లభ్యత గురించి లభిస్తున్న గణాంకాలను బట్టి శ్రామిక ప్రజానీకపు స్థితిగతులు బాగా క్షీణించాయని స్పష్టంగా చెప్పవచ్చు. అంత నిలకడ లేని ఈ జీడీపీ గణాంకాలను పక్కనపెట్టి ప్రపంచ జీడీపీ సంగతేమిటో చూద్దాం.

ఇందుకోసం నేను ప్రపంచబ్యాంక్ గణాంకాలను పరిగణనలోకి తీసుకుంటున్నాను. 2015 నాటి ధరలు ఆ యా దేశాల్లో ఎలా ఉన్నాయో, పరిశీలించి, వాటిని 2015 నాటి డాలర్‌తో ఆయా దేశాల కరెన్సీ మారకపు రేటును లెక్కలోకి తీసుకుని ఆ ప్రాతి పదికన జీడీపీ లెక్కలను అంచనా కట్టారు. 1961 నుంచీ గడిచిన కాలాన్ని కొన్ని ఉప కాలాలుగా విభజించి ఆయా ఉప కాలాలలో వృద్ధి ఏ విధంగా ఉన్నదీ పరిశీలించడం కొంచెం చిక్కులతో కూడుకున్న విషయమే. ఒక దశాబ్ద కాలాన్ని ఒక ఉప కాలంగా విభజిస్తే గనుక దానిలో ఒక సమస్య వస్తుంది. ఆ దశాబ్దపు మొదటి ఏడాది గనుక వృద్ధి రేటు బాగా తక్కువగా ఉంటే, దాంతో పోల్చినప్పుడు తక్కిన దశాబ్దకాలం యావత్తూ వృద్ధిరేటు చాలా ఎక్కువగా జరిగినట్టు లెక్క వస్తుంది. అందుచేత సరైన అంచనాలకు రావడానికి వీలుగా నేను 1961 నుంచీ గడిచిన కాలంలో బాగా ఎక్కువ వృద్ధిరేటు సాధించిన సంవత్సరాలను ఎంచుకున్నాను. ఆ విధంగా చూసినప్పుడు 1961, 1973, 1984, 1997, 2007, 2018 సంవత్సరాలలో అత్యధిక వృద్ధిరేటు జరిగినట్టు తేలింది. ఇప్పుడు వీటిలో ప్రతీ రెండింటి మధ్య కాలంలోని వృద్ధిరేటును పరిశీలించాను. ఆ రేట్లు ఈ విధంగా (పట్టిక) ఉన్నాయి.

ఉపకాలం	సాలుకు జీడీపీ వృద్ధి రేటు
1961-73	5.4 శాతం
1973-84	2.9 శాతం
1984-97	3.1 శాతం
1997-2007	3.5 శాతం
2007-2018	2.7 శాతం

పైన ఇచ్చిన అంకెలను బట్టి మూడు నిర్ధారణలు చేయవచ్చు. మొదటిది: మొత్తంమీద చూసినప్పుడు ప్రభుత్వాల నియంత్రణలో దేశాల ఆర్థిక వ్యవస్థలు నడిచినప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు నయా ఉదారవాద కాలంలోని వృద్ధిరేటు కన్నా చాలా ఎక్కువగా ఉంది. "మార్కెట్టే సర్వ శక్తి సంపన్నం" అంటూ ఇప్పుడు జరుగుతున్న చర్చల్లో నయా ఉదారవాద కాలంలోనే జీడీపీ వృద్ధిరేటు బాగా ఎక్కువగా ఉందన్న అభిప్రాయం కలుగుతుంది. ఈ అభిప్రాయం పూర్తిగా తప్పు. వాస్తవానికి నయా ఉదారవాద కాలంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు గణనీయంగా మందగించింది.



రెండవది: ప్రభుత్వ నియంత్రణలో ఆర్థిక వ్యవస్థలు నడిచిన కాలానికి, నయా ఉదారవాద విధానాలు అమలు కావడం మొదలైన నాటికి మధ్య కొంత వ్యవధి ఉంది. ఈ కాలంలో వృద్ధిరేటు 5.4 శాతం నుండి 2.9 శాతానికి పడిపోయింది. 1967 నుండి ద్రవ్యోల్బణం వేగవంతం అయి 1973-74 వరకూ కొనసాగింది. దానిని అదుపు చేయడానికి పెట్టుబడిదారీ వర్గం ప్రభుత్వ వ్యయాన్ని కుదిస్తూ, భారీ స్థాయిలో నిరుద్యోగాన్ని పెంచే వ్యూహాన్ని అనుసరించింది. ఈ వ్యూహం ఫలితంగా 1973 నుంచీ వృద్ధిరేటు మందగించింది. అప్పటి నుంచీ దేశాల ఆర్థిక వ్యవస్థల మీద ప్రభుత్వాల నియంత్రణ ఉండే విధానం నిలిచిపోయింది. ఇలా వృద్ధిరేటు మందగించిపోవడం నయా ఉదారవాద విధానాలను ప్రవేశపెట్టడానికి కావలసిన భూమికను కల్పించింది. అప్పటికే పెరుగుతూ అంతకంతకూ అంతర్జాతీయ స్వభావాన్ని సంతరించుకుంటున్న ద్రవ్య పెట్టుబడి అంతకు ముందునుంచే నయా ఉదారవాద విధానాలకు మళ్ళాల్సిందేనంటూ ఒత్తిడి పెంచుతోంది. సరిగ్గా ఆ సమయానికే పాత విధానాల పర్యవసానంగా ముందు ద్రవ్యోల్బణం, తర్వాత వృద్ధిరేటు మందగించడం జరిగాయి.

మూడవది: పట్టికలో ఇచ్చిన అంకెలను చూస్తే అమెరికాలో హౌసింగ్ బుడగ పేలిపోయిన అనంతర కాలంలో వృద్ధిరేటు మందగమనం కొనసాగుతూనే వుంది. హౌసింగ్ బుడగ బద్దలైపోవడంతో పెట్టుబడిదారీ ప్రపంచం మొత్తంగా సంక్షోభంలో పడింది. అప్పుడు ఆర్థిక వ్యవస్థను నిలబెట్టడానికి ప్రభుత్వం పెద్దఎత్తున జోక్యం చేసుకుంది (ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వాల జోక్యం ఉండరాదనే నయా ఉదారవాదన బండారం దీనితో బయటపడింది). కాని వాస్తవ ఆర్థిక వ్యవస్థకు దాని నుంచి ఎటువంటి ప్రేరణా లభించలేదు. వృద్ధిరేటును పెంచడానికి ప్రభుత్వాల వ్యయం పెరగడంగాని, హౌసింగ్ బుడగ వంటి మరేవైనా బుడగలు ఏర్పడి తాత్కాలికంగా వృద్ధిరేటు వేగాన్ని పెంచడానికి దోహదం చేయడం వంటివి కాని జరగలేదు.

మనం 2018 సంవత్సరాన్ని ఆఖరి గరిష్టవృద్ధి సంవత్సరంగా తీసుకున్నాం. ఆ తర్వాత చూస్తే వృద్ధిరేటు మరీ అన్యా యంగా పడిపోయింది. 2018 నుంచి 2022 మధ్య వృద్ధిరేటు సాలుకు 2.1 శాతం మాత్రమే ఉంది. ప్రపంచ జనాభా వృద్ధిరేటు సుమారు 1 శాతంగా ఉంది (మన దేశ జనాభా లెక్కలు 2021లో సేకరించి వుండాల్సింది. కాని ఇంతవరకూ ఆ పని ప్రారంభం కానేలేదు.). దీనిని పరిగణనలోకి తీసుకుంటే ప్రపంచ తలసరి ఆదాయం ఒక శాతం చొప్పున మాత్రమే పెరుగుతున్నట్టు భావించాలి. ఐతే, ప్రపంచంలో ఆదాయాల మధ్య అసమానతలు బాగా పెరుగుతున్నాయి. దానిని బట్టి ప్రపంచ జనాభాలో అత్యధిక మెజార్టీ ఆదాయాలలో పెరుగుదల లేకుండా స్తంభించిపోవడం కాని తరిగిపోవడం కాని జరుగుతోంది. దీన్ని వివరించడానికి దిగువ విషయాన్ని ఉదహరిస్తాను. ప్రపంచ ఆదాయం మొత్తంలో సగభాగం కన్నా ఎక్కువ జనాభాలోని అత్యంత సంపన్నులైన పది శాతం ప్రజలు పొందుతున్నారు. వీరి ఆదాయాలు ఏటా కనీసం రెండు శాతం చొప్పున పెరుగుతున్నాయనుకుంటే అప్పుడు తక్కిన 90 శాతం మంది ఆదాయాలూ ఏ పెరుగుదలా లేకుండా స్తంభించిపోయినట్టే కదా. అంటే నయా ఉదారవాదం చివరి దశలో పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రపంచ జనాభాలో అత్యధిక ప్రజానీకపు ఆదాయాలు పెరుగుదల లేకుండా స్తంభించిపోయేట్టు చేసిందని స్పష్టం అవుతోంది. ఇది పాత వలస పాలనా కాలాన్ని గుర్తుకు తెస్తోంది. అప్పుడు కూడా ప్రపంచంలోని అత్యధిక శాతం ప్రజల నిజ ఆదాయాలు పెరగకపోగా తరిగిపోయాయి.

ఇలా వృద్ధిరేటు మందగించడం అనేది కొద్దికాలంపాటు మాత్రమే ఉండే తాత్కాలిక సమస్య అని, త్వరలోనే దీనిని అధిగమిస్తామని అనుకోలేం. ఈ పరిస్థితి నయా ఉదారవాద విధానాల పర్యవసానమే. ఇప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వృద్ధిరేటు పెరగాలంటే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో డిమాండ్ పెరగాలి. అంటే ప్రజల కొనుగోలు శక్తి పెరగాలి. ప్రజల కొనుగోలు శక్తి పెరగాలంటే ప్రభుత్వం అందుకు వీలుగా వ్యయాన్ని పెంచాలి. ఆ పెరిగే వ్యయాన్ని ద్రవ్యలోటును పెంచడం ద్వారానో, లేక సంపన్నుల మీద పన్ను లను అదనంగా విధించడం ద్వారానో భరించాలి. కాని ఈ రెండిట్లో దేనినీ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి అంగీకరించదు. ప్రభుత్వం ఆ యా దేశాలకు విడివిడిగా ఉంటుంది. కాని ద్రవ్య పెట్టుబడి అంతర్జాతీయ స్వభావాన్ని కలిగివుంది. అందుచేత ఏ దేశంలోనైనా తన ఆదేశాలకు భిన్నంగా జరిగితే వెంటనే ద్రవ్య పెట్టుబడి క్షణాల్లో ఆ దేశాన్ని వదిలిపెట్టి పోతుంది. అలా వెళ్లిపోకుండా నిలుపు చేయా లంటే ఆయా దేశాల ప్రభుత్వాలు అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి అడుగులకు మడుగులొత్తక తప్పదు. అందుచేత ప్రభుత్వ జోక్యం ద్వారా మార్కెట్‌లో డిమాండ్‌ను, ప్రజల కొనుగోలు శక్తిని పెంచడం అనేది ఈ నయా ఉదారవాద చట్రం లోపల జరగని పని.

ఇక ఆయా దేశాల ప్రభుత్వాలు జోక్యం చేసుకోగలిగేది ఒక్క ద్రవ్య విధానం ద్వారా మాత్రమే. ఇక్కడ కూడా ఒక దేశం తన వడ్డీ రేట్లను సంపన్న దేశాలలో అమలౌతున్న వడ్డీ రేట్లకన్నా మరీ తక్కువగా నిర్ణయించకూడదు. ముఖ్యంగా అమెరికా లోని వడ్డీ రేట్లతో పోల్చుకున్నప్పుడు తేడా ఎక్కువ ఉండకూడదు. ఒకవేళ వడ్డీ రేట్లను బాగా తగ్గించి ప్రజలకు ఎక్కువ ధనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ఏ ప్రభుత్వం అయినా అనుకుంటే అప్పుడు ఆ స్వల్ప వడ్డీ రేట్లు ఆకర్షణీయంగా లేవంటూ ఇక్కడి బ్యాంకుల్లో ఉన్న డిపాజిట్లను అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి వేరేచోటికి తరలించుకుపోతుంది. ప్రస్తుతం తన ఇష్టం వచ్చినట్టు వడ్డీ రేట్లను పెంచడం గాని, తగ్గించడం గాని చేయగలిగే శక్తి అమెరికాకు మాత్రమే ఉంది. అక్కడ గనుక డిమాండ్‌ను పెంచడం కోసం వడ్డీ రేట్లను తగ్గిస్తే అప్పుడు తక్కిన దేశాలలో కూడా వడ్డీరేట్లను తగ్గించడానికి వీలౌతుంది. ఐతే, ప్రస్తుతం అమెరికాలో వడ్డీ రేట్లు దాదాపు సున్నా శాతా నికి చేరుకున్నాయి. అయినా ఆర్థిక వ్యవస్థ కోలుకోవడం లేదు. దీర్ఘకాలంగా ఇలా వడ్డీరేట్లను అతి తక్కువగా కొనసాగించడంతో కార్పొ రేట్లు తమ లాభాల మార్జిన్‌ను పెంచుకోడానికి సరుకుల ధరలను పెంచడం మొదలెట్టాయి. దానితో ద్రవ్యోల్బణం వేగం పుంజుకుంది.

పాపం! కీన్స్! సోషలిస్టు విప్లవం రాకుండా పెట్టుబడిదారీ వ్యవస్థే దీర్ఘ కాలం కొనసాగాలని కలలుగన్నాడు. అందుకోసం ప్రభుత్వ జోక్యాన్ని ఒక పరిష్కారంగా సూచించాడు. కాని ఇప్పుడది సాధ్యమయ్యేది కాదని తేలిపోయింది. కీన్స్ కల పీడకలగా మిగిలిపోయింది. ప్రస్తుత నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థ పరిస్థితి ఈ విషయాన్ని స్పష్టంగా చూపుతోంది.

(స్వేచ్ఛానుసరణ)

> ఇప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వృద్ధిరేటు పెరగాలంటే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో డిమాండ్ పెరగాలి. అంటే ప్రజల కొనుగోలు శక్తి పెరగాలి. ప్రజల కొనుగోలు శక్తి పెరగాలంటే ప్రభుత్వం అందుకు వీలుగా వ్యయాన్ని పెంచాలి. ఆ పెరిగే వ్యయాన్ని ద్రవ్యలోటును పెంచడం ద్వారానో, లేక సంపన్నుల మీద పన్ను లను అదనంగా విధించడం ద్వారానో భరించాలి. కాని ఈ రెండిట్లో దేనినీ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి అంగీకరించదు. ప్రభుత్వం ఆ యా దేశాలకు విడివిడిగా ఉంటుంది. కాని ద్రవ్య పెట్టుబడి అంతర్జాతీయ స్వభావాన్ని కలిగివుంది. అందుచేత ఏ దేశంలోనైనా తన ఆదేశాలకు భిన్నంగా జరిగితే వెంటనే ద్రవ్య పెట్టుబడి క్షణాల్లో ఆ దేశాన్ని వదిలిపెట్టి పోతుంది. అలా వెళ్లిపోకుండా నిలుపు చేయా లంటే ఆయా దేశాల ప్రభుత్వాలు అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి అడుగులకు మడుగులొత్తక తప్పదు.

> పైన ఇచ్చిన అంకెలను చూస్తే అమెరికాలో హౌసింగ్ బుడగ పేలిపోయిన అనంతర కాలంలో వృద్ధిరేటు మందగమనం కొనసాగుతూనే వుంది. హౌసింగ్ బుడగ బద్దలైపోవడంతో పెట్టుబడిదారీ ప్రపంచం మొత్తంగా సంక్షోభంలో పడింది. అప్పుడు ఆర్థిక వ్యవస్థను నిలబెట్టడానికి ప్రభుత్వం పెద్దఎత్తున జోక్యం చేసుకుంది (ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వాల జోక్యం ఉండరాదనే నయా ఉదారవాదన బండారం దీనితో బయటపడింది). కాని వాస్తవ ఆర్థిక వ్యవస్థకు దాని నుంచి ఎటువంటి ప్రేరణా లభించలేదు. వృద్ధిరేటును పెంచడానికి ప్రభుత్వాల వ్యయం పెరగడంగాని, హౌసింగ్ బుడగ వంటి మరేవైనా బుడగలు ఏర్పడి తాత్కాలికంగా వృద్ధిరేటు వేగాన్ని పెంచడానికి దోహదం చేయడం వంటివి కాని జరగలేదు.

పశ్చిమాసియాను అగ్గికొలిమిగా మార్చిన ఇజ్రాయిల్



గాజాపై ఇజ్రాయిల్ దురాక్రమణ యుద్ధానికి అక్టోబరు 7వ తేదీతో ఏడాది పూర్తవుతుంది. హమాస్ దాడిని ఒక సాకుగా చూపించి ఇజ్రాయిల్ గాజాపై మానవ మారణహోమం ప్రారంభించింది. హమాస్‌ను నిర్మూలించేందుకే తాను గాజాపై దాడి చేస్తున్నానని చెప్పింది. ఆ లక్ష్యం సాధించడం అటుంచి ఇజ్రాయిల్ ఈ రోజుకు వచ్చేసరికి మొత్తం పశ్చిమాసియాను అగ్గికొలిమిగా మార్చింది. లెబనాన్, ఇరాన్, సిరియా, ఎమెన్, ఇరాక్‌లపై దాడికి ఒడిగడుతున్నది. ఇజ్రాయిల్ దురాక్రమణలో భాగంగా వేసే ప్రతి అడుగునూ బలపరుస్తూ అమెరికా గట్టిగా వత్తాసుదారుగా నిలిచింది. గత పక్షం రోజులలో లెబనాన్‌పై ఇజ్రాయిల్ చేస్తున్న సైనిక దాడులు యుద్ధం స్వభావాన్నే మార్చేశాయి. ఒక పథకం ప్రకారం మొదలుపెట్టిన దాడిలో అది దక్షిణ లెబనాన్‌పై ముమ్మర వైమానిక దాడులకు దిగింది. పేజర్లు ఇతర సమాచార సాధనాలను ఉపయోగించి హిజ్బుల్లా నాయకుల హత్యలకు పాల్పడింది. సంస్థ కేంద్రంలో వున్న హిజ్బుల్లా ప్రధాన కార్యదర్శి హసన్ నస్రుల్లాను ఒక బంకర్ విధ్వంసక బాంబర్‌తో హత్య చేయడంతో యుద్ధం మరింత తీవ్రమైంది. దక్షిణ లెబనాన్‌పై ఒక పరిమిత స్థానిక లక్ష్య నిర్దేశిత భూతల యుద్ధం ప్రారంభిస్తున్నట్టు ఇజ్రాయిల్ అక్టోబర్ ఒకటిన ప్రకటించింది. అయితే వాస్తవంలో అది పూర్తి స్థాయి భూతల యుద్ధం కోసం లెబనాన్ సరిహద్దులలో భారీ సంఖ్యలో బలగాలను మొహరించింది.

ఇజ్రాయిల్ పశ్చిమాసియాలో ఒక దుష్ట రాజ్యం. అన్ని అంతర్జాతీయ చట్టాలనూ, ఒప్పందాలనూ ఉల్లంఘించి అది దేశ దేశాలలో పథకం ప్రకారం హత్యలు, దాడులు సాగిస్తున్నది. గత ఒక్కఏడాదిలోనే ఇజ్రాయిల్ ఇరానియన్ భూభాగంపై వైమానిక దాడులకు పాల్పడ్డం ద్వారా హమాస్ ప్రధాన ప్రతినిధి ఇస్మాయిల్ హనియే ప్రాణాలు తీసింది. నూతనంగా ఎన్నికైన ఇరాన్ అధ్యక్షుడి ప్రమాణ స్వీకారానికి హాజరయ్యేందుకు వెళ్లిన హనియేను బలిగొన్న తర్వాత అది బీరుట్‌ను లక్ష్యంగా చేసుకుని నస్రుల్లాను హతమార్చింది. నస్రుల్లా హత్య తర్వాత హిజ్బుల్లా దాదాపు తుడిచి పెట్టుకు పోయినట్టేనని ఇజ్రాయిల్ ప్రకటించింది. అలాంటి దారుణమైన హూంకరింపులు వాస్తవానికి చాలా దూరంగా వుంటాయి. 1992లో ఇజ్రాయిల్ హిజ్బుల్లా సహ వ్యవ స్థాపకుడు, రెండవ కార్యదర్శి అబ్బాస్ అల్ ముసావీని హత్య చేసినట్టు ప్రకటించింది.ఆ స్థానంలో నస్రుల్లా వచ్చాడు. తను రెండుసార్లు ఇజ్రాయిల్ సైన్యం దురాక్రమణను ప్రతిఘటించాడు. హిజ్బుల్లా చేతుల్లో రెండుసార్లు పరాజయం పాలైన తర్వాత 2006లో ఇజ్రాయిల్ తను అనుకున్న లక్ష్యం సాధించలేక పోయినట్టు అంగీకరించాల్సి వచ్చింది. ఇదివరకటి తన దుస్సా హసాలకు ఏ గతి పట్టిందో ఇజ్రాయిల్ మరచిపోయినట్టు కనిపిస్తుంది.

గత చరిత్ర చెబుతున్నదేమిటి?

పశ్చిమాసియాలో అమెరికాకు బలమైన స్థావరంగా వున్న ఇజ్రాయిల్ అమెరికా భాషనే మాట్లాడుతున్నది. 'ఉధృతం నుంచి ఉపశమనం' అంటూ అది తన సైనిక వ్యూహాన్ని ప్రకటించింది. ఇదో లోపభూయిష్టమైన అవగాహన, విఫల వ్యూహం. ఉధృత సైనిక దాడితో శత్రువు లొంగిపోవలసి వస్తుందనేది ఈ వ్యూహంలో వుండే ఆలోచన. అయితే ఈ వ్యూహం ప్రకారమే విజయాలు దక్కుతాయనే గ్యారంటీ ఏమీ లేదని చెప్పడానికి చరిత్రలో అనేక ఉదాహరణలున్నాయి. ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, సిరియా లిబియాలలో అమెరికా దారుణంగా ఓడిపోవడం చూశాం, ఇప్పుడూ ఇజ్రాయిల్‌కు అదే గతి పట్టబోతున్నది. హిజ్బుల్లా దళాలు తమ దాడులతో నిస్సహాయ స్థితిలో పడిపోయాయనీ, కనుక ఇరాన్ కూడా ఆ ప్రభావానికి గురై బలహీనంగా మారిందని యుద్ధోన్మాద ఇజ్రాయిల్ నాయకులు అంచనా వేస్తున్నారు. ఇరాన్‌పై సైనిక దాడులు జరగాలని, ఆ దేశ అణు కేంద్రాలనూ లక్ష్యంగా చేసుకోవాలనీ చెబుతున్నారు.ఇరాన్‌లో ప్రభుత్వ మార్పు తీసుకురావడం గురించీ, పశ్చిమాసియా రాజకీయ ముఖచిత్రం మార్పు గురించీ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ మాట్లాడుతున్నారు. ఈ విశృంఖల భావాలతో రెచ్చిపోయిన ఇజ్రాయిల్ పశ్చిమాసియాలో తన ఆధిపత్యం నెలకొల్పుకోవాలని నిర్లక్ష్యపూరితంగా ప్రయత్నిస్తోంది. అది అమెరికా ప్రయోజనాలకూ ఉపయోగకరమవుతుంది.

అమెరికా వత్తాసు వల్లనే..

ఇజ్రాయిల్‌ను నిలవరించడానికి తన ప్రయోజనాలు కాపాడుకోవడానికి ఇరాన్ ఇప్పుడు ఆ దేశంపై 180కి పైగా మిసైళ్లను ప్రయోగించింది. తమ గగనతలంపై ఇజ్రాయిల్ దాడి చేశాక ఇరాన్ ప్రతీకారదాడి చేయడం ఇది రెండోసారి. అమెరికా నుంచి, దాని మిత్రదేశమైన బ్రిటన్ వంటి దేశాల నుంచి తిరుగులేని మద్దతు వల్లనే ఈ ప్రాంతంలో ఇజ్రాయిల్‌కు ధైర్యం వస్తున్నది. ఈ సంఘర్షణ ప్రతి దశలోనూ అమెరికా నుంచి ఇజ్రాయిల్‌కు మద్దతు లభిస్తూనే వుంది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత మరే దేశానికీ ఇవ్వనంతగా 12,400 కోట్ల డాలర్ల సహాయం అందించింది. 2016 నుంచి చూస్తే దశాబ్ది సహాయం పథకంలో భాగంగా ఇజ్రాయిల్ ఏటా మొత్తం 3800 కోట్ల డాలర్ల సహాయం అందుకున్నది. గాజాపై ఇజ్రాయిల్ దాడి ప్రారంభించిన రోజున అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మరింత సైనిక సహాయం అందిస్తామని వాగ్దానం చేశారు. పేలుడు పదార్థాలు, విధ్వంసక పరికరాలు అందించి ఇజ్రాయిల్ ఉక్కు చట్రాన్ని మరింత బలోపేతం చేస్తామన్నారు. ఇజ్రాయిల్ రక్షణ బలగాలు మానవ హక్కుల హననానికి పాల్పడుతున్నారని వస్తున్న నివేదికలను బొత్తిగా పెడచెవిన పెట్టి అమెరికా ఆగస్టులో ఇజ్రాయిల్‌కు తమ దేశ సైనిక పరికరాలను, ఆయుధాలను కొనుగోలు చేయడం కోసం 3500 కోట్ల డాలర్ల అదనపు సహా యం పంపించింది. గత ఒక్క ఏడాదిలోనే ఇజ్రాయిల్ ఆయుధ పాటవం పెంపు కోసం 1400 కోట్ల డాలర్ల సాయం లభించింది. వీటన్నిటినీ మించి అమెరికా ఇజ్రాయిల్‌కు మద్దతుగా యుద్ధ విమానాలు, క్షిపణి విధ్వంసక ఆయుధాలు తరలించింది. ఇరాన్ మిసైళ్లను తిప్పికొట్టడంలో తమ సైన్యం కీలకమైన వ్యూహాత్మక పాత్ర పోషించిందని అమెరికా ప్రకటించింది. బ్రిటన్ కూడా అలాంటి ప్రకటనే చేసింది. ఇజ్రాయిల్‌కు అమెరికా ఇన్ని విధాల ఆర్థిక, ఆయుధ సహాయం అందిస్తుంటే కాల్పుల విరమణకూ యుద్ధ ప్రజ్వలన చల్లార్చడానికి ప్రయత్నిస్తున్నాని మాట్లాడటం కేవలం కంటి తుడుపు, పసలేని పల్లవి మాత్రమే.

వంత పాడుతున్న మోడీ

పాలస్తీనాతో సంఘీభావం అనే విధానం నుంచి వైదొలగిన భారత ప్రభుత్వం అమెరికాకు, ఇజ్రాయిల్‌కు కూడా వ్యూ హాత్మక భాగస్వామిగా వుంది. పన్నెండు నెలల్లోగా అన్ని ఆక్రమిత ప్రాంతాల నుంచి వైదొలగాలని ఇజ్రాయిల్‌ను ఆదేశిస్తూ ఐక్యరాజ్య సమితి ముందుకొచ్చిన తీర్మానంపై ఓటింగులో పాల్గొనకుండా వుండిపోయింది. ఇజ్రాయిల్ పథకం ప్రకారం హత్యలు చేయించడాన్ని ఖండించే బదులు భారత ప్రభుత్వం మౌనంగా వుండిపోయింది. నెతన్యాహూతో జరిపిన ఫోన్ సంభాషణలో ప్రధాన మంత్రికి టెర్రరిజాన్ని ఖండించేందుకు సమయం దొరికింది గానీ గాజా, లెబనాన్‌లపై ఇజ్రాయిల్ మారణ యుద్ధాన్ని ఖండించేందుకు ధైర్యం కూడగట్టుకోలేక పోయారు. భారత సైనిక దళాల ప్రధానాధికారి ఇజ్రాయిల్ పేజర్ బాంబులను గొప్ప దెబ్బగా ప్రశంసించారేగాని అలాంటి దాడులను ఖండించలేదు. అత్యంత లజ్జావిహీనమైన రీతిలో ప్రభుత్వం పేలుడు పదార్థాల, విడిభాగాల రవాణాను అనుమతిస్తున్నది. భారత్‌లో తయారైన డ్రోన్లను పాలస్తీనియన్లపై ప్రయోగించడానికి ఒప్పుకొంటున్నది. ఆక్రమిత ప్రాంతాల హక్కుల కోసం నిలబడే స్థితి నుంచి ఆక్రమణదార్ల వైపున నిలిచేవిధంగా మన విదేశాంగ విధానంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ఎంతటి మార్పు తీసుకొచ్చిందో వీటన్నిటినీ బట్టి విదితమవుతుంది.

పాలస్తీనియన్లకు సంఘీభావం

ఇజ్రాయిల్ దురాక్రమణ ప్రపంచ శాంతికి ముప్పుగా మారే ప్రమాదకర దశకు చేరుకున్నది. ఇది మరెంత మాత్రం తీవ్రతరమైనా సర్వ వినాశనకరమవుతుంది. వెంటనే కాల్పుల విరమణ చేయాలని కోరుతూ ప్రపంచ వ్యాపితంగా ప్రజలు ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా సమీకృతమవుతున్నారు. ఆయుధాలను తరలించడానికి గానీ, వాటిని చేరవేసే పడవలు రేవులో దిగడానికి గానీ వారు అనుమతించడం లేదు. ఇజ్రాయిలీ యూనివర్సిటీలతో కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దు చేసుకోవలసిందిగా తమ దేశంలో విద్యాలయాలపై విద్యార్థులు ఒత్తిడి తెస్తున్నారు. అలాంటి ప్రతిఘటన కార్యక్రమాలను మన దేశంలోనూ బలోపేతం చేయాలి. మన ప్రభుత్వంపై ఇజ్రాయిల్‌కు ఆయుధాల సరఫరా నిలిపివేసి పాలస్తీనియన్లకు సంఘీభావంగా నిలిచే పరిస్థితి తీసుకురావాలి.

(అక్టోబరు2 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)



మహిళా రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలి

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

నవతెలంగాణ-ఖమ్మం

మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని, మహిళల హక్కుల సాధనకు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. సోమవారం ఖమ్మంలోని నాగార్జున ఫంక్షన్ హాల్‌లోని కొండపల్లి దుర్గాదేవి నగర్‌లో ఐద్వా 12వ మహాసభ నిర్వహించారు. తొలుత (సత్తెనపల్లి రామకృష్ణ భవన్) సీపీఐ(ఎం) కార్యాలయంలో మహాసభ ప్రారంభ సూచికగా ఐద్వా జెండాను సీనియర్ నాయకులు ఏపూరి జయమ్మ ఆవిష్కరించారు. అనంతరం అమరవీరులకు నివాళి అర్పించారు. మహాసభకు జిల్లా అధ్యక్షులు బండి పద్మ, మెరుగు రమణ, మెహరునిష బేగం అధ్యక్షత వహించగా.. మల్లు లక్ష్మి మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం మహిళల సాధికారత, 33 శాతం రిజర్వేషన్ల అమలు, హక్కుల గురుంచి మాటలు చెప్పడం తప్ప చేతల్లో ఏమీ చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి మహిళకూ రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చి నేటికీ అమలు చేయలేదని, వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఐద్వా రాష్ట్ర నాయకులు బుగ్గవీటి సరళ మాట్లాడుతూ.. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా వారి హక్కుల సాధనకు కృషి చేయాలని, సమస్యలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మూడు సంవత్సరాలుగా జిల్లాలో ఐద్వా చేసిన పోరాటాలు, భవిష్యత్ కర్తవ్యాలను, ఉద్యమ నిర్మాణ నివేదికను జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి ప్రవేశపెట్టారు. ఈ మహాసభలో జిల్లా నాయకులు, మాజీ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ అఫ్రోజ్ సమీనా, నాగసులోచన, ప్రభావతి, కృష్ణవేణి, రజిత, పకీరమ్మ, సునీత, అమరావతి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

ఆశాలతో ఆరోగ్య పరీక్షలు ఎలా చేయిస్తారు..?

- పెండింగ్ పారితోషికాలు చెల్లించాలి
- ఫిక్స్‌డ్ వేతనం రూ.18000 ఇవ్వాలి : ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జయలక్ష్మి
- వనపర్తి కలెక్టరేట్ ఎదుట ధర్నా



నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ల్యాబ్ టెక్నీషియన్లు చేయాల్సిన ఆరోగ్య పరీక్షల పనిని ఆశా వర్కర్లతో ఎలా చేయిస్తారని ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు టి.జయలక్ష్మి అన్నారు. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని మర్రికుంట పాలకేంద్రం నుంచి ర్యాలీగా కలెక్టర్ కార్యాలయానికెళ్లి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆశా వర్కర్లతో బీపీ, షుగర్ టెస్టులు చేయించడం సరికాదన్నారు. ఈ పని చేయాల్సింది ఆశావర్కర్లు కాదని, ల్యాబ్ టెక్నీషియన్లుగా శిక్షణ పొందిన వారు అని చెప్పారు. వనపర్తిలో ప్రత్యేకంగా ఎందుకు ఆశాలతో ఇలాంటి పనులు చేయిస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. పని భారాన్ని పెంచి వేధింపులకు గురి చేస్తున్నార న్నారు. పెండింగ్‌లో ఉన్న సెప్టెంబర్ నెల పారితోషికం, టిపి డబ్బులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2023-24 లెప్రసీ సర్వే డబ్బులు ఇవ్వాలన్నారు. 2024 పల్స్ పోలియో డబ్బులు ఇవ్వాలని, ఎంసీహెచ్‌లో ఆశాలకు రెస్ట్ రూమ్ కేటాయించాలని కోరారు. స్పుటమి (తెమడ) డబ్బాలను ఆశాలతో తెప్పించొద్దని డిమాండ్ చేశారు. ఫిక్స్‌డ్ వేతనం రూ.18000 ఇవ్వాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ ప్రమాద బీమా సౌకర్యం కల్పించి, పండుగకు, ఇతర సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ ఆదర్శ్ సురభికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మండ్ల రాజు, పుట్ట ఆంజనేయులు, ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బుచ్చమ్మ, సునీత, జిల్లా కోశాధికారి భాగ్య, నాయకులు ఇందిరా, సత్యమ్మ, గోవిందమ్మ, జ్యోతి, శ్యామల సుజాత, మంజుల, లక్ష్మీదేవి, కల్పన పాల్గొన్నారు.

పండుగలోపు చెక్కులు పంపిణీ చేయాలి

- లేదంటే లబ్ధిదారులతో కేసీఆర్ నివాసానికే వస్తాం : గజ్వేల్లో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించిన కాంగ్రెస్ నాయకులు
- కేసీఆర్ చిత్రపటానికి వినతి



నవతెలంగాణ-గజ్వేల్

దసరా పండుగలోపు కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేయాలని, లేదంటే లబ్ధిదారులతో కలిసి కేసీఆర్ నివాసానికే వస్తామని కాంగ్రెస్ నాయకులు అన్నారు. గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మెన్ ఒంటేరు నరేందర్ రెడ్డి, వైస్ చైర్మెన్ సర్దార్‌ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మెన్ గాడిపల్లి భాస్కర్ ఆధ్వర్యంలో సోమవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని కాంగ్రెస్ నాయకులు ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాసనసభ ఎన్నికలైనప్పటి నుంచి స్థానిక ఎమ్మెల్యే కేసీఆర్ అందుబాటులో ఉండకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

ముఖ్యంగా కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ ఆగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే గజ్వేల్ శాసనసభ్యులు స్పందించి దసరాలోపు చెక్కులను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మరో కార్యాచరణకు సిద్ధమవుతామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేయలేదని ఓ బీఆర్ఎస్ నాయకుడు అజ్ఞానంతో మాట్లాడుతున్నారని, ఒక్కసారి పక్క నియోజకవర్గం దుబ్బాక నాయకులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ నాయకులు కేసీఆర్‌తో మాట్లాడి తక్షణమే కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేయించాలని, అలాగే గజ్వేల్‌లో మిగిలిపోయిన బస్టాండ్, రింగ్ రోడ్డు పనులను పూర్తి చేయించాలని కోరారు. అనంతరం క్యాంప్ కార్యాలయంలోని గజ్వేల్ ఎమ్మెల్యే, మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గజ్వేల్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, నాయకులు వెంకట నరసింహారెడ్డి, వర్గల్ మోహన్, శ్రీనివాస్ రెడ్డి, సుఖేందర్ రెడ్డి, మతిన్, కరుణాకర్ రెడ్డి, వహీద్, బోస్, రాజు, అజార్, రాజశేఖర్ రెడ్డి, బంగారురెడ్డి, శివుడు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే హక్కుల సాధన

సీఐటీయూ జాతీయ కార్యదర్శి కరుమలయన్

- హయ్యర్ పెన్షన్ సమస్యలపై ఎస్‌డబ్ల్యూఎఫ్ ధర్నా
- ఆర్‌పీఎఫ్ పరిధిలోని సమస్యలు పరిష్కరిస్తాం: కమిషనర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



పోరాటాలతోనే హక్కులు సిద్ధిస్తాయని సీఐటీయూ జాతీయ కార్యదర్శి కరుమలయన్ అన్నారు. ఆర్టీసీ ఉభయ రాష్ట్రాల స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద హయ్యర్ పెన్షన్ సమస్యలపై నిర్వహించిన ధర్నానుద్దేశించి ప్రసంగించారు. రాష్ట్రంలోని హయ్యర్ పెన్షనర్లకు సంబంధించిన 17 సమస్యలపై రీజినల్ ప్రావిడెంట్ ఫండ్(ఆర్‌పీఎఫ్) కమిషనర్‌తో ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రతినిధి బృందం చర్చించిందని తెలిపారు. కమిషనర్ స్థాయిలోని 11 సమస్యలను త్వరలో పరిష్కరిస్తామనీ, సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్(సీపీఎఫ్) కమిషనర్ పరిధిలో ఉన్న సమస్యలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. ప్రావిడెంట్ ఫండ్ అధికారులు ఇచ్చిన హామీ మేరకు సమస్యలు పరిష్కరించకుంటే ప్రత్యక్ష పోరాటానికి సిద్ధం కావాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ అంశంపై సీఐటీయూ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. అంతకు ముందు ధర్నా శిబిరాన్ని ప్రారంభించిన సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్ మాట్లాడుతూ హయ్యర్ పెన్షనర్ డిమాండ్ నోటీసుల జాప్యాన్ని నివారించాలనీ, లెక్కింపు ప్రక్రియను 60 నెలల సగటు కాకుండా ప్రాఫిట్ బేసిక్‌తో లెక్కించి కార్మికులకు నష్టం చేస్తున్నారని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో రిజెక్ట్ చేసిన 16 వేల మంది పెన్షన్ సొమ్మును వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. టీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో హయ్యర్ పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు 1.12 లక్షల మంది ఉంటే, తెలంగాణ ఆర్టీసీలో 48 వేలు, ఏపీ ఆర్టీసీలో 50 వేల మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. సగటు పెన్షన్ లెక్కింపుతో పాటు కేవైసీ లోపాలను సరిదిద్దాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆర్టీసీ పీఎఫ్‌కు బకాయి పడ్డ రూ.1800 కోట్లను వెంటనే చెల్లించాలని యాజమాన్యానికి సూచించారు. ఆర్టీసీ కార్మికుల పెన్షన్ సమస్యలపై ఇతర కార్మిక సంఘాలు ఎందుకు మౌనంగా ఉన్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఏపీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి అయ్యప్ప రెడ్డి మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల హయ్యర్ పెన్షన్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రచార కార్యదర్శి పి.రవిందర్‌రెడ్డి, ఏపీ ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి కొట్టు సుబ్రమణ్యం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శులు జీఆర్.రెడ్డి, సుధాకర్, ప్రకాష్, ఉపాధ్యక్షులు కె.బిక్షపతి గౌడ్, రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌పీఎఫ్ పరిధిలోని సమస్యలు పరిష్కరిస్తాం : కమిషనర్

రీజినల్ ప్రావిడెంట్ ఫండ్(ఆర్‌పీఎఫ్) పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని కమిషనర్ శివ కుమార్ సీఐటీయూ జాతీయ కార్యదర్శి కరుమలయన్ నేతృత్వంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రతినిధి బృందానికి హామీ ఇచ్చారు. సుప్రీంకోర్టు తీర్పు అమలులో భాగంగా పీఎఫ్ పెన్షన్‌లో హయ్యర్ పెన్షన్ డిమాండ్ నోటీసులు విడుదల చేయడంతో పాటు డబ్బులు చెల్లించిన వారికి రివైజ్డ్ పెన్షన్‌పే ఆర్డర్‌లో ఆలస్యాన్ని నివారించి సత్వరమే చర్యలు తీసుకుంటామని తెలిపారు. తమ పరిధిలోని సమస్యల పరిష్కారానికి అవసరమైతే ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రతినిధులతో మరోసారి చర్చలు జరుపుతామని పేర్కొన్నారు.

మహిళా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు అరుణ జ్యోతి



నవతెలంగాణ-జనగామ

చిట్యాల ఐలమ్మ, మల్లు స్వరాజ్యం పోరాట స్ఫూర్తితో.. బీజేపీ మహిళా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు అరుణ జ్యోతి అన్నారు. ఐద్వా జనగామ జిల్లా 3వ మహాసభను జనగామ పట్టణంలోని విజయ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు అహల్య జెండాను ఆవిష్కరించారు. చిట్యాల ఐలమ్మ, మల్లు స్వరాజ్యం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇర్రి అహల్య అధ్యక్షతన జరిగిన మహాసభలో అరుణ జ్యోతి మాట్లాడారు. వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరులు చిట్యాల ఐలమ్మ, మల్లు స్వరాజ్యం వారసత్వంగా మహిళల హక్కుల కోసం ఐద్వా పోరాటాలు చేస్తున్నదని తెలిపారు. 2014లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మహిళా హక్కులను కాలరాస్తూ చట్టాలను నీరుగారుస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో మహిళలపై, విద్యార్థినులపై లైంగికదాడులు అధికమయ్యాయని, నిందితులకు బీజేపీ ఎమ్మెల్యేలు అండగా ఉంటున్నారని ఆరోపించారు.

మణిపూర్ రాష్ట్రంలో మహిళలను వివస్త్రలను చేసి రోడ్లపై ఈడ్చుకెళ్లినా ప్రధాని మోడీ నోరు మెదపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుజరాత్ రాష్ట్రంలో ముస్లిం మహిళ బిల్కిస్ భానుపై 11 మంది దుర్మార్గులు లైంగికదాడి చేసి కుటుంబ సభ్యులందరినీ హతమార్చారని గుర్తు చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలకు రక్షణ, హక్కులు లేకుండా పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బిల్కిస్ భాను కేసు విషయంలో సుప్రీంకోర్టులో కేసు వేసి 11 మంది దుర్మార్గులను జైలుకు పంపించిన చరిత్ర ఐద్వాకు ఉన్నదని చెప్పారు.

కేంద్ర ప్రభుత్వం నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెంచి సామాన్యుల నడ్డి విరుస్తోందన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించినప్పటికీ 33 శాతం రిజర్వేషన్లను పదేండ్ల తర్వాత అమలు చేయాలనే ఆలోచన సరికాదని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే మహిళల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి జనగామ అంబేద్కర్ చౌరస్తా వద్ద బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆశాలత, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ షబానా, నాయకులు పందిళ్ల కళ్యాణి, మోకు భవాని, సిహెచ్ శ్రీలత, సౌందర్య, నిర్మల, రమాదేవి, నిర్మల, కావ్య, మమత, రజిత, రమ, పుల్లమ్మ, రాములమ్మ, మంగమ్మ, అనిత, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల సాగు రైతులకు పట్టాలు

- కొత్త ఆర్‌ఓఆర్ చట్టంతో భూ సమస్యలకు పరిష్కారం
- ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు : రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- కద్తాల్‌లో తహసీల్దార్ కార్యాలయ భవనం ప్రారంభం

నవతెలంగాణ-ఆమనగల్



ప్రభుత్వ భూములు సాగుచేసుకుంటున్న రైతులందరికీ త్వరలో పట్టా పాసుపుస్తకాలు అందజేస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రంగారెడ్డి కద్తాల్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరమ్మ పాలనలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒకటి, రెండు మినహా అన్ని పథకాలూ అమలు చేశామని చెప్పారు. ధరణి పోర్టల్ ద్వారా తీవ్ర ఇబ్బందులకు గురైన రైతుల సమస్యల పరిష్కారానికి త్వరలో కొత్త ఆర్‌ఓఆర్ చట్టాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మిస్తామన్నారు. ఈ నెల చివరి వరకు ఒక్కో నియోజకవర్గానికి 3,500 నుంచి 4,500 వరకు మొదటి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 6 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కోరిక మేరకు కద్తాల్ మండల కేంద్రంలో 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రి, జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కద్తాల్ మండల కేంద్రంతోపాటు నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న సర్వేయర్ పోస్టులను వెంటనే భర్తీ చేస్తామని చెప్పారు. ఆర్డీఓ కార్యాలయ ఏర్పాటు విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా 80 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అదేవిధంగా పలువురు గీత కార్మికులకు కాటమయ్య రక్ష సేఫ్టీ కిట్లను అందజేశారు. ధనిక రాష్ట్రాన్ని రూ.7.19 లక్షల కోట్లకు పైగా అప్పుల రాష్ట్రంగా మార్చింది 'మీరు కాదా' అని బీఆర్ఎస్‌నుద్దేశించి ప్రశ్నించారు. ఏదో ఒక వంకతో ప్రభుత్వంపై చేస్తున్న కాకి గోలను ఆపి రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శశాంక్, ఆర్డీఓ అనంత్‌రెడ్డి, పీసీసీ సభ్యులు బాలాజీ సింగ్, టీయూడీఎఫ్ఐ చైర్మెన్ చల్లా నర్సింహారెడ్డి, టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీక్యా నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ ముదిరాజ్, తహసీల్దార్లు ముంతాజ్ బేగం, లలిత, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ జక్కు అనంత్ రెడ్డి పాల్గొన్నారు.



సమిష్టి పనితోనే మదర్ డెయిరీకి లాభాలు

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

- నూతన చైర్మెన్ ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ- హయత్‌నగర్

సిబ్బంది, పాడి రైతులు సమిష్టిగా పని చేస్తేనే మదర్ డెయిరీ లాభాల బాటలో నడుస్తుందని, లేకపోతే తనకే చెడ్డ పేరు వస్తుందని రోడ్డు, రవాణా శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లోని మదర్ డెయిరీ కార్యాలయంలో సోమవారం నూతన చైర్మెన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. విజయ డెయిరీపై ఉన్న ప్రభుత్వ జీఓ విషయంపై ముఖ్యమంత్రితో చర్చిస్తానని చెప్పారు. ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లోని దేవాలయాలు, ప్రభుత్వ హాస్టల్స్, ప్రభుత్వ పాఠశాలల్లో డెయిరీ పాలు సరఫరా అయ్యేలా చొరవ చూపాలని అన్నారు. డెయిరీని లాభాల్లోకి తీసుకెళ్లేలా సిబ్బంది కొత్త పద్ధతుల్లో ముందుకెళ్లాలని సూచించారు. 45లక్షల కుటుంబాలపై సంస్థ ఆధారపడి ఉందని, సమిష్టి కృషితో నాణ్యమైన పాలను ఉత్పత్తి చేయాలని అన్నారు. ప్రస్తుతం లక్షా 75 వేల లీటర్ల పాలను సేకరిస్తే, 65 వేల లీటర్ల పాలు మాత్రమే అమ్మకమవుతోందని చెప్పారు.

ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. 450 మంది ఉద్యోగులు ఉన్న మదర్ డెయిరీ సంస్థ అభివృద్ధికి ముఖ్యమంత్రి వద్దకు ఈనెల 10న వెళ్దామని డైరెక్టర్లకు సూచించారు. సంస్థతో తనకు 33 సంవత్సరాల అనుబంధం ఉందని, దాని వల్లే తనకు ఈ స్థాయిలో గుర్తింపు వచ్చిందని గుర్తు చేసుకున్నారు. సంస్థ ప్రస్తుతం సుమారు రూ.30 కోట్లు లోటు బడ్జెట్‌లో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిగి, ఇబ్రాహీంపట్నం ఎమ్మెల్యేలు రామ్‌మోహన్, మల్‌రెడ్డి రంగారెడ్డి, డైరెక్టర్‌లు, ఎండీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులు అభివృద్ధి నిరోధకులు



(మొదటిపేజీ తరువాయి)

నిర్మూలించాయని ప్రకటించగలమని అన్నారు. ఇది ఒక్కసారి సాధిస్తే అభివృద్ధికి ఎలాంటి ఆటంకం ఉండదని తెలిపారు. మావోయిస్టుల ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు అభివృద్ధి, మావోయిస్టుల వ్యతిరేక కార్యకలాపాల పురోగతిని కనీసం నెలకోసారి సమీక్షించాలని కోరారు. కనీసం 15 రోజులకు ఒకసారి ఇటువంటి సమీక్షలు నిర్వహించాలని పోలీసు డైరెక్టర్ జనరల్ (డీజీపీ)లకు సూచించారు. 2004-2014తో పోల్చితే, దేశంలో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు 53 శాతం తగ్గాయని, 7,700 ఘటనలు నమోదయ్యాయని అన్నారు. ప్రభావిత జిల్లాలు 96 నుంచి 42కు తగ్గాయని, హింసాత్మక ఘటనలు నమోదయ్యే పోలీసు స్టేషన్ల సంఖ్య 465 నుంచి 171కి తగ్గిందని తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ సీఎం, హోం మంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ హోం శాఖ మంత్రి వంగలపూడి అనితతో పాటు కేంద్ర మంత్రులు జెపి నడ్డా, నిత్యానంద్ రాయ్, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, హోం మంత్రులు, డీజీపీలు, కేంద్ర బలగాల చీఫ్‌లు పాల్గొన్నారు.

గుజరాత్‌లో దారుణం

టీనేజీ బాలికపై సామూహిక లైంగికదాడి

- వడోదరలో నవరాత్రుల వేడుకల సమయంలో ఘటన
- బీజేపీ పాలిత రాష్ట్రంలో శాంతి భద్రతలపై కాంగ్రెస్ ఆందోళన



అహ్మదాబాద్ : బీజేపీ పాలిత రాష్ట్రం గుజరాత్‌లో దారుణం చోటు చేసుకున్నది. ఒక బాలికపై ఇద్దరు దుండగులు లైంగికదాడికి పాల్పడ్డారు. బాధితురాలి స్నేహితుడిని అడ్డుకొని, అతను చూస్తుండగానే ఈ దారుణం జరగటం గమనార్హం. వడోదర నగరంలోని ఒక నిర్మానుష్య ప్రదేశంలో ఈ ఘటన చోటు చేసుకున్నది. ఒకపక్క గుజరాత్‌లో నవరాత్రుల జరుగుతున్న సందర్భంలోనే ఈ దారుణం జరగటంతో రాష్ట్రంలో మహిళల భద్రతపై ఆందోళన తలెత్తుతున్నది. నవరాత్రి సందర్భంగా నగరంలో గార్బ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అయినప్పటికీ.. ఇలాంటి ఘటన జరగటం మహిళలకు ఆందోళన కలిగించే విషయమని సామాజిక కార్యకర్తలు, హక్కుల సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

తన చిన్ననాటి స్నేహితుడిని కలిసే క్రమంలో రాత్రి 11 గంటల సమయంలో తనపై ఈ దారుణం జరిగిందని బాధితురాలు తెలిపింది. ఈ విషయాన్ని వడోదర రూరల్ ఎస్పీ రోహన్ ఆనంద్ తెలిపారు. "సదరు అమ్మాయి, అబ్బాయి ఇద్దరూ స్కూటీపై అర్ధరాత్రి తిరిగి వస్తున్న క్రమంలో ఐదుగురు వ్యక్తులు నిర్మానుష్య ప్రదేశంలో వారిని ఆపారు. ఆ ఇద్దరితో వాగ్వాదానికి దిగారు. ఆ తర్వాత ఐదుగురు నిందితుల్లో ఇద్దరు అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఆ తర్వాత ఉన్న ముగ్గురిలో ఇద్దరు.. బాలికపై లైంగికదాడికి దిగారు. బాధితురాలి స్నేహితుడిని మరొక నిందితుడు నిరోధించాడు" అని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొన్నది. ఘటనా స్థలం నుంచి నిందితులు వెళ్లగానే.. బాధితురాలు పోలీసుల వద్దకు వచ్చి ఫిర్యాదు చేసిందని రోహన్ ఆనంద్ చెప్పారు. నిందితులను పట్టుకోవటానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్టు వివరించారు. కాగా, ఈ ఏడాది నవరాత్రి పండుగ సందర్భంగా గార్బ వేడుకల టైమింగ్స్‌పై ఉన్న ఆంక్షలను గుజరాత్ ప్రభుత్వం ఎత్తేసింది.

ఈ ఘటనపై గుజరాత్ హోం మంత్రి హర్ష సంఘవి స్పందించారు. దారుణ ఘటనను ఖండించారు. నిందితులను త్వరలో పట్టుకుంటామని హామీ ఇచ్చారు. మరోపక్క, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్.. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితుల పట్ల ఆందోళన వ్యక్తం చేసింది. నవరాత్రుల వేడుకల సందర్భంలోనూ రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైందని ఆరోపించింది. ఈ ఘటనతో రాష్ట్ర శాంతి భద్రతల విషయంలో బీజేపీ ప్రభుత్వ పనితీరు బయటపడిందని గుజరాత్ రాష్ట్ర అంసెబ్లీలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు అమిత్ చావ్‌డా ఆరోపించారు. బీజేపీ పాలనలో రాష్ట్రంలో మహిళలపై దారుణాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాశ్మీరంలో పీడీపీ కీలక పాత్ర ?

శ్రీనగర్ : హర్యానా, జమ్మూకాశ్మీర్ శాసనసభలకు జరిగిన ఎన్నికలకు సంబంధించి (మంగళవారం) నేడు ఫలితాలు వెలువడనున్నాయి. హర్యానాలో కాంగ్రెస్ విజయఢంకా మోగిస్తుందని అన్ని ఎగ్జిట్ పోల్స్ స్పష్టం చేశాయి. అయితే జమ్మూకాశ్మీర్‌లో హంగ్ ఏర్పడవచ్చునని అంచనా వేశాయి. జమ్మూకాశ్మీర్ ఎన్నికలలో కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) ఉమ్మడిగా పోటీ చేశాయి. 83 స్థానాలలో ఉమ్మడి అభ్యర్థులను నిలిపాయి. ఐదు చోట్ల స్నేహపూర్వక పోటీకి దిగాయి. కాశ్మీర్ ప్రాంతంలో సీపీఐ (ఎం) నేత మహమ్మద్ యూసఫ్ తరిగామికి, జమ్మూ డివిజన్‌లో నేషనల్ పాంథర్స్ పార్టీకి మద్దతు ప్రకటించాయి. ఈ కూటమికే మెజారిటీ స్థానాలు లభిస్తాయని ఎగ్జిట్ పోల్స్ చెబుతున్నప్ప టికీ ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన స్థానాలు లభిస్తాయా అన్నది సందేహంగా ఉంది. దీంతో అందరి కళ్లూ మెహబూబా ముఫ్తి నేతృత్వంలోని పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పీడీపీ) పైనే ఉన్నాయి. ఇండియా కూటమి లో భాగస్వామిగా ఉన్న పీడీపీ, హంగ్ ఏర్పడితే తటస్థ మిత్రపక్షంగా వ్యవహరించే అవకాశం ఉంది. అయితే కాశ్మీర్ లోయలో ఎన్సీకి ప్రధాన శత్రువు పీడీపీయే. అందువల్ల ఆ పార్టీ మద్దతును ఎన్సీ అంగీకరించకపోవచ్చు. 2014 ఎన్నికలలో పీడీపీ 28 సీట్లు గెలుచుకొని అతి పెద్ద పార్టీగా అవతరించింది. బీజేపీతో పొత్తు పెట్టుకొని సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే 2018 జూన్‌లో బీజేపీ తన మద్దతు ఉపసంహ రించుకుంది. దీంతో జమ్మూకాశ్మీర్ కేంద్ర పాలన కిందికి వచ్చింది. 2019లో పీడీపీ నిట్టనిలువునా చీలిపోయింది. ఆ పార్టీ నుంచి బయటికి వచ్చిన బుఖారీ 2020లో వేరు కుంపటి పెట్టారు. అయితే ఆ పార్టీకి ఇంకా ప్రజలలో పట్టు లభించలేదు. బుఖారీ పార్టీ తాజా ఎన్నికలలో మనుగడ కోసం పోరాడింది. ఇంజినీర్ రషీద్ నేతృత్వంలోని అవామీ ఇతెహాద్ పార్టీ (ఏఐపీ) బారాముల్లా ప్రాంతంలో అద్భుతాలు సాధించే అవకాశం ఉంది. బారాముల్లా లోక్‌సభ స్థానం పరిధిలో 18 శాసనసభ సీట్లు ఉన్నాయి. లోక్‌సభ ఎన్నికలలో వీటిలో 15 చోట్ల ఏఐపీకి మెజారిటీ రావడంతో ఇంజినీర్ ఘన విజయం సాధించారు.

అయితే ఆయన బీజేపీకి బినామీ అంటూ ప్రచారం జరగడంతో ఏఐపీ విజయావకాశాలపై ప్రభావం పడవచ్చు.చిన్నా చితకా పార్టీలు, స్వతంత్రులు ఏ మేరకు ప్రభావం చూపుతారో చూడాల్సి ఉంది. జమ్మూ ప్రాంతంలో బీజేపీ పట్టు సాధిస్తుందని ఎగ్జిట్ పోల్స్ తెలిపాయి.

చిన్న చిన్న ప్రాంతీయ పార్టీల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తానని బీజేపీ ధీమాగా ఉంది. అయితే కాశ్మీర్ లోయపై ఆ పార్టీకి ఎలాంటి ఆశలు లేవు.



పెండింగ్ డీఏలు, బిల్లులు విడుదల చేయాలి

- ఉప ముఖ్యమంత్రి భట్టికి ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం (డీఏ), పెండింగ్‌లోని వివిధ రకాల బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య ప్రధాన కార్యదర్శి చావ రవి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను నర్సిరెడ్డితోపాటు టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. బకాయి ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలనీ, పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని కోరారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం మూడు వాయిదాల డీఏలను విడుదల చేయలేదని తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ, సప్లిమెంటరీ వేతనాలు, సరెండర్ లీవులు, గత పీఆర్సీ బకాయిలు, మార్చి నుంచి ఉద్యోగ విరమణ పొందిన వారికి పెన్షనరీ బెనిఫిట్స్ తదితర వేలాది బిల్లులు ట్రెజరీల్లో ఆమోదం పొందినప్పటికీ సంబంధితుల ఖాతాల్లో జమ కావడం లేదని వివరించారు. 010 పద్దు ద్వారా వేతనాలు పొందుతున్న ఉద్యోగులకు ప్రతినెలా మొదటి తేదీన వేతనాలు ఇస్తున్నారు కానీ గురుకులాలు, మోడల్ స్కూళ్లు, ఎయిడెడ్, కేజీబీవీ, యూఆర్ఎస్ సిబ్బంది, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మొదటి తేదీన వేతనాలు అందటం లేదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 15 రోజుల్లో పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు ఇస్తామనీ, ఉద్యోగులందరికీ నెల మొదటి తేదీన వేతనాలు ఇస్తామనీ, పెండింగ్ బిల్లులన్నీ మంజూరు చేస్తామంటూ మ్యానిఫెస్టోలో ప్రకటిం చిందని గుర్తు చేశారు. పది నెలలు గడిచినా డీఏలు, పెండింగ్ బిల్లులు విడుదల కాకపోవడం వల్ల ఉద్యోగులు తీవ్రమైన అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. బకాయి పడిన నాలుగు వాయిదాల డీఏలు తక్షణమే విడుదల చేయాలనీ, పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు లక్ష్మారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

విదేశీ కంపెనీలతో సింగరేణి ఉమ్మడి భాగస్వామ్యం

- ఖనిజాన్వేషణ సహా నూతన రంగాల్లోకి ప్రవేశం
- ఖాళీ ప్రదేశాల్లో గ్రీన్ ఎనర్జీ ప్లాంట్లు :

సింగరేణి ఉద్యోగులకు లాభాల వాటా పంపిణీ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సింగరేణి కాలరీస్, విదేశీ కంపెనీల ఉమ్మడి భాగస్వామ్యంతో భవిష్యత్‌లో సరికొత్త ప్రాజెక్టులు చేపట్టనున్నట్టు డిప్యూటీ సీఎం, విద్యుత్, ఆర్థిక శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. కేవలం బొగ్గు ఉత్పత్తికే సింగరేణిని పరిమితం చేయబోమనీ, ఖనిజాన్వేషణతో పాటు బహుముఖంగా వ్యాపారాన్ని విస్తరిస్తామన్నారు. సోమవారంనాడిక్కడి మహాత్మా జ్యోతిభాపూలే ప్రజాభవన్‌లో సింగరేణి కార్మికులకు లాభాల వాటా చెక్కులు పంపిణీ కార్యక్రమం జరిగింది. డిప్యూటీ సీఎంతో పాటు మంత్రుల పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, సింగరేణి ప్రాంత ఎమ్మెల్యేలు, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఈ సభలో పాల్గొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వరంగ సంస్థలను కాపాడటమే తమ ధ్యేయమని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం అన్నారు. సింగరేణి లాభాల విషయంలో గత ప్రభుత్వం మాదిరి తాము దాపరికాలు చేయడంలేదనీ, వచ్చిన లాభాల్లో కొంత శాతం కొత్త గనులు ప్రారంభించడానికీ, కొత్త వ్యాపారాలు చేపట్టేందుకు వినియోగిస్తున్నామన్నారు. సింగరేణి సంస్థలో తొలిసారిగా కాంట్రాక్ట్ కార్మికులకు కూడా లాభాల నుండి ఒక్కొకరికి రూ.5 వేలు చెల్లిస్తున్నామని తెలిపారు. లాభాల వాటా, దీపావళి బోనస్, పండుగ అడ్వాన్స్‌లు కలిపి మొత్తం రూ. 1,261 కోట్లను కార్మికులు, ఉద్యోగులకు చెల్లించామని వివరించారు. దీపావళి బోనస్‌ను పండుగకు ముందు చెల్లిస్తామన్నారు.

భవిష్యత్‌లో బొగ్గు నిల్వలు తగ్గి, థర్మల్ విద్యుత్ కేంద్రాలపై పర్యావరణహిత ఆంక్షలు ఉంటాయనీ, అందువల్ల సంస్థ మనుగడ కోసం లిథియం వంటి ఇతర పరిశ్రమల్లోకి అడుగు పెట్టాలని నిర్ణయించామన్నారు. థర్మల్, సోలార్‌తోపాటు ఇతర గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తులను చేపడతామనీ, దానికోసం కొన్ని విదేశీ కంపెనీలతో కలిసి ఉమ్మడి భాగస్వామ్యంతో పనిచేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. సింగరేణి ప్రాంతంలోనిఖాళీ ప్రదేశాల్లో గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ల నిర్మాణం చేపడతామన్నారు. బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి కార్మికుల ఉత్పత్తి వ్యయం కన్నా, కాంట్రాక్టు కార్మికుల ఉత్పత్తి వ్యయం చాలా తక్కువగా ఉందనీ, ఈ వ్యత్యాసాలను సవరించుకుంటే మరిన్ని ఎక్కువ లాభాలు సాధించొచ్చని చెప్పారు. త్వరలో సింగరేణి వ్యాప్తంగా నియోజకవర్గానికి ఒకటి చొప్పున యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తామన్నారు. రిటైర్డ్ కార్మికుల వైద్య సేవల పరిమితిని రూ. 8 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచుతున్నామని ప్రకటించారు.

కార్యక్రమానికి సింగరేణి సీఎమ్‌డీ ఎన్ బలరాం స్వాగతోపన్యాసం చేశారు. సింగరేణి ప్రాంత ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, గడ్డం వినోద్, గడ్డం వివేక్ వెంకటస్వామి, ప్రేమ్ సాగర్‌రావు, మక్కన్‌సింగ్ రాజ్ ఠాకూర్, కోరం కనకయ్య, డాక్టర్ మట్టా రాగమయి, గండ్ర సత్యనారాయణరావు, గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రాతినిధ్య కార్మిక సంఘం (ఐఎన్‌టీయూసీ) సెక్రెటరీ జనరల్, కనీస వేతనాల అమలు కమిటీ చైర్మెన్ బీ జనక్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ ఏరియాలో ఎస్‌డిఎల్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న ఆసం శ్రీనివాస్ 304 రోజులు పని చేసి, అత్యధికంగా 3 లక్షల 24 వేల 150 రూపాయలను లాభాల వాటాగా పొంది సింగరేణి టాపర్‌గా నిలిచారు. ఆ తర్వాతి స్థానంలో కార్మికులు జెస్సిరాజ్ రూ.3 లక్షల పదివేలు, ఏ శ్రీనివాస్ రూ.3 లక్షలు, ఎమ్ తిరుపతి రూ.3 లక్షలు చొప్పున లాభాల వాటా చెక్కులను డిప్యూటీ సీఎం చేతుల మీదుగా పొందారు.

జర్నలిస్టుల ఇండ్లస్థలాలను వెనక్కి తీసుకోవడంపై కేటీఆర్ ఆగ్రహం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కరీనంగర్‌లో జర్నలిస్టులకు కేటాయించిన ఇళ్ల స్థలాలను వెనక్కి తీసుకోవటంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సమాజ హితం కోసం పనిచేసే జర్నలిస్టులకు ప్రభుత్వం స్థలాలను కేటాయించటాన్ని కూడా రేవంత్‌రెడ్డి సర్కార్ జీర్ణించుకోలేకపోతోందని ఆరోపించారు. హైదరాబాద్‌లో పేద ప్రజల ఇండ్లను కూలగొడుతున్నదని విమర్శించారు. కరీంనగర్‌లో జర్నలిస్టుల స్థలాలను వెనక్కి తీసుకుంటున్నదని తెలిపారు. అసలు ఇదేం పాలనంటూ ప్రశ్నించారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం పనిచేయాల్సిన ప్రభుత్వం వారికి కేటాయించిన స్థలాలను రద్దు చేయటం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకే జర్నలిస్టులపై కక్ష గట్టి ఈ చర్యకు పాల్పడుతున్నదని పేర్కొన్నారు.

అమానుష దాడి

వామపక్షాల నిరసన కార్యక్రమంలో వక్తలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అమెరికా అండతోనే పాలస్తీనాపై ఇజ్రాయిల్ అమానుష దాడికి పాల్పడుతోందని వామపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. మానవ హననానికి పాల్పడుతున్న ఆ దుశ్చర్యలు వెంటనే ఆపాలని డిమాండ్ చేశాయి. పాలస్తీనా భూభాగంపై ఇజ్రాయిల్ దాడులను ఖండించాయి. పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న దారుణ హత్యాకాండకు ఏడాది పూర్తైన సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్ వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించాయి. "గాజాపై ఇజ్రాయిల్ దాడి ఆపాలనీ, తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించాలనీ, సామ్రాజ్యవాదం నశించాలనీ, పాలస్తీనాపై యూఎన్ఓ తీర్మానాలను అమలు చేయాలనీ, భారత ప్రభుత్వం ఇజ్రాయిల్‌కు ఆయుధాల సరఫరా తక్షణమే నిలిపివేయాలి" అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. 'ప్రపంచ శాంతి వర్ధిల్లాలి, ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి, సేవ్ పాలస్తీనా అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సీపీఐ(ఎం) నగర కార్యదర్శి ఎం శ్రీనివాస్ అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఇజ్రాయిల్ దుర్మార్గాలకు వ్యతిరేకంగా విశాల ఉద్యమాన్ని నిర్మిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీఎస్ బోస్ చెప్పారు. పాలస్తీనాపై అమెరికా సామ్రాజ్యవాదం అండతో సాగిస్తున్న దాడులను తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. వేలాది మంది చనిపోతున్నా లక్షలాది మంది నిరాశ్రయులవుతున్నా ఇజ్రాయిల్ యుద్ధాన్ని ఆపటం లేదన్నారు. మానవ హననానికి పాల్పడుతున్న దేశానికి మోడీ మద్దతు పలకటం దుర్మార్గమని ఆయన విమర్శించారు. సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ కార్యదర్శి ఎస్ వెంకటేశ్వరరావు, కార్యదర్శి వర్గ సభ్యులు జేవీ చలపతిరావు, వి సంధ్య, మాస్‌లైన్ నాయకులు స్వరూప, లిబరేషన్ కార్యదర్శి మామిండ్ల రమేష్‌రాజా, ఎస్‌యూసీఐ కార్యదర్శి మురారి, ఆర్ఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి జానికి రాములు, ఏఐఎఫ్‌బీ నాయకులు భాస్కరరాజు మాట్లాడుతూ ఇజ్రాయిల్ చర్యలు అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు విరుద్ధమైనవన్నారు. పాలస్తీనా భూభాగాన్ని ఆక్రమించేందుకే ఇజ్రాయిల్ మారణకాండను కొనసాగిస్తున్నదని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు ఎం శ్రీనివాసరావు, మహేందర్, ఎం దశరథ్, రాజన్న సీపీఐ నాయకులు కిషన్, న్యూడెమోక్రసీ నాయకులు జి ఝాన్సీ, అనురాధ, ఎం శ్రీనివాస్, అరుణక్క , ఐఫ్టూ నాయకులు జే.కే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ దాడులతో మానవాళి వినాశనం :డీజీ నర్సింహారావు

అమెరికా సామ్రాజ్యవాదం అండతో ఇజ్రాయిల్ చేస్తున్న దుర్మార్గాలు ప్రపంచ మానవాళికి వినాశనంగా మారాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ నర్సింహారావు అన్నారు. పాలస్తీనాపై దాడులను ఆపాలంటూ ఐక్యరాజ్య సమితి తీర్మానాలు చేసినా ఇజ్రాయిల్ పట్టించుకోవటం లేదని తెలిపారు. అంతర్జాతీయ న్యాయస్థానం ఆదేశాలను బేఖాతరు చేసిందన్నారు. ఆయుధాలను అమ్ముకునేందుకు అమెరికా సామ్రాజ్యవాదం ప్రపంచ దేశాల మధ్య యుద్ధాన్ని ప్రేరేపిస్తున్నదని విమర్శించారు. అందులో భాగంగానే పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులకు పాల్పడుతున్నదని చెప్పారు. ఇది పాలస్తీనా మీద జరుగుతున్న దాడి కాదనీ, మానవాళి మీద, ప్రపంచ శాంతి మీద జరుగుతున్న దాడి అని అభివర్ణించారు. మోడీ ప్రభుత్వం ఇజ్రాయిల్‌కు ఆయుధాలను సరఫరా చేసి పరోక్షంగా ఆ యుద్ధంలో భాగస్వామిగా మారిందని విమర్శించారు. ఆ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పాలస్తీనాకు ప్రపంచ ప్రజలంతా అండగా ఉండాలనీ, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నిలబడాలని ఆయన పిలుపునిచ్చారు.

వైద్యశాస్త్రంలో అమెరికన్ శాస్త్రవేత్తలకు నోబెల్

స్టాక్‌హోం : అమెరికన్ శాస్త్రవేత్తలైన విక్టర్ ఆంబ్రోస్, గ్యారీ రువ్‌కున్‌లకు వైద్యశాస్త్రంలో నోబెల్ పురస్కారం వరించింది. స్వీడన్‌లోని కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్ సోమవారం ఈ పురస్కారాన్ని ప్రకటించింది. మైక్రో ఆర్ఎన్ఎ, పోస్ట్ ట్రాన్స్‌క్రిప్షనల్ జన్యు నియంత్రణలో దాని పాత్రను కనుగొన్నందుకు అత్యంత ప్రతిష్టాత్మకమైన నోబెల్ పురస్కారాన్ని ప్రకటించినట్లు నోబెల్ బృందం పేర్కొంది. వివిధ కణ రకాలు ఎలా అభివృద్ధి చెందుతాయనే అంశంపై అధ్యయనంలో భాగంగా వీరు మైక్రో ఆర్ఎన్ఎను కనుగొన్నారు. ఇది, జన్యు నియంత్రణలో కీలక పాత్ర పోషించే అణువుల కొత్త తరగతి అని నోబెల్ బృందం ఒక ప్రకటనలో తెలిపింది. జన్యు చర్యల నియంత్రణను అవగాహన చేసుకోవడమనేది అనేక దశాబ్దాలుగా కీలక లక్ష్యంగా వుందని, ఈ జన్యు నియంత్రణ గనక అవకతవకలతో సాగినట్లైతే కేన్సర్, మధుమేహం లేదా ఆటో ఇమ్యూనిటీ వంటి తీవ్రమైన వ్యాధులకు దారి తీయగలదని నోబెల్ అకాడమీ పేర్కొంది. వైద్యరంగం నుండి ప్రారంభమైన ఈ నోబెల్ బహుమతుల ప్రకటన అక్టోబర్ 14 వరకు కొనసాగుతుంది. వరుసగా అక్టోబర్ 8న భౌతిక శాస్త్రం, 9వ తేదీన రసాయన శాస్త్రం, 10వ తేదీన సాహిత్య విభాగం, 11వ తేదీన శాంతి బహుమతి, అక్టోబర్ 14వ తేదీన అర్థశాస్త్రంలో పురస్కారాలను ప్రకటిస్తారు. 10 లక్షల స్వీడిష్ క్రోనార్లు (సుమారు 9లక్షల డాలర్లు) నగదుతో పాటు అవార్డులను డిసెంబర్ 10న బహూకరిస్తారు.

అత్యున్నత పురస్కారం నోబెల్ పుట్టుక ఇలా.....

ప్రపంచంలోనే అత్యున్నత పురస్కారంగా నోబెల్‌కు గుర్తింపు ఉంది. స్వీడన్‌కు చెందిన శాస్త్రవేత్త, వ్యాపారవేత్త అల్‌ఫ్రెడ్ నోబెల్ పేరు మీదుగా ఈ నోబెల్ పురస్కారాన్ని ప్రవేశపెట్టారు. 1896లో ఆయన మరణించగా, ఆ తర్వాత ఐదేళ్లకు అంటే 1901 నుండి మానవాళి ప్రయోజనాల కోసం విశేషంగా సేవలందించిన వారికి ఈ పురస్కారాన్ని అందజేస్తున్నారు. ఆయన తన జీవితకాలంలో సంపాదించిన యావదాస్తిని ఒక నిధిగా ఏర్పాటు చేసి ఈ బహుమతులు అందజేస్తున్నారు. భౌతిక, రసాయన శాస్త్రాలు, వైద్య, సాహిత్య, రంగాలు, ప్రపంచ శాంతి కోసం పాటుపడిన వారికి ఈ అవార్డులు అందజేయాలని నోబెల్ తన వీలునామాలో ప్రత్యేకంగా పేర్కొన్నారు.

నార్వే పార్లమెంట్ ఎంపిక చేసిన ఐదుగురు వ్యక్తులతో ఏర్పడిన కమిటీ నోబెల్ శాంతి బహుమతిని అందజేయాలని నోబెల్ తన వీలునామాలో పేర్కొన్నారు. 1897 ఏప్రిల్‌లో ఈ బాధ్యతను పార్లమెంట్ ఆమోదించింది. నోబెల్ గౌరవార్థం ఆర్థిక రంగంలో పురస్కారాన్ని 1969 నుండి బ్యాంక్ ఆఫ్ స్వీడన్ ద్వారా అందజేస్తున్నారు. నోబెల్ చనిపోయిన డిసెంబరు 10వ తేదీన ఈ బహుమతులను స్టాక్‌హోమ్‌లో జరిగే కార్యక్రమంలో అందచేస్తారు.

అత్యున్నత పురస్కారమైన నోబెల్ బహుమతిని అందుకోవడం అత్యంత గౌరవప్రదంగా భావిస్తారు. జాతి, మత ప్రాంత వివక్ష లేకుండా మానవాళి ప్రయోజనాల కోసం విశేషంగా కృషి చేసేవారికి వీటిని ఇస్తారు. ఈ పురస్కారాలకు అర్హులను ఎంపిక చేయడానికి ముందుగా సవివరమైన పరిశోధన జరుగుతుంది.

సహకరించుకుందాం

న్యూఢిల్లీ : భారత్, మాల్దీవుల మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతమే లక్ష్యంగా మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ ముయిజు న్యూఢిల్లీలో పర్యటించారు. మాల్దీవుల్లో భారత్ సహకారంతో చేపట్టిన కొత్త రన్‌వే ప్రారంభోత్సవం, అధికారికంగా రూపే కార్డును ప్రారంభించడం వంటి చర్యలు ఇరు దేశాల మధ్య ఆర్థిక, పర్యాటక సహకారాన్ని పెంచుకోవడానికి ఉద్దేశించబడ్డాయి. ప్రధాని నరేంద్ర మోడీ, ముయిజు ఇరువురూ కలిసి సంయుక్తంగా హనిమధూ అంతర్జాతీయ విమానాశ్రయంలోని రన్‌వేను ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. మాల్దీవుల్లో రూపే చెల్లింపుల సేవలను కూడా ఆరంభించారు. అంతకుముందు ఇరువురు నేతలు విస్తృతంగా చర్చలు జరిపారు. ద్వైపాక్షిక సంబంధాలను సమీక్షించుకున్నారు. భవిష్యత్ సహకారానికి కొత్త పంథాను రూపొందించామన్నారు. ఈ మేరకు ఒక పత్రికా ప్రకటన జారీ చేశారు. భారత పర్యాటకులకు ఈ సందర్భంగా ముయిజు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. భారత టూరిస్టులు తమకెంతో విలువైన వారని, వారు తమ ఆర్థిక వ్యవస్థపై సానుకూలమైన ప్రభావాన్ని చూపుతారని పేర్కొన్నారు. ముయిజు దేశాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టన తర్వాత భారత్‌లో పర్యటించడం ఇదే ప్రథమం. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆయన చేసిన వ్యాఖ్యలతో ఇరు దేశాల సంబంధాల్లో ఒడిదుడుకులు తలెత్తాయి. మాల్దీవుల్లో భారత పర్యాటకుల సంఖ్య ఒక్కసారిగా పడిపోయింది.

మాల్దీవుల పర్యాటక రంగం బాగా దెబ్బతింది.దీంతో పరిస్థితులను చక్కదిద్దే బాధ్యత తీసుకున్న ముయిజు భారత ప్రజలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్ సీఎస్ఎంపీని అమృత్ 2.0లో చేర్చండి

కేంద్ర మంత్రి ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి వినతి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

హైదరాబాద్ సమగ్ర సీవరేజీ మాస్టర్ ప్లాన్‌ను(సీఎస్ఎంపీ) అమృత్ 2.0లో చేర్చాలని, లేకపోతే ప్రత్యేక ప్రాజెక్టుగా చేపట్టాలని కేంద్ర పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం నాడిక్కడ కేంద్ర మంత్రి ఖట్టర్‌ను సీఎం కలిశారు. చారిత్రాక హైదరాబాద్ నగరంలో పురాతన మురుగుశుద్ధి వ్యవస్థే ఉందని, అది ప్రస్తుత అవసరాలకు తగినట్టుగా లేదని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. హైదరాబాద్ సమీప పురపాలక సంఘాల్లోనూ సరైన మురుగునీటి పారుదల వ్యవస్థ లేదని ఆయన కేంద్ర మంత్రి దష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్‌లో ప్రజల జీవన ప్రమాణాలు ప్రపంచ స్థాయి నగరంలో మాదిరి ఉండాలంటే నగరంతో పాటు సమీప మున్సిపాలిటీల్లో 100 శాతం ద్రవ వ్యర్థాలను శుద్ధి చేయాల్సిన అవసరం ఉందని వివరించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌తో పాటు సమీప 27 పురపాలక సంఘాలతో కలుపుకొని కలిపి 7,444 కిలో మీటర్ల మేర రూ.17,212.69 కోట్లతో సీఎస్ఎంపీకి డీపీఆర్ రూపొందించినట్టు సీఎం తెలిపారు. ఆ డీపీఆర్‌ను కేంద్ర మంత్రి ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి అందజేశారు. సీఎస్ఎంపీని అమృత్ 2.0లో చేర్చి ఆర్థిక సహాయం చేయడం, లేకపోతే ప్రత్యేక ప్రాజెక్టుగా గుర్తించి నిధులివ్వాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు.

మూసీపై డీపీఆర్ అందజేత

హైదరాబాద్ నగరంలో 55 కిలోమీటర్ల మేర మూసీ నది ప్రవహిస్తోందని, ఇరువైపులా కలిపి 110 కిలోమీటర్ల మేర నగరంలోని మురుగంతా మూసీలోనే చేరుతోందని తెలిపారు. ఇలా మురుగు మూసీలో చేరకుండా ఉండేందుకు ట్రంక్ సీవర్స్ మెయిన్స్, లార్జ్ సైజ్ బాక్స్ డ్రెయిన్స్, కొత్త సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణానికి రూ.4 వేల కోట్లతో డీపీఆర్ రూపొందించినట్టు సీఎం కేంద్ర మంత్రికి తెలిపారు. ఆ డీపీఆర్‌ను కేంద్ర మంత్రి ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి సమర్పించారు. ఆ డీపీఆర్‌ను ఆమోదించడంతో పాటు పనుల అనుమతికి చొరవ చూపాలని కేంద్ర మంత్రిని కోరారు.

మెట్రో రైలు రెండో దశకు మద్దతు ఇవ్వండి

హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించి నాగోల్-శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (36.8 కిలో మీటర్లు), రాయదుర్గం-కోకాపేట నియోపొలిస్ (11.6 కిలో మీటర్లు), ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట (7.5 కిలో మీటర్లు), మియాపూర్-పటాన్‌చెరు (13.4 కిలో మీటర్లు), ఎల్‌బీ నగర్-హయత్ నగర్ (7.1 కిలో మీటర్లు) మొత్తం 76.4 కిలో మీటర్ల మేర డీపీఆర్‌లు పూర్తయినట్లు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ కారిడార్ల నిర్మాణానికి రూ.24,269 వ్యయం అవుతుందని అంచనా వేశామని, దీనిని కేంద్రం, తెలంగాణ ప్రభుత్వం 50:50 రేషియోలో జాయింట్ వెంచర్‌గా చేపట్టాలని భావిస్తున్నట్టు సీఎం తెలిపారు. త్వరలోనే ఇందుకు సంబంధించిన డీపీఆర్‌ను సమర్పిస్తామని, అది త్వరగా కార్యరూపం దాల్చేందుకు సహకరించాలని సీఎం కోరారు. ముఖ్యమంత్రి వెంట నల్లగొండ, భువనగిరి, పెద్దపల్లి ఎంపీలు రఘువీర్ రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, జి.వంశీకష, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, రాష్ట్ర పట్టణాభివ ద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ ఉన్నారు.

మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్‌కు

చట్టబద్ధమైన పని పద్ధతులు కల్పించాలి

- రాష్ట్ర గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తాం : సీఐటీయూ జాతీయ కార్యదర్శి కరుమలయన్

రాష్ట్ర కార్మిక శాఖ కార్యాలయం వద్ద ధర్నా



నవతెలంగాణ - ముషీరాబాద్

మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్‌కు చట్టబద్ధమైన పని పద్ధతులు కల్పించాలని సీఐటీయూ జాతీయ కార్యదర్శి కరుమలయన్ అన్నారు. ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా పిలుపుమేరకు సోమవారం యూనియన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ చిక్కడపల్లిలోని కార్మిక శాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చట్టాలను ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలను శిక్షించాలన్నారు. చట్ట వ్యతిరేక చర్యలను సహించేది లేదని, యాజమాన్యాలను శిక్షించాలని డిమాండ్ చేశారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి కార్మిక శాఖ కమిషనర్‌కు, కేంద్ర కార్మిక శాఖ మంత్రికి వినతిపత్రాలు అందజేస్తామని తెలిపారు. అలాగే, 10వ తేదీన రాష్ట్ర గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు.

ఈ ధర్నాలో ఎఫ్ఎంఆర్ఐఎ సంయుక్త ప్రధాన కార్యదర్శి కె.సునీల్ కుమార్, టీఎంఎస్ఆర్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.భాను కిరణ్, సంయుక్త ప్రధాన కార్యదర్శి ఏ.నాగేశ్వరరావు, సదానందాచారి, ఐలయ్య, విద్యాసాగర్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ మీడియం ఉపాధ్యాయ పోస్టులను పూర్తిగా భర్తీ చేయాలి

- ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్
- ఇందిరాపార్క్ వద్ద ఉర్దూ మీడియం నిరుద్యోగుల ధర్నా



నవతెలంగాణ-ముషీరాబాద్

ఉర్దూ మీడియం ఉపాధ్యాయ పోస్టులను పూర్తిగా భర్తీ చేయాలని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి అబ్బాస్ డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్‌ధర్నా చౌక్ వద్ద ఉర్దూ మీడియం నిరుద్యోగ యువతీ యువకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వ డీఎస్సీ నోటిఫికేషన్‌ను సవరిస్తూ 11062 పోస్టులకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. ఇందులో ఉర్దూ మీడియంలో 1183 పోస్టులు ఉన్నాయని, ఇటీవల ఫలితాలు విడుదల చేశారని తెలిపారు. అయితే, 550 మందికి మాత్రమే అపాయింట్‌మెంట్ లెటర్ వచ్చే అవకాశం ఉందని, బ్యాక్ లాగ్‌లో 600కు పైగా పోస్టులు మిగిలిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉర్దూ మీడియంలో డీఎస్సీలో కొన్ని రిజర్వుడ్ కేటగిరీల అభ్యర్థులు అందుబాటులో లేకపోవడమే దీనికి ప్రధాన కారణమన్నారు. 2012, 17 డీఎస్సీ కూడా ఇలాగే జరిగిందన్నారు. అందువల్ల మూడు డీఎస్సీల్లో అందుబాటులో లేని పోస్టులను జనరల్ కేటగిరీలోకి మార్చి మెరిట్ ఆధారంగా రిక్రూట్‌మెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

దసరా నాటికి మోడల్ స్కూల్ టీచర్లకు జీతాలివ్వాలి : పీఎంటీఏటీఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల వేతనాలు ఇంకా విడుదల కాలేదని పీఎంటీఏటీఎస్ రాష్ట్ర అధ్యక్షులు తరాల జగదీశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దసరా పండుగ సమయంలోనూ వేతనాలను ఆలస్యంగా ఇవ్వడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. డీఏ, పీఆర్సీ బకాయిలు కూడా నేటికీ రాలేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని దసరా పండుగ వరకైనా వేతనాలతోపాటు డీఏ, పీఆర్సీ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీని వేయాలని కోరారు. 010 పద్దు కింద వేతనాలను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

దౌత్య వైఫల్యం సిగ్గుచేటు

వాటికన్ సిటీ : పశ్చిమాసియాలో యుద్ధాన్ని, ఘర్షణలను పరిష్కరించడంలో ప్రపంచ దేశాలు విఫలమవడం సిగ్గుచేటైన వ్యవహారమని పోప్ ఫ్రాన్సిస్ సోమవారం విమర్శించారు. గాజాలో ఇజ్రాయిల్ దాడులకు ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "ఏడాది క్రితం, విద్వేషాగ్ని రగిలింది. సిగ్గుపడే రీతిలో అంతర్జాతీయ సమాజం వైఫల్యం కారణంగా అది హింసను చిమ్ముతోంది. ఈ విషాదానికి స్వస్తి పలకడంలో ప్రపంచ అగ్ర దేశాలు విఫలమయ్యాయి." అని ఆయన కేథలిక్కులకు రాసిన బహిరంగ లేఖలో పేర్కొన్నారు. రక్తం చిమ్మి కన్నీరుగా మారుతోంది. ఆగ్రహావేశాలు పెరుగు తున్నాయి. ప్రతీకారం తీర్చుకోవాలనే వాంఛ పెరుగుతోంది. ప్రస్తుతం ఎంతగానో అవసరమైన చర్చలు, శాంతి గురించి కేవలం అతి కొద్ది మంది మాత్రమే ఆలోచిస్తున్నట్లు కనిపిస్తోందని అన్నారు. అక్టోబరు 7న అంతర్జాతీయ దినంగా ప్రకటిస్తూ ఆ రోజున ప్రార్థనలు జరపాలని, శాంతి కోసం నిరశన చేపట్టాలని పోప్ కోరారు. ఈ యుద్ధం వల్ల బాధపడుతున్న ప్రతి ఒక్కరికీ సంఘీభావాన్ని ప్రకటించారు. ప్రణాళికలు, వ్యూహాల గురించి మాట్లాడుతున్నారు కానీ యుద్ధ విధ్వంసం కారణంగా ఇబ్బందులు పడుతున్న వారి పట్ల ఆందోళన కనిపించడం లేదన్నారు.

317 జీవో బాధితుల సమస్యలు పరిష్కరించాలి : టీపీటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 317 జీవో బాధితుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పి నాగిరెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వం ఏకపక్ష విధానాల్లో భాగంగా స్థానికత లేకుండా 317 జీవోను అమలు చేసిందని తెలిపారు. ఆ జీవో బాధితుల సమస్యను పరిష్కరిస్తామంటూ కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. స్థానికత, స్పౌజ్ ఆధారంగా జిల్లాలకు కేటాయించి న్యాయం చేయాలని కోరారు.

22 నుంచి ఏఈ అభ్యర్థుల

ధ్రువపత్రాల పరిశీలన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని వివిధ ఇంజినీరింగ్ శాఖలకు చెందిన విభాగాల్లో అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ), మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్, టెక్నికల్ ఆఫీసర్ అండ్ జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ పోస్టులకు తాత్కాలికంగా ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 22 నుంచి ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం కానుంది. ఈ మేరకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సెలవు దినాల్లో కాకుండా వచ్చేనెల ఐదో తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని వివరించారు. గైర్హాజరైన అభ్యర్థుల కోసం వచ్చేనెల ఆరో తేదీన నిర్వహిస్తామని తెలిపారు. హైదరాబాద్‌లోని నాంపల్లి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ధ్రువపత్రాల పరిశీలన నిర్వహిస్తామని వివరించారు. అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతోపాటు రెండు జతల జిరాక్స్ ప్రతులను వెంట తెచ్చుకోవాలని సూచించారు. అందుకు సంబంధించిన వివరాలు www.tspsc.gov.in వెబ్‌సైట్‌లో పొందుపర్చామని కోరారు. అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలను తీసుకురాలేకపోతే ఆ తర్వాత ఈ అవకాశం ఉండబోదని స్పష్టం చేశారు. 837 ఏఈ పోస్టుల భర్తీకి 2022, సెప్టెంబర్ 12న టీజీపీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే.

కలెక్టర్‌కు టీఎన్జీవోస్ నాయకుల కృతజ్ఞతలు



నవతెలంగాణ - సిటీబ్యూరో

తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా చేసిన విజ్ఞప్తి మేరకు హైదరాబాద్ జిల్లాలో పనిచేస్తున్న మహిళా ప్రభుత్వ ఉద్యోగులందరికి, ఆ సంఘం ఆధ్వర్యంలో నేడు (మంగళవారం) నిర్వహిస్తున్న బతుకమ్మ వేడుకలలో పాల్గొనేందుకు సాయంత్రం కార్యాలయాల నుంచి ఒక గంట ముందుగానే వెళ్లేందుకు హైదరాబాద్ కలెక్టర్ , జిల్లా మేజిస్ట్రేట్ అనుదీప్ దురిశెట్టి అవకాశమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినందుకు జిల్లా కార్యదర్శి విక్రమ్ కుమార్, సహాధ్యక్షుడు కె.ఆర్. రాజ్ కుమార్, ఉపాధ్యక్షుడు కుర్రాడి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గంతో పాటు స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఫిరోజ్ అహ్మద్ కృతజ్ఞతలు తెలియచేసింది. బతుకమ్మ వేడుకలలో ఉద్యోగినులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలనీ వారు కోరారు.

మీరు ఊరెళ్లండి.. మేము భద్రత కల్పిస్తాం

సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజ్ గౌడ్, సబ్ ఇన్‌స్పెక్టర్ వెంకట్ రెడ్డి



నవతెలంగాణ-హాయత్ నగర్

దసరా పండగకు ఊరు వెళ్లే వారు విలువైన బంగారు, వెండి, ఆభరణాలు, డబ్బులు, బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవాలని హయత్‌నగర్ పోలీసులు సూచించారు. పండగకు ఊరెళ్తున్న వేళ తీసుకోవాల్సిన జాగ్రతలపై వారు పలు సూచలు చేస్తూ ప్రజా చైతన్య రథాన్ని పోలీస్ స్టేషన్ ఆవరణలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజ్ గౌడ్, సబ్ ఇన్‌స్పెక్టర్ వెంకట్ రెడ్డితో కలిసి సోమవారం ప్రారంభించారు.అనంతరం వారు మాట్లాడుతూ దసరా పండుగ సందర్భంగా కాలనీల్లో దొంగతనాల నివారణకు స్వచ్ఛందంగా కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని, ఎవరిమీదైనా అనుమానం వస్తే వెంటనే 100 నెంబర్ కు గాని, పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. ప్రజా చైతన్య రథం ద్వారా ఊరు వెళ్ళేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, పాటించవలసిన నియమాల గురించి ప్రచారం చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ.. ఇద్దరు మృతి



- లిఫ్ట్ అడిగి ప్రాణం కోల్పోయిన వ్యక్తి

నవతెలంగాణ - మీర్ పేట్

బైక్ పై లిఫ్ట్ అడిగి వెళ్లి ప్రాణాలను కోల్పోయిన విషాద ఘటన మీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం ధర్పల్లి గ్రామానికి చెందిన అన్నోజ్ శ్రావణ్ కుమార్ (40) జీవనోపాధి కోసం మీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నందనవనంలో గత సంవత్సరం కాలంగా కుటుంబ సమేతంగా నివాసం ఉంటున్నాడు. టీకేర్ కళాశాలలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే అతను డ్యూటీకి ముగించుకొని ఇంటికి వస్తూ టీకేఆర్ కమాన్ దగ్గర షేక్ మదీనా భాష (42) అనే వ్యక్తిని లిఫ్ట్ అడిగి బైక్‌పై (టీఎస్ 13 ఈపీ 2563) టీకేఆర్ కళాశాల వైపు వస్తున్నాడు. ఆ సమయంలో వెనకాల నుంచి వచ్చిన లారీ వారి బైక్‌ను ఢీకొట్టింది. దాంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు మీర్ పేట్ పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అన్నోజ్ శ్రవణ్ కుమార్ భార్య అనురాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ కీసర నాగరాజు తెలిపారు.

జి.ఎస్.ఐ సంస్థ అత్యుత్తమ జియో సైన్స్ ఆర్గనైజేషన్



- మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎన్. కుటుంబరావు

నవతెలంగాణ- నాగోల్

భారతీయ భూ వైజ్ఞానిక సర్వే సంస్థ అత్యుత్తమ జియో సైన్స్ ఆర్గనైజేషన్ అని జీఎస్ఐ సంస్థ మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎన్ .కుటుంబరావు అన్నారు. సోమవారం నాగోల్ డివిజన్ బండ్లగూడలో గల జీఎస్ఐ శిక్షణ సంస్థ కార్యాలయంలో నిర్వహించిన 48వ బ్యాచ్ జియాలజిస్టులు, నాలుగవ బ్యాచ్ అసిస్టెంట్ ఇంజినీర్ల ఓరియంటేషన్ కోర్సు ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జి.ఎస్.ఐ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మాథ్యూ జోసెఫ్ చీఫ్ ఇంజనీర్ అజయ్ అగర్వాల్ తో కలిసి ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో కుటుంబరావు మాట్లాడుతూ జి.ఎస్.ఐ సంస్థ అత్యుత్తమ జ్యో సైన్స్ ఆర్గనైజేషన్ అని ఈ గొప్ప సంస్థలు భాగమైనందుకు అధికారులు , ఉద్యోగులు గర్వపడుతున్నారని అన్నారు. అపారమైన అవకాశాలు ముమ్ముందు ఉన్నాయని దీంతో ట్రైనీలు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా దేశంలో ఏ ప్రాంతానికైనా పోస్టింగ్ లేదా బదిలీ ద్వారా వెళ్లి దేశానికి సేవ చేసేందుకు సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. హైదరాబాద్ జి.ఎస్.ఐ శిక్షణ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్. మాథ్యూ జోసెఫ్ స్వాగత ఉపన్యాసం చేస్తూ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యు.పి.ఎస్.సి.) ద్వార కొత్తగా రిక్రూట్ అయిన గ్రూప్-ఎ సర్వీస్‌కు చెందిన 171 మంది జియాలజిస్టులు, 05 మంది అసిస్టెంట్ ఇంజనీర్లు ఈ శిక్షణా ప్రారంభోత్సవ కార్యక్రమములో పాల్గొన్నారని తెలిపారు. 1851 లో స్థాపించబడి, 174 సంవత్సరాలకు పైగా వారసత్వాన్ని కలిగి ఉన్న ప్రపంచంలోని 3వ అతి పెద్ద, భారతదేశంలో 2వ అతి పెద్ద సర్వే సంస్థ జీఎస్ఐ కుటుంబంలో భాగమైనందుకు ట్రైనీ అధికారులని అభినందించారు. అనుభవజ్ఞులైన అధ్యాపకుల నైపుణ్యాన్ని ఉపయోగించుకొని తమ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. చీఫ్ ఇంజనీర్. అజయ్ అగర్వాల్ మట్లాడుతూ సంస్థలో చేరినందుకు నూతనంగా నియమితులైన ట్రైనీ అధికారులను అభినందించి శిక్షణను సద్వినియోగం చేసుకునేలా వారిని ప్రోత్సహించారు. ట్రైనీ అధికారులు తొమ్మిది నెలల పాటు (జూలై 7, 2025 వరకు) సుదీర్ఘ శిక్షణా కాలంలో సాంకేతిక, క్రియాత్మక, ప్రవర్తనాపరమైన వంటి వివిధ సామర్థ్యాలలో శిక్షణ పొందనున్నారని జి.ఎస్.ఐ శిక్షణ సంస్థ ప్రజా సంబంధాల అధికారి డాక్టర్. మల్లేష్ గంజి, ప్రజా సంబంధాల అధికారి తెలియజేశారు.ఈ శిక్షణ తరగతుల్లో డీడీజీలు, డైరెక్టర్లు, అధ్యాపకులు, ఉద్యోగస్తులు ,ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.



అక్రమ నిర్మాణం కూల్చివేత

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

నిబంధనలకు విరుద్దంగా బాటసింగారం గ్రామ రెవిన్యూ సర్వే నెం 319లోని భూదాన్ భూమిలో చేపట్టిన ఇంటి నిర్మాణం, కాంపౌండ్ వాల్‌ను జేసీబీ సాయంతో రెవిన్యూ అధికారులు సోమవారం కూల్చివేశారు. అలాగే అదే గ్రామ రెవిన్యూ సర్వేనెం. 10/106లోని అసైన్ భూమి ఆక్రమించారంటూ ఓ వ్యక్తి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో ఇచ్చిన పిర్యాదు మేరకు తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ ఇంద్రాణి, సర్వేయర్ జ్యోతి లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తున్న ఇజ్రాయిల్

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మహమ్మద్ అబ్బాస్
- ఐఎస్ సదన్‌లో నిరసన



నవతెలంగాణ-చంపాపేట్

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తున్నాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మహమ్మద్ అబ్బాస్ అన్నారు. సీపీఐ(ఎం) జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా పార్టీ హైదరాబాద్ సౌత్ కమిటీ ఆధ్వర్యంలో ఐ.ఎస్. సదన్ క్రాస్ రోడ్, సంతోష్ నగర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇజ్రాయిల్ పాలస్తీనా దేశాల మధ్య రాజకీయ, సామాజిక సమస్య తలెత్తడంతో యుద్ధం మొదలైతే ఆ యుద్ధానికి ఎటువంటి సంబంధం లేని మహిళలపై, చిన్న పిల్లలపై, శరణార్థ శిబిరాలపై, పాఠశాలలపై, హాస్పిటలపై ఏరి కోరి దాడులు చేయడం చాలా విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది అంతర్జాతీయ చట్టానికి విరుద్ధమని తెలిపారు. రోజులు, వారాలు దాటి ఏకంగా 365 రోజుల పాటు ప్రతిరోజూ ఇజ్రాయిల్ పాలసీనపై దాడులు చేస్తూనే ఉందని ఆ దాడులన్నీ అమాయక ప్రజల పైనే జరుగుతున్నాయన్నారు. ఈ దాడుల్లో ఇప్పటికీ 42,000 మంది చనిపోయారని తెలిపారు. ఇలాంటి అక్రమ దాడులను ప్రోత్సహించేది అమెరికా దేశమేనని వారి ఆయుధాల వ్యాపారం కోసం ఇలాంటి అక్రమ దాడులను స ష్టిస్తూ ప్రపంచంపై పెత్తనం చేస్తున్నారని విమర్శించారు. ఈ విషయాన్ని ప్రపంచవంతా ఖండించాలని, భారతదేశ ప్రభుత్వం కూడా ఐక్యరాజ్య సమితితో మాట్లాడి ఈ యుద్ధాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. పార్టీ హైదరాబాద్ సౌత్ కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.మీనా మాట్లాడుతూ పాలస్తీనా పై ఇజ్రాయిల్ సంవత్సరం పాటు ఆగకుండా దాడులు చేయడం ప్రపంచశాంతికి విఘాతం కలిగిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని ఐక్యరాజ్యసమితి కల్పించుకొని యుద్ధం ఆపాలని కోరారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం చూసి చూడనట్టు నిర్లక్ష్యం చేస్తున్నదన్నారు. ఇప్పటికే సంవత్సరం పాటు జరుగుతున్న దాడుల కారణంగా వచ్చిన నష్టాన్ని పూరించాల్సిన అవసరం పూర్తి ప్రపంచానిదని, అందులో భాగంగా బీజేపీ ప్రభుత్వం కూడా బాధ్యత వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వర్గ సభ్యులు ఎల్.కోటయ్య జిల్లా కమిటీ సభ్యులు ఎం.బాలు నాయక్, అబ్దుల్ సత్తార్, ఎమ్ లక్ష్మమ్మ, ఎం.శ్రావణ్ కుమార్, ఎస్.కిషన్, రామ్ కుమార్ పాల్గొన్నారు.



ప్రజల భద్రతే పోలీసుల విధి

- పండుగకు గ్రామాలకు వెళుతున్నారా.. జాగ్రత్తలు తీసుకోవాలి :
- ఇన్‌స్పెక్టర్లు గురువారెడ్డి, భూపతిలు

నవతెలంగాణ-బడంగ్‌పేట్

ప్రజల భద్రతే పోలీసుల విధి అని, దసర పండుగకు తమ స్వంత గ్రామాలకు వెళుతున్న వారు పలు జాగ్రత్తలు తీసుకోవాలని పహడి షరీఫ్, బాలాపూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు గురువారెడ్డి, భూపతిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో దసర పండుగను ప్రజలు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా కుటుంబ సభ్యులు,బంధు మిత్రులతో కలిసి ఆనందోత్సవాల మధ్య జరుపుకుంటారని, అందుకోసం సొంత గ్రామాలకు వెళ్తారన్నారు. అయితే వెళ్ళే సమయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఇంటికి తాళం వేసిన ఇండ్లను టార్గెట్ చేస్తూ దొంగలు దొంగతనాలకు పాలుపడుతుంటారని తెలిపారు. గ్రామాలకు వెళుతున్న వారు ఇంటిలో విలువైన బంగారు ఆభరణాలు,నగదు డబ్బులు ఇంటిలోనే ఉంచుకోకుండా తమ వెంట తీసుక వెళ్లాలని లేకపోతే బ్యాంకుల్లో భద్రపర్చుకోవాలని సూచించారు. మీరు ఇంటిలో లేని సమయంలో పొరుగింటివారికి చెప్పి ఇంటిని చూడమని చెప్పాలని, ఇంటి ముందు లైట్లు వేసి ఉంచి, ఇంటి ముందు చెప్పులను ఉండేవిధంగా చూసుకోవాలని కోరారు. అనుమానం వచ్చిన కొత్త వ్యక్తులు ఎవ్వరైనా కనిపిస్తే 100కు డయల్ చేయాలని, అదేవిధంగా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

పాత పోచంపల్లి రోడ్డును వెంటనే పునరుద్ధరించాలి

- ఎంపీ ఈటల రాజేందర్

నవతెలంగాణ-హాయత్ నగర్

ఆటోనగర్ ఇండస్ట్రియల్ ఏరియా నుంచి క్రిడా,డీర్ పార్క్ ఫారెస్ట్ నుంచి ఉన్న పాత పోచంపల్లి రోడ్డును పునరుద్ధరించాలని ఎంపీ ఈటల రాజేందర్‌ను జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి, స్థానికులతో కలిసి కోరారు. సోమవారం ఈటల ఎల్బీనగర్‌కు విచ్చేసిన సందర్భంగా గోడను నిర్మించి మూసివేసిన పాత పోచంపల్లి రోడ్డు వద్ద ఘటన స్థలానికి చేరుకున్నారు. అధికారులతో ఎంపీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అటవీ ప్రాంతం నుంచి ఉన్న రోడ్లను పునరుద్ధరణ చేస్తుంటే మీరు ఎందుకు ఆపుతున్నారని అధికారులను ప్రశ్నించారు. పాత పోచంపల్లి రోడ్డు కోసం ఫారెస్ట్, క్రీడా అధికారులకు పాత రోడ్డు హద్దులను వివరించి వినతిపత్రం అందజేశామని అన్నారు. లోపల నుండి ఉన్న మైల్ రాయి, రోడ్డు హద్దులను నిర్మించిన గోడ పైనుండి పర్యవేక్షించి వెంటనే ఈటల సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వారి నుండి కూడా వివరాలు తెలుసుకుని ఇక్కడున్న సమస్యను వారికి వివరించి వెంటనే రోడ్డును పునరుద్ధరణ చేస్తే వేలమంది ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ప్రయాణించే రోడ్డు అని వెంటనే రోడ్డున పునరుద్ధరించాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా ఎల్బీనగర్ నుండి అబ్దుల్లాపూర్మెట్ వరకు జాతీయ రహదారి నుండి ట్రాఫిక్ ను అధిగమించే విధంగా ఉన్న ఈ రోడ్డును శాయశక్తులతో వెంటనే పునరుద్ధరణ చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీవాసులు, బీజేపీ



నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన కళలను ప్రోత్సహించండి : ఎంపీ

మలక్ పేట్ : ప్రాచీన కళలను ప్రోత్సహించాలని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని పీఎన్‌టీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం 50 సంవత్సరాల గోల్డెన్ జూబిలీ వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రాచీన కళలలో ఒకటైన కూచిపూడి, భరతనాట్యం పట్ల ప్రజల్లో ఆదరణ తగ్గుతున్నదని తెలిపారు. అసోసియేషన్ వారు ఆ కళలను ప్రోత్సహించటం అభినందనీయం అని చెప్పారు. ఈ కళలను ఎక్కువ మంది నేర్చుకొనే విధంగా చూడాలని సూచించారు. కాలనీ ముఖద్వారాన్ని ఎంపీ ప్రారంభించారు.భరతనాట్యం, కూచిపూడి,సంగీత ప్రదర్శన చేస్తున్న కాలనీ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఐఎఫ్ఎస్ సుభద్ర దేవి,గడ్డి అన్నారం కార్పొరేటర్ ప్రేమ్ మహేందర్ రెడ్డి, కాలనీ ప్రెసిడెంట్ మున్నంగి అశోక్ కుమార్,కాలనీ వాసులు పాల్గొన్నారు

సాహెబ్ నగర్ సీపీఐ(ఎం) శాఖ కార్యదర్శిగా కొత్త గణేష్



నవతెలంగాణ-వనస్థలిపురం

బి.యన్.రెడ్డి డివిజన్ పరిధిలో సీపీఐ(ఎం) సాహెబ్ నగర్ శాఖ మహాసభలు కామ్రేడ్ సంధ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహా సభలకు ముఖ్య అతిథులుగా పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, సర్కిల్ కార్యదర్శి కీసరి నర్సిరెడ్డి హాజరైనారు. నర్సిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మూసీ పరివాహక ప్రాంతంలో పేదల ఇండ్లను కూల్చడం సరైందికాదన్నారు. ప్రత్యామ్నాయంగా వారికి సమానమైన భూమి కేటాయించి ఇల్లు నిర్మాణం చేసి ఇవ్వాలని అన్నారు. ఆదేవిధంగా ఆరు పథకాలను అమలు చేయాలని, పేదలకు రేషన్ కార్డ్స్ ఇవ్వాలని, శివారు కాలనీలలో డ్రయినేజీ నిర్మాణం, మంచినీటి సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాలనీలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ పరిష్కారం చేయాలన్నారు. ఈ మహాసభల్లో నూతన సాహెబ్ నగర్ శాఖ కార్యదర్శిగా కొత్త గణేష్ గౌడ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ శాఖ సభ్యులు తిరుమల సంధ్య, మూర్తి, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు షాక్... టీడీపీలోకి తీగల కృషారెడ్డి..



- చంద్రబాబుతో భేటీ అయిన తీగల కృషారెడ్డి, మల్లారెడ్డి

నవతెలంగాణ - మీర్ పేట్

తెలంగాణలో కాంగ్రెస్‌కు బిగ్‌షాక్ తగిలింది. ఆ పార్టీ నేత తీగల కృషారెడ్డి కాంగ్రెస్‌లో చేరనున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు సోమవారం ఏపీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబుతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో టీడీపీ పూర్వ వైభవానికి తీసుకు వచ్చేందుకు చంద్రబాబు ప్రయత్నాల్లో ఉన్నారన్నారు. అలాగే హైదరాబాద్ అభివృద్ధికి బాబు ఎంతగానో కృషి చేసినట్లు తెలిపారు. అదే సమయంలో మల్లారెడ్డి సైతం ప్రక్కనే ఉన్నారు. అయితే ఆయన తన మనవరాలి వివాహ వేడుకకు చంద్రబాబును ఆహ్వానించేందుకు వచ్చినట్టు తెలిపారు.

ఇక మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి టీడీపీలోకి చేరితే టీటీడీపీ బలోపేతం అవుతుందని రాజకీయ విశ్లేషకుల అంచనా. కాగా మల్లారెడ్డి మాత్రం నిశ్శబ్దంగా ఉన్నా.. తీగలను తనతో పాటు తీసుకెళ్ళి బాబును కలవడం అనంతరం టీడీపీలోకి వెళుతున్నట్టు తీగల తెలపడం వెనుక వీరిద్దరి రాజకీయ వ్యూహం ఉందని పొలిటికల్ కామెంట్స్ వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఢిల్లీ వెళుతున్నట్టు.. తర్వాత అన్నీ మాట్లాడుకుందామని బాబు చెప్పినట్టు చివరగా తీగల చెప్పారు. ఇక తీగల రాజకీయ ప్రస్థానం సైతం టీడీపీ నుంచి ప్రారంభం కావడం మళ్లీ సొంత గూటికి చేరుతున్నట్లు ప్రకటించడం పట్ల రాజకీయ వర్గాల్లో విస్త తంగా చర్చలు జరుపుతున్నాయి. తీగల క షారెడ్డి గతంలో టీడీపీ నుండి గ్రేటర్ హైదరాబాద్ కి ప్రత్యేక్ష ఎన్నికల్లో గెలిచి మేయర్ గా పనిచేశారు. అనంతరం హుడా చైర్మెన్ గా కూడా సేవలందించారు. అధికార కాంగ్రెస్‌లో ఉండి మళ్లీ సొంతగూటికి టీడీపీలోకి వెళ్ళడం అంటే కాంగ్రెస్ పార్టీకి భారీ షాకే అని చెప్పొచ్చు. టీడీపీతో తన రాజకీయ ప్రయాణం ప్రారంభించిన తీగల కషారెడ్డి.. గతంలో హైదరాబాద్ మేయర్ గా, మహేశ్వరం ఎమ్మెల్యేగా పని చేశారు. తెలంగాణ ఏర్పడిన అనంతరం 2014లో టీడీపీ నుంచి గెలుపొందారు. ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. 2018లో కాంగ్రెస్ అభ్యర్థి సబితా ఇంద్రారెడ్డి చేతిలో ఓడిపోయారు. అనంతరం సబితా ఇంద్రారెడ్డి సైతం బీఆర్ఎస్‌లోకి రావడంతో మహేశ్వరం బీఆర్ఎస్‌లో తీగల వర్సెస్ సబితా మధ్య వర్గపోరు మొదలైంది. ఈ నేపథ్యంలో పార్టీలో తనకు గుర్తింపు దక్కడం లేదని అనేక సందర్భాల్లో అసంత ప్తి వ్యక్తం చేశారు. ఈ క్రమంలో అధికారంలో ఉండగా తనకు ఎమ్మెల్సీ ఇస్తానని కేసీఆర్ హామీ ఇచ్చి మాట తప్పారని, మొన్నటి ఎన్నికల్లో టికెట్ కూడా ఇవ్వకుండా మోసం చేశారని తన సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నారట. దీంతో టికెట్ నిరాకరించిన సందర్భంలోనే పార్టీ మారేందుకు తీగల సిద్ధం కాగా రంగారెడ్డి జడ్పీ చైర్ పర్సన్ గా ఉన్న తీగల క షారెడ్డి కోడలు తీగల అనితారెడ్డి పార్టీ మారకుండా చివరి నిమిషంలో అడ్డుకున్నట్లు ప్రచారం జరిగింది. ప్రస్తుతం రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో అనూహ్యంగా ఆయన రేవంత్ రెడ్డితో భేటీ కావడం కాంగ్రెస్ పార్టీలో చేరడం అంతా జరిగిపోయింది. కాంగ్రెస్ పార్టీలో చేరి 9 నెలలకి మళ్లీ టిప్ టిప్‌లో చేరుకున్నట్లు ప్రకటించడం టీడీపీ బలోపేతానికి కషి చేస్తానని ప్రకటించడం పట్ల రాజకీయ పరిణామాలు ఏమవుతాయని విస్త తంగా చర్చలు జరుగుతున్నాయి.

నవరాత్రి ఉత్సవాలలో పాల్గొన్న నవ జీవన్ రెడ్డి

నవతెలంగాణ-వనస్థలిపురం

హయత్ నగర్ డివిజన్ లోని భూలక్ష్మి నగర్ లో కాలనీ వాసులు ఏర్పాటు చేసినా అమ్మ వారిని కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. బీజేపీ నాయకులు సురేష్, వెంకట్ రెడ్డి, అరుణ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.





ఆరోగ్యంగా ఉండాలంటే యోగతోనే సాధ్యం

నవతెలంగాణ-చంపాపేట్

ఆరోగ్యంగా ఉండాలంటే యోగాతో సాధ్యపడుతుందని గ్రూప్ లీడర్ డి. విజయలక్ష్మి అన్నారు. సోమవారం ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని జీహెచ్ఎంసీ వార్డు ఆఫీస్ ఐ.ఎస్ సదన్ డివిజన్ వార్డు 38 పార్క్ నందు వాకింగ్, జిమ్, మహిళా మణులు దాండియా, దేవుని పాటలకు దాండియా న త్యాలు ఆటల పాటలతో పలు యోగాసనాలు చేశారు. విజయలక్ష్మి మాట్లాడుతూ... మహిళలు, మనసులు శరీరాన్ని రోగాలకు దూరం చేసేది వాకింగ్, డాన్స్, దాండియా, యోగ అన్నారు. ప్రతిరోజూ కొంత సమయం యోగకు కేటాయించుకొని,మానసిక ఒత్తిడిని తగ్గించుకొని ఆరోగ్యవంతమైన జీవితం అనుభవించాలని కోరారు. ఎండలో నిల్చుంటే "విటమిన్ డి" సంవద్ధిగా లభిస్తుందని సూచించారు. బి. వీరమణి, కస్తూరి సుశీల, కళావతి, సరళ, కవిత, సుజాత తదితరులు పాల్గొన్నారు.



పండుగకు ఊరు వెళ్తున్నారా? తస్మాత్ జాగ్రత్త

- వనస్థలిపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అశోక రెడ్డి

నవతెలంగాణ-వనస్థలిపురం

దసరా పండుగకు ఊరు వెళ్లే ప్రజలు పోలీస్ సూచనలు పాటిస్తూ దొంగతనాల నివారణకు సహకరించాలని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ అశోక్ రెడ్డి తెలిపారు. వనస్థలిపురం పోలీస్ స్టేషన్ వద్ద ప్రచార ఆటోను సోమవారం ఇన్‌స్పెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఊరికి వెళ్లే సమయంలో ప్రజలు వీలైనంతవరకు విలువైన వస్తువులు నగలు, నగదును ఇంట్లో పెట్టకుండా బ్యాంక్ లాకర్లలో భద్రపరుచుకోవాలని సూచించారు. సెంట్రల్ లాక్ చేసిన ఇంటికి బయటి నుంచి గొళ్ళం పెట్టవద్దని, బయట గేటుకు లోపలి నుంచి తాళం వేయాలని, ఇంటి గడప ముందు చెప్పులు ఉంచాలన్నారు. పేపర్ బాయ్, పాల ప్యాకెట్లు వేసేవాళ్లను వెయ్యవద్దని చెప్పాలని, ఇంటి ముందు గదిలో లైట్ వేసి ఉంచాలని, ఊరికి వెళ్లే సమయంలో ఇంటి పక్కన వారికి, స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇచ్చి దొంగతనాలను నివారించాలని కోరారు. కాలనీలలో అనుమానిత, అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, తక్షణమే100 నెంబర్ కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. దొంగతనాలను అరికట్టడానికి తమ వంతు సహకారం అందించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు ఏడుకొండలు, అనిల్ కుమార్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నాయి బ్రాహ్మణుల క్షౌర వృత్తి దారుల సమావేశం



నవతెలంగాణ -ఎల్బీనగర్

నాయి బ్రాహ్మణుల వృత్తిదారుల రేట్లపై ఎల్బీనగర్‌లో సోమవారం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా క్షౌర వృత్తిదారు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెన్నారం మల్లేష్ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో పెద్ద పెద్ద పట్టణాలలో కార్పొరేట్ సెలూన్స్ ప్రవేశించి అక్కడ 30, 40 సంవత్సరాల నుంచి పని చేస్తున్న తమ వృత్తిని దెబ్బతీస్తున్నారన్నారు. తమ కుటుంబాలను రోడ్డు పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కస్టమర్లకు తాము మాలిష్ చేస్తే పెరాల్సిస్ వస్తుందని దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్పొరేట్ సెలూన్స్‌పై ప్రభుత్వం చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ వ త్తిదారులను ఆదుకోవాలనిచ క్షౌర వృత్తికి రక్షణ కల్పించాలని కోరారు. గిరాకీ రాక ఇబ్బందులు పడుతున్నామని, గత ప్రభుత్వం తమ నాయి బ్రాహ్మణ సెలూన్ షాపులకు 250 యూనిట్ల సబ్సిడీ విద్యుత్తు అమలు చేసిందని.. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత కరెంటు బకాయిలు చెల్లిస్తామని చెప్పింది కానీ ఇంతవరకు చెల్లించలేదన్నారు. తమ వృత్తికి రక్షణ చట్టం చేయాలని, తమకు కేటాయించిన సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి అన్నారు. వృత్తి శిక్షణ ఇవ్వాలని, ఇల్లు లేని పేదలకు ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలు నిండిన తమ వృత్తిదారులకు పింఛన్ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ హాస్టల్స్, హాస్పిటల్స్, పోలీస్ శాఖలో బార్బర్లకు ఉద్యోగాలు ఇవ్వాలి అన్నారు. ఈ సమావేశానికి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు గోల్కొండ అశోక్, రాష్ట్ర నాయకులు నెలకంటి చంద్రయ్య, దయానంద్ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు దేవరకొండ శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఊరెళ్తున్నారా.. నిర్లక్ష్యం వద్దు

- ఐఎస్ సదన్ సీఐ సైదయ్య



నవతెలంగాణ- చంపాపేట్

దసరా పండగకు ఊరు వెళ్తే నిర్లక్ష్యం వహించవద్దని ఐ ఎస్ సదన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్. సైదయ్య తెలిపారు. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా తిరిగి వచ్చేసరికి ఇల్లు గుల్ల గాక తప్పదని, దొంగలు తాళం వేసి ఉన్న ఇండ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనం చేసే ప్రమాదం ఉందని ఐ.ఎస్ సదన్ సీఐ సైదయ్య అన్నారు. సోమవారం ఆయన నవ తెలంగాణతో మాట్లాడుతూ.. ప్రజలకు పలు సూచనలు చేశారు.

నగర శివారు ప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఐ ఎస్ సదన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎక్కువగా నివసించేది రోజువారి కూలీలేనని, అయితే కొన్ని ఏరియాలలో సీసీ కెమెరాలు అందు బాటులో లేవని తెలిపారు. బంగారు, వెండి, ఆభరణాలు, డబ్బులు, బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవాలన్నారు. లేదంటే మీ ఇంట్లోనే రహస్య ప్రదేశంలో దాచుకోవాలని తెలిపారు. సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సర్లు ఏర్పాటు చేసుకోవాలని, మీ ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్ ఉన్న తాళం అమర్చుకోవడం మంచిదని చెప్పారు. మీ దగ్గరలోని పోలీసు స్టేషన్‌లోసమాచారం ఇవ్వాలని చెప్పారు. వాహనాలకు తప్పనిసరిగా తాళాలువేయాలని, వీలైతే చక్రాలకు చైన్స్ కూడా లాక్ చేయాలని సూచించారు. నమ్మకమైన వాచ్ మెన్లను మాత్రమే సెక్యూరిటీ గార్డులుగా నియమించుకోవాలన్నారు. మీ ఇంట్లో అమర్చిన సీసీ కెమెరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు చూసుకువాలన్నారు. మీరు ఇంట్లో లేనప్పుడు ఇంటి ముందు చెత్తా చెదారం లేకుండా, న్యూస్ పేపర్లు, పాలప్యాకెట్లు వెయ్యవద్దని చెప్పాలన్నారు. తాళం వేసినప్పటికీ అవి కనిపించకుండా కర్టెన్లతో కవర్ చేసి ఇంటి లోపల బయట కొన్ని లైట్లు వేసి ఉంచాలని సూచించారు.నమ్మకమైన ఇరుగు పొరుగు వాళ్లకు మీ ఇంటికి వచ్చే, వెళ్లే దారులు, ఇంటిలోపల సీసీ కెమెరాలు అమర్చుకొని డీవీఆర్ కనపడకుండా ఇంటి లోపల రహస్య ప్రదేశంలో ఉంచాలన్నారు. అల్మరా, కబోర్డ్స్‌కు సంబంధిం చిన తాళాలు మీ ఇంట్లోనే రహస్య ప్రదేశంలో ఉంచుకోవాలని చెప్పారు.

బంగారు ఆభరణాలు వేసుకొని ఫంక్షన్లకు వెళ్లేటప్పుడు తగు జాగ్రతలు తీసుకోవాలని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో మీరు బయటికి వెళ్లే విషయాన్ని ఇతరులకు షేర్ చేయకూడదని చెప్పారు. కాలనీల్లో దొంగతనాల నివారణకు స్వచ్ఛందంగా కమిటీలను నిర్వహించుకో వాలన్నారు. కాలనీల్లో, వీధుల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు కనిపించినా లేదా ఆ ప్రాంతాల్లో అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులు సమాచారం అందించాలన్నారు. డయల్ 100కు ఫోన్ చేసి చెప్పిన వెంటనే పోలీసులు తగిన విధంగా చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. తప్పని సరిగా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలన్నారు. ఇలా దొంగతనాలను నియంత్రించవచ్చని తెలిపారు.

జవహర్ నగర్‌ను అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తా

మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్



నవతెలంగాణ - జవహర్ నగర్

అభివృద్ధిలో జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను ముందుకు తీసుకు వెళ్తానని మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ అన్నారు. సోమవారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ 18వ డివిజన్‌లో మున్సిపల్ సాధారణ నిధులు రూ.10 లక్షలతో చేపట్టి అండర్ గ్రౌండ్ డ్రయినేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేషన్‌లో అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, విడతల వారీగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ప్రవీణ్ రెడ్డి, మహిళా నాయకురాలు శ్రీదేవి, కవిత, శ్రీనివాస్, కుమార్, సాయి, శేఖర్, శ్రీకాంత్, బస్తి వాసులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 60 ఫిర్యాదులు : అదనపు కలెక్టర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 60 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణికి ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టర్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యమిస్తూ, ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలనీ, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయండి



- కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-బోడుప్పల్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నాయకులు చింతల నరసింహ రెడ్డి కోరారు. సోమవా రం పీర్జాదిగూడ కమిషనర్ త్రిలేశ్వర్ రావును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం చింతల నరసింహారెడ్డి మాట్లాడుతూ..పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆ కూడలికి అంబేద్కర్ సర్కిల్‌గా నామకరణం చేసి గౌరవించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొట్టుమంచి సునీల్, సుక్క జయేందర్ పాల్గొన్నారు.

సునీల్ వర్మకు బెస్ట్ సోషల్ వర్కర్ అవార్డు



నవతెలంగాణ-కాప్రా

సామాజిక భావనతో సేవా కార్యక్రమాలు చేపడుతున్న ఈసీఐఎల్‌కు చెందిన సర్పెల్ల సునీల్ వర్మను తెలుగు రాష్ట్రాల క్షత్రియ సేవాసమితి ఉత్తమ సామాజిక వేత్తగా గుర్తించింది. ఆయనకు బెస్ట్ సోషల్ వర్కర్ అవార్డును ప్రదానం చేసి రూ.1 లక్ష రివార్డును ప్రకటించింది. ఈ మేరకు క్షత్రియ సేవాసమితి పెద్దలు, శ్రీహరి రాజు, మైనర్ రాజు, నాగరాజు, డాక్టర్ రఘు, డీవీఎస్ఎస్ రాజు, డాక్టర్ పీవీ రామచంద్రరాజులు ఆయనకు సోమవారం అవార్డును ప్రదానం చేసి సత్కరించారు. సునీల్‌వర్మ లక్ష్మీ అంబులెన్స్, లక్ష్మీ వృద్ధాశ్రమం, లక్ష్మీ గోశాలను ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు. నిరపేదలకు అండగా నిలుస్తున్నందున్న ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్టు తెలిపారు. గతంలో తెలంగాణ పోలీసు విభాగం నుంచి సోషల్ వర్కర్ అవార్డుతో పాటు ప్రశంసా పత్రాలను అందుకున్నారు. మాజీ మంత్రి కేటీఆర్ చేతులమీదుగా ఉత్తమ సేవా కార్యకర్త అవార్డును అందుకున్నారు. అంతకుముందు సునీల్ వర్మ మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించిన క్షత్రియ సేవాసమితి ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డు తనపై బాధ్యతను మరింత పెంచిందని చెప్పారు. భవిష్యత్‌లో సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తానని తెలిపారు.

కమలమ్మ చిత్రపటానికి ఈటల నివాళి



నవతెలంగాణ-కాప్రా

హైదరాబాద్ నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ తల్లి కమలమ్మ ఇటీవల మృతి చెందారు. సోమవారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ చర్లపల్లిలోని రామ్మోహన్ నివాసానికి వెళ్లి బొంతు శ్రీదేవి, రామ్మోహన్ దంపతులతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కమలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈటల వెంట మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బొంతు రామ్మోహన్‌కు టీపీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్‌గౌడ్ పరామర్శ



నవతెలంగాణన-కాప్రా

ఇటీవల హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ మాతృమూర్తి బొంతు కమలమ్మ పరమపదించారు. విషయం తెలుసుకున్న టీపీసీసీ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ సోమవారం రామ్మోహన్ కుటుంబ సభ్యులను చర్లపల్లిలోని వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా కమలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి, స్థానిక నాయకులు ఉన్నారు.

మదర్ డైరీ చైర్మెన్‌ను కలిసిన కార్పొరేటర్



నవతెలంగాణ-బోడుప్పల్

ఉమ్మడి నల్లగొండ-రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార యూనియన్ లిమిటెడ్ ప్రభుత్వ సంస్థ జిల్లా మదర్ డైరీ చైర్మెన్‌గా గుడిపాటి మధుసూదన్ రెడ్డి ఎన్నికయ్యారు. సోమవారం ప్రమాణ స్వీకారం చేసి పదవీ బాధ్యతలు చేపడుతున్న సందర్భంగా పీర్జాదిగూడ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి హయత్‌నగర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పూల బొకే అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దయాకర్ రెడ్డి, కమలాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'గాజా'పై ఇజ్రాయిల్ దాడులను ఆపాలి







- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోమటి రవి
- సీపీఐ రాష్ట్ర నాయకులు బాల మల్లేష్

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

గాజా పట్టణంపై ఇజ్రాయిల్ దాడులను ఆపాలని సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోమటి రవి, సీపీఐ రాష్ట్ర నాయకులు బాల మల్లేష్ అన్నారు. వామపక్ష పార్టీలు రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు సోమవారం సీపీఐ(ఎం) సీపీఐ పార్టీల మల్కాజిగిరి మండల కమిటీల ఆధ్వర్యంలో మల్కాజిగిరి చౌరస్తాలో యుద్ధానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బాల మల్లేష్‌లు మాట్లాడుతూ.. గాజా పట్టణం మీద ఇజ్రాయిల్ భీకర దాడులు వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ఇజ్రాయిల్ కు సామ్రాజ్య వాద దేశం అమెరికా సపోర్ట్ చేయడం అత్యంత హేయమైన చర్య అని మండిపడ్డారు. గాజా పట్టణం, భూములను వశపర్చుకోవాలని ఇజ్రాయిల్ ఈ దాడులకు పూనుకున్నదని తీవ్రంగా ఖండించారు. అనంతరం కోమటి రవి మాట్లాడుతూ.. ఐక్యరాజ్య సమితి తీర్మానాన్ని సైతం లెక్క చేయకుండా అమెరికా, ఫ్రాన్స్, జర్మనీ, దేశాల మద్దతుతో విర్రవీగుతూ ఇజ్రాయిల్ పాలస్తీనా మీద అధునాతన యంత్రాలు ఉపయోగిస్తూ భీకర దాడులు చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్పిటల్స్ మీద, స్కూల్స్ మీద, ప్రజల నివాసాల మీద దాడులు చేస్తున్నదని వాపోయారు. ఈ దాడుల్లో దాదాపు 50 వేల మంది చనిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. చనిపోయిన వారిలో మహిళలు, పిల్లలు అధికంగా ఉన్నారని చెప్పారు. యుద్ధాలు ప్రజా మనుగడకు, ఆర్థిక వెనుకబాటుతనం పెరగటానికి కారణం అవుతాయన్నారు. ఇప్పటికైనా యుద్ధానికి స్వస్తి పలకాలని డిమాండ్ చేశా రు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రొయ్యల కృష్ణమూర్తి, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కృపాసాగర్, సీపీఐ మండల సమితి కార్యదర్శి యాదయ్య గౌడ్, సీపీఐ(ఎం) మండల నాయకులు బంగారు నర్సింగ రావు, విజయ్ కుమార్ లు మాట్లాడుతూ.. యుద్ధం వద్దు.. శాంతి కావాలని, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కృపాసాగర్ అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల నాయకురాలు మంగ, డివిజన్ నాయకులు మురళీ మోహన్, నాగమణి, సరోజ, షాహిన్, సీపీఐ మండల సమితి నాయకులు నాగరాజు, యాదగిరి, రమణ, వెంకట్, అజీజ్, లింగం పాల్గొన్నారు.

కాప్రాలో..

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని వామపక్ష పార్టీల కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా సీపీఐ, సీపీఐ(ఎం) పార్టీల ఆధ్వర్యంలో ఈసీఐఎల్ చౌరస్తాలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జె. చంద్రశేఖర్, సీపీఐ జిల్లా నాయకులు కె. శంకర్ రావు మాట్లాడుతూ.. ఇజ్రాయిల్ అమానుషంగా పాలస్తీనాపై యుద్ధం ప్రకటించి 41,825మందిని హతమార్చడం దారుణం అన్నారు. ఈ మారణ కాండలో చిన్నారులు16 వేలమంది , మహిళలు6 వేల మందికిపైగా చనిపోయారని వాపోయారు. 19 వేల మంది పిల్లలు అనాధలయ్యారని తెలిపారు. 2,27,591 గృహాలు ధ్వంసం అయ్యాయని అన్నారు. అమాస్ ఏరివేత అనే సాకుతో అమెరికా అండదండలతో లక్షలాది మందిని నిరాశ్రయులు చేశారని మండిపడ్డారు. ఇజ్రాయిల్ తెగబడి లెబనాన్, సిరియా, ఇరాన్ దేశాలపై యుద్ధాలు ప్రకటించి యుద్ధోన్మాధాన్ని పురికొల్పుతున్నాయని తెలిపారు. ఇజ్రాయిల్ పాలస్తీనాపై యుద్ధాన్ని మొదలుపెట్టి ఏడాది పూర్తయిందన్నారు. అయినప్పటికీ యుద్ధోన్మాధ మారణకాండ నానాటికి పెచ్చిరిల్లుపోతుం ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అమెరికా దుశ్చర్యలను నిలుపుదల చేయాలన్నారు. వెంటనే పాలిస్తీనా, ఇరాన్, లెబనాన్, సిరియా ఇతర దేశాలపై ఇజ్రాయిల్ ధమన కాండను నిలవరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు ఎన్. శ్రీనివాస్, సిహెచ్ ప్రసాద్, యాదగిరిరావు, వెంకటాచారి, దుర్గయ్య, జివి రావు, శివ నారాయణ ఎమ్మెస్ రావు, సోమయ్య చారి, సుహాసిని శశికళ, శోభ, సఫియా,గౌసియా,రేష్మ, సీపీఐ నాయకులు లక్ష్మీనారాయణ, సత్యప్రసాద్, సాయిలు, కుమార్ ఉన్నారు.

ఉప్పల్‌లో..

గాజాపై ఇజ్రాయిల్ మరణకాండకు పాల్పడి అక్టోబర్ 7వ తేదీ నాటికి ఏడాది పూర్తయిన సందర్భంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన దినం పాటించారు. సోమవారం ఉప్పల్ రింగ్ రోడ్డులో సీపీఐ (ఎం) ఉప్పల్ కార్యదర్శి జె. వెంకన్న ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమెరికా అండదండలతో ఇజ్రాయిల్ చేస్తున్న దురాక్రమణదాడులతో పాలస్తీనా అతలాకుతలం అయిందన్నారు. ఉద్దేశపూర్వకంగానే పాఠశాలలు, ఆస్పత్రులపై దాడులకు పాల్పడిందన్నారు. ఇజ్రాయిల్ పౌరులు హత్యలు, హత్యాచారాలు, దాడులకు పాల్పడ్డారని తెలిపారు. కార్యక్రమంలో పద్మ, ఊర్మిళ, బాలరాజు, అంజయ్య, స్వరూప, మురళీమోహన్, రవి తదితరులు పాల్గొన్నారు.

హామీ ఇస్తే..అమలు చేసి తీరుతాం

- అభివృద్ధి, ప్రజా సంక్షేమమే మా లక్ష్యం
- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-ఉప్పల్

ప్రజలకు హామీ ఇచ్చామంటే, పక్కాగా అమలు చేసి తీరుతామని, అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళ్తామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం చిల్కానగర్ డివిజన్‌లో రూ.52 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిల్కానగర్ డివిజన్‌లో దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. చేయాల్సిన పనులు ఇంకా ఉన్నాయని, వాటిని దశలవారీగా పూర్తి చేస్తామన్నారు. కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ మాట్లాడుతూ.. ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని చెప్పారు. చిల్కానగర్ గుట్టపైన ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన మాట ప్రకారంగా నెలరోజుల్లోపే ఓపెన్ జిమ్‌కు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారని తెలిపారు. నెల రోజుల్లో ఓపెన్ జిమ్ పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులో తీసుకువస్తామన్నారు. డివిజన్‌కు అభివృద్ధికి భారీ ఎత్తున నిధులు వెచ్చిస్తున్న ఎమ్మెల్యేకు చిల్కానగర్ డివిజన్ ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, బీరప్ప గడ్డ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, చిల్కానగర్ గుట్ట పైన నివసించే మహిళలు, హాజరయ్యారు.

పేదలకు తోచిన సహాయం చేయాలి

- కాంగ్రెస్ నాయకులు పిట్టల నాగరాజు
- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి స్ఫూర్తితో పేదలకు సాయం



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మానవతా దృక్పథంతో పేదలకు మనకు తోచిన సహాయం చేస్తూ అండగా ఉండాలని కాంగ్రెస్ మల్కాజిగిరి నాయకులు పిట్టల నాగరాజు అన్నారు. వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని వినాయక నగర్‌లో నివాసం ఉంటున్న జయమ్మ అనే పారిశుధ్య కార్మికురాలు అనారోగ్యంతో చనిపోయింది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పిట్టల నాగరాజు సోమవారం జయమ్మ పదకొండు రోజుల కార్యక్రమానికి రూ.6వేలను మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు స్ఫూర్తితో తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాని తెలిపారు. అనాధలకు, వృద్ధులకు, ఆపదలో ఉన్న పేదలకు తోచిన సహాయం చేస్తున్నానని చెప్పారు. పారిశుధ్య కార్మికుల సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించాలని తెలిపారు. ఆర్థిక సహాయం చేసిన నాగరాజుకు మృతురాలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఎన్ఆర్ గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

రోడ్లపై మత పరమైన నిర్మాణాలను తొలగించాలి



- సుప్రీం కోర్టు గైడ్ లైన్స్ పాటించాలి
- సిటిజన్ రైట్స్ అసోసియేషన్

నవతెలంగాణ-కాప్రా

రోడ్లపై మతపరమైన నిర్మాణాలను తొలగించాలని సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని సిటిజన్ రైట్స్ అసోసియేషన్ సభ్యులు స్పష్టం చేశారు. సోమవారం ఈసీఐఎల్ కమలానగర్‌లోని సీఐటీయూ ఆఫీస్‌లో సుప్రీం కోర్టు వాక్యాలను బలపరుస్తూ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏపూరి గిరీష్ అధ్యక్షత వహించారు. స్ఫూర్తి గ్రూపు నాయకులు గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ.. కొన్ని చోట్ల రహదారులపైన, ఫుట్‌ఫాత్‌లపై, మతపరమైన నిర్మాణాలు ఉండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సుప్రీంకోర్టు చెప్పిన విధంగా అటువంటి నిర్మాణాలను ప్రత్యామ్నాయ ప్రదేశాలకు తరలించాలన్నారు. ఆ బాధ్యతను ప్రభుత్వాలు తీసుకోవాలని తెలిపారు. కర్రె మల్లేశం, కోమటి రవి, పి.బి చారి, ఏఆర్వి ప్రసాద్ లు మాట్లాడుతూ.. ఇటువంటి ఆలోచన సరైందని, దానికోసం మన కర్తవ్యంగా ప్రజల్లో చైతన్యం కల్పించి ప్రజల ద్వారా సమస్యలను ప్రభుత్వానికి తెలిపి సుప్రీంకోర్టు ఆదేశాలు పాటించేలా కృషి చేయాలని కోరారు. అనంతరం 'అభివృద్ధికి ఆటంకం కలిగించే నిర్మాణాలను తరలించే కృషికి (సిటిజన్ రైట్స్ అసోసియేషన్)కమిటీ" ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా మన్నే ప్రశాంత్, ఉపాధ్యక్షులుగా పాడుగుల చంద్రమౌళి, సౌమ్య, ప్రధాన కార్యదర్శిగా ఏపూరి గిరీష్, సహాయ కార్యదర్శులుగా చంద్రశేఖర్, వినాయక్, ఆర్గనైజ్ సెక్రటరీగా నర్సింగరావులతో కమిటీని ఎన్నుకున్నారు. గొడుగు యాదగిరి రావు, కర్రె మల్లేశం, పి.బి.చారి, కోమటి రవి సలహాలు తీసుకోని ముందుకు నడుస్తామని తెలిపారు. అక్టోబర్ మాసంలోనే మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో సదస్సు ఏర్పాటు చేసి ప్రజలతో సంతకాల సేకరణ, అన్ని జిల్లాల కలెక్టర్లకు, ఉన్నత అధికారులకు మెమొరండాలు ఇచ్చి సమస్యలను విన్నవించాలన్నారు.

గొర్ల కాపరులు సభ్యత్వం తీసుకోవాలి



నవతెలంగాణ-కీసర

గొర్ల కాపరులుందరూ సభ్యత్వం తీసుకోవాలని ఓబీసీ మోర్చా మేడ్చల్ రూరల్ జిల్లా గొర్ల కాపరుల సెల్ కన్వీనర్ చీర సురేష్ కుర్మ అన్నారు. సోమవారం కీసర మండలంలోని గోధుమకుంటలో గొర్ల కాపరులతో సభ్యత్వం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొర్ల మేకల పెంపకం దారులు సభ్యత్వం తీసుకుంటే ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ అధ్యక్షులు మహేందర్ యాదవ్, మాజీ ఎంపీటీసీ సింగిరెడ్డి వెంకటరెడ్డి, ఓబీసీ మోర్చా గొర్ల కాపరుల సెల్ రాష్ట్ర కో కన్వీనర్ గొంగళ్ల రాజా రమేష్ కుర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షులు మహేశ్ కుర్మ , జిల్లా ఇన్‌చార్జి ఆంజనేయులు గౌడ్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బాలరాజు యాదవ్ , సంతోష్ రెడ్డి, పవన్ గౌడ్, ప్రేమ్ నాథ్ రెడ్డి, హరీష్ రెడ్డి, చీర బాళేశ్ కూర్మ , సోమని ప్రసాద్ , వంగేటి ముత్యం రెడ్డి , శ్రీశైలం బండి మల్లేష్ గౌడ్ పాల్గొన్నారు.

దివిస్ జల ప్రసాదం ఏర్పాటు అభినందనీయం

- కీసర గుట్ట ఆలయ చైర్మెన్ తటాకం నాగలింగం శర్మ



నవతెలంగాణ-కీసర

కీసరగుట్టలో భక్తుల సౌకర్యార్థం దివిస్ జల ప్రసాదం ఏర్పాటు చేయడం అభినందనీయమని కీసర గుట్ట ఆలయ చైర్మెన్ తటాకం నాగలింగం శర్మ అన్నారు. సోమవారం కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో దివిస్ లేబరేటరీ ఆధ్వర్యంలో దివిస్ జల ప్రసాదంను ఆలయ చైర్మెన్ నాగలింగం శర్మ, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కట్ట సుధాకర్ రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి పుణ్యక్షేత్రం సందర్శించే భక్తులకు దివిస్ లేబరేటరీ యజమాన్యం జల ప్రసాదాన్ని వితరణ చేస్తున్నందుకు చాలా సంతోషం అన్నారు. దివిస్ లేబరేటరీ యజమాన్యం రూ.32 లక్షలతో రెండు జలప్రసాదం కేంద్రాలను భక్తుల కోసం ఏర్పాటు చేయడం అదృష్టం అని తెలిపారు. దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వంతో పాటు దాత దివిస్ సీఎండీ దివి మురళీకృష్ణ సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం ఫౌండర్ మెంబర్లు తటాకం నారాయణ శర్మ, తటాకం వెంకటేశం శర్మ, దేవాలయ సిబ్బంది అర్చకులు దివిస్ అధికారులు లైసెన్ ఆఫీసర్ బి కిషోర్ కుమార్, సిహెచ్ శ్రీనివాసులు, సాయి కృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పు పనులు ఇరువైపులా చేపట్టాలి

- నాగారం మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేత



నవతెలంగాణ-కీసర

రాంపల్లి నుండి ఘట్కేసర్ వరకు చేపట్టనున్న రోడ్డు వెడల్పు పనుల్లో రెండు వైపులా చేపట్టాలిని పలువురు మున్సిపాలిటీ ప్రజలు సోమవారం నాగారం మున్సిపాలిటీ కార్యాలయంలోని ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా అధికారులు రోడ్డుకు ఒక వైపు ఎక్కువగా, మరోవైపు తక్కువగా మార్కింగ్ చేస్తున్నారని అధికారులకు వివరించారు. రోడ్డు మధ్యలో నుండి ఇరువైపుల సమానంగా రోడ్డు వెడల్పు పనులు చేస్తే తమకేమీ అభ్యంతరం లేదన్నారు. అలా కాకుండా ఒక వైపు ఎక్కువ మార్కింగ్ చేస్తే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాగారం మున్సిపాలిటీ కో ఆప్షన్ సభ్యుడు ఆధామ్ షఫిక్, తదితరులు పాల్గొన్నారు.

కాలనీలోని సమస్యలు పరిష్కరించాలని వినతి



నవతెలంగాణ-అల్వాల్

కౌకూరు, భరత్ నగర్ వాసులు డ్రయినేజీ వ్యవస్థ, స్ట్రీట్ లైట్స్, విద్యుత్తు ఇనుప స్తంభాలను తొలగింపు సమస్యలను పరిష్కరించాలని సోమవారం ప్రజావాణిలో ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీకాంతికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లక్ష్మణ్ యాదవ్, తిరుపతిరావు, సత్యనారాయణ ,మల్లేష్ యాదవ్ ,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల మన్ననలు పొందుతూ అభివృద్ధి చెందాలి

- మేడబోయిన ప్రసాద్ యాదవ్
- శ్రీకృష్ణ ప్యూర్ గీ స్వీట్స్ షాపు ప్రారంభం



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి సర్కిల్ బృందావన్ నగర్‌లోని సీఎంఆర్ షాపింగ్ మాల్ పక్కన సోమవారం నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ కృష్ణ ప్యూర్ గీ స్వీట్స్ షాపు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడబోయిన ప్రసాద్ యాదవ్ హాజరై షాపు నిర్వాహకులు అజిత్ యాదవ్, మిత్రులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ ఎక్కువమంది వినియోగదారులకు చుపరిచితులుగా ఉంటూ, నాణ్యమైన స్వీట్స్‌ను అందజేస్తూ వినియోగదారుల మన్ననలు పొందుతూ, అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దీపక్ కుమార్, మల్లేష్ యాదవ్, నగేష్ గౌడ్, టిజి రవి, కుటుంబ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నవరాత్రి ఉత్సవాలు

నవతెలంగాణ-ఉప్పల్

దసరా ఉత్సవాలను పురస్కరించుకుని న్యూ సాయి మారుతీ నగర్‌లో కొలువైన రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలోని మండపంలో కాలనీలోని మహిళలు దుర్గామాత విగ్రహాన్ని నిలపెట్టుకొని ఘనంగా పూజలు నిర్వహించారు.



ఆలయ ప్రాంగణంలో అన్నదానం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గాంధీనగర్‌లో శ్రీ దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం శ్రీ నల్ల పోచమ్మ దేవి ఆలయ ప్రాంగణంలో కల్చరల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుర్గామాత మంటపం వద్ద కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు జల్దా లక్ష్మి నాథ్, సాయి గౌడ్, శ్రీధర్, తిమ్మయ్య, బాలయ్య, శ్రీనివాస్ గౌడ్, బిక్షపతి, రాజు, విజయ్,నీలగిరి,శ్రీనివాస్, సందీప్, కిరణ్, భరత్, పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో దుర్గా దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ రాజీవ్ గాంధీ సీనియర్ కాంగ్రెస్ నాయకులు సాయి రాజ్ ఆధ్వర్యంలో.. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలో పాల్గొన్నా నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖః సంతోషాలతో ఉండాలని అమ్మవారిని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోలన్ హన్మంత్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంసీ కాంగ్రెస్ అధ్యక్షులు కోలన్ రాజశేఖర్ రెడ్డి కాలనీ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుండిగల్

ప్రపంచ శాంతిని కాపాడాలి



- సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎం.డి.యూసుఫ్ పిలుపు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట/కుత్బుల్లాపూర్

ప్రపంచ శాంతిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎండి. యూసుఫ్ పిలుపునిచ్చారు. రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు యుద్ధోన్మాదికి వ్యతిరేకంగా సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్ డివిజన్ ఐడీపీఎల్ కాలనీ చౌరస్తా వద్ద నిర్వహించిన ప్రపంచ శాంతి కాపాడాలనే జరిగిన సభకు అయనతోపాటు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె.ఏసురత్నం, మాజీ కౌన్సిలర్ పి.నర్సయ్యలు పాల్గొని ప్రసంగించారు. ఈ సభకు సీపీఐ నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు వంగాల శ్రీనివాస్ అధ్యక్షత జరిగిన ఈ సభలో ఎం.డి.యూసుఫ్ మాట్లాడుతూ అమెరికా నాయకత్వంలోని సామ్రాజ్యవాదం ఉక్రెయిన్, రష్యాల మధ్య యుద్ధవాతావారణాన్ని సృష్టించి తన ఆయుధాలను యధేచ్ఛగా అమ్ముకోవటం కోసం అమాయకపు ప్రజల ప్రాణాలను బలితీసుకోవటం క్షమించరాని నేరం అని తెలిపారు. గల్ఫ్ దేశాలను యుద్ధం ద్వారా అనిచివేసి ఆయిల్‌పై పెత్తనం చెలాయించటం కోసం అమెరికా చేస్తున్న ప్రయత్నాలను ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు ఖండిచాలని,శాంతిని కాపాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కే.ఏసురత్నం మాట్లాడుతూ అమెరికా యుద్ధోన్మాదాన్ని పూర్తి స్థాయిలో మోడీ ప్రభుత్వం మద్దతు తెల్పడాన్ని ఖండిచారు. మాజీ కౌన్సిలర్ పి.నర్సయ్య మాట్లాడుతూ యుద్ధాల వల్ల ప్రపంచశాంతి కరువవుతందని ధరలు విపరీతంగా పెరిగే అవకాశం ఉందని, డీజిల్, పెట్రోల్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని వాటిని తగ్గించే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని,సామాన్య ప్రజల జీవితాలను కాపాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కే.స్వామి, గాజులరామారం డివిజన్ కార్యదర్శి సదానందం, జగద్గిరిగుట్ట శాఖ కార్యదర్శి సహదేవ రెడ్డి, గిరినగర్ శాఖా కార్యదర్శి ఎం.డి.యాకూబ్, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షులు ప్రవీణ్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు చర్లపల్లి రాములు, పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నిరుపేదల పెన్నిధి.. సీఎం సహాయ నిధి



- ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

నిరుపేదల పెన్నిధి సీఎం సహయ నిధి అని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకనంద్ అన్నారు. చింతల్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే మంజూరు చేయించిన దాదాపు రూ.45 లక్షలు 114 మంది "సీఎం సహాయనిధి" లబ్ధిదారులకు వారి చేతుల మీదుగా సోమవారం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించడంలో సీఎం సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ కెఎం.గౌరీష్, నిజాంపేట్ కార్పొరేటర్ గాజుల సుజాత, మాజీ కౌన్సిలర్ సూర్యప్రభ, నియోజకవర్గం యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, ఎర్వ శంకరయ్య, పుప్పాల భాస్కర్, నరేందర్ రెడ్డి, ఆటో బలరాం, యేసు, మహిళా నాయకురాలు దేవి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దశల వారీగా అభివృద్ధి చేపడుతా..



- కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్ రావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

దశల వారిగా అభివృద్ధి పనులు చేపడుతామని హైదర్నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్ రావు అన్నారు. హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని హెచ్ఎంటీ శాతవాహన నగర్ కాలనీలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి చేపట్టవల్సిన పలు అభివృద్ధి పనులపై జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో, కాలనీ వాసులతో కార్పొరేటర్ కలిసి క్షేత్ర స్థాయిలో స్వయంగా పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీ వాసులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను, సమస్యలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. కాలనీలలో స్వయంగా ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలను తెలుసుకొని.. సత్వర పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. అదే విధంగా కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు డ్రయినేజీ, రోడ్లు, మంచినీరు, వీధి దీపాలు, ఎలక్ట్రికల్, శానిటేషన్, ట్రాఫిక్ సంబంధిత సమస్యలను శాశ్వత పరిష్కారం చూపుతామని త్వరలోనే పనులు ప్రారంభించి కాలనీ వాసులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఏ చిన్న సమస్య అయిన తన దృష్టికి కానీ కార్పొరేటర్ కార్యాలయం దృష్టికి కానీ తీసుకువస్తే పరిష్కరిస్తానని, ఎల్లవేళలా అందు బాటులో ఉంటానని ఈ సందరరేగా కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ఏఈ రాజీవ్, డ్రయినేజీ సూపర్ వైజర్ ఓం ప్రకాష్, కాలనీ వాసులు రత్న ప్రసాద్, యాది రెడ్డి, రామ కోటేశ్వర రావు, వెంకట్ రావు, కృష్ణమూర్తి, హనుమంతు రాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సంఘాలు అభివృద్ధికి వారధులు



- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట/కుత్బుల్లాపూర్

సంక్షేమ సంఘాలు బస్తీ అభివృద్ధికి వారదులుగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ సూచించారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి సంజయ్ గాంధీనగర్ (గుబురు గుట్ట) కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన సభ్యులు సోమవారం షాపూర్ నగర్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్చం అందజేశారు. బస్తీ ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎన్నికైన బండారు నారాయణ, ఇతర సభ్యులను కూన అభినందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్తీలో ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారంతోపాటు బస్తీ అభివృద్ధికి తాను నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వివిధ బస్తీలు, కాలనీల నుండి పలువురు దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పలు ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంజయ్ గాంధీనగర్ కాలనీ అసోసియేషన్ నూతన అధ్యక్షులు బండారు నారాయణ, సభ్యులు రమేష్, రాజు, పరమేష్, గంగా వెంకటేష్, పాల్గొన్నారు.

అడ్డదారి ప్రయాణం.. అనర్థాలకు మూలం

- రాంగ్ రూట్ పోకడలతో ట్రాఫిక్ జామ్
- హెచ్చరిక బోర్డులు ఉన్నా.. పట్టించుకోని వాహనదారులు
- ట్రాఫిక్ పోలీసులకు తప్పని తిప్పలు
- చలాన్లు రాస్తున్నా ప్రయోజనం శూన్యం





నవతెలంగాణ-బాలానగర్

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని బాలానగర్ సబ్ డివిజన్‌లో హనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలకు నీళ్లదులుతున్నారు. దాన్ని నియంత్రించాల్సిన అధికారులూ నీమ్మకు నీరెత్తిన చందంగా వ్యవహరిస్తున్నారు. త్వరగా గమ్యస్థానాలకు చేరుకోవాలన్న ఆత్రుతతో ద్విచక్ర వాహనదారులు విచ్చల విడిగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు.

నగర శివారులోని పలు ప్రాంతాల్లో ప్రతినిత్యం అనేక ప్రమాదాలు జరుగుతున్నా వాహనదారులు మాత్రం రోడ్డు భద్రతా నియమాలు పాటించడం లేదు. అతివే గం, రాంగ్ రూట్ వంటివి చివరకు వారి ప్రాణాలను హరిస్తున్నా యి. ప్రతి యేటా ఆర్టీసీ, ఆర్టీఏ అధికారులు రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహి స్తున్నారే తప్ప వాహనదారులకు అవగాహన కల్పించడంలో విఫలమవుతున్నారు. అతివేగం ప్రమాదకరమని తెలిసినా.. వాహనదారుల్లో మార్పు రాకపోవడం విచారకరం. బాలానగర్ సబ్ డివిజన్ పరిధిలో సనత్ నగర్, బాలానగర్, జగద్గిరిగుట్ట, జీడిమెట్ల పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. ట్రాఫిక్ పోలీసులు ఆయా ప్రాంతాలలోని ప్రధాన కూడళ్ల వద్ద తనిఖీలు నిర్వహిస్తూ వాహనదారులకు చలాన్లు విధిస్తున్నారు. అసలే ఇది పారిశ్రామిక ప్రాంతాలు కావడం వల్ల వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. నిత్యం ట్రాఫిక్ జామ్‌లతో రహ దారులు స్థంభించిపోతుంటాయి. దీనికి తోడు కొందరు వాహనదారులు రాంగ్ రూట్‌లో వెళ్తా ప్రయాణికులు ఇబ్బందులు కలిగిస్తున్నారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీస్ అధికారులు ఎక్కడపడితే అక్కడ దారులున్న డివైడర్ల మూసేసి ప్రధాన కూడళ్ల వద్ద వన్‌వే, నో వేలపై దృష్టి సారించి.. బారికేడ్లను ఏర్పాటు చేశారు. అయినప్పటికీ వాహనదారుల్లో మార్పు మాత్రం రావడం లేదు. సందు దొరికితే చాలు ద్విచక్ర వాహనదారులు దూరి పోతున్నారు. రహదారులే అంతర్గత ప్రధాన కాదు. రోడ్లనూ రాంగ్ రూట్ వాహనదారుల వదలడం లేదు. దీంతో ట్రాఫిక్ జామ్లు తో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఆయా రహదారులపై స్పీడ్ బ్రేకర్లున్నా రేడియం, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన న్పటికీ ఏ మాత్రం బాధ్య త లేకుండా వాహనదారులు రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తున్నారు.

రాంగ్ రూట్ జరిమానా రూ.1100

రాంగ్ రూట్లో ప్రయాణించే వారికి రూ.1100 జరిమానా విధిస్తామని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరిక బోర్డులు పెట్టారు. అంతే కాకుండా ప్రధాన కూడళ్ల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. కానీ కొందరు వాహనదారులు అవే మీ చూడకుండా రెడ్ సిగ్నల్ పడినప్పటికీ స్టాప్ లైన్ల వద్ద జంపింగ్ చేస్తున్నారు. సనత్ నగర్, బాలానగర్, ప్రశాంత్ నగర్, గాంధీన గర్, కూకట్ పల్లి, జీడిమెట్ల తదితర పారిశ్రా మిక ప్రాంతాల్లో పరిశ్రమల ఉత్పత్తుల, ముడిసరుకు రవాణా కోసం వాహనాలు అధికంగా రాకపోకలు సాగిస్తుంటాయి. లోడింగ్, అన్ లోడింగ్ విషయంలో భారీ వాహనాలను రహదారుల పక్కనే నిలుపుతున్నారు.

దీనికి తోడు స్టీలు కంపెనీలు ఆయా రహదారుల పక్కనే నిలపడంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్ప న్నమవుతున్నాయి. డివైడర్ల మధ్య రోడ్ క్రాసింగ్ చేసే ప్రాంతాలను గుర్తించి వాటిని మూసేయడం వల్ల గమ్యాన్ని చేరుకోవాలనే తొందరలో ప్రమాదమని తెలిసినా రాంగ్ రూట్ ను ఎంచుకుంటున్నారు. దీంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంతాల్లో రాత్రివేళల్లో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనికి అతివేగమే కారణ మవుతోంది. ఒక్కోసారి ప్రమాదం జరిగిన వాహనాలు ఎక్కడివి?.. ఏ ప్రాంతానికి చెందినవో గుర్తించ లేకపోతున్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ..

బాలానగర్ పోలీస్‌స్టేషన్ల పరిధుల్లో గుర్తు తెలియని వాహనాలు ఎన్నో ఉన్నాయి. దీంతో ఆయా పరిధిలో ప్రమాదాల సంఖ్య అధికంగానే ఉంటుంది. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలంటే, ప్రమాదాలను నివారించాలంటే సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి. రాంగ్ రూట్‌లో వెళ్లే వారిపై చలాన్లు తీసుకోవాలి. అదే విధంగా వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాల గురించి అవగాహన కల్పించేందుకు కృషి చేయాలి. అప్పుడే ప్రమాదాలను అదుపు చేయగలమని పలువురు కోరుతున్నారు. సమస్యాత్మక ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు పర్యవేక్షణలో ఉన్నట్లుగా తెలిపారు. నైపర్, ఇందిరా గాంధీపురం, ఫిరోజ్ గూడు, తదితర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి రాంగ్ రూట్లో ప్రయాణించే వారికి కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

-బాలానగర్ ట్రాఫిక్ సీఐ ఎం.సురేష్

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలి



- సీపీఐ(ఎం) రాస్తారోకో

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కమిటీ సభ్యులు పసుల అంజయ్య, దేవదానం డిమాండ్ చేశారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను నిరసనగా సోమవారం సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో షాపూర్ నగర్ రైతు బజార్ రోడ్డులో రాస్తా రోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు పసుల అంజయ్య, ఈ దేవదానం పాల్గొ ని మాట్లాడుతూ...పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని అని అన్నారు. దాదాపు 42,000 మంది పిల్లలు, మహిళలు ఈ యూద్ధం వల్ల చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నేటికీ ఇజ్రాయిల్ ఈ యుద్ధాన్ని ప్రారంభించి సంవత్సరం అయినదని పాలస్తీనా భూ భాగాలపైన, లెబనాన్ పైన ఆస్పత్రులు పాఠశాలలు మసీదులపై వైమానిక భూతల దాడులతో వేలాది మదిని చంపుతున్నదన్నారు. ఇరాన్ అధ్యక్షుని చంపిందన్నారు. ఈ విధంగా పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తలు పెంచుతుందన్నారు. ఇజ్రాయిల్‌కు అమెరికా ఆయు ధాలు సప్లై చేసి ఈ యుద్ధాలకు కారణం అవుతున్నదని దీనివల్ల భారత దేశంలో ధరలు పెరిగి సామాన్య ప్రజలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లోకి పోయే పరిస్థితి ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా భారత్‌కు పశ్చి మాసియా దేశాల నుంచి ఆయిల్ దిగుమతులు ఎక్కు వగా జరుగుతున్నాయని, ఈ ప్రాంతంలో ఈ యుద్ధం పెరిగితే ఇక్కడ ప్రజల పరిస్థితి మరీ దారుణంగా ఉంటుందని అన్నారు. తక్షణమే ఇజ్రాయిల్ దాడులు ఆపాలంటూ వామపక్ష పార్టీల కేంద్ర కమిటీల పిలుపులో భాగంగా ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహించడం జరుగు తుందని, ఇప్పటికైనా అమెరికా దాని మిత్ర దేశాలు ప్రపంచంలో శాంతిని నెలకొల్పాలని యుద్ధాన్ని ప్రోత్స హించకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ నాయకులు రావుల స్వాతి, మల్లారెడ్డి కరుణాకర్, కే.శీను ఆంజనేయులు నరసింహులు సాధులు, భాష యాదవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇరు దేశాల మధ్య యుద్ధాన్ని నిలిపి ప్రపంచ శాంతిని కాపాడాలి : సీపీఐ(ఎం)

జిల్లా కార్యదర్శి పి. సత్యం ..

బాలానగర్ : కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని వామపక్ష పార్టీల పిలుపు మేరకు.. మతోన్మాదానికి వ్యతిరేకంగా బాలానగర్‌లో 'వై' జంక్షన్ వద్ద సోమవారం నిర్వహించిన ప్రపంచంలో శాంతిని కాపాడాలని నిరసన కార్యక్రమంలో సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి పి.సత్యం, సీపీఐ మండల కార్యదర్శి జి.కృష్ణ సీపీఎం సీనియర్ నాయకులు బీఎస్ సుదర్శన్‌లు పాల్గొని ప్రసంగించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఐలాపురం రాజశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ మేరకు సభను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ అమెరికా నాయకత్వంలోని సామ్రాజ్యవాదం, ఉక్రెయిన్ రష్యాల మధ్య యుద్ధ వాతావరణాన్ని సృష్టించి తన ఆయుధాలను యధేచ్ఛగా అమ్ము కోవటం కోసం అమాయక ప్రజల ప్రాణాలను బలి తీసుకోవటం క్షమించరాని నేరమన్నారు. అదేవిధంగా పాలస్తీనా, ఇజ్రాయల్‌ల మధ్య జరుగుతున్న చెదురు, మొదురు సంఘటలను ఉపయోగించు కుని ఆయా రెండు దేశాల మధ్య శాంతి నెలకొనే విధంగా ప్రయత్నాలు చేయాల్సిన అమెరికా ఇజ్రాయిల్‌కు ఆయుధాలు సరఫరా చేస్తూ యుద్ధాన్ని ప్రపంచ యుద్ధంగా మార్చే ప్రయత్నాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. యుద్ధాల వల్ల ప్రపంచశాంతి కరువవుతందని, ధరలు విపరీతంగా పెరిగే అవకాశం ఉందని, డీజల్, పెట్రోల్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, వాటిని తగ్గించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, సామాన్య ప్రజానిక జీవితాలను కాపాడాలని కోరారు. మన దేశ ప్రధానమంత్రి పాలస్తీనాకు మద్దతుగా నిలబడలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఎం.శంకర్, చెన్నకేశవులు, ధర్మారావు, కృష్ణా నాయక్, పి.శంకర్, చంద్రశేఖర్, సీపీఐ నాయకులు మనోజ్ చారి, చంద్రమ్మ లక్ష్మీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



నూతన సీఐగా నర్సింహా రాజు



నవతెలంగాణ-బాలానగర్

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని బాలానగర్ పోలీస్ స్టేషన్ నూతన సీఐగా టి. నరసింహ రాజు సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన ఆయన బాలా నగర్ బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ నవీన్ కుమార్ రాజేందర్ నగర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ పై వెళ్లారు. ఈ సందర్భంగా సీఐ నరసింహ రాజు మాట్లాడుతూ స్థానికులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బాలానగర్ పోలీస్ స్టేషన్ పరధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. అదేవిధంగా బాలనగర్ స్టేషన్ పరిధిలో అవాంఛనీయ సంఘటనలుగాని, అసాంఘిక కార్యకలాపాలు ఎక్కడ జరిగినా వెంటనే మా దృష్టికి తీసుకుని రావాలని వారు తెలిపారు. ప్రజలకు శాంతిభద్రతల్లో ఎలాంటి సమస్యలు తలెత్తిన పరిష్కారం దిశగా ముందుకు వెళ్తామన్నారు. బాలానగర్ పరదిలో పరిధిలోని ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.

స్మశాన వాటిలకలో అక్రమ రోడ్డును కూల్చివేసిన అధికారులు



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ డి.పోచంపల్లి పరిధిలోని సారెగూడెంలో త్రిపుర ల్యాండ్ మార్క్ సంస్థ ఓ వెంచర్ నిర్మాణం చేపట్టారు. ప్రధాన రహదారి లేకపోవడంతో దర్జాగా ప్రభుత్వ స్థలం సారె గూడెం ప్రజల ప్రయోజనాలకు స్మశాన వాటిక కోసం స్థలం కేటాయించారు. అందులో నుంచి సదరు నిర్మాణ సంస్థ దర్జాగా స్మశాన స్థలం గుండా రోడ్ ఏర్పాటు చేయడం జరిగింది. ఆదివారం స్థానికులు నిర్మాణ సంస్థ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే అధికారులు రెవిన్యూ, ఇరిగేషన్, మునిసిపల్ శాఖలపై వరుస కథనాలు వార్త పత్రికలలో రావడంతో సోమవారం మునిసి పల్, కమిషనర్ కె.సత్యనారాయణ ఆదేశాల మేరకు.. రెవెన్యూ అధికారులు సంయుక్తంగా కూల్చి వేతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐతో పాటు మున్సిపల్ చైన్‌మెన్‌లు తిరుపతి, సతీష్, రాము తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
మంగళవారం | అక్టోబర్ 08, 2024 | www.navatelangana.com

పవన్ కళ్యాణ్‌పై కేఏ పాల్ ఫిర్యాదు



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇటీవలకాలంలో తిరుపతి లడ్డు వ్యవహారంలో పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారనీ, సమాజంలో ఆయన వ్యాఖ్యల మూలంగా అశాంతి వాతావరణం ఏర్పడిందని ఆయనపై ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కె. ఏ. పాల్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన పాల్.. పోలీసులకు పిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తన పిర్యాదు ఆధారంగా విచారణ చేసి ఎఫ్.ఐ.అర్ నమోదు చేయాలని పోలీస్ అధికారులకు విజ్ఞప్తి చేశారు.



దేవి నవరాత్రులను పురస్కరించుకుని బన్సీలాల్ పేట్ డివిజన్‌లోని పద్మారావు నగర్‌లో ఉన్న పోల్ బాల్ హనుమాన్ ఆలయంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి దేవి మండపంలోని దుర్గామాతను బీజేపీ రాష్ట్ర యువ నాయకులు మర్రి పురురవ రెడ్డిలు దర్శించుకొని అక్కడ జరిగిన ప్రత్యేక పూజ కార్యక్రమములో పాల్గొన్నారు.
నవతెలంగాణ-బేగంపేట

జీహెచ్‌ఎంసీ పరిధిలో ప్రజావాణికి 139 అర్జీలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్‌ఎంసీ పరిధిలో నిర్వహించిన ప్రజావాణిలో 139 అర్జీలు వచ్చాయి. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులను కమిషనర్ ఆమ్రపాలి కాట తీసుకున్నారు. వచ్చిన అర్జీలపై నిర్లక్ష్యం వహించకుండా పరిష్కరించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాల యంలో నిర్వహించిన ప్రజావాణిలో 90 అర్జీలురాగా, ఆరు జోన్లలో మరో 49 అర్జీలు వచ్చాయి. ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వాం (9) విన్నపాలు వచ్చాయి. ఆ విన్నపాలను కమిషనర్ సంబంధిత అధికారులకు పరిష్కారానికి పంపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు నళిని పద్మావతి, సత్యనాయణ, యాదగిరిరావు, శానిటేషన్ వేణుగోపాల్ రెడ్డి, అడిషనల్ సీసీపీలు ప్రదీప్ కుమార్, గంగాధర్, హౌసింగ్ యస్ ఈ.పీ.వీ.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్

- క్షేత్రస్థాయిలో జలమండలి ఎండీ పర్యటన
- నాలుగో రోజు ఎర్రగడ్డ, హైమవతి నగర్‌లో పర్యటించిన ఎండీ
- స్థానికంగా నెలకొన్న సమస్యలపై ఆరా
- ఏండ్ల తరబడి నెలకొన్న సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ మహానగరంలో సీవరేజ్ ఓవర్ ఫ్లో నివారణకు జలమండలి చేపట్టిన 90 రోజుల స్పెషల్ డ్రైవ్ కొనసాగుతోంది. ఈ మేరకు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి సోమవారం పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఓ అండ్ ఎం డివిజన్ నం.6 పరిధిలోని ఎర్రగడ్డ, హైమవతి నగర్ ప్రాంతాల్లో పర్యటించి స్పెషల్ డ్రైవ్ పనితీరును పరిశీలించారు. దాదాపు 500 గృహాలున్న ఈ ప్రాంతంలో 1979 సమయంలో నిర్మించిన సీవరేజ్‌లైన్ తరచూ పొంగిపొర్లి దుర్గంధం వచ్చేది. దీంతోపాటు ఈ ప్రాంతంలో ఉత్పన్నమయ్యే మురుగు మొత్తం ఒకే పైపు లైన్‌కు అనుసంధానం చేసి ఉండటం వల్ల ఒత్తిడి పెరిగి మెయిన్ రోడ్ పైకి సైతం వచ్చే పరిస్థితి ఉంది. ఫలితంగా ఈ ప్రాంతం నుంచి ఎక్కువగా ఎంసీసీ ఫిర్యాదులు వచ్చేవి. ఈ సమస్యను పరిష్కరించడానికి ఎప్పటికీ ఒక సీవరేజ్ టీమ్ అక్కడే పనిచేయాల్సిన పరిస్థితి ఉండేది. ఈ సమస్య మళ్లీ పునరావృతం కాకుండా ఆ పురాతన పైపు లైన్ కు తాత్కాలిక మరమ్మతులు చేయాలన్న ఎండీ శాశ్వత పరిష్కారంగా, కొత్త పైపు లైన్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌లో జలమండలి ప్రధానంగా రెండు అంశాలపై దృష్టి సారించింది. హైదరాబాద్ నగరంలో దీర్ఘకలికంగా ఉన్న సీవరేజ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు భవిష్యత్తులో నీటి కరవు రాకుండా ఇంకుడు గుంతల నిర్మించుకునేలా చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే.

ఊరెళ్లే ప్రజలు సమాచారం ఇవ్వాలి

- సనత్ నగర్ ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాసులు



నవతెలంగాణ-బేగంపేట్

దసరా పండుగలకు ఊరెళ్లే వారు సమాచారం ఇవ్వా లని, వారి ఇంటికి భద్రత కల్పించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సనత్ నగర్ ఇన్‌స్పెక్టర్ కె శ్రీనివా సులు తెలిపారు. ప్రజలు దొంగతనాల నివారణ గురించి తాము సూచించిన సూచనలు పాటించడం ద్వారానే ఇది సాధ్యమవు తుందని అన్నారు. సోమవారం ఆయన మాట్లా డుతూ ప్రధానంగా ఊరికి వెళ్లే సమయంలో వీలైనంత మేరకు ఇంటిలో విలువైన వస్తువులు, నగదు, బంగారం ఆభరణాలు పెట్టవద్దని, వాటిని బ్యాంకు లాకర్‌లో లేదా భద్రంగా ఉన్నచోట దాచుకోవటం ఉత్తమమని సూచించారు. బీరువా తాళం చెవులు బీరువా పైన కానీ, బీరువా లోని బట్టల కింద లేదా ఇంట్లో పెట్టి వెళ్లవద్దని కోరారు. అలాగే విలువైన వాహనాల తాళం చెవులను కూడా వెంట తీసుకుని వెళ్తే మంచిదన్నారు. ఇంటి ముందు తలుపులకు సెంటర్ లాక్ వేసి బయట గొళ్లెం పెట్టవద్దని, ఇండ్లకు నాసిరకం తాళాలు వాడొద్దనీ, తాళం కనపడకుండా కర్టెన్స్ వేయాలనీ తెలిపారు. ఇంటి తలుపుల ముందు చెప్పులు ఉంచండం ద్వారా ఇంట్లో తాము ఉన్నామనే భావనను దొంగ తనం చేసే వారికి కలిగించాలన్నారు. బయటి గేటుకు లోపల నుంచి తాళం వేయాలని ,అలాగే ఇంట్లో ముందు గదిలో లైట్ వేసి ఉంచాలని తెలిపారు.

ఊరికి వెళ్లేటపుడు నమ్మకమైనవారికి అలాగే స్థానిక పోలీస్ స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని, ఊరికి వెళ్లిన తర్వాత కూడా ఇంటి పక్క వారికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకుంటూ ఉండాలన్నారు. అంతే కాకుండా మహిళలు బయటకు వెళ్లేటప్పుడు, వాకిట్లో ముగ్గులు వేసేటపుడు మెడలోని బంగారు ఆభరణాలు జాగ్రత్త అని, వీలైతే చీర కొంగుతో కవర్ చేసుకుంటే మంచిదనీ అన్నారు. కాలనీలో సి.సి. కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే దొంగలు భయపడే అవకాశం ఉందని, ప్రత్యేక అల్లారం సిస్టమ్ పద్ధతిని ఏర్పాటు చేయడం ద్వారా ఎక్కువ భద్రత ఉంటుందన్నారు. ఇంటికి సి.సి. కెమెరాలను సొంతంగా ఏర్పాటు చేసుకుంటే మొబైల్ యాప్ ద్వారా సి.సి. కెమెరా ద శ్యాలు ఎప్పటి కప్పుడు వీక్షించే అవకాశం ఉంటుందన్నారు. బస్సు లేదా రైలు ప్రయాణ సమయంలో అపరిచిత వ్యక్తులు ఇచ్చిన తినుబండారాలను తీసుకోకూడదని, మీ వెంట విలువైన వస్తువులను తీసుకుని వెళ్తున్నట్టయితే అట్టి బ్యాగును దగ్గరే అంటిపెట్టుకుని ఉంచుకోవాలని తెలిపారు. ఎవరిమీదైనా అనుమానం వస్తే డయల్ 100 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ చెప్పారు.

57 ఎస్సీ ఉపకులాలకు 8 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి

- చింతల రాజలింగం

నవతెలంగాణ-ఓయూ

57 ఎస్సీ ఉపకులాలకు 8శాతం రిజర్వేషన్ ఇవ్వాలని తెలంగాణ ఎస్సీ 57 ఉపకులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్య క్షుడు చింతల రాజలింగం కోరారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ ఆఫీసర్ డిప్యూటీ డైరెక్టర్ కిషన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాల ,మాదిగలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందారని, ఇప్పటికీ 57 ఉపకులాల వారు ఊరికి దూరంగా ఉంటున్నారన్నారు. వీరికి ఇల్లు, వ్యవసాయం, ఉద్యోగాలు లేక అన్ని రకాలుగా వెనుకబడిన సంచార జీవితం గడుపుతున్నారని తెలిపారు. క్రిమిలేయర్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏర్పుల యాదయ్య, నిషాని శంకర్, పస్తం తులసిరామ్, నూనె రాజు, కడమంచి ఎల్లేష్, సదుల తిరుమల, హరి పానీటి శంకర్,కపరి రమేష్, సదుల విట్టల్, 57 ఉపకులాల ప్రతినిధులు పాల్గొన్నారు.

టింట్ ఆరెంజ్ స్టూడియో ప్రారంభం





- హాజరైన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, బోయిన్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ.

నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ నియోజకవర్గంలోని డైమండ్ పాయింట్స్ సమీపంలో సోమవారం టింట్ ఆరెంజ్ స్టూడియో షోరూ ం ప్రారంభమైంది. ప్రతినిధులు అరుణ్ మాధవరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, బోయిన్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ తో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ప్రతినిధులు, నిర్వాహకులు అరుణ్, మాధవరావు, మాట్లాడుతూ కంటో న్మెంట్‌లో ఇలాంటి షోరూమ్ మొదటిసారిగా ప్రారంభిం చామని తెలిపారు. యజమానుల పాత కారులను పాలిష్ తో పాటు స్క్రాచింగ్ స్కీన్ గార్డ్ షైనింగ్ తగ్గకుండా మెరిసిపోయేలా ముస్తాబు చేసే ప్రక్రియ నిర్వహించేందుకు ఈ షో రూమ్‌ను ప్రారంభించినట్టు చెప్పారు. మీడియం, లార్జ్, ఎక్స్‌ట్రా లార్జ్, భారీ వాహనాలను అందంగా వారు కోరుకున్న విధంగా పీపీఎఫ్ చేస్తామని వారు వివరించారు. తమకు ఈ రంగంలో 8 ఏండ్ల అనుభవం ఉందని క్రమం గా విస్తరించి ఉన్నట్లు పేర్కొన్నారు. సిబ్బందితో పాటు అధునాతన పరికరాలు అందుబాటులో ఉన్నాయని కార్ల యజమానులను సంతృప్తి పరిచేందుకు తమ సేవలు బాగుంటాయని వివరించారు కారులను ఇంటీరియర్ కింది బాడీ డస్ట్ కోటింగ్ తో పాటు తదితర పార్ట్స్ ను అలంకరించేందుకు పాలిష్ తో కూడిన పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పద్మా రెడ్డి , బి వెంకట్ రెడ్డి తదితరులు నాయకులు పాల్గొన్నారు

బతుకమ్మ పండుగ పర్యావరణం స్త్రీ సాధికారతకు ప్రతీక

- రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి వాణీ ప్రసాద్



నవతెలంగాణ-కల్చరల్

బతుకమ్మ పండుగ కేవలం ఆట పాటలు పూలు పేర్చటం మహిళలు సమిష్టిగా చేసుకునే వేడుక మాత్రమే కాదని వేదాంత పరమైన భావన కూడా ఉందని రాష్ట్ర పర్యటక సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి వాణీ ప్రసాద్ చెప్పారు. పర్యావరణ పరిరక్షణ స్త్రీ సాధికారత భావన ఈ వేడుకలో అంతర్భాగంగానే ఉందన్నారు. రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై సంగీత నాటక అకాడమీ నిర్వహణలో మూడు రోజుల పాటు జరిగే యువ కళోత్సవం సోమ వారం ఆరంభమైంది. ముఖ్య అతిథిగా వాణీ ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ రవీంద్ర భారతి ప్రాంగణం బతుకమ్మ వేడుకలతో బహిరంగ సాంస్కృతిక వేదిక గా రూపొందిందన్నారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న ఉత్తర తూర్పు ప్రాంత సాంస్కృతిక కేంద్రం సంచాలకుడు ప్రసన్న గొగోయి మాట్లాడుతూ పరస్పర అవగాహన కు సంస్కృతి పరిచయానికి ఇట్టి వేడుకలు దోహద పడతాయి అన్నారు పండుగలు, పెండ్లి, మరణం వంటి అన్ని సందర్భాలలో పూలు ప్రాధాన్యత ఉందని అన్నారు. పూలతోనే జరుపుకొనే పండుగ బతుకమ్మ.. తెలంగాణ సంస్కృతి లో ప్రత్యేకమైనది అన్నారు హైదరాబాద్ నగరం సహజ సిద్ధమైన ప్రకృతి పర్యావరణంతో ప్రత్యేకించి రుచి కర ఆహారానికి గుర్తింపు ఉందని అన్నారు. వేదిక పై అకాడమీ చైర్ పర్సన్ డాక్టర్ అలేఖ్య పుంజల స్వాగతం పలికారు భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ అతిథి సత్కారంలో పాల్గొన్నారు. అనంతరం ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసులు రాఘవా చారి శిష్య బృందం నన్ను గన్న తల్లి నా భాగ్యమా కృతి తో ఆరంభిం చారు. లలిత హరిప్రియ , శిష్య బృందం శ్యామ శాస్త్రి కృతులు గానం చేశారు. రామా ప్రభ శేషులత శిష్య బృందం కూడా కర్ణాటక సంగీతం గానం చేశారు. శ్వేత, దయాసార్,హేమంగి శిష్య బృందం హిందూస్తానీ గానం రామా చారి శిష్య బృందం భక్తి గీత గానంతో శ్రోతల ప్రశంసలు అందుకున్నారు.

కొసమెరుపు : కార్యక్రమానికి వ్యాఖ్యానం అందించిన వ్యాఖ్యాత్రి తెలుగింగ్లీష్‌తో రెండు భాషలను సంకరం చేశారు. తెలుగు పదాల ఉచ్చారణలో పద ప్రయోగంలో దోషాలు అనేకం కాగా తెలుగు పండుగ తెలంగాణ రాష్ట్ర గీతానికి వ్యాఖ్యానంలో తెలంగాణ భాష లేకున్నా కనీసం వాడుక తెలుగు భాషలో నైన కాకుండా ఆంగ్లం లో చేయటం శోచనీయం అని పలువురు తమ ఆవేదన వెలిబుచ్చారు

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



- ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ

నవతెలంగాణ-కంటోన్మెంట్

కాంట్రాక్టు కార్మికుల హక్కులను అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ డిమాండ్ చేశారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో పనిచేయుచున్న కాంట్రాక్టు కార్మికులకు కార్మిక చట్టాల ప్రకారం రావలసిన హక్కులను అమలు చేయాలని కోరుతూ సోమవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో విద్యానగర్‌లోని సెంట్రల్ లేబర్ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు . ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ సబ్ ఏరియాలలో పనిచేయుచున్న కాంట్రాక్ట్ కార్మికులకు రెండు నెలలుగా వేతనాలు చెల్లించకుండా కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు 2000 మంది కాంట్రాక్టు కార్మికులు సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్ పరిధిలో పనిచేస్తున్నారని బోనస్ యాక్ట్ 1965 కింద దసరా పండుగకు ఒక నెల బోనస్ వేతనం రావలసి ఉందని.. ఆ బోనస్ ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.కంటోన్మెంట్ బోర్డు పరిధిలో పనిచేయుచున్న కాంట్రాక్టు కార్మికులకు కాంట్రాక్టు లేబర్ చట్టం ప్రకారం ఉండాల్సిన కనీస హక్కులు కూడా లేకుండా అధికారులు వ్యవహరిస్తున్నారని చెప్పారు లేబర్ కమిషనర్ అధికారులు తక్షణం బోర్డు పరిధిలో ఎంక్వైరీ నిర్వహించి కార్మికులకు న్యాయం జరిగే విధంగా తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులకు బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయడం ద్వారా సక్రమంగా వేతనాలు అందే విధంగా చూడాలని, ఎక్కువ గంటలు విధులు నిర్వహించుకుంటూ కార్మికులపై పని భారాన్ని మోపుతున్నారని, కార్మికులకు చట్టప్రకారం ఉండవలసిన కనీస సౌకర్యాలు భోజన వసతులు మరుగుదొడ్లు సైతం లేకుండా ఉన్నారని వారు అధికారులకు వివరించారు. సెంట్రల్ లేబర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులుబోర్డు పరిధిలో ఉన్నటువంటి కార్మికుల స్థితిగతులపైన ఎంక్వయిరీ నిర్వహించి తగు న్యాయం చేయాలని వారు కోరారు

అనంతరం లేబర్ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సెంట్రల్ డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ హైదరాబాద్ డి. శ్రీనివాసులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులని నియమించి కార్మికుల స్థితిగతుల పైన, కార్మిక చట్టాల అమలుపైన కార్మికులకు అమలవుతున్నటువంటి వసతుల పైన ఎంక్వయిరీ నిర్వహించి వేతనాలు అందే విధంగా లీవులు అమలు అయ్యే విధంగా పిఎఫ్ ఈఎస్ఐ సక్రమంగా చెల్లించే విధంగా పని గంటలలో వ్యత్యాసం లేకుండా తగు చర్యలు తీసుకుంటామని డి శ్రీనివాసులు యూనియన్ ప్రతినిధులకు హామీ ఇవ్వడం జరిగింది



'ప్రజల అసౌకర్యాన్ని దూరం చేయాలి'

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-బేగంపేట్

సమస్యలను పరిష్కరించడం ద్వారా ప్రజలకు కలుగుతున్న అసౌకర్యాన్ని దూరం చేయాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం బన్సీలాల్ పేట డివిజన్ లోని గొల్ల కొమురయ్య కాలనీలోని మెయిన్ రోడ్ పై జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఈ రోడ్డు ఎప్పుడూ మురుగునీటితో నిండి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారని తెలిపారు. ప్రజల అవస్థలను చూసి సమస్య పరిష్కారం కోసం డ్రయినేజీ, వాటర్ లైన్ లను ఏర్పాటు చేసి అనంతరం వైట్ టాపింగ్ రోడ్డు నిర్మాణం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అయినప్పటికీ కొన్ని చోట్ల డ్రయినేజీ నీరు రోడ్డుపైకి వస్తున్నాయని స్థానికులు ఎమ్మెల్యే దష్టికి తీసుకు రాగా సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా జయనగర్ గార్డెన్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టగా అసంపూర్తిగా నిలిచిపోయిందని, అందు కున్న అడ్డంకులను గుర్తించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ సుదర్శన్, వాటర్ వర్క్స్ జీఎం వినోద్, శానిటేషన్ డీఈ దేవేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

పోల్ బాల్ హనుమాన్ ఆలయంలో పూజలు

దేవీ నవరాత్రులలో భాగంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సోమవారం పద్మారావు నగర్ లోని పోల్ బాల్ హనుమాన్ దేవాలయంలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈఓ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు తీర్థ ప్రసాదాలను అందజేసి అనంతరం పండితులు వేద మంత్రాలతో ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కుర్మ హేమలత, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, నాయకులు లక్ష్మీపతి, రమణ, శ్రీకాంత్ రెడ్డి, కుమార్ యాదవ్, గజ్జెల శ్రీనివాస్, అబ్బాస్ తదితరులు ఉన్నారు.

'గో ఫర్ ఫ్రీడమ్ గోల్డ్' ఆఫర్‌ను ప్రకటించిన ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్

నవతెలంగాణ- జూబ్లీహిల్స్



దసరా దీపావళి వంటి పండుగల సీజన్‌లో కస్టమర్లకు ఆనందం తీసుకురా వడానికి ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్ "గో ఫర్ ఫ్రీడమ్ గోల్డ్ ఆఫర్ 2024" ప్రత్యేక ఆఫర్ ను ప్రవేశపెట్టింది. 45 రోజుల పాటు అందుబాటులో ఉండే ఆఫర్ లో భాగంగా 100 మంది అదృష్టవంతులు 1 గ్రాము బంగారు నాణెం పొందు తారు. ఐదుగురు అదృష్టవంతులైన కస్టమర్లకు 50గ్రాముల బంగారు నాణెం, 10 గ్రాముల బంగారు నాణెం గెలుచుకునే అవకాశం ఉంది. ఈ ఆఫర్ అక్టోబర్ 1 నుంచి నవంబర్ 14, 2024 వరకు 45 రోజుల పాటు ఆంధ్రప్రదేశ్, తెలం గాణ, కర్ణాటక, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో అందుబాటులో ఉంటుంది. ఈ ప్రాంతాలలో 100 మంది వినియోగదారులు ప్రతిరోజూ ఒక గ్రాము బంగారాన్ని గెలుచుకునే అవకాశాన్ని కలిగి ఉండటంతో పాటుగా, బంపర్ డ్రాలో పాల్గొనే అవకాశాన్ని కూడా పొందుతారు.

ఈ సందర్భంగా జెమిని ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్ సేల్స్ అండ్ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గో ఫర్ ఫ్రీడమ్ గోల్డ్ ఆఫర్ 2024'లో పాల్గొనాలనుకునే కస్టమర్లు ఫ్రీడమ్ రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ ఒక లీటర్ పౌచ్‌లను రెండు కొనుగోలు చేయాల్సి ఉంటుందన్నారు. వారు పోటీలో పాల్గొనటానికి ఈ దిగువ విధంగా చేయాల్సి ఉంటుందని చెప్పారు. "కొనుగోలుతో పాటుగా అందించిన కార్డ్‌ను స్క్రాచ్ చేసి క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్ మైక్రోసైట్‌లో వారి మొబైల్ నెంబర్, పేరు, నగరం, రాష్ట్రాన్ని వెల్లడించాల్సి ఉంటుంది. వారి మొబైల్ నెంబర్‌కు పంపిన ఓటీపీ ద్వారా వారి వివరాలను ధ్రువీకరించడం చేస్తారు. ప్రమోషనల్ స్కీమ్ వ్యవధిలో, ప్రతి రోజూ 100 మంది లక్కీ కస్టమర్లు 1 గ్రాము బంగారు నాణెం పొందుతారు. విజేతలకు వాట్సాప్ సందేశాలు, ఎస్‌ఎంఎస్ లేదా ఫోన్ కాల్‌ల ద్వారా తెలియజేస్తారు. విజేతల జాబితా ప్రతిరోజూ www.freedomconsumeroffer.com వెబ్‌సైట్‌లో ప్రచురిస్తారు. ప్రమోషనల్ స్కీమ్ ముగిసే సమయానికి, ఐదుగురు అద ష్టవంతులైన విజేతలకు 50 గ్రాముల బంగారు నాణెం, 10 మంది విజేతలు 10 గ్రాముల బంగారు నాణెం అందుకుంటారు. ఆఫర్ ముగిసిన తర్వాత బంపర్ లక్కీ డ్రా విజేతలు ప్రకటిస్తారు. విజేతల పేర్లు వెబ్‌సైట్‌లో పోస్ట్ అవుతాయి. పోషకాలు సమృద్ధిగా ఉండటమే కాకుండా గుండె ఆరోగ్యానికి తోడ్పడే నూనెలను అందించడం ద్వారా ఆరోగ్యకరమైన వంట అలవాట్లను ప్రేరేపించడం మా లక్ష్యం. ఈ పండుగల సీజన్‌కు ఉత్సాహాన్ని జోడించడానికి, మా అభిమానులకు బహుమతులను అందించ డానికి, మేము ఈ ఆఫర్‌ను పరిచయం చేశాం. ఈ పరిమిత-కాల ప్రమోషన్ కస్టమర్‌లకు ప్రతిరోజూ బంగారు నాణేలను గెలుచుకునే అవకాశాన్ని అందిస్తుంది. అదే సమయంలో ఈ పండుగ సీజన్‌లో ఫ్రీడమ్ రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ ఆరోగ్య ప్రయోజనాలను ఆస్వాదిస్తూ రుచికరమైన వంటకాలను ఆస్వాదించే అవకాశం అందిస్తుంది" అని అన్నారు.

ఫ్రీడమ్ రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ విటమిన్లు ఏ అండ్ డీ తో సమ ద్ధి చేశారు. దీనిలో సహజంగా లభించే విటమిన్ ఈ కూడా సమృద్ధిగా ఉంటుంది. ఇది మొత్తం కుటుంబానికి ఆరోగ్యకరమైన ఎంపిక. "ఫ్రీడమ్ "అనేది సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్రముఖ బ్రాండ్, ప్రస్తుతం భారతదేశంలో సన్‌ఫ్లవర్ ఆయిల్ కేటగిరీలో మార్కెట్ వాటా ప్రకారం నెంబర్ 1 స్థానంలో ఉందని తెలిపారు.

'కేర్'లో గుండె మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతం



నవతెలంగాణ - బంజారాహిల్స్

డైలేటెడ్ కార్డియోమియోపతి వల్ల ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న 39 ఏండ్ల మహిళా రోగికి బంజారాహి ల్స్‌లోని కేర్ ఆస్పత్రిలో విజయవంతంగా గుండె మార్పిడి శస్త్ర చికిత్స చేసి రోగికి పునర్జన్మ ప్రసాదించారు. ఎడమ జఠరిక పనిచేయకపోవడంతో తలెత్తిన గుండె వైఫల్యం, పునరావ తం అవుతున్న అరిథ్మియాతో డైలేటెడ్ కార్డియోమి యోపతి వల్ల ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న మహిళా రోగికి అధునాతన కార్డియాక్ కేర్లో నైపుణ్యానికి ప్రసిద్ధి చెందిన ఈ సంక్లిష్ట ప్రక్రియ ఆస్పత్రి విజయాన్ని సూచిస్తుంది.

కేర్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అజిత్ సింగ్ మాట్లాడుతూ తీవ్రమైన హ ద్రోగ సమస్యతో బాధపడుతున్న రోగికి గతంలోనే ఆటోమేటిక్ ఇంప్లాంటబుల్ కార్డియోవర్టర్ డిఫిబ్రిలేటర్ (ఏఐసీడీ) అమర్చినట్టు తెలిపారు. అయితే గుండె వైఫల్యం, వెంట్రిక్యులర్ టాకికా ర్డియో తదితర అనారోగ్య సమస్యలతో రోగి పలుమార్లు ఐసీయూలో వైద్య చికిత్స పొందుతూ వచ్చారన్నారు. ఆక్సిజన్ మద్దతు,మిల్రినోన్ థెరపీ సహా సమగ్రమైన వైద్య నిర్వహణ ఉన్నప్పటికీ రోగిలో అనారోగ్య లక్షణాలు కొనసాగా యన్నారు.దీంతో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది,అతినిద్ర తదితర లక్షణాలతో రోగి ఆరోగ్యం క్షీణతకు దారితీసిందని చెప్పారు. ఈ క్రమంలో రోగి కేర్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ నగేష్, వారి బృందాన్ని సంప్రదించగా ఆమె ఆరోగ్యం పై పూర్తిస్థాయి పరిశీలన చేసి ఆమె జీవన మనుగడను మెరుగు పరిచేందుకు గుండె మార్పిడి మాత్రమే ఉత్తమమైనదిగా నిర్ధారించారన్నారు. దీంతో రోగి జీవన్ దాన్‌లో నమోదు చేసుకున్నారని, ఐదు నెలల నిరీక్షణ అనంతరం అవసరమైన గుండె అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. దాత గుండె ఆస్పత్రికి చేరుకున్న కేర్ ఆస్పత్రి సీనియర్ కార్డియోథొరాసిక్ సర్జన్ డా.నగేష్ నేత త్వంలో కార్డియోథొరాసిక్ వైద్య నిపుణు లు, అనస్థీషియా వైద్య నిపుణుల బ ందం కలిసి రోగికి గుండె మార్పిడి ప్రక్రియను విజయవంతంగా నిర్వహించామన్నారు.

రోగులకు అధునాతన ఆరోగ్య సంరక్షణ విధానాలను అందించడం తమకెంతో గర్వకారణంగా ఉందన్నారు. వైద్య బ ందం నైపుణ్యం, అంకితభావానికి ఇది నిదర్శనం అన్నారు. రోగి ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తుం టామని వెల్లడించారు.కాగా గుండె మార్పిడి అనంతరం రెండు వారాల తర్వాత పూర్తిస్థాయి ఆరోగ్యవంతమైన స్థితిలో రోగి ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారని తెలిపారు. అనంతరం డా.నగేష్ మాట్లాడుతూ.. రోగి గుండె వైఫల్యం, పునరావ త అరిథ్మియా వల్ల ఈ కేసు వైద్యులకు సవాల్‌గా మారిందన్నారు. ఈ ప్రక్రియలో పాల్గొన్న వైద్య బ ందం సమన్వయం, నైపుణ్యాన్ని ప్రశంసించారు. రోగి త్వరగా కోలుకున్నారని, భవిష్యత్తులో ఆమె జీవన ప్రమాణం మరింత మెరుగుపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. రోగికి శస్త్ర చికిత్స అనంతరం తలెత్తే అన్ని రకాలైన అనారోగ్య సమస్యలను క్షుణ్ణంగా తనిఖీ చేశామని చెప్పారు. ఆమెకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తలేదని, గుండె మార్పిడి ప్రక్రియ పూర్తిగా విజయవం తమైందని వెల్లడించారు.రోగి త్వరితగతిన కోలుకోవడంలో ఆస్పత్రి వైద్య సిబ్బంది సహకారం పూర్తిస్థాయిలో అందిందన్నారు.

కేకేసీ సికింద్రాబాద్ జిల్లా చైర్మెన్‌గా గంట రాజు సాగర్

నవతెలంగాణ-ఓయూ

రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అఖిల భారత అసంఘటిత కార్మికుల అండ్ ఉద్యోగుల కాంగ్రెస్ తెలంగాణ కమిటీలో అడ్డగుట్ట డివిజన్ కు చెందిన గంట రాజు సాగర్‌ను సికింద్రాబాద్ జిల్లాకు చైర్మెన్‌గా నియమించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని రాష్ట్ర చైర్మెన్ కౌన్సిల్ సమీర్ చేతులమీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైస్ చైర్మెన్ వేణుగోపాల్ , ప్రధాన కార్యదర్శి ప్రతాప్ రెడ్డి, మాజీ హైదరాబాద్ ఎస్సీ సెల్ జాయింట్ కన్వినర్ భూపతి, మాజీ సికింద్రాబాద్ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ అనంత్ కషారావు, నవీన్, కుమార్, సాయి చందర్, ప్రభుదేవ్ పాల్గొన్నారు.



బహుజన శ్రేయోభిలాషి నిరంతరం ప్రజాశ్రేయాసుకై పాటుపడే నీకార్సైనా బహుజన యోధుడు బడుగుబలహీన వర్గలా వారి కోసం కృషి చేస్తున్న సమాజ్ పార్టీ ఖైరతాబాద్ నియోజకవర్గ అధ్యక్షులు దోరపల్లి రమేష్ను సికింద్రాబాద్ జిల్లా (పార్లమెంట్), ఇన్‌చార్జిగా నియమిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్ సోమవారం పార్టీ కార్యాలయంలో ప్రకటించారు.
నవతెలంగాణ-బంజారాహిల్స్



సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డిని తుమ్మలూరు మాజీ సర్పంచ్ రంగారెడ్డి జిల్లా కబడ్డీ చైర్మెన్ మద్ది కర్ణాకర్ రెడ్డి, చంపాపేట్ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు గోపాల్ ముదిరాజ్, యమ్మ భాష, భాస్కర్ రావు మొదలగువారు మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతి రెడ్డికి శాలువాతో ఘనంగా సత్కరిస్తూ, జ్ఞాపక ఫోటో ఫ్రేంను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పెద్దలు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-చంపాపేట్

పండుగ వేళ..

నిత్యావసర వస్తువుల ధరల పరుగులు





● పరేషాన్‌లో సామాన్య ప్రజలు

నవతెలంగాణ-నాగోల్

రాష్ట్రంలో ఎంతో గొప్పగా ఘనంగా నిర్వహించుకునే దసరా పండగ సమీ పిస్తుండగా మరోవైపు నిత్యవసర వస్తువుల ధరలు పరుగులు పెడుతు న్నాయి. దాంతో ఈ సారి పండుగను ఎలా జరుపుకోవాలోనని సామాన్య ప్రజలు పరేషాన్ అవుతున్నారు. ఇప్పటికే చాలీచాలని సంపాదనలతో ఒకవైపు, ఇంటి అద్దెలతో మరోవైపు, పిల్లల చదువులు, అనారోగ్యాలకు గురై ఆస్పత్రుల చెల్లింపులతో ఆగమవుతున్న తమకు పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలు మరో గుదిబండగా మారుతున్నాయని ప్రజలు వాపో తున్నారు. ఇప్పటికే రోజురోజుకు పెరిగిపోతున్న కూరగాయల ధరలతో నాణ్యమైన ఆహారానికి నోచుకోలేకపోతున్నామని ఆవేదన చెందుతున్నారు.

ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వేసిన కూరగాయల తోటలు పాడైపోయి సరైన దిగుబడి లేక ఉన్న కూరగాయలకు ధరలు పెంచాల్సి వచ్చిందని మార్కెట్‌కు సరుకులు తెచ్చిన రైతులు, కమిషన్ ఏజెంట్లు చెబుతున్నారు. అయితే ఎలాంటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సుంకాలు లేక పోయినా పెట్రోలు, డీజిల్ ధరలు పెరగకపోయినా మధ్య దళారులు కత్రిమ కొరతలను స ష్టిస్తూ నిత్యవసర వస్తువులైన బియ్యం, పప్పులు, నూనెలు, అల్లం ,వెల్లుల్లి పాయల ధరలను పెంచి తమ నడ్డి విరుస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. తమను పట్టించుకునే నాధుడే కరువయ్యారని ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు కూరగాయల ధరలు మరొకవైపు నిత్యావసర వస్తు వులు బియ్యం, పప్పులు, నూనెల ధరలు పెరిగిపోవడంతో పొద్దంతా కష్టపడి నాణ్యమైన ఆహారం తీసుకోవడానికి నోచుకోలేక పోతున్నామని అంటున్నారు.

పెరిగిపోతున్న ధరల నియంత్రించడంలో పాలక పక్షాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పాలకపక్షాలకు ఓట్లు, సీట్లు తప్ప ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పట్టడం లేదని ఎన్నికల ముందు కేవలం ప్రజాకర్షణ పథకాలను ప్రకటించి వాటిని కూడా పూర్తిస్థాయి అమలుపరచడంలో విఫలం చెంది కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలు కూడా లేకపోలేదు. దొరికిన పని చేసుకుంటూ చాలీచాలని వేతనాలతో తమపై ఆధారపడి ఉన్న కుటుంబ సభ్యులను పోషించుకుంటున్న పేద ,మధ్యతరగతి కుటుంబాలకు మండి పోతున్న కూరగాయల ధరలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు తీవ్ర మానసిక ఆందోళనకు గురి చేస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు. తమ ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా చౌకగా ఉన్న కూరగాయలను కొందామనుకున్న ఏ ఒక్క కూరగాయను చూసిన 50 రూపాయలకు పై మాటే కానీ చౌకగా లేవని.. దీంతో తమ కుటుంబ సభ్యులకు నాణ్యమైన ఆహారాన్ని అందించడంలో విఫలం చెందుతున్నామని ఇంటి యజమానులు మనోవేదనకు గురవుతున్నారు.

ఇప్పటికైనా పాలకపక్షాలు, ప్రతిపక్షాలు ఒకరిపై ఒకరు నిందారోపణలు చేసుకుంటూ పంతాలకు పోకుండా ప్రధానంగా రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పై ప్రత్యేక దృష్టిని సారించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని మధ్య తరగతి ప్రజలు, పేదలు కోరుతున్నారు. అదేవిధంగా పండగ వేల పరుగులు పెడుతున్నటువంటి నిత్యావసర వస్తువుల ధరలను, కూరగాయల ధరలను నియంత్రించి పేద మధ్యతరగతి ప్రజలు నాణ్యమైన ఆహారాన్ని తీసుకునేలా ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ధరలు చూస్తుంటే కండ్లు తిరుగుతున్నాయి..



నేడు నిత్యావసర సరుకులు, కూరగాయలు వాటి ధరలు చూస్తుంటే కళ్ళు తిరుగుతున్నాయి. పేదవారి నుంచి మధ్య తరగతి వారి వరకు.. రోజూ వారి కూలీలు, ప్రయివేటు ఉద్యోగాలు చేసేవారిదాకా అందరూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.నూనె ధర, పప్పుల ధరలు, ఉల్లి గడ్డ, టమాటా, పచ్చి మిర్చి ధరలు కొండెక్కి కూర్చున్నాయి. దాంతో పేదలు నాణ్యమైన ఆహారం తీసుకోవడానికి దూరం కావాల్సి వస్తున్నది. అస్సలు ప్రజల బాధలు వర్ణించలేనిది, పాలకులు కన్నెత్తి చూడడంలేదు. ఇలానే కొనసాగితే ప్రజల ఆగ్రహానికి గురికాకతప్పదు. కూరగాయలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలను రాష్ట్ర ప్రభుత్వం నియంత్రించి ప్రజలను కాపాడాలి

-సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సమితి సభ్యులు బొడ్డుపల్లి కృష్ణ

నిత్యావసర ధరలను నియంత్రించాలి



పెరిగిపోతున్న కూరగాయలు నిత్యావసర వస్తువుల ధరల వల్ల సామాన్యులు ఏమి తినాలో ఎలా బతకాలో తెలియకుండా పోతున్నది. దసరా పండుగ సమీపిస్తుండడంతో ఈ ధరల పెంపుదల పేదలపై ఎంతో ప్రభావం ఉంటుంది. ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ఈ పాలకులకు పట్టడం లేదు. ఇలాగే సమస్యలపై నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తే పాలకులు తగిన సమయంలో తగిన గుణపాఠాన్ని నేర్చుకోక తప్పదు. ఇప్పటికైనా నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించి ప్రజలను ఆదుకోవాలి

-గోకమల్ల చైతన్య భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) రంగారెడ్డి జిల్లా కోశాధికారి

కుంట్లూరులో భారీగా ట్రాఫిక్ జామ్



● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

నవతెలంగాణ-పెద్ద అంబర్ పేట

పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని కుంట్లూర్ ప్రధాన చౌరస్తాలో ఆదివారం ఉదయం భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. నాలుగు రోడ్ల నుంచి వాహనాల తీవ్రత పెరగడం వల్ల ఎలాంటి సిగ్నల్ లేకపో వడం, ట్రాఫిక్ సిబ్బంది లేకపోవడం వాహనాదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నేషనల్ హైవే విస్తీర? పనులు జరుగుతుండడంతో వాహనదారులు రోడ్ డైవర్షన్‌గా ఈ రోడ్డును తిసుకుంటున్నారు. దాంతో వాహనాల రద్దీ ఎక్కువ అవుతున్నది. దీనికి తోడు హయత్ నగర్ నుండి పసుమావులకు వెళ్లే రహదారిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణా దారులు కనీసం సెట్ బ్యాక్ లేకుండా, షట్టర్లు నిర్మించి వ్యాపారాలు నడిపి స్తుండడంతో రోడ్డుపైనే వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. దీనికి తోడు నాగోల్ వెళ్లే రోడ్డులో ఉన్న ఒక నాలా ఉదయం సమయంలో పొంగి పొర్లతూ దుర్వాసమైన సువాసన వెదజల్లుతుంది. దీంతో పాదా చార్యులు, వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదురుకోవాల్సి వస్తుంది, అని స్థానికులు వాపోతున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 10 కేసులు నమోదు

నవతెలంగాణ-చంపాపేట్

ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ చౌరస్తా, భారత్ గార్డెన్, యాదిరెడ్డి గార్డెన్ వద్ద రెండు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లు సంతోష్ నగర్, మీర్ చౌక్ ట్రాఫిక్ పోలీసులు సోమవారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. సౌత్ జోన్ ఈస్ట్ జోన్ ట్రాఫిక్ అదనపు డీసీపీ శ్రీనివాస్ చార్యులు, ట్రాఫిక్ ఏసీపీ లక్ష్మణ్, సీఐలు నరసింహ నాయక్, నముద్దీన్ ఆదేశం మేరకు.. అమర్నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహించగా సుమారు 10 కేసులను నమోదు చేసినట్టు ట్రాఫిక్ ఎస్సై తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 10 మంది ద్విచక్ర వాదారులు, త్రీ వీలర్, ఫోర్ వీలర్ నమోదు చేసినట్టు పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై అమర్నాథ్ రెడ్డి హె హెచ్చరించారు. ఎన్ని అవగాహన కార్యక్రమాలను నిర్వహించినా వాహనదారుల మార్పు రావడం లేదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మీర్ చౌక్ ట్రాఫిక్ ఏఎస్ ఐలు ట్రాఫిక్ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

హిందీనగర్‌లో డిజిటల్ కార్డు వివరాల సేకరణ..



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

గోషామహల్ నియోజకవర్గం జాంబాగ్ డివిజన్ హిందీనగర్ ప్రాంతంలో డిజిటల్ కార్డ్ పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఇంటింటి వివరాల సేకరణ కార్యక్రమం నిర్వహించామని జీహెచ్ఎంసీ సర్కిల్-14 అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శైలజ తెలిపారు. ఈ కార్డు ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, హెల్త్ ప్రొఫైల్, వివిధ పథకాలు అందేఅవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిసి విద్యాధర్, కైలాష్ సింగ్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా బతకమ్మ వేడుకల ఆటపాట'



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

హిమాయత్ నగర్, లిబర్టీలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో ఆమ్ ఆద్మీ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో సోమవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఆప్ మహిళా విభాగం అధ్యక్షురాలు హేమ జిల్లోజు, ప్రధాన కార్యదర్శి నర్సింగ్ యమునా, ఆప్ డాక్టర్స్ విభాగం అధ్యక్షు రాలు డాక్టర్ లాక్ష్య, నేతలు సుధారాణి, ఆఫసా సలాం, ఫర్ హాత్ ఉన్నిసా, మౌనికా తదితరులు తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా బతుకమ్మ సంబరాలను ఆప్ మహిళా శ్రేణులు ఆటపాటలతో ఘనంగా జరిపారు.ఈ కార్యక్రమంలో ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిద్ది సుధాకర్, కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము గౌడ్, నేతలు అబ్దుల్, సాదిక్, ఖలీం బాబా, విజయ్ మల్లంగి, శివాజీ, దర్శనం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలపై చిన్న చూపు తగదు

- తెలంగాణ రాష్ట్ర శ్రామిక మహిళా కన్వీనర్ ఎస్.వి.రమ
- సీఐటీయు ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు..



నవతెలంగాణ-ధూల్‌పేట్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలపై చిన్న చూపు తగదని తెలంగాణ రాష్ట్ర శ్రామిక మహిళ కన్వీనర్ ఎస్.వి.రమ అన్నారు. జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యునియన్ సీఐటీయు ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు సంతోష్ నగర్‌లో ఘనంగా నిర్వహించారు. శ్రామిక మహిళ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఎస్.వి.రమ గారు, సీఐటీయు అధ్యక్ష కార్యదర్శులు శ్రావణ్ కుమార్, మీనా, సీఐటీయు సీనియర్ నాయకులు ఎం.డి అబ్బాస్ లు శ్రామిక మహిళతో బతుకమ్మ ఆట, పాటలతో పూల బతుకమ్మలతో సందడి చేశారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు ఎండి అబ్బాస్‌తో పాటు ఆమె మాట్లాడుతూ.. సమాజంలో సగ భాగంగా ఉన్న మహిళలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలపై చిన్న చూపు చూస్తున్నారని, 33శాతం రిజర్వేషన్లు కల్పించడంలో విఫలమైన్నారు. దేశంలో ఎక్కడా చూసిన మహిళలపై అత్యాచారాలు, దాడులు, హత్యలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని పట్టించుకోని ప్రభుత్వ లు దేశాన్ని ఎలుతున్నాయి మండిపడ్డారు. అడ పిల్లల్ని పుట్టనిదాం, చదనిదాం, ఎదగనిదాం అనే నినాదంతో ముందుకు వెళ్ళాలన్నారు. సమానత్వం, భద్రతకై పోరాడాలన్నారు. మహిళలు, పిల్లలపై హింసను ముగింపు పలికె విధంగా పోరాటంలో మహిళలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటియు జిల్లా నాయకులు ఎస్.కిషన్, రాంకుమార్, ఎం.బాలు , యాదమ్మలు, కృష, శ్రీను, రాజ్ కుమార్, యూగేందర్ రెడ్డి, అరుణ, లక్ష్మి, దీపికా, కవిత, శ్రీదేవి, ఆశా, ప్రశాంతి, కవిత, శైలేజా, స్వరూప, అలీం, ఇందిరమ్మ, సైదమ్మ, లాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలకు ఆస్కారం లేకుండా యాప్

- మరింత దూసుకెళ్లనున్న హైడ్రా
- యాప్‌లోనే నేరుగా ఫిర్యాదు చేసే అవకాశం
- నగరంలో చెరువుల పరిరక్షణపై లేక్ ప్రొటక్షన్ కమిటీ సమావేశం



నవతెలంగాణ-సిటీబ్యూరో

జంట జలాశయాల పరిరక్షణ లక్ష్యంగా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) చేపట్టిన ఆపరేషన్‌తో ప్రముఖుల గుండెల్లో గుబులు రేపింది. హైడ్రా పంజాను అడ్డుకునేందుకు ప్రయత్నాలు జరిగాయి. ఇదిలా వుండగా ప్రభుత్వం హైడ్రాకు ప్రత్యేక చట్టం కల్పించిన విషయం తెలిసిందే. మున్సిపల్ చట్టంలో 374 – బీ సెక్షన్ చేరుస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. దాంతో హైడ్రా మరింత వేగంతో దూసుకెళ్లేందుకు కసరత్తు మొదలు పెట్టింది. ఆక్రమణలకు గురైన చెరువులను పరిరక్షించడంతో పాటు పూర్వ వైభవం తీసుకువచ్చే విధంగా హైడ్రా చర్యలపై దృష్టి సారిం చింది. ఇందులో భాగంగా చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను గుర్తించేందుకు ఇరిగేషన్, రెవెన్యూ, నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ, స్టేట్ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్, సర్వే ఆఫ్ ఇండియా అధికారులతో సోమవారం హైడ్రా కమిషనర్, లేక్ ప్రొటక్షన్ కమిటీ ఛైర్మెన్ ఏవీ రంగనాథ్ బుద్ధ భవన్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలో చెరువులు, ప్రభుత్వ స్థలాలు, పార్కులు, ప్రజావసరాలకు నిర్దేశించిన స్థలాలు ఆక్రమణలకు గురి కాకుండా తీసుకోవాల్సిన చర్యలతోపాటు నిరంతరం నిఘా ఉంచాలని నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యం గా ఆక్రమణలకు ఆస్కారం లేకుండా అప్రత్యేక ఆయాప్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఎక్కడ ఆక్రమణలు జరుగు తున్నా యాప్ ద్వారా సమాచారం క్షణాల్లో హైడ్రాకు చేరేలా చర్యలు తీసుకున్నారు. ఈ యాప్‌లోనే ప్రజలు ఫిర్యాదు చేసే విధంగా రూపొందిస్తున్నారు. ప్రజల నుంచి ఫిర్యాదు వచ్చిన వెంటనే క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి, అక్కడ తీసుకున్న చర్యలపై యాప్ ద్వారా అన్ని వివరాలను వివరించే అవకాశం ఉంటుంది.

45 ఏండ్ల డేటా ఆధారంగా..

ఆక్రమణలు తొలగించిన చెరువుల్లో డెబ్రీస్‌ను పూర్తి స్థాయిలో తొలగించనున్నారు. మొదటి దశగా సున్నం చెరువు, అప్పాచెరువు, ఎర్రకుంట, కూకట్‌పల్లి నల్లచెరువుతో పనులు ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నారని తెలిసింది. ఓఆర్ ఆర్ పరిధిలో ఎన్ని చెరువులున్నాయి. ఎంత మేర ఆక్రమణలకు గుర య్యాయి లెక్కలు తేల్చాలంటూ అధికారులకు హైడ్రా కమిషనర్ సూచించినట్టు సమాచారం. చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారణకు శాస్త్రీయ పద్ధతులను అనుసరించే అంశాలపై సమీక్షలో చర్చించినట్టు తెలిసింది. గతంలో నిర్ధారించిన ఎఫ్‌టీఎల్ సరిగా లేని పక్షంలో వాటిని సవరించే విధంగా చర్యలు తీసుకోను న్నారు. 45 ఏండ్ల డేటా ఆధారంగా చెరువుల ఎఫ్‌టీఎల్, మాగ్జిమమ్ వాటర్ స్ప్రెడ్ ఏరియాను గుర్తించారు. ఇందుక ఎన్.ఆర్.ఎస్.ఏ, స్టేట్ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్, ఇరిగేషన్ విభాగాల డేటాను పరిశీలించారు. విలేజ్ మ్యాప్స్, భూ వినియోగం సర్వే నంబర్లతో సహా సమాచారం ఇచ్చే కాడాస్ట్రల్ మ్యాప్స్ , 45 ఏండ్లలో పూర్తి స్థాయిల చెరువు నీరు విస్తరించిన తీరుపై సమాచారం సేకరిస్తున్నారు. హిమాయత్ సాగర్‌తో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల గుర్తింపు ప్రారంభించి అదే విధానాన్ని అన్ని చెరువుల విషయంలో పాటించేందుకు చర్యలు తీసుకు న్నారు. చెరువుల ఆక్రమణలపై 2018లో కాగ్ ఇచ్చిన నివేదిక ను పరిశీలించిన కమిషనర్ ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా చెరువులను గుర్తించేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. చెరువుల పరిరక్షణపై ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాలపైనా సమీక్షలో చర్చించినట్టు తెలిసింది.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

- బస్తీ దవాఖాన డాక్టర్ జె.సాత్విక్ ఆనంద్



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తలుగా ఉండా లని చంద్ర కిరణ్ బస్తి దవాఖాన డాక్టర్ జె సాత్విక్ ఆనంద్ అన్నారు. సోమవారం చంద్ర కిరణ్ బస్తీలోని బస్తీ దావాఖానాలో ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్త లు పాటించాలని సూచించారు. వేడి చేసి వడబోసిన నీరును తీసుకోవాలని సూచించారు ఇంట్లో, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజలు వేడి ఆహారం, కూరగాయలు, పండ్లు, పండ్ల రసాలు తీసుకోవాలన్నా రు. చిన్న పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసు కోవాలి సూచించారు. జలుబు. జ్వరం ఉంటే వెంట నే డాక్టర్‌ను సంప్రదించాలని కోరారు. తమ బస్తీ దవఖానా లో బీపీ, షుగర్ వ్యాధులకు మందులను ఉచితంగా అందిస్తున్నామ న్నారు. అన్ని రకాల రక్త పరీక్షలు నిర్వ హించి అవసరమైన వారికి మందులను అందిస్తున్నామన్నారు.

టెస్కాబ్‌లో బతుకమ్మ సంబరాలు..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

తెలంగాణ రాష్ట్ర సహకార ఎపెక్స్ బ్యాంక్ లిమిటెడ (టీఎస్‌సీఏబీ) కార్యాలయంలో సోమవారం తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించే సాంస్కృతిక పండుగ అయిన బతుకమ్మ సంబరాలను ఉద్యోగులందరు కలిసి ఘనంగా నిర్వహించారు. కార్యాలయ సిబ్బంది అంద రూ సాంప్రదాయ దుస్తుల్లో వచ్చి "అలిగిన బతుకమ్మ" పండుగను ఉత్సాహంగా జరిపారు. మహిళా సిబ్బంది అందమైన పూలతో బతుకమ్మలను తయారుచేసి ఆడి పాడి సందడి చేశారు. టెస్కాబ్ సిజీఎం జ్యోతి ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ "తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిరోజు జ్ఞాపకం చేసుకునే ఈ బతుకమ్మ పండుగను కార్యాలయంలో జరపడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు". ప్రతి ఒక్కరికీ బతు కమ్మ పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ ఈ వేడుకను విజయవంతంగా నిర్వహించడానికి అనుమతించిన బ్యాంక్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. సిబ్బంది సహకారాన్ని ప్రశంసించారు.

డీఎస్సీ డైరెక్టర్ రిక్రూట్మెంట్‌తో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య



నవతెలంగాణ-ముషీరాబాద్

డీఎస్సీ డైరెక్టర్ రిక్రూట్మెంట్ ద్వారా స్కూల్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. నిరుద్యోగ జేఏసీ చైర్మెన్ నీలా వెంకటేశ్ ఆధ్వర్యంలో సోమవారం విద్యానగర్ బీసీ భవన్‌లో నిరుద్యోగుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎస్‌జీటీ టీచర్లచే 70శాతం ప్రోమోషన్స్ ద్వారా స్కూల్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేస్తున్నారు. ఇది మా బీఈడీ చదివిన నిరుద్యోగులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు. విషయ పరిజ్ఞానం ఎక్కువ కలిగి ఉన్న బీడీ వారికి 30శాతం డైరెక్టర్ రిక్రూట్మెంట్ ద్వారా భర్తీ చేస్తున్నారు. విషయ పరిజ్ఞానం తక్కువగా ఉండి ఓపెన్ లో డిగ్రీ, బీఈడీ పూర్తి చేసిన వారిచే 70శాతం ప్రమోషన్స్ ద్వారా స్కూల్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయడం వల్ల విద్యావ్యవస్థలో నాణ్యత లోపిస్తుందని తెలిపారు. కావున దయచేసి బీఈడీ చదివిన వారిచే స్కూల్ అసిస్టెంట్లు పోస్టులు 100శాతం డైరెక్ట్ రిక్రూట్మెంట్ ద్వారా భర్తీ చేయాల్సింది గా కోరారు. స్కూల్ ఎడ్యుకేషన్ బోర్డుని, బోర్డ్ ఆఫ్ ప్రైమరీ ఎడ్యుకేషన్, బోర్డ్ ఆఫ్ సెకండ్ సెకండరీ ఎడ్యుకేషన్ గా విడదీయాల్సిందిగా కోరారు. ఎస్ఆర్‌టీ పోస్టులు 100శాతం భర్తీ చేస్తున్నప్పుడు బీఈడీ వారిచే మాత్రమే స్కూల్ అసిస్టెంట్ పోస్టులు డీఎస్సీ లో డైరెక్ట్ రిక్రూట్మెంట్ ద్వారా 100కు 100శాతం భర్తీ చేయాల్సిం దిగా డిమాండ్ చేశారు. ఈ సమావేశం లో గుజ్జ కృష, జీలపల్లి అంజి, నందగోపాల్, రాజేందర్, నరసింహా గడ్ ,రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ముక్కు పుడకను అందజేసిన మహేందర్ రెడ్డి దంపతులు



నవతెలంగాణ-అంబర్‌పేట

అంబర్‌పేట మహంకాళి అమ్మవారికి 8 గ్రాముల బంగారం ముక్కు పుడకను బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వెదురు మహేందర్ రెడ్డి దంపతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు కే.దుర్గా ప్రసాద్ రెడ్డి, శంకర్ గౌడ్, గడ్డం లక్ష్మణ్, మల్లికార్జున గౌడ్, ఎర్రబోలు నరసింహా రెడ్డి, శ్రీధర్ గౌడ్, కిషోర్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సగరులను బీసీ డి నుంచి బీసీ ఏ లోకి చేర్చాలి


- ఫైనాన్స్ కమిషన్ చైర్మెన్ సిరిసిల్ల రాజయ్య, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవి



నవతెలంగాణ-ముషీరాబాద్

ఆర్థికంగా రాజకీయంగా విద్య పరంగా వెనుకబ డిన సగరులను బీసీ డి నుంచి బీసీ ఎలో చేర్చాలని ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ సిరిసిల్ల రాజయ్య, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవి రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మెన్ వకుళాభరణం కృష్ణ మోహన్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర ఆధ్వర్యంలో సగర సం ఘం నాయకులు సమావేశం జరిగింది. ఈ సమావే శంలో వక్కలాభరణం కృష్ణ మోహన్ మాట్లాడుతూ కుల వృత్తులపై ఆధారపడిన వారికి ప్రభుత్వం స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమం ద్వారా శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని కోరారు. వృత్తులు అంతరించి పోకుండా ప్రభుత్వం శిక్షణ తరగతులు అందిస్తూ సంక్షే మ పథకాలు అందేలా చేయాలని కోరారు. పాత పద్ధతులు కాకుండా వృత్తులకు ఆధునిక పరికరాలు అందిస్తూ ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షులు శేఖర్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు తర్వాత అనంతరామ కమిషన్ తర్వాత తర్వాత మురళీధర్ రావు కమిషన్ ఆధారంగా తీసుకు వచ్చిన 166 జీవోను అమలు పరచాలని కోరారు. 300 మంది ప్రతిభా విద్యార్థిని విద్యార్థులకు పురస్కార అవార్డులు అందజేశామన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ సగరులు సంచార జాతులకు చెందినవారు వీరిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ డి నుంచి బీసీ ఏలో చేర్చాలని డిమాండ్ చేశారు. విద్యా రాజకీయ ఉద్యోగ రంగంలో సగరులకు ప్రభుత్వాలు అవకాశాలు కల్పించాలని అవకాశాలు కోరారు . ఈ సమావేశంలో సాగర సంగం గౌరవ అధ్యక్షులు హరికృష, ట్రస్ట్ బోర్డ్ చైర్మెన్ మారుతి, ప్రధాన కార్యదర్శి సత్యం, కోశాధికారి కుమారస్వామి, మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

'దసరా పండుగకు సర్పంచుల కుటుంబాల్లో వెలుగులు నింపాలి'



- అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి
- తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం జేఏసీ

నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఈ దసరా పండుగకు 2019 నుంచి 2024 వరకు గ్రామాల్లో సర్పంచులు చేసిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించి, తమ కుటుంబాల్లో వెలుగులు నింపాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్ర సీఎం దిష్టిబొమ్మల దహనం, నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ హెచ్చరించింది. ఈ మేరకు సోమవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కమిటీ రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచులు వడ్డీలకు డబ్బులు తీసుకొచ్చి గ్రామ అభివృద్ధి పనులు చేశారని గుర్తు చేశారు. అనేక మంది సర్పంచులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని, కొంత మంది సర్పంచులు గతంలో సూసైడ్ చేసుకుని చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచులపై నేటి కాంగ్రెస్ ప్రభుత్వ కక్ష సాధింపులు సరైనవి కాదన్నారు. దేశంలోనే అత్యధిక అభివృద్ధి పనులు చేసి రికార్డు స్థాయిలో అత్యధిక అవార్డులు అందుకుని ప్రజాసేవ చేసిన సర్పంచుల పరిస్థితి నేటి ప్రజా పాలనలో దయనీయ స్థితిలో ఉందన్నారు. సర్పంచుల పెండింగ్ బిల్లులపై సీఎం ఎ.రేవంత్ రెడ్డికి రెండుసార్లు, డిప్యూటీ సీఎంకు రెండుసార్లు, పంచాయతీ శాఖ మంత్రి సీతక్కకు ఐదు సార్లు, అదే విధంగా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలకు, అధికారులకు వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని, అయినా తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి, మాట్ల మధు, ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, సహాయ కార్యదర్శులు సుభాష్ గౌడ్, మెడబోయిన గణేష్, నవీన్ గౌడ్, రాజేందర్, సముద్రాల రమేష్, కేశబోయిన మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

- మాజీ కార్పొరేటర్ కే.పద్మావతి దుర్గాప్రసాద్ రెడ్డి



నవతెలంగాణ-అంబర్‌పేట

పండుగలు ప్రశాంత వాతావరణంలో సాంప్రదాయాల ప్రకారం సామరస్యంగా జరుపుకోవాలని మాజీ కార్పొరేటర్ కే.పద్మావతి దుర్గా ప్రసాద్ రెడ్డి అన్నారు. సోమవారం దుర్గా నగర్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దసరా ఉత్సవాలలో భాగంగా సాంప్రదాయాలతో వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏనుగంటి నరేందర్ మాజీ కార్పొరేటర్ పద్మావతి దుర్గా ప్రసాద్ రెడ్డి దంపతులను సన్మానించారు.

పీడీఎస్‌యు నుంచి ఎస్. నాగేశ్వరరావు, స్వాతి, సుమంత్‌ల బహిష్కరణ

- పీడీఎస్‌యు తెలంగాణ రాష్ట్ర కమిటీ

నవతెలంగాణ-ముషీరాబాద్

పీడీఎస్‌యు నుండి ఎస్.నాగేశ్వరరావు, స్వాతి, సుమంత్‌లను సంఘం నుంచి బహిష్కరిస్తున్నట్టు పీడీఎస్‌యు తెలంగాణ రాష్ట్ర కమిటీ సోమవారం పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యు)లో పనిచేసిన ఎస్. నాగేశ్వరరావు, స్వాతి, సుమంత్‌లు గత కొన్ని నెలలుగా సంఘం కార్యక్రమాలకు దూరంగా ఉంటూ 2024 సెప్టెంబర్ 4న వ్యక్తిగత కారణాల చేత సంఘానికి రాజీ నామా చేస్తున్నట్టు లేఖ ద్వారా తెలిపారు. ఈ రాజీనా మాపై పీడీఎస్ యు రాష్ట్ర కమిటీ, సంబంధిత బాధ్యులు వారితో పలుమార్లు చర్చించి వారి నిర్ణయాన్ని ఉపసం హరించుకొని ఉద్యమాలలో పాల్గొనాలని వారికి సూచిం చారు. ఈ సూచనలను పరిగణనలోకి తీసుకో కుండా పోటీ కార్యక్రమాలు సంఘ నిర్మాణ విచ్ఛినానికి పాల్పడుతున్నారు. పైగా పీడీఎస్‌యు కార్యాలయం (ప్రజాపంథా పార్టీ కార్యాలయం) పేరుతో కరపత్రాలు, విసిటింగ్ కార్డ్స్ ప్రింట్ చేసుకొని వ్యక్తిగత స్వలాభం కోసం చలామణి అవుతున్నారు. పీడీఎస్‌యు నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఎస్.నాగేశ్వర రావు, స్వాతి, సుమంత్‌లను పీడీఎస్‌యు అన్ని స్థాయి బాధ్యతల నుండి బహిష్కరిస్తున్నామని రాష్ట్ర కమిటీ నాయకులు తెలిపారు.

'అనూహ్య రెడ్డికి లండన్ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రతిష్టాత్మక గౌరవం'

- ఆక్స్‌ఫర్డ్ లార్డ్ మేయర్ మైక్ రోలీ చేతుల మీదుగా ప్రదానం



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

అక్టోబర్ 2 మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని లండన్ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో అక్కడి అష్మోలెన్ మ్యూజియంలో నిర్వహించిన 55వ అంతర్జాతీయ సదస్సు, అవార్డుల వేడుకలో నగరానికి చెందిన వ్యాపార దిగ్గజం, కళాబంధు డాక్టర్ జి.అనూహ్య రెడ్డి అసాధారణ వ్యాపార నైపుణ్యాలకుగాను అత్యంత ప్రతిష్టాత్మకమైన గౌరవం పొందారు. ఎం.ఎస్.జీ అడ్వర్ట్ లిమిటెడ్ నిర్వహించిన ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం ప్రపంచ నాయకులను, వివిధ రంగాలలోని ప్రతిభావంతులను సన్మానించ దానికి వేదికగా అయ్యింది. ఈ సందర్భంగా డాక్టర్ జి.అనూహ్య రెడ్డిని నితీష్ అరోరా వ్యాపార రంగంలో ఆమె చేసిన అసాధారణ పనుల కోసం నామినేట్ చేయగా, ఆమెకు 'బిజినెస్ మావెరిక్ అవార్డు'(వ్యాపార దిగ్గజం)ను ప్రధానం చేశారు.ఆక్స్‌ఫర్డ్ లార్డ్ మేయర్ మైక్ రోలీ ఆమెకు ఈ పురస్కారం ప్రధానం చేసినట్లు సోమవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లండన్ వేదికపై నగర కీర్తి ప్రతిష్టలు ప్రపంచానికి చాటిన అనూహ్య రెడ్డికి పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

'పాఖాల గ్రామ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు'



- తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ చైర్మెన్ జిలుకర రవికుమార్
- పాఖాల అలయ్..బలయ్‌లో తీర్మానం

నవతెలంగాణ-హిమాయత్ నగర్

జనగామ జిల్లా, కొడకండ్ల మండలంలోని 'పాఖాల' గ్రామాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా తాము ముందుకెళ్తున్నట్లు తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ చైర్మెన్ జిలుకర రవికుమార్ తెలిపారు. యూఎస్ఆర్ఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన 'పాఖాల అలయ్..బలయ్ కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. గ్రామానికి చెందిన పలు వురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొని, చిన్ననాటి ముచ్చట్లను చర్చించుకున్నారు. ఈ గ్రామానికి చెందిన తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ చైర్మెన్ జిలుకర రవికుమార్ పాఖాల గ్రామానికి చెందిన హైదరాబాద్ నగరంలో స్థిరపడిన పలువురు ప్రముఖులు డాక్టర్ వి.విద్యాకుమార్, ఉప్పగల్ల సోమయ్య, బోటుమంచి సుధాకర్, గోలీ ప్రకాష్, జక్కుల జీవరత్నం, మాదారపు ఎల్లయ్య, రాపోలు నర్సయ్య, జక్కుల తార, బాకే సోమశేఖర్, చిలుక ప్రసాద్, జి.లక్ష్మ య్య, స్వామిదాస్, నాగార్జున, చంద్రమౌళి తదితరులు కలిసి వారి అనుభవాలు, అనుభూతులను పంచుకు న్నారు. పాఖాల గ్రామాన్ని అందరి భాగస్వామ్యంతో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఈ అలయ్.. బలయ్ కార్యక్రమం నిర్వహించామన్నారు. గ్రామంలోని యువతను మంచి మార్గంలో నడిపించ దానికి పలు కార్యక్ర మాలు చేపడుతున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలను పూర్తిగా అభివృద్ధి చేసి పూర్వవైభవం తీసుకువస్తామని, విద్యార్థుల సంఖ్యను పెంచుతామన్నామని పేర్కొన్నారు.

'బ్యాంక్ ఆఫ్ బరోడా గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా సచిన్ టెండూల్కర్'




నవతెలంగాణ-హిమాయత్ నగర్

భారతదేశంలో అత్యంత విశ్వాసనీయమైన బ్యాంకుల్లో ఒకటైన బ్యాంక్ ఆఫ్ బరోడా గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా సచిన్ టెండూల్కర్‌ను ఎంపిక చేసినట్టు బ్యాంకు వెల్లడించింది. ఈ మేరకు సోమవారం హిమాయత్ నగర్ లోని బ్రాంచీలో బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో దేబదత మాట్లాడుతూ సచిన్ విశ్వాసం, నాయకత్వం ఆయన స్థిరత్వం బ్యాంకుకు స్ఫూర్తిదాయకమన్నారు. సచిన్ తమ బ్యాంకుకు బ్రాండ్ అంబాసిడర్ గా ఉండడం గర్వకారణమన్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడా మాస్టర్ స్ట్రోక్స్ సేవింగ్స్ అకౌంట్ పేరుతో అనేక సేవలను అందిస్తుందన్నారు. మాస్టర్ స్ట్రోక్ ఖాతా ఫ్లెక్సీ ఫిక్స్ డిపాజిట్, అధిక వడ్డీ రేటు, లోన్లపై రాయితీలు, డెబిట్ కార్డు, జీవితకాల ఉచిత క్రెడిట్ కార్డు వంటి సౌకర్యాలను అందిస్తుందన్నారు. సచిన్ టెండూల్కర్‌తో ఏర్పడిన వ్యూహాత్మక భాగస్వామ్యం బ్యాంకు వేగవంతమైన అభివ ృద్ధికి దోహద పడుతుందన్నారు.బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రచారాల్లో సచిన్ పాల్గొని, వినియోగదారుల విద్య, ఆర్థిక అభివృద్ధికి తోడ్పడతారన్నారు. 17 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న బ్యాంక్ బ్రాండ్‌ను అంతర్జాతీయంగా విస్తరించడానికి సచిన్ సహాయపడతారని తెలిపారు. శ్రేష్టత, సమగ్రతకు నిలయమైన బ్యాంక్ ఆఫ్ బరోడాను తానేప్పుడూ అభిమానిస్తానని సచిన్ టెండుల్కర్ తెలిపినట్లు ఆయన వివరించారు.



కానీ ఈ ఆధునిక కాలంలో మహిళల సంపాదనకు ప్రాధాన్యం పెరిగిపోయింది. గతంలో స్త్రీ సంపాదిస్తుంటే వేణ్ణీళ్లకు చన్నీళ్ల తోడు అనేవారు. ఇప్పుడు కుటుంబాలను పోషిస్తున్న మహిళల సంఖ్య ఎక్కువయింది. అయితే ఉద్యోగాలు చేసి ఎంత సంపాదిస్తున్నా ఇంటి పని మాత్రం తప్పడం లేదు. కొన్ని సంస్థల్లో అయితే 12 గంటలు కూడా పని చేయాల్సి వస్తుంది. దీనివల్ల విపరీతమైన పని భారంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల పూణెలో ఓ యువ చార్టర్డ్ అకౌంటెంట్ ఆఫీసు కుర్చీలోనే ప్రాణం వదిలిన ఘటన మనం చూశాము. ఇలా మహిళలు ప్రాణాలు పోయేంత ఒత్తిడిని అనుభవించాల్సి వస్తుంది.

ఆమెకు విశ్రాంతి ఏది?





ప్రస్తుతం మన దేశంలో స్త్రీలు ఉద్యోగం, ఇంటి పని, పిల్లల పెంపకం వంటి మూడు రకాల బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు పని చేస్తే తప్ప జీతం రాని ఉద్యోగాలు చేస్తున్న స్త్రీలు మన దేశంలో కోట్ల సంఖ్యలో ఉన్నారు. సేల్స్‌గర్ల్స్, హాస్పిటల్స్ స్టాఫ్, హెూటల్స్, కాల్ సెంటర్లు, ల్యాబ్ టెక్నీషియన్స్, ఫ్యాక్టరీ వర్కర్లు 9 గంటల నుండి 12 గంటల వరకు డ్యూటీలు చేయాల్సి వస్తుంది. ఈ పని గంటలతో పాటు ఆఫీస్‌కు రావడం, పోవడం, ఇంటి పని, పిల్లల పెంపకానికి పోగా ఇక రోజులో వారి విశ్రాంతి కోసం మిగిలే సమయం ఎంత?

ఒత్తిడి ఎదుర్కొంటూ...

జీవితం గడవడానికి సంపాదన చాలా ముఖ్యమయ్యాక, ఆ సంపాదనలో ప్రధాన భాగం పిల్లల చదువు, వైద్య, రవాణాకు ఖర్చు చేయాల్సి వస్తుంది. ఇటువంటి పరిస్థితుల్లో భార్యాభర్తలు పని చేయక తప్పడం లేదు. మగాళ్లకు కేవలం ఉద్యోగంలో మాత్రమే ఒత్తిడి ఉంటుంది. కానీ మహిళలకు ఉద్యోగ ఒత్తిడితో పాటు ఇంటి పని కూడా ఉంటుంది. వంట వారే చేయాలి. ఇక పిల్లల పనులు, బట్టలు ఉతకడం, ఇంటి శుభ్రత, ఆతిథ్యం, అత్తమామలు ఉంటే వారి బాగోగులు... ఇలా అన్ని రకాల పనులు వారికే భారం. ఇటు ఈ పని అటు ఆ పని వీటి మధ్య సమన్వయం చేసుకోలేక మౌనంగా ఒత్తిడి ఎదుర్కొంటూ అనారోగ్యాలు తెచ్చుకుంటున్నారు. ఒక్కోసారి ప్రాణాల మీదకు కూడా తెచ్చుకుంటున్నారు.

బానిసలుగా చూస్తున్నారు


గతంలో ప్రభుత్వ ఉద్యోగంలో కొంత వెసులుబాటు ఉండేది. ప్రస్తుతం అక్కడ కూడా పని ఒత్తిడి బాగా పెరిగిపోయింది. సుఖమైన ఉద్యోగం అంటే బ్యాంకు ఉద్యోగం అనుకునేవారు అందరు. కానీ ఇప్పుడు అది పూర్తి విరుద్ధంగా మారిపోయింది. బ్యాంకుల్లో చాకిరి విపరీతంగా పెరిగిపోయింది. పెద్ద పెద్ద జీతాలు అందుకునే సాఫ్ట్‌వేర్ రంగం విషయానికి వస్తే వర్క్ ఫ్రం హెూమ్ వచ్చాక ఇరవై నాలుగ్గంటలు పనే అనే భావన కలుగుతోంది. ఇక మల్టీ నేషనల్ కంపెనీల్లో అయితే భారతీయ ఉద్యోగులను మనుషుల్లా కాకుండా బానిసలుగా చూస్తున్నారు. లాగిన్ చేయడం వరకే వారి చేతుల్లో ఉంటుంది. ఆ తర్వాత ఎన్ని గంటలు పని చేస్తారో వారికే తెలియదు. ఈ నేపథ్యంలో స్త్రీలు తమ ఉద్యోగ, కుటుంబ జీవితాలను నిర్వహించుకోవడానికి సతమతమవుతున్నారు.

ప్రాణాలను హరిస్తున్నాయి

కరోనా తర్వాత సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల పరిస్థితి మరింత దారుణంగా తయారయింది. వస్తున్న జీతం గురించి మాట్లాడుకోవడం కంటే వారు ఎదుర్కొంటున్న సమస్యలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. జీవితానికి భరోసా ఇవ్వాల్సిన ఉద్యోగాలే ప్రాణాలను హరిస్తున్నాయి. పూణెలో మరణించిన చాటెడ్ అకౌంటెంట్ సంఘటన కేవలం ఒక ఉదాహరణ మాత్రమే. ప్రపంచం ముందుకు రాని ఇలాంటి ఘటనలు ఎన్ని ఉన్నాయో? భారతదేశంలో యువ మహిళా ఉద్యోగులు ప్రపంచంలో అందరి కంటే ఎక్కువ గంటలు పని చేస్తున్నారని తాజా సర్వేలు చెబుతున్నాయి. వారానికి 40 గంటలు అనే నిబంధనకు ఎప్పుడో కాలం చెల్లిపోయింది. ప్రస్తుతం కార్పొరేట్ కంపెనీలు 55 నుండి 60 గంటల పాటు మహిళలతో పని చేయించుకుంటున్నాయి. సాఫ్ట్‌వేర్, ఐటీ, ఫైనాన్స్ రంగాల్లో రోజుకు 18 గంటల పని విధానం సర్వసాధారణంగా మారిపోయింది. పని గంటలు ముగిసినా ఇంట్లో ఉన్నా చివరకు వారాంతమైనా సరే టార్గెట్లు పూర్తి చేయించుకోవడానికి ఆయా సంస్థలు ఉద్యోగులను వెంటాడుతున్నాయి. కుటుంబం, వ్యక్తిగత జీవితంతో పాటు ఆరోగ్యాన్ని కూడా త్యాగం చేస్తే తప్ప ఈ తరహా ఉద్యోగాలు చేయలేని పరిస్థితి.

ఇండియాకు స్థానమే లేదు

చట్టాలను కఠినంగా అమలు చేసే దేశాల్లో ఇంత చాకిరి చెల్లుబాటు కాదు. ప్రపంచంలో అతి తక్కువ పని గంటలున్న 20 దేశాల్లో ఇండియాకు స్థానమే లేదు. మన దేశంలో జీవించడానికి ఉద్యోగం చేస్తున్నామా లేక ఉద్యోగం చేయడమే జీవితమా అన్న స్థాయిలో పని కబళించేస్తోంది. ఒక రకంగా మానవ హక్కుల ఉల్లంఘనే జరుగుతోంది. వర్క్ కండిషన్స్ ఎలా ఉండాలి అనే అంశంపై 1948లో యూనివర్సల్ డిక్లరేషన్ ఫర్ హ్యూమన్ రైట్స్‌ను మెజార్టీ దేశాలు ఆమోదించాయి. ఉద్యోగుల హక్కులను కాపాడే ఈ డిక్లరేషన్‌ను రూపొందించడంలో భారత్ కూడా కీలక పాత్ర పోషించింది. అయితే దానికి కట్టుబడి చట్టాలను అమలు చేయడంలో మాత్రం మన ప్రభుత్వాలు, వ్యవస్థలు విఫలమవుతున్నాయి. అందుకే భారతీయులతో బానిస చాకిరి చేయించుకునే సంస్థలు పెరిగిపోయాయి. ▪




స్మార్ట్ వర్క్ అవసరం

ఎక్కువ గంటలు పని చేయడం ఉద్యోగి డెడికేషన్‌కు ఏ మాత్రం కొలమానం కాదన్న విషయాన్ని సంస్థలు గుర్తించాలి. వర్కింగ్ కండిషన్స్ ఏ మాత్రం సానుకూలంగా లేని చోట హార్డ్ వర్క్ కంటే స్మార్ట్ వర్క్ చేయడం చాలా అవసరం. ఆనందంగా, ఆరోగ్యంగా జీవించాలంటే నో చెప్పడం ఒక్కటే ఉత్తమమైన మార్గం. ఇన్ని గంటలు ఇంత పనే చేయగలం అని చెప్పాలి. ఎవరి జీవితం వాళ్ల చేతుల్లోనే ఉండాలంటే మొహమాటాలు పక్కన పెట్టి నో చెప్పడానికి సిద్ధంగా ఉండాలి.

కాల్షియం గని

నువ్వులు కాల్షియం గని. అవును నిజమే ఈ చిన్న విత్తనాల్లో పాలకంటే ఎక్కువ కాల్షియం ఉంటుంది. ఒక్క కాల్షియం మాత్రమే కాదు, వీటిల్లో ప్రొటీన్, ఫైబర్, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, మెగ్నీషియం, ఐరన్, జింక్ వంటి ఎన్నో పోషకాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు



చెబుతున్నారు.

100 గ్రాముల నువ్వుల్లో దాదాపు 975 మి.గ్రా. కాల్షియం ఉంటుంది. అయితే 100 మి.లీ. పాలలో 120-130 మి.గ్రా. కాల్షియం మాత్రమే ఉంటుంది. పాలలో ఉండే లాక్టోస్‌ను జీర్ణించుకోవడం చాలా మందికి కష్టం. కాబట్టి ఇలాంటి వారు పాలు తీసుకోలేరు. ఇలాంటి పరిస్థితుల్లో నువ్వులు వారికి ఓ వరమే. అంతేకాదు నువ్వులు సెసామోలిన్, సెసామిన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లకు మూలం. ఇవి ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనం చేకూరుస్తాయి. ఎముకలను బలోపేతం చేయాలనుకున్నా, భవిష్యత్తులో సప్లిమెంట్లను తీసుకోకూడదనుకున్నా.. మీరు తప్పనిసరిగా ఆహారంలో నువ్వులను చేర్చుకోవాలి. అలాగే ఇవి కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో ముందుంటాయి. అధిక కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరేడ్లతో బాధపడేవాళ్లు తప్పనిసరిగా వీటిని తీసుకోవాలి. అలాగే హార్ట్ పేషెంట్లు కూడా నువ్వులను తీసుకోవటం చాలా మంచిది. ఎందుకంటే ఇవి చెడు కొలెస్ట్రాల్ స్థాయిల్ని తగ్గిస్తాయి. వీటిలో లిగ్నన్స్, ఫైటోస్టెరాయిస్ వంటి సమ్మేళనాలు కూడా ఉన్నాయి. ఇవి కూడా కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచడంలో తోడ్పడతాయి. రోజూ 40 గ్రాముల నువ్వుల్ని తింటే చెడు కొలెస్ట్రాల్ 10 శాతం తగ్గుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ▪

మారణహోమం ఆపాలి

(మొదటిపేజీ తరువాయి)



లెబనాన్‌పై కూడా దాడి చేస్తోందని పేర్కొన్నారు. "ఇజ్రాయిల్‌ను ఎవరూ నియంత్రించలేనందున దాడులు తీవ్రమయ్యే అవకాశం ఉంది. అమెరికా వారికి మద్దతు ఇస్తున్నందున ఎవరూ వాటిని ఆపలేరు. అమెరికా వారికి ఆయుధాలు ఇస్తుంది. నిధులిచ్చి ప్రోత్సహిస్తోంది" అని ఆయన విమర్శించారు. పాలస్తీనాకు భారతదేశం దీర్ఘకాలంగా ఇస్తున్న మద్దతును పలుచన చేస్తూ మోడీ ప్రభుత్వం, ఇజ్రాయిల్‌కు అండగా నిలుస్తోందని దుయ్యబట్టారు. "మోడీ ప్రభుత్వం ఇజ్రాయిల్‌కు మద్దతు ఇస్తోంది. ఆయుధాలు, డ్రోన్‌లను ఎగుమతి చేస్తోంది" అని అన్నారు. "అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఇజ్రాయిల్‌కు మద్దతు ఇస్తున్నట్టుగా, మోడీ ప్రభుత్వం అదే బాటలో నడుస్తోంది. ఇది సిగ్గుచేటు" అని కరత్ విమర్శించారు. ప్రత్యేక పాలస్తీనాకు భారత్ ఎప్పుడూ మద్దతునిస్తుందనీ, మోడీ ప్రభుత్వం ఆ వైఖరిని ఖతం చేసిందని ధ్వజమెత్తారు. ఆక్రమిత పాలస్తీనా భూభాగంలో ఇజ్రాయిల్ తన చట్టవిరుద్ధమైన ఉనికిని ఆలస్యం చేయకుండా ముగించాలని డిమాండ్ చేసే తీర్మానాన్ని యూఎన్ జనరల్ అసెంబ్లీ ఇటీవల ఆమోదించినప్పుడు, ఇండియా ఓటింగ్‌కు దూరంగా ఉందని ఆయన గుర్తు చేశారు. "నాటోలోని యూఎస్ మిత్రదేశాలు స్పెయిన్, బెల్జియం, యూకే ఇజ్రాయిల్‌కు ఆయుధాలు ఎగుమతి చేయకూడదని నిర్ణయించుకున్న సమయంలో, అలీన ఉద్యమానికి, గ్లోబల్ సౌత్‌కు నాయకుడిగా చెప్పుకునే ఇండియాను మోడీ ప్రభుత్వం, అమెరికా సామ్రాజ్యవాదం, ఇజ్రాయిల్ యుద్ధ నేరాలకు భాగస్వామిగా మార్చింది" అంటూ ధ్వజమెత్తారు. "కాబట్టి ఆందోళన పాలస్తీనాకు సంఘీభావం గురించి మాత్రమే కాదు. మనం పాలస్తీనా ప్రజలకు మరింత మద్దతును కూడగట్టాలి. అదే సమయంలో, పాలస్తీనా ప్రజలకు వ్యతిరేకంగా మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని బహిర్గతం చేయాలి. ఆయుధాల ఎగుమతి ఆపడానికి చర్యలు తీసుకోవాలి. గాజాలో కాల్పుల విరమణను నిర్ధారించడానికి అన్ని ఫోరమ్‌లలో పని చేయాలి" అని ప్రకాశ్‌కరత్ అన్నారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా, సీపీఐ (ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య కూడా ఇజ్రాయిల్‌కు కేంద్ర ప్రభుత్వం మద్దతునిస్తోందని విమర్శించారు. గాజాలో వెంటనే కాల్పుల విరమణ చేయాలని డిమాండ్ చేశారు.

రైలు పట్టాలను అమ్మేయొద్దు

మోడీ ప్రభుత్వానికి లాలు సూచన

పాట్నా : ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం రైల్వే వ్యవస్థను నాశనం చేస్తోందని రైల్వే శాఖ మాజీ మంత్రి, బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ ఆదివారం మండిపడ్డారు. రాబోయే రోజులలో ఈ ప్రభుత్వం రైలు పట్టాలను సైతం విక్రయిస్తుందేమోనని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. 'మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం రైలు చార్జీలను, ప్లాట్‌ఫారం టిక్కెట్ల రేటును పెంచేసింది. రైల్వే స్టేషన్లను అమ్మేసింది. జనరల్ బోగీల సంఖ్యను తగ్గించింది. వృద్ధులకు అందజేస్తున్న ప్రయోజనాలను నిలిపివేసింది. భద్రతను గాలికి వదిలేసింది' అని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఆయన ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం రైల్వే భద్రతను గాలికి వదిలేయడంతో ప్రతి రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయని లాలూ విమర్శించారు. ఇప్పుడేమో రైల్వేలు నష్టాలలో ఉన్నాయని చెబుతున్నారని అంటూ వాటిని పూడ్చుకునేందుకు రైలు పట్టాలను అమ్మవద్దని ప్రభుత్వాన్ని కోరారు. హర్యానా శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని చెబుతూ దీనిని నరేంద్ర మోడీ ఓటమిగానే చూడాలని లాలూ అభిప్రాయపడ్డారు.లాలూ ప్రసాద్ యూపీఏ ప్రభుత్వ హయాంలో 2004-2009 మధ్యకాలంలో రైల్వే మంత్రిగా పనిచేసిన విషయం తెలిసిందే. దివాలా తీసే పరిస్థితికి చేరుకున్న రైల్వేలను ఆయన గాడిలో పెట్టారు. లాలూ నేతృత్వంలో రైల్వేలు సాధించిన అభివృద్ధిపై ప్రపంచంలోని అనేక యూనివర్సిటీలలో అధ్యయనాలు జరిగాయి. 2004లో లాలూ రైల్వే మంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు రైల్వేలు కేవలం రూ.880 కోట్ల మిగులులో మాత్రమే ఉన్నాయి. 2007 నాటికి రైల్వే శాఖ లాభాలు రూ.11,500 కోట్లకు చేరాయి. సామర్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు, ప్రయాణికుల సంఖ్య ను, సరుకు రవాణాను పెంచేందుకు లాలూ తీసుకున్న చర్యల కారణంగా ఆ శాఖ మంచి లాభాలు ఆర్జించింది. నికర ఆదాయం కూడా రూ.4,000 కోట్ల నుంచి రూ.16,000 కోట్లకు పెరిగింది. అయితే ఉద్యోగాలు ఇచ్చేందుకు భూమిని లంచంగా తీసుకున్నారని (ల్యాండ్ ఫర్ జాబ్) లాలూపై ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై సీబీఐ, ఈడీలు కేసులు నమోదు చేశాయి. న్యూఢిల్లీలోని రౌస్ అవెన్యూ ప్రత్యేక కోర్టులలో విచారణ కూడా జరిగింది. ఈ కేసులో లాలూ కుటుంబ సభ్యులను కూడా నిందితులుగా చేర్చారు.

చెరువులను, మూసీని కాపాడొద్దా?

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్‌లో సచివాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తమ ప్రభుత్వం గడీల పాలన చేయడం లేదనీ, తలుపులు తెరిచే ఉన్నాయని తెలిపారు. నదీ ప్రవాహానికి అడ్డుగా ఉన్న ఇండ్లను తొలగిస్తే వారికుండే బాధ ప్రభుత్వానికి తెలుసని స్పష్టం చేశారు. వారికి న్యాయం చేసి తీరుతామని తెలిపారు. ప్రతిపక్షాలు అలాంటి వారికి ఏం చేయాలో ఏదైనా సలహాలిస్తే స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సూచనలు చేసే వారందరినీ ఆహ్వానిస్తున్నామనీ, తప్పుడు ప్రచారం మానుకోవాలని హితవు పలికారు. బ్రిటన్, జపాన్ తదితర దేశాల్లో నదులను ఏ విధంగా తీర్చిదిద్దుకున్నారో స్లైడ్స్ ద్వారా ప్రదర్శించి వివరించారు. అదే విధంగా 2014 నుంచి 2023 వరకు హైదరాబాద్‌లో చెరువులు పూర్తిగా, పాక్షికంగా ఏ విధంగా కబ్జా అయ్యేయో స్లైడ్స్ ప్రదర్శించారు. వీటిని కాపాడుకోకుంటే భవిష్యత్తులో హైదరాబాద్‌కు ముప్పు పొంచి ఉందని హెచ్చరించారు. భవిష్యత్ తరాలకు ప్రమాదంతో కూడిన నగరాన్ని ఇవ్వడం భావ్యం కాదని ప్రభుత్వం పునరుద్ధరణ దిశగా అడుగులు వేస్తున్నదని తెలిపారు. మూసీ పునరుద్ధరణ ఎలా చేయాలో అధ్యయనం చేసేందుకు మాత్రమే కమిటీ వేసినట్టు తెలిపారు. ఆ ప్రాజెక్టుకు రూ.1.50 లక్షల కోట్లు ఎలా ఖర్చవుతాయంటూ ప్రశ్నిస్తున్నారనీ, ఇంకా అంచనాలే వేయ లేదని కొట్టిపారేశారు. సబర్మతీ పునరుద్ధరణకు మద్దతుగా నిలిచిన వారు మూసీ పునరుద్ధరణను ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు. చెరువులు, మూసీ పునరుద్ధరణలో సామాన్యులే బలవుతున్నారనీ, ఆక్రమణకు అధికారులు, బాధ్యులైన ఇతరులపైనా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హైదరాబాద్ అంటేనే లేక్స్, పార్క్స్, రాక్స్ అని పేరుందని గుర్తు చేశారు. అలాంటి నగరంలో ఆ మూడు కబ్జాలకు గురయ్యాయనీ, చర్యలు తీసుకోకుంటే కాలక్రమేణా కనిపించకుండా పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న చెరువులు అన్యాక్రాంతం కాకుండా కాపాడుతామనీ, మూసీనీ ప్రక్షాళన చేస్తామని చెప్పిన గత ప్రభుత్వాలు చేయలేకపోయాయని విమర్శించారు. హైదరాబాద్ నగరానికి మణిహారంగా మూసీ నదిని తీర్చిదిద్దాలన్నదే మా ప్రభుత్వ ఎజెండా తప్ప మా వ్యక్తిగత ఎజెండా లేనే లేదని భట్టి తెలిపారు. అన్యాక్రాంతమైన చెరువులు హైదరాబాద్ నగర ప్రజల ఆస్తి. మన పూర్వీకులు మనకు ఇచ్చిన ఆస్తిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన పైనే ఉందని తెలిపారు. అధికారంలో ఉన్నప్పుడు మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు తదితరులు మూసీ ప్రక్షాళన అవసరమన్నారని గుర్తుచేశారు.



మధురైలో కదంతొక్కిన పేదలు

ఇండ్లు, భూములకు పట్టాలివ్వాలని వేలాదిమంది ప్రదర్శన

మధురై : వేలాదిమంది పేదలు మధురైలో కదంతొక్కారు. ఇండ్లు, భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ వేలాదిమంది పేదలు సోమవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. పార్లమెంట్ సభ్యులు, సీపీఐ(ఎం) తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ఎస్.వెంకటేశన్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.కన్నన్, మధురై పట్టణ, గ్రామీణ జిల్లాల కార్యదర్శులు ఎం.గణేశన్, కె.రాజేంద్రన్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.విజయరాజన్, ఎస్‌కె పొన్నుతాయ్ తదితరులు నాయకత్వం వహించారు. ప్రదర్శన అనంతరం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు మెమోరాండం సమర్పించారు.

దళితుడి ఇంట్లో రాహుల్ వంట

మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో కాంగ్రెస్ అగ్రనేత ములాఖాత్

ముంబయి: కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో ఓ దళిత కుటుంబంతో ముచ్చటించారు. దళితుడి ఇంటికి వెళ్లి ఆయన కుటుంబంతో కలిసి వంట చేశారు. ఈ సందర్భంగా ఆ దళితుడి కుటుంబంతో పలు విషయాలు మాట్లాడారు. వంట చేయడం పూర్తయిన అనంతరం ఆ దళితుడి కుటుంబంతో కలిసి రాహుల్‌గాంధీ భోజనం చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే.. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో పర్యటించిన రాహుల్‌గాంధీ.. అజయ్ తుకారాం సనాదే, అంజనా తుకారాం సనాదే అనే దళిత దంపతుల ఇంటికి వెళ్లారు. వారితో ఆయన మాట్లాడుతూ.. దళితుల వంటగది గురించి ఇప్పటికీ చాలా తక్కువ మందికే తెలుసునని అన్నారు. కులవివక్ష గురించి వారితో పలు విషయాలు మాట్లాడారు. అంతేగాక షాహూ పటోలే చెప్పినట్టు దళితులు ఏం తింటారో ఎవరికీ తెలియదని ట్వీట్ చేశారు.

ఈ ట్వీట్‌లో 'దళితులు ఏం తింటారు..? ఎలా వండుతారు..? దాని సామాజిక, రాజకీయ ప్రాముఖ్యత ఏమిటి..? అనే విషయాలు తెలుసుకునేందుకు నేను దళితులైన అజయ్ తుకారాం సనాదే కుటుంబంతో ఒక మధ్యాహ్నం గడిపాను' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. వారు తమ ఇంటికి నన్ను గౌరవంగా ఆహ్వానించి వంటగదిలో సహాయం చేసే అవకాశం ఇచ్చారని, తామంతా కలిసి బెండకాయతో 'హరియాలి భాజీ' పచ్చిమిర్చి, తువర్ పప్పు తయారు చేశామని తెలిపారు.

మూతపడిన కంపెనీలో విద్యుద్ఘాతం

(మొదటిపేజీ తరువాయి)

నిచ్చెనను కార్మికులు సోమవారం మధ్యాహ్నం తమ బ్యారక్‌కు మార్చుతున్నారు. ప్రమాదవశాత్తూ మెయిన్ గేట్ సమీపంలోని 11కేవీ విద్యుత్ తీగలకు నిచ్చెన తగలడంతో 8 మంది కార్మికులు గాయపడ్డారు. వెంటనే వారిని సమీపంలో సీఎంఆర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల కార్మికులు గుడుబైటా(26), పురో మాంఝీ(25) మృతిచెందారు. మిగతా ఆరుగురిలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కాగా, మృతదేహాలను గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కోటా ఫుల్...రేషన్ నిల్

నిర్ణయించి, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నిధులు కేటాయిస్తారు.

పీయంజీకేవై అంటే...

2020లో విరుచుకుపడిన కోవిడ్ మహమ్మారి సమయంలో కేంద్ర ప్రభుత్వం పీయంజీకేఏవై పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా లబ్ది పొందుతున్న వారికి ఇందులో భాగంగా అదనంగా ఐదు కిలోల ఆహార ధాన్యాలను అందజేశారు. అయితే గత సంవత్సరం జనవరి నుంచి ప్రభుత్వం ఉచిత పంపిణీని నిలిపివేసింది. జాతీయ ఆహార భద్రతా చట్టం కింద ఒక్కో వ్యక్తికి అందజేస్తున్న ఐదు కిలోలనే (గతంలో సబ్సిడీ రేటుపై ఇచ్చారు) ఇప్పుడు ఉచితంగా ఇస్తున్నారు. సవరించిన ఈ పథకాన్ని ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి మరో ఐదు సంవత్సరాలు పొడిగించారు.

2011 జనాభా లెక్కలు చూపి...

రేషన్ కోటా పూర్తి కావడంతో చాలా మంది ఇప్పటికీ కార్డులు పొందలేకపోయారు. దీంతో రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేదలు ఆకలితో విలవిలలాడుతున్నారు. 2011లో సేకరించిన జనాభా లెక్కల ఆధారంగానే ప్రస్తుత పీడీఎస్ కోటా (జనాభాలో మూడింట రెండు వంతుల మందికి) నిర్ణయించబడుతోంది. ఫలితంగా అనేక కుటుంబాలు రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసినప్పటికీ వాటిని పొందలేకపోతున్నాయి. ప్రభుత్వమేమో కోటా పూర్తయిందని చెబుతోంది. 2020 నాటికే దేశంలోని 10 కోట్ల మందిని పీడీఎస్ నుంచి మినహాయించారని ఆర్థికవేత్తలు తెలిపారు. జాతీయ ఆహార భద్రతా చట్టం కింద రాష్ట్రాల వారీ గణాంకాల కోసం కేంద్రం 2011 నాటి జనాభా లెక్కలపై ఆధారపడడమే దీనికి కారణం.

న్యాయస్థానం అక్షింతలు వేసినా...

జనగణనను నిరవధికంగా వాయిదా వేశామని 2022లో కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. జనాభాను అంచనా వేసి, దానికి అనుగుణంగా రేషన్ కోటా పెంచాలని న్యాయస్థానం ఆదేశించినప్పటికీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దేశంలో రేషన్ కార్డులు లేని ఎనిమిది కోట్ల మంది ప్రజలకు వాటిని పంపిణీ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించినా కేంద్రం నిమ్మకు నీరెత్తినట్లుగానే వ్యవహరిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉదాశీన వైఖరిని దారుణమైనదిగా సుప్రీంకోర్టు జులైలో అభివర్ణించింది.

తాజా విచారణలో ఆగ్రహం

ఈ నెల 4న సుప్రీంకోర్టులో ఈ వ్యవహారం విచారణకు వచ్చింది. రేషన్ కార్డుల జారీకి చివరి అవకాశంగా నవంబర్ 19వ తేదీ వరకూ సమయం ఇస్తున్నామని స్పష్టం చేస్తూ వలస కార్మికులు, నైపుణ్యం కొరవడిన కార్మికులు అందరికీ రేషన్ అందించాలని ఆదేశాలు జారీ చేసింది. తమలో సహనం నశిస్తోందని వ్యాఖ్యానించింది. తన ఆదేశాలను పాటించకుంటే రాష్ట్రాల కార్యదర్శులు (ఆహారం, పౌర సరఫరాలు) వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాల్సి ఉంటుందని హెచ్చరించింది. విచారణ సందర్భంగా సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ కోర్టుకు ఓ ఛార్ట్‌ను సమర్పించారు. కర్నాటకలో 1.45 లక్షల మంది అర్హులు రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తుంటే ఇప్పటి వరకూ కేవలం 13,945 మాత్రమే జారీ అయ్యాయని తెలిపారు. రేషన్ కార్డుల జారీ ప్రక్రియ కొనసాగుతోందని కర్నాటక తెలుపగా 'ఈ ప్రక్రియ మరో సంవత్సరం పడుతుందా? అప్పటి వరకూ ప్రజలు ఆకలితో బాధ పడాల్సిందేనా? కఠిన చర్యలు తీసుకుంటాం. ధిక్కార నోటీసు జారీ చేస్తున్నాం. ఆకలి ఎంతోకాలం వేచి చూడలేదు' అని న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఈ-కేవైసీ బూచిని చూపి...

రేషన్ కార్డులు పొందాలంటే అనేక అవరోధాలు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం కార్డులున్న 81 కోట్ల మంది ఈ-కేవైసీ ద్వారా బయోమెట్రిక్ వెరిఫికేషన్ చేయించుకోవాలని ప్రభుత్వం ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. 99.8 శాతం రేషన్ కార్డులు ఇప్పటికే ఆధార్‌తో అనుసంధానమయ్యాయి. అలాంటప్పుడు ఈ-కేవైసీ అవసరం ఏముంటుంది? ఈ-కేవైసీని పూర్తి చేయకపోతే రేషన్ కార్డులు రద్దవుతాయని చౌకధరల దుకాణాల నుంచి లబ్దిదారులకు సందేశాలు వస్తున్నాయి. ఈ-కేవైసీ కోసం వెళ్లే వారికి అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా వలస కార్మికుల ఇబ్బందులు చెప్పనలవి కావు.

వాస్తవ చిత్రం ఇదే

ఆగస్టులో జరిగిన వ్యవసాయ ఆర్థికవేత్తల జాతీయ సదస్సులో ప్రధాని మోడీ ప్రసంగిస్తూ దేశంలో ఆహార ధాన్యాల నిల్వలు అవసరానికి మించి ఉన్నాయని ప్రకటించారు. కానీ వాస్తవాలు అందుకు భిన్నంగా ఉన్నాయి. ప్రపంచ ఆకలి సూచికలో మన స్థానం నానాటికీ దిగజారుతోంది. 2016లో 97వ స్థానంలో ఉన్న భారత్, 2023లో 111వ స్థానానికి (మొత్తం దేశాలు 125) పడిపోయింది. 74.1 శాతం మంది భారతీయులకు ఆరోగ్యకరమైన ఆహారం లభించడం లేదని 2021లో నిర్వహించిన ఓ సర్వే తేల్చింది. మన దేశంలో ఐదు సంవత్సరాల లోపు వయసున్న చిన్నారులలో మూడో వంతు మందికి వయసు, ఎత్తుకు తగిన బరువు లేదు. పిల్లలు, మహిళలు, పురుషులు రక్తహీనతతో బాధపడుతున్నారు. అలాంటప్పుడు దేశంలో ఆహార ధాన్యాల నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని ఎలా చెప్పగలం?.

ఇజ్రాయిల్ దాడులను ప్రతిఘటించాలి

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్

రాష్ట్ర వ్యాప్తంగా వామపక్షాల నిరసనలు



నవతెలంగాణ- విలేకరులు

అమెరికా అండతోనే పాలస్తీనా, గాజా, లెబనాన్‌లపై ఇజ్రాయిల్ వైమానిక దాడులు చేస్తోందని, ఈ దాడులను ప్రపంచం అంతా ప్రతిఘటించాలి అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్ అన్నారు. ఇజ్రాయిల్ దాడులను నిరసిస్తూ సోమవారం వామపక్షాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పాలస్తీనా సంఘీభావం తెలిపారు. అలాగే, ఇజ్రాయిల్ దాడులను ఖండించారు. అందులో భాగంగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నంది కమాన్ వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. యుద్ధం వద్దు.. శాంతి ముద్దు.. అమెరికన్ సామ్రాజ్యవాదం నశించాలి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. ఐక్యరాజ్య సమితి ఆదేశాలను ఇజ్రాయిల్ బేఖాతర్ చేస్తూ దాడులు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు టి.స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ.. అమెరికా విచ్చలవిడిగా ఆయుధాలను ఉత్పత్తి చేస్తూ సరిహద్దు విద్వేషాలను రెచ్చగొడుతూ యుద్ధాలను సృష్టి సృష్టిస్తోందని విమర్శించారు. మోడీ సర్కార్ అంతర్జాతీయ సంఘీభావం తెలపాలన్నారు. అలాగే, తెలంగాణ అమరవీల స్థూపం వద్ద సీపీఐ నాయకులు నిరసన తెలిపారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో సీపీఐ(ఎం), సీపీఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

సామ్రాజ్యవాద దురహంకారంతో అమెరికా కనుసన్నల్లో ఇజ్రాయిల్ పాలస్తీనాపై దాడులు చేస్తోందని సీపీఐ(ఎం), సీపీఐ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నేతలు ఆదిలాబాద్‌లో నిరసన చేపట్టారు. బస్టాండ్ ఎదుట రాస్తారోకో చేపట్టి ఇజ్రాయిల్ దిష్టిబొమ్మ దహనం చేశారు. దాడులు ఆపి శాంతిని పాటించాలని కోరారు.

హనుమకొండ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద సీపీఐ, సీపీఐ(ఎం), ఆర్ఎస్‌పీ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కారల్ మార్క్స్ కాలనీలో సీపీఐ(ఎం) జిల్లా నాయకులు వెలిశెట్టి రాజయ్య ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు. జనగామ జిల్లా లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండల కేంద్రంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో, ఉప్పునుంతల మండల కేంద్రం, నారాయణ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. మేడ్చల్ జిల్లా మల్కాజిగిరి చౌరస్తాలో ధర్నా చేశారు. ఇజ్రాయిల్ దాడులు వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ఈసీఐఎల్ చౌరస్తాలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఉప్పల్ రింగ్ రోడ్డు, షాపూర్ నగర్ రైతు బజార్ రోడ్డు, బాలానగర్‌లో 'వై' జంక్షన్ వద్ద నిరసన చేపట్టారు. సీపీఐ(ఎం) హైదరాబాద్ సౌత్ కమిటీ ఆధ్వర్యంలో ఐ.ఎస్. సదన్ క్రాస్ రోడ్, సంతోష్ నగర్‌లో నిరసన తెలిపారు. ఇక్కడ సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మహమ్మద్ అబ్బాస్ మాట్లాడుతూ.. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడుల వల్ల అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తోందన్నారు.

నల్లగొండలోని సుభాష్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సూర్యాపేటలోని స్థానిక కొత్త బస్టాండ్ వద్ద ఇజ్రాయిల్ దిష్టిబొమ్మ దహనం చేశారు. సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని రంగా థియేటర్ చౌరస్తాలో నిరసన తెలిపారు. ఆలేరు పట్టణంలో, భువనగిరి జిల్లా కేంద్రంలో ప్రిన్స్‌కార్నర్ వద్ద నిరసన తెలిపారు.

ఆర్చరీలో కొల్లూరు డీపీఎస్ హవా

ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్ చాంపియన్‌షిప్స్



హైదరాబాద్ : ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్ (డీపీఎస్) ఆర్చరీ చాంపియన్‌షిప్స్‌లో కొల్లూరు డీపీఎస్ విద్యార్థులు అదరగొట్టారు. దేశవ్యాప్తంగా 20 రాష్ట్రాల నుంచి ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్ నుంచి 146 మంది ఆర్చర్లు పోటీల్లో తలపడ్డారు. విలు విద్య పోటీల్లో ప్రథమ స్థానం సాధించి కొల్లూరు డీపీఎస్ ఆర్చర్లు చాంపియన్‌షిప్ టైటిల్‌ను సొంతం చేసుకున్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను డీపీఎస్ చైర్మన్ భీం సేన్ కొల్లూరు స్కూల్ విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు.



విన్యాసాలకు సెలవు!

జిమ్నాస్టిక్స్‌కు దీప కర్మాకర్ వీడ్కోలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ

భారత జిమ్నాస్టిక్స్ ముఖచిత్రం, స్టార్ అథ్లెట్ దీప కర్మాకర్ (31) ప్రొఫెషనల్ కెరీర్‌కు ముగింపు పలికింది. ఒలింపిక్స్‌లో పోటీపడిన భారత తొలి మహిళా జిమ్నాస్ట్‌గా చరిత్ర సృష్టించిన దీప కర్మాకర్.. 2016 రియో ఒలింపిక్స్‌లో 0.15 పాయింట్ల తేడాతో విశ్వక్రీడల పతకం చేజార్చుకుంది. ప్రమాదకర ప్రొడునోవ వాల్ట్ విన్యాసాలతో ప్రపంచ వ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న దీప కర్మాకర్ జిమ్నాస్టిక్స్‌కు వీడ్కోలు పలుకుతున్నట్టు సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. నిరుడు మే నెలలో తాష్కెంట్‌లో జరిగిన ఆసియా చాంపియన్‌షిప్స్‌లో బంగారు పతకం సాధించిన దీప కర్మాకర్ ఈ ఘనత సాధించిన తొలి భారత అథ్లెట్‌గా రికార్డు నెలకొల్పింది. తన కెరీర్‌పై పూర్తి సంతృప్తితో వీడ్కోలు నిర్ణయం తీసుకున్నట్టు దీప కర్మాకర్ వెల్లడించింది.

'సమతల పాదాలతో జిమ్నాస్ట్ కాలేవు అని ఐదేండ్ల వయసులో విన్న సంగతి ఇంకా గుర్తుంది. ఈ రోజు భారత్‌కు ప్రాతినిథ్యం వహిస్తూ ఎన్నో విజయాలు, ఘనతలు సాధించటం పట్ల ఎంతో గర్వంగా ఉంది. రియో ఒలింపిక్స్‌లో ప్రొడునోవ వాల్ట్ విన్యాసం ప్రదర్శించటం నా కెరీర్‌లో ప్రత్యేకం. నా కెరీర్‌లో అదో చిరస్మరణీయ సందర్భంగా మిగిలిపోతుంది. ఆసియా చాంపియన్‌షిప్స్ నా కెరీర్‌లో టర్నింగ్ పాయింట్. ఆ సమయంలో నా శరీరాన్ని మరింత కష్టపెట్టవచ్చని అనుకున్నాను. కానీ కొన్ని సార్లు మన బాడీ.. ఇక విశ్రాంతి తీసుకోవాల్సిన సమయం వచ్చిందనే సందేశం ఇస్తుంది. నా హృదయం అంగీకరించకపోయినా.. ఎన్నో ఆలోచనల అనంతరం జిమ్నాస్టిక్స్ నుంచి రిటైర్మెంట్ తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నాను. ఈ నిర్ణయం నాకు సులువైనది కాదు, కానీ ఇది సరైన సమయం' అని అగర్తల తార దీప కర్మాకర్ 'ఎక్స్' ఖాతాలో రాసుకొచ్చింది. జిమ్నాస్టిక్స్‌తో నా సంబంధం ఎప్పటికీ తెగిపోదు. జిమ్నాస్టిక్స్‌లో మెంటార్, కోచ్‌గా ఏదో రూపంలో పని చేస్తాను.

ఒసాక ఔట్

గాయంతో పోటీకి దూరం



టోక్యో : జపాన్ సూపర్‌స్టార్ నవొమి ఒసాక వెన్ను నొప్పి గాయంతో రానున్న జపాన్ ఓపెన్‌కు దూరం కానుంది. గత వారంలో జరిగిన చైనా ఓపెన్‌లో ఒసాక గాయపడింది. క్వార్టర్‌ఫైనల్లో వెన్నుగాయంతో విలవిల్లాడింది. దీంతో వచ్చే వారం ఆరంభం కానున్న జపాన్ ఓపెన్‌లో రాకెట్ పట్టుకోవటం లేదు. 'గాయంతో నవొమి ఒసాక టోర్నమెంట్‌లో పోటీపడటం లేదు' అని జపాన్ టెన్నిస్ సంఘం ఓ ప్రకటనలో తెలిపింది. అక్టోబర్ 14-20 వరకు టోక్యో వేదికగా జపాన్ ఓపెన్ జరుగనుంది.

సుకన్యకు సిల్వర్ మెడల్



హైదరాబాద్ : కామన్‌వెల్త్ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ పవర్‌లిఫ్టర్ తేజావత్ సుకన్య రజత పతకం సాధించింది. మహిళల 76 కేజీల విభాగంలో పోటీపడిన సుకన్య రెండో స్థానంలో నిలిచి సిల్వర్ సాధించింది. కర్ణాటక పవర్‌లిఫ్టర్ వైశాలి 112.5 కేజీలతో బంగారు పతకం సొంతం చేసుకోగా.. 107.5 కేజీలతో సుకన్య సిల్వర్ దక్కించుకుంది. ఐర్లాండ్ పవర్‌లిఫ్టర్ బెల్ ఎలెనా 100 కేజీలతో కాంస్యం సాధించింది.

భారత్ రాకపై పాక్ ధీమా

పీసీబీ చైర్మెన్ మోషిన్ నక్వీ ఆశాభావం



కరాచీ : ఐసీసీ మెన్స్ 2025 చాంపియన్స్ ట్రోఫీలో ఆడేందుకు భారత జట్టు పాకిస్థాన్ గడ్డపై అడుగు పెడుతుందనే ఆశావహ దృక్పథంతో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) కనిపిస్తోంది. పాకిస్థాన్ వేదికగా జరగాల్సిన మెగా ఈవెంట్ ఎటువంటి అవాంతరాలు లేకుండా పాక్ గడ్డపై జరుగుతుందనే విశ్వాసం ఉందని పీసీబీ చైర్మన్ మోషిన్ నక్వీ ఆశాభావం వ్యక్తం చేశారు. చాంపియన్స్ ట్రోఫీ వచ్చే ఏడాది ఫిబ్రవరి 19న ఆరంభం కావాల్సి ఉంది. మార్చి 9న టైటిల్ పోరు షెడ్యూల్ చేశారు. లాహోర్, రావల్పిండి, కరాచీలను వేదికలుగా ఎంపిక చేశారు. ద్వైపాక్షిక సంబంధాల కారణంగా 2008 నుంచి భారత జట్టు పాక్‌లో పర్యటించటం లేదు. పాక్ వేదికగా జరిగిన ఆసియా కప్‌లో సైతం భారత మ్యాచులను తటస్థ వేదికపై నిర్వహించారు. 'భారత జట్టు తప్పకుండా వస్తుంది. చాంపియన్స్ ట్రోఫీ పాకిస్థాన్‌లోనే జరుగుతుంది. స్టేడియాలు ఆతిథ్యానికి సిద్ధంగా ఉన్నాయి. చాంపియన్స్ ట్రోఫీ కోసం పాక్ స్టేడియాలను సైతం ఆధునికరిస్తుంది' అని నక్వీ తెలిపారు. ఏ విదేశీ పర్యటనకు వెళ్లేందుకైనా భారత ప్రభుత్వం అనుమతి తప్పనిసరి అని, పాక్‌లో పర్యటనకు సైతం ప్రభుత్వం ఆమోదం తెలిపటంపైనే ఆధారపడి ఉంటుందని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా ఇటీవల వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

శ్రీలంక చీఫ్ కోచ్‌గా సనత్ జయసూర్య



కొలంబో : శ్రీలంక క్రికెట్ దిగ్గజం, మాజీ కెప్టెన్ సనత్ జయసూర్య ఆ దేశ జాతీయ జట్టు చీఫ్ కోచ్‌గా నియమితులయ్యాడు. శ్రీలంక క్రికెట్ బోర్డు (ఎస్ఎల్‌సీ) ఈ మేరకు సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఇటీవల భారత్, ఇంగ్లాండ్, న్యూజిలాండ్‌తో సిరీస్‌ల్లో శ్రీలంక సూపర్ విక్టరీలు సాధించింది. ఈ మూడు సిరీస్‌లకు శ్రీలంక తాత్కాలిక కోచ్‌గా జయసూర్య కొనసాగారు. 27 ఏండ్ల తర్వాత భారత్‌పై ఓ వన్డే సిరీస్ విజయం, పదేండ్ల తర్వాత ఇంగ్లాండ్ గడ్డపై టెస్టు విజయం, న్యూజిలాండ్‌పై స్వదేశంలో టెస్టు సిరీస్ క్లీన్‌స్వీప్‌తో ద్వీపదేశంలో క్రికెట్ పూర్వ వైభవం దిశగా అడుగులే వేసింది. చీఫ్ కోచ్‌గా సనత్ జయసూర్య నియామకం అక్టోబర్ 1 నుంచి అమల్లోకి రానుంది. 2026, మార్చి 31 వరకు జయసూర్య చీఫ్ కోచ్‌గా కొనసాగేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు.

బీసీసీఐ గుర్తింపు కోసం లేఖ రాయండి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి అల్లీపురం వినతి



హైదరాబాద్ : తెలంగాణ జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధి కుంటుపడింది. ఏడు దశాబ్దాలుగా గ్రామీణ ప్రాంతాల్లో ఎటువంటి క్రికెట్ కార్యకలాపాలు నిర్వహించటం లేదు. గ్రామీణ క్రికెట్ అభివృద్ధికి కృషి చేస్తున్న తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ)కు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) గుర్తింపు లభిస్తే.. జిల్లాల్లో క్రికెటర్లకు న్యాయం చేకూరుతుంది. అందుకోసం టీడీసీఏకు గుర్తింపు ఇవ్వాలని బీసీసీఐకి లేఖ రాయాల్సిందిగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ఆ సంఘం అధ్యక్షుడు అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని కిషన్ రెడ్డి కార్యాలయంలో ఆయనకు వినతి పత్రం అందజేశాడు. టీడీసీఏ వినితి పట్ల కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని అల్లీపురం తెలిపాడు.

నవచిత్రం

అందరూ హాయిగా నవ్వుకునే సినిమా



సుహాస్, సంగీర్తన హీరో, హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'జనక అయితే గనక'. శిరీష్ సమర్పణలో దిల్‌రాజు ప్రొడక్షన్స్ పతాకంపై హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించారు. సందీప్ రెడ్డి బండ్ల డైరెక్ట్ చేశారు. ఈ సినిమా దసరా కానుకగా ఈనెల 12న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో బందర్‌లో చిత్రయూనిట్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను అత్యంత ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి మంత్రి కొల్లు రవీంద్ర ముఖ్య అతిథిగా విచ్చేశారు.

దిల్ రాజు మాట్లాడుతూ, 'సుహాస్‌లో మీలో ఒకడిగా ఉండేవాడు.. మీ జిల్లా వాడు. ఇంతింతై వటుడింతై అన్నట్టుగా ఎదిగాడు. డైరెక్టర్ సందీప్, సంగీర్తన ఇలా కొత్త వాళ్లతో దిల్ రాజు ప్రొడక్షన్స్‌లో నిర్మించిన ఈ చిత్రం పెద్ద హిట్ కాబోతోంది. సినిమా చూసి అందరూ నవ్వుకుని బయటకు వస్తారు. అందరినీ నవ్వించేలానే చిత్రం ఉంటుంది. పండుగ రోజు రిలీజ్ అవుతున్న ఈ చిత్రాన్ని చూసి అందరూ ఆనందిస్తారని ఆశిస్తున్నాను' అని అన్నారు. 'దిల్ రాజు ఎప్పుడూ కొత్త వాళ్లని ఎంకరేజ్ చేస్తూనే ఉంటారు. హన్షిత, హర్షిత్ నాకు ముందు నుంచీ సపోర్ట్ ఇస్తూనే ఉన్నారు. ప్రభాస్ 'సలార్' సినిమాకు రైటర్‌గా పని చేశాను. ఆయన మా మూవీ టీజర్‌ను రిలీజ్ చేశారు. సుహాస్ వల్లే ఈ సినిమా ఇంత వరకు వచ్చింది' అని డైరెక్టర్ సందీప్ బండ్ల చెప్పారు.

హీరోయిన్ సంగీర్తన మాట్లాడుతూ, 'నాకు ఈ సినిమాలో ఛాన్స్ ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థ్యాంక్స్. సుహాస్‌తో నటించడం ఆనందంగా ఉంది. విజయ్ బుల్గానిన్ సంగీతం అద్భుతంగా వచ్చింది. అందరూ మా సినిమాను చూసి సక్సెస్ చేయండి' అని అన్నారు.

ఈ సినిమా మీద నాకు చాలా నమ్మకం ఉంది. అందుకే ఈ మూవీతో డిస్ట్రిబ్యూటర్‌గా మారుతున్నా. ఓవర్సీస్‌లో ఈ సినిమాను డిస్ట్రిబ్యూట్ చేస్తున్నాను. నాకు ఇంత మంచి పాత్ర, సినిమాను ఇచ్చిన దర్శక నిర్మాతలకు థ్యాంక్స్. ఈ సినిమా చూస్తూ ఆద్యంతం నవ్వుతూనే ఉంటారు. నవ్వుతూనే థియేటర్ బయటకు వెళ్తారు.

- హీరో సుహాస్



యుఫోరియా గ్లింప్స్ విడుదల

గుణశేఖర్‌కు డైరెక్షన్‌లో 'యుఫోరియా' అనే యూత్‌ఫుల్ సోషల్ డ్రామాని గుణ హ్యాండ్‌మేడ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై నీలిమ గుణ నిర్మించారు. ఈ సినిమాకి విఘ్నేష్, లిఖిత, పృథ్వీ, శ్రీనిక ప్రధాన తారాగణం. భూమిక ముఖ్య పాత్రను పోషించారు. ఈ చిత్ర గ్లింప్స్‌ను నిర్మాత దిల్ రాజు, కేఎల్ దామోదర ప్రసాద్ సోమవారం రిలీజ్ చేశారు.

దిల్ రాజు మాట్లాడుతూ, 'గుణ శేఖర్ మొదటి చిత్రం 'లాఠీ'. అది చాలా ఫ్రెష్‌గా ఉంటుంది. ఆయన ఎన్నో సక్సెస్‌లు చూశారు. ఫెయిల్యూర్స్ కూడా చూశారు. ఫెయిల్యూర్స్ తరువాత వచ్చే సక్సెస్, ఆ సక్సెస్ ఇచ్చే కిక్కు వేరేలా ఉంటుంది. ఈ గ్లింప్స్ అదిరిపోయింది. నేటి ట్రెండ్‌కు తగ్గట్టుగా ఉంది. నైట్ లైఫ్, డ్రగ్స్ ఇలా ఇప్పటి తరానికి ప్రతీకగా ఉంది. ఈ చిత్రంలో అందరూ కొత్త వాళ్లే నటిస్తున్నారు. ఈ మూవీ పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. 'గుణ శేఖర్ వెర్సటైల్ దర్శకుడు. గ్లింప్స్ బాగుంది. విజువల్స్ బాగున్నాయి. ఆర్ఆర్ బాగుంది' అని కే ఎల్ దామోదర్ ప్రసాద్ చెప్పారు.

గుణశేఖర్ మాట్లాడుతూ, 'అంతా కొత్త వారితో ఈ చిత్రం చేశాను. తొంభై శాతం అంతా కొత్త వాళ్లే కనిపిస్తారు. కథను బేస్ చేసుకుని ఈ ఫిల్మ్ చేశాను. ఇప్పటి వరకు అరవై శాతం షూటింగ్ పూర్తయింది. యుఫోరియా అంటే ఏంటి? అనేది జనాలకు పరిచయం చేయడానికి ఈ గ్లింప్స్‌ను రిలీజ్ చేశాం. ఓ రెండు ఘటనలు నన్ను కదిలించాయి. ప్రతీ వారం అలాంటి ఘటనలే జరుగుతున్నాయి. ఇప్పుడున్న టైంలో ఇలాంటి కథను చెప్పాలని అనిపించింది. కథను రాస్తున్న కొద్దీ.. సమాజంలో ఇలాంటి ఘటనలు జరుగుతూనే వచ్చాయి. ఈ కథ అనుకున్న తరువాత నీలిమకు చెప్పాను. ఇప్పుడు ట్రెండ్‌కు తగ్గట్టుగా ఉందని నా కూతురు చెప్పింది. యూత్‌కు యూత్‌తో చెప్పాల్సిన కథ అని అన్నారు. వాళ్లు కూడా ఇన్‌పుట్స్ ఇచ్చారు. ఇందులో కొత్త వాళ్లైనా సినిమాటిక్‌గా కాకుండా అందరూ రియలిస్టిక్‌గా నటించారు. యూత్, పేరెంట్స్ మధ్య జరిగే సంఘర్షణ నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుంది. ఇప్పుడున్న యూత్ మైండ్ సెట్‌కు తగ్గట్టుగా సినిమా చాలా కొత్తగా ఉండబోతోంది. ఇప్పుడు కథ బాగుంటే ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. ఇది చాలా పెద్ద కమర్షియల్ సక్సెస్ అవుతుందని నమ్మకం ఉంది' అని అన్నారు.

తండ్రీకొడుకుల ముక్కోణ ప్రేమకథ

సుధీర్ బాబు తాజాగా 'మా నాన్న సూపర్ హీరో' సినిమాతో అలరించ బోతున్నారు. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సిఏఎం ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి వి సెల్యులాయిడ్స్ బ్యానర్‌పై సునీల్ బలుసు నిర్మిస్తున్నారు. ఈనెల 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో సుధీర్ బాబు మీడియాతో ముచ్చటించారు.



సుధీర్ బాబు

- ఈ సినిమాలో కాన్‌ఫ్లిక్ట్ పాయింట్ బాగా సెట్ అయింది. ఇద్దరు తండ్రులు- ఒక కొడుకు చుట్టూ తిరిగే కథ ఇది. ముఖ్యంగా దీన్ని ఇద్దరు ఫాదర్స్, ఒక కొడుకు మధ్య నడిచే ట్రయాంగిల్ లవ్ స్టోరీ అని చెప్పొచ్చు. ఇది యూనివర్సల్ పాయింట్. తప్పకుండా అందరికీ కనెక్ట్ అవుతుందని నమ్ముతున్నాను.
- దర్శకుడు అభిలాష్ చేసిన 'లూజర్' సిరీస్ చూశాను. అభిలాష్ ఈ కథ చెప్పినప్పుడు చాలా ఫ్రెష్‌గా అనిపించింది. ఇది పర్‌ఫెక్ట్ ఫ్యామిలీ ఫిల్మ్. రేర్ స్టొరీ. డెఫినెట్‌గా ప్రేక్షకులకు నచ్చుతుంది. నా కెరీర్‌లో అత్యంత సంతృప్తికరమైన సినిమా ఇది. ఫస్ట్ డే నుంచే యునానిమస్‌గా ప్రేక్షకులు, క్రిటిక్స్ నుంచి పాజిటివ్ టాక్ వస్తుందనే నమ్మకం ఉంది.
- మహేష్‌కి మొదట రఫ్ కట్ పంపించాను. చూసి, లుకింగ్ గుడ్ అన్నారు. ఫైనల్ ట్రైలర్ పంపించిన తర్వాత.. చూసి చాలా అప్రిషియేట్ చేశారు. హార్ట్ టచ్చింగ్ అన్నారు.
- ప్రస్తుతం 'జటాధర' చేస్తున్నాను. కాన్సెప్ట్ పరంగా ఇది వెరీ బిగ్ స్కేల్ మూవీ. ప్రీ ప్రొడక్షన్ జరుగుతోంది. అలాగే రాహుల్ రవీంద్రన్‌తో ఓ సినిమా ఉంటుంది.

అమ్మోరే మురిసేలా ఆడు..



కిరణ్ అబ్బవరం

హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న భారీ పీరియాడిక్ థ్రిల్లర్ 'క'. ఈ సినిమాలో నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు.

చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ పై చింతా గోపాలకృష్ణ రెడ్డి భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్‌తో నిర్మిస్తున్నారు. దర్శక ద్వయం సుజీత్, సందీప్ విలేజ్ బ్యాక్‌డ్రాప్ యాక్షన్ థ్రిల్లర్ కథతో ఈ సినిమాను రూపొందిస్తున్నారు.

ఈ సినిమాను త్వరలో తెలుగుతో పాటు తమిళం, మలయాళ, కన్నడలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకు రాబోతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఈ సినిమా నుంచి 'మాస్ జాతర' సాంగ్‌ని రిలీజ్ చేశారు.

ఈ పాటను సామ్ సీఎస్ మంచి బీట్‌తో కంపోజ్ చేశారు. సనాపాటి భరద్వాజ పాత్రుడు లిరిక్స్ అందించగా, దివాకర్, సామ్ సీఎస్, అభిషేక్ ఏఆర్ పాడారు. 'ఆడు ఆడు ఆడు ఆడు అమ్మోరే మురిసేలా ఆడు..' అంటూ పూనకాలు తెప్పించేలా సాగుతుందీ పాట. పొలాకి విజయ్ ది బెస్ట్ కొరియోగ్రఫీ చేశారు. ఈ పాటలో హీరో కిరణ్ అబ్బవరం మాస్ ఎనర్జిటిక్స్ స్టెప్స్ హైలైట్ అవుతున్నాయి. ఆయనతో పాటు హీరోయిన్స్ తన్వీరామ్, నయన్ సారిక అదిరే డ్యాన్స్‌లు చేశారు. థియేటర్‌లో ఈ పాట ఆడియెన్స్‌తో స్టెప్స్ వేయించనుంది. ఈ సినిమాను తెలుగులో ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి, మలయాళంలో హీరో దుల్కర్ సల్మాన్ తన వేఫరర్ ఫిలింస్ పై రిలీజ్ చేస్తున్నారు.

వినూత్న కథతో పొట్టేల్

యువ చంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల లీడ్ రోల్స్‌లో సాహిత్ మోత్కూరి డైరెక్ట్ చేస్తున్న రూరల్ యాక్షన్ డ్రామా 'పొట్టేల్'. ఈ చిత్రంలో అజయ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. రీసెంట్‌గా రిలీజైన అజయ్ ఫస్ట్‌లుక్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. నిసా ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై నిశాంక్ రెడ్డి కుడితి, ప్రజ్ఞ సన్నిధి క్రియేషన్స్‌పై సురేష్ కుమార్ సడిగే ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ఈ చిత్రాన్ని ఈనెల 25న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేస్తున్నట్టు మేకర్స్ అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు. రిలీజ్ డేట్ పోస్టర్ యువ చంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల, వారి కుమార్తె ఇంటెన్స్ ఫేస్‌లతో ప్రజెంట్ చేసింది. మరో పార్ట్‌లో హీరోని గ్రామస్తులు వెంబడిస్తున్నట్టు కనిపించడం ఆసక్తికరంగా ఉంది. ఈ సినిమా పాటలు ఇప్పటికే సూపర్ హిట్ అయ్యాయి. టీజర్ స్ట్రాంగ్ బజ్‌ని క్రియేట్ చేసింది.

ప్రియాంక శర్మ, తనస్వి చౌదరి, నోయల్ సీన్, ఛత్రపతి శేఖర్, శ్రీకాంత్ అయ్యంగార్, జీవన్, రియాజ్, విక్రమ్ తదితరులు నటిస్తున్న దీనికి నిర్మాతలు - నిశాంక్ రెడ్డి కుడితి, సురేష్ కుమార్ సడిగె, సంగీతం- శేఖర్ చంద్ర, సినిమాటోగ్రాఫర్ - మోనిష్ భూపతి రాజు, ఎడిటర్ - కార్తీక శ్రీనివాస్, లిరిక్స్ - కాసర్ల శ్యామ్, ఆర్ట్ డైరెక్టర్ - నార్ని శ్రీనివాస్, ఫైట్స్ - పృథ్వీ, రబిన్ సుబ్బు.



అనన్య నాగళ్ల

ఆదిపర్వం రిలీజ్‌కి రెడీ

రావుల వెంకటేశ్వర్ రావు సమర్పణలో అన్విక ఆర్ట్స్ పతాకంపై ఏఐ ఎంటర్‌టైన్‌మెంట్స్ కలయికలో నిర్మించిన చిత్రం 'ఆదిపర్వం'.

ఈ సినిమాలో మంచు లక్ష్మి ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. మరో కీలక పాత్రను ఆదిత్యం ఓం పోషిస్తున్నారు. ఎర్రగుడి నేపథ్యంలో అమ్మవారి చుట్టూ అల్లుకున్న పీరియాడిక్ ప్రేమకథతో గ్రాఫిక్స్ ప్రధానంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు దర్శకుడు సంజీవ్ మేగోటి. ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఈ నెల 31న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. మంచు లక్ష్మి పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రంలో ఆమె క్యారెక్టర్ ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేశారు. ఈ క్యారెక్టర్ ఫస్ట్ లుక్ ఆసక్తికరంగా ఉండి ఆకట్టుకుంటోంది. ఇప్పటిదాకా మంచు లక్ష్మి చేయని, ఓ సరికొత్త పాత్రలో ప్రేక్షకులను అలరించబోతున్నారు.

దర్శకుడు సంజీవ్ మేగోటి మాట్లాడుతూ, 'అన్విక ఆర్ట్స్, ఏఐ ఎంటర్‌టైన్‌మెంట్స్ సహకారంతో నేను అనుకున్న స్థాయిలో ఒక గొప్ప చిత్రంగా మలిచానన్న సంతృప్తి ఉంది. మంచు లక్ష్మి, ఆదిత్యం ఓం, శివ కంఠమనినేని, ఎస్తేర్ పాత్రలకు జనం నీరాజనం పలుకుతారు. 1974-90 మధ్య కాలంలో జరిగిన యదార్థ ఘటనల సమాహారంగా ఈ సినిమాను రూపొందించాను. అమ్మోరు, అరుంధతి చిత్రాల తరహాలో దుష్టశక్తికి, దైవశక్తికి మధ్య జరిగే యుద్ధమే ఈ సినిమా. మా మూవీలో గ్రాఫిక్స్ హైలైట్ అవుతాయి' అని తెలిపారు.




మంచు లక్ష్మీ

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

ఆరో రోజూ అమ్మకాల వెల్లువ

- సెన్సెక్స్ 638 పాయింట్ల పతనం
- వీడని యుద్ధ భయాలు
- నేడు తెరుచుకోనున్న చైనా మార్కెట్లు



ముంబయి : వరుసగ ఆరో రోజూ దలాల్ స్ట్రీట్‌లో అమ్మకాల వెల్లువ కొనసాగింది. సోమవారం ఉదయం ఆశజనకంగా లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. ఓ దశలో అమ్మకాలు వెల్లువెత్తడంతో బీఎస్ఇ సెన్సెక్స్ 962 పాయింట్ల పతనాన్ని చవి చూసింది. తుదకు 638 పాయింట్లు లేదా 0.78 శాతం క్షీణించి 81,050కు పడిపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 218 పాయింట్లు లేదా 0.87 శాతం తగ్గి 24,795 వద్ద నమోదయ్యింది. ప్రధానంగా ఎఫ్ఐఐల అమ్మకాలు, అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడం, ఇజ్రాయిల్-ఇరాన్ మధ్య వీడని ఉద్రిక్తతల భయాలు తదితర కారణాలతో మార్కెట్లు నేల చూపులు చూశాయి. ప్రధాన స్టాక్స్ అయినా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ షేర్ 2.09 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ 1.17 శాతం పతనం కావడంతో మార్కెట్లపై మరింత ఒత్తిడి చోటు చేసుకుంది. ఎన్‌టిపిసి, యాక్సిస్ బ్యాంక్, ఎల్అండ్‌టి, అదానీ పోర్ట్స్ షేర్లు అధికంగా 4 శాతం వరకు విలువ కోల్పోయిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు ఐటిసి, భారతీ ఎయిర్‌టెల్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, ఇన్ఫోసిస్ షేర్లు లాభపడిన వాటిలో ఉన్నాయి. బిఎస్ఇలో స్మాల్ క్యాప్ సూచీ 3.86 శాతం, మిడ్ క్యాప్ 2.61 శాతం చొప్పున నష్టపోయాయి.

తరలిన రూ.37 వేల కోట్ల ఎఫ్ఐఐలు

గడిచిన ఆరు సెషన్లలో భారత స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత మదుపర్లు రూ.37,000 కోట్ల విలువ చేసే ఎఫ్ఐఐలను తరలించుకుపోయారు. ఆర్థిక వృద్ధి కోసం చైనా కీలక నిర్ణయాలు చేపట్టడమే ఇందుకు ప్రధాన కారనమని నిపుణులు భావిస్తున్నారు. ఇది భారత మార్కెట్లపై తీవ్ర ప్రభావం పడింది. ఆరు సెషన్లలో సెన్సెక్స్ 4,786 పాయింట్లు క్షీణించింది.

చైనా మార్కెట్లపైనే అందరి చూపు

వారం తర్వాత చైనా స్టాక్ మార్కెట్లు తెరుచుకుంటున్నాయి. చైనా నేషనల్ డే ఉత్సవాల సందర్భంగా అక్టోబర్ 1 నుంచి 7వ తేది వరకు అక్కడి ప్రభుత్వం గోల్డెన్ వీక్ హాలిడేను ప్రకటించింది. దీంతో గడిచిన వారం రోజులుగా చైనా మార్కెట్లు పని చేయలేదు. మంగళవారం తిరిగి మార్కెట్లు ప్రారంభం కానున్నాయి. ఇజ్రాయిల్- ఇరాన్ పరిణామాల మధ్య ప్రపంచంలోని ఇన్వెస్టర్ల చూపు చైనా మార్కెట్లపై పడింది. ఇటీవల చైనా ప్రభుత్వం ఆ దేశ వృద్ధికి కీలక విధానాలను ప్రకటించింది. దీంతో విదేశీ సంస్థాగత మదుపర్లు ఇతర దేశాల నుంచి చైనాకు పెట్టుబడులను భారీగా తరలిస్తున్నాయి. నేటి మార్కెట్లు ఎలా ఉండొచ్చోనని ఇన్వెస్టర్లు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

హీరో మోటార్స్ ఐపిఒ ప్రతిపాదన ఉపసంహరణ

హీరో గ్రూపునకు చెందిన విడిభాగాల తయారీ సంస్థ హీరో మోటార్స్ తన ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ) ప్రతిపాదనలను ఉపసంహరించుకుంది. ఈ ఇష్యూ ద్వారా రూ.900 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఐపిఒను ఉపసంహరించుకోవడానికి గల కారణాలను మాత్రం వెల్లడించలేదు.

97 శాతం స్పామ్ కాల్స్ బ్లాక్

- ఎయిర్‌టెల్ కొత్త ఏఐ సిస్టమ్‌తో చెక్
- తెలుగు రాష్ట్రాల సీఈవో వెల్లడి

నవ తెలంగాణ - హైదరాబాద్



తమ వినియోగదారులను స్పామ్ కాల్స్, మెసేజ్‌ల నుంచి రక్షించడానికి కొత్తగా ఎఐ ఆధారిత స్పామ్ డిటెక్షన్ సిస్టమ్‌ను అభివృద్ధి చేశామని భారతీ ఎయిర్‌టెల్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ) శివన్ భార్గవ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తమ వినియోగదారుల అన్ని పరికరాల్లో ఆటోమేటిక్ యాక్టివేషన్‌తో ఉచితంగా దీన్ని అందిస్తున్నామన్నారు. దీన్ని ప్రారంభించిన 10 రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 12.2 కోట్ల స్పామ్ కాల్స్, 23 లక్షల స్పామ్ ఎస్ఎంఎస్ మెసేజ్‌లను విజయవంతంగా గుర్తించి బ్లాక్ చేశామన్నారు. దీనికి ఎలాంటి యాప్ డౌన్‌లోడ్ అవసరం లేదన్నారు. ఉచితంగా ఆటోమెటిక్‌గా ఈ సేవలు అందుతాయన్నారు. స్మార్ట్‌ఫోన్లతో ఇటీవల మోసాలకు గురయ్యే ప్రమాదం విపరీతంగా పెరగడంతో ఈ క్లిష్టమైన సమస్యను చురుకుగా పరిష్కరించడానికి తాము ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. రెండు రాష్ట్రాల్లో తమకు 3 కోట్ల పైగా ఖాతాదారులున్నారని తెలిపారు.

కమెడియన్ ట్వీట్‌కు ఓలా షేర్లు పతనం

ముంబయి : ఓలా ఎలక్ట్రిక్ సర్వీసు సెంటర్ల కొరతపై కమెడియన్ కునాల్ క్రమా చేసిన ట్వీట్ ఆ కంపెనీ షేర్లను భారీగా పడేసింది. ఓలా పేలవ సేవలు, సర్వీసింగ్ సెంటర్ల ముందు పెద్ద ఎత్తున పోగుబడిన వాహనాల ఫోటోను ఎక్స్ వేదికలో కునాల్ పంచుకున్నారు. ఈ అధ్వాన పరిస్థితుల్లో భారతీయులు ఇవిలను ఎలా ఉపయోగించుకోగలరని మంత్రి నితిన్ గడ్కరీకి ట్యాగ్ చేశారు. దీనిపై ఓలా సిఇఒ భవిష్ అగర్వాల్ తీవ్రంగా స్పందించారు. ఇది కాస్తా ఇద్దరి మధ్య మాటల యుద్ధానికి దారి తీసింది. ఆ ప్రభావం కంపెనీ షేర్లపై గట్టిగా పడింది. సోమవారం బిఎస్ఇలో ఓలా షేర్ 9.4 శాతం పతనమై రూ.89.7కు పడిపోయింది. ఈ కంపెనీల్లో గరిష్ఠ స్థాయిలో షేర్లు కొనుగోలు చేసిన వారు భారీ నష్టాలను చవి చూస్తున్నారు. ఆగస్టులో పబ్లిక్ ఇష్యూకు వచ్చిన రోజుల్లో రూ.70 వద్ద లిస్టింగ్ కాగా.. అదే నెల 20న రూ.157కు చేరింది. ఈ ధర వద్ద కొనుగోలు చేసిన ఇన్వెస్టర్లు ప్రస్తుతం ఏకంగా 43 శాతం విలువ కోల్పోయినట్లయ్యింది.

సులభంగా ద్విచక్ర వాహన రుణాలు : శ్రీరామ్ ఫైనాన్స్

నవ తెలంగాణ - హైదరాబాద్

శ్రీరామ్ గ్రూపునకు చెందిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ కొత్తగా "టూ వీలర్ లోన్ ఎలిజిబిలిటీ వోచర్"ను ప్రారంభించినట్లు ప్రకటించింది. "టూ-వీలర్ లోన్ ఎలిజిబిలిటీ వోచర్‌ను పరిచయం చేయడం మాకు గర్వకారణం, పండుగ సీజన్‌లో, శ్రీరామ్ ఫైనాన్స్ తెలంగాణలోనే అతిపెద్ద ద్విచక్ర వాహన డీలర్‌గా ఉంది. తాము ఎంచుకున్న ద్విచక్రవాహనం కోసం రుణం పొందేందుకు అర్హత ఉందో లేదో చెక్ చేసుకోవచ్చని చాలా మందికి తెలియదు. కస్టమర్‌లు టూ-వీలర్ లోన్ ఎలిజిబిలిటీ వోచర్‌తో వారి రుణ అర్హతను ముందుగా ధృవీకరించవచ్చు. ఇది సులభంగా ద్విచక్ర వాహన రుణాన్ని పొందేందుకు వీలు కల్పిస్తుంది." అని శ్రీరామ్ ఫైనాన్స్ సిఇఒ వైఎస్ చక్రవరి పేర్కొన్నారు.

ఫరెవర్ న్యూకు అంబాసిడర్‌గా త్రిప్తి డిమ్రీ



హైదరాబాద్ : మెల్‌బోర్న్‌కు చెందిన ప్రీమియం మహిళల ఫ్యాషన్ బ్రాండ్ ఫరెవర్ న్యూ కొత్తగా బాలీవుడ్ నటి త్రిప్తి డిమ్రీని తన గ్లోబల్ అంబాసీడర్‌గా నియమించుకుంది. దీంతో త్రిప్తి ఇప్పుడు భారత్ సహా ఆస్ట్రేలియా, కెనడా, దక్షిణాఫ్రికా, యూరప్‌తో సహా ప్రధాన మార్కెట్‌లలో ఫరెవర్ న్యూకు ప్రాతినిధ్యం వహించనుందని ఫరెవర్ సంస్థ తెలిపింది.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

ఎంసెట్, నీట్ కోచింగ్ ఇచ్చే విధంగా చర్యలు : బీసీ సంక్షేమ శాఖ సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



తమ ప్రభుత్వం విద్యకు ప్రథమ ప్రాధాన్యతనిస్తోందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని కొమురంభీమ్ ఆదివాసీ భవన్‌లో నిర్వహించిన బీసీ సంక్షేమ శాఖ విస్తృత స్థాయి సమీక్షా సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి బుర్ర వెంకటేశంతో కలిసి మంత్రి దిశా నిర్దేశం చేశారు. క్షేత్ర స్థాయిలో గురుకులాల పనితీరుపై వారి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. రాష్ట్రంలో ఇంటర్నేషనల్ స్కూళ్లకి మించి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లు రాబోతున్నాయనీ, ఇందు కోసం ప్రభుత్వం ఈ ఏడాదికి రూ. ఐదు వేల కోట్లు కేటాయించనుందని తెలిపారు. బీసీ గురుకులాలు రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉండాలనీ, 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. అధికారుల పనితీరు మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. మెస్ చార్జీల పెంపు అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామనీ, గ్రీన్ ఛానెల్ ద్వారా బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చారు.

వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రస్తుతం మోడల్ స్కూళ్లలో అమలవుతున్న మాదిరి గురుకులాల్లో కూడా పదో తరగతి ఉత్తీర్ణత కాగానే నేరుగా ఇంటర్మీడియట్‌కి వెళ్ళేలా విద్యాశాఖకు మంత్రి ఈ సందర్భంగా ఆదేశాలు ఇచ్చారు. గురుకులాల్లో ఇంటర్మీడియట్‌లో కంప్యూటర్‌తో పాటు అన్ని కోర్స్‌లు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఎంసెట్ ,నీట్ కోచింగ్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులకు సూచించారు. గురుకులాల్లో ఏఎన్ఎంలు విధిగా విద్యార్థుల ఎత్తు ,బరువులు కొలవడంతో పాటు రక్తహీనత సమస్యలను పరిశీలించాలని సూచించారు. గురుకుల సమస్యలపై ఎమ్మెల్యే ,ఎంపీ, ఆ జిల్లా మంత్రి, ,ఎమ్మెల్సీలు వారి నిధుల నుంచి కేటాయించేలా కలెక్టర్ దృష్టికి తీసుకుపోవాలని సూచించారు. దసరా సెలవుల అనంతరం ఈనెల 15 నుంచి 31 లోపు ప్రతి గురుకులాల్లో పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ ఏర్పాటు చేయాలనీ, వారి నుంచి సలహాలు సూచనలు తీసుకుని ఫీడ్ బ్యాక్ అందించాలన్నారు. దసరా పండగ లోపు రెంటెడ్ గురుకుల భవనాలకు 50 శాతం అద్దె చెల్లిస్తామనీ, యజమాన్యాలతో మాట్లాడి భవనాల్లో మౌలిక వసతులు కల్పించేలా చూడాలని ఆదేశించారు.

విద్యార్థులు క్రీడలు , కల్చరల్ యాక్టివిటీస్ , ఫిజికల్ ఫిట్నెస్ , వ్యాసరచన పోటీలు ఏదైనా అంశంపై డిబెట్‌లు ,సైన్స్ ఇన్నోవేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. స్టడీ సర్కిళ్ల ద్వారా మోటివేషన్ స్పీచ్ ఏర్పాటు చేయాలనీ, రికార్డు ఆన్‌లైన్ క్లాస్‌లు నిర్వహించాలన్నారు. విద్యార్థుల సమస్యలు తెలుసుకోవటానికి ప్రతి గురుకులంలో బాక్స్ ఏర్పాటు చేసి ఆర్సీఓలు పరిశీలించాలని సూచించారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలకు స్థల పరిశీలన చేయాలనీ, త్వరలోనే భవనాల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అన్ని గురుకులాల్లో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. తమ ప్రభుత్వం రూ. 1100 కోట్లతో 25 వేల పాఠశాలలకు మౌలిక వసతులు కల్పించిందని గుర్తు చేశారు. 19 వేల మందికి ప్రమోషన్లు ,35 వేల మందికి బదిలీలు చేపట్టినట్టు మంత్రి వెల్లడించారు . ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాల్లో నియామకాలు పూర్తి చేశామన్నారు. దశాబ్ద కాలంగా ఎదురు చూస్తున్న మోడల్ స్కూల్ సిబ్బంది బదిలీల ప్రక్రియ కూడా పూర్తయిందని తెలిపారు. గురుకులాల్లో చదువుతున్న 8,9,10 తరగతి విద్యార్థులకు రెడ్‌క్రాస్, ఎన్‌సీసీ, ఎన్ఎస్-ఎస్, స్కౌట్స్ అండ్ గైడ్‌లలో ప్రతి విద్యార్థి రెండిటిలో ఉండేలా చూడాలని బుర్ర వెంకటేశం సూచించారు. సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయాదేవి, గురుకుల సెక్రటరీ సైదులు , ఎంబీసీ కార్పొరేషన్ ఎమ్‌డీ అలోక్ కుమార్, బీసీ కార్పొరేషన్ ఎమ్‌డీ మల్లయ్య బట్టు, అడిషనల్ డైరెక్టర్ చంద్ర శేఖర్, జాయింట్ డైరెక్టర్ సంధ్య, నాయి బ్రాహ్మణ ఎమ్‌డీ ఇందిరా ,బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సాహితీ' లక్ష్మీనారాయణకు ఐదు రోజులు ఈడీ కస్టడీ

- నాంపల్లి కోర్టు ఆదేశాలు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

వందల కోట్ల రూపాయల మేర బాధితులకు కుచ్చుటోపీ తొడిగిన సాహితీ ఇన్‌ఫ్రా ఎండీ లక్ష్మీనారాయణను ఐదు రోజుల పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీకి ఇస్తూ నాంపల్లి కోర్టు సోమవారం ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 14 నుంచి 18 వరకు కస్టడీలోకి తీసుకొని విచారించటానికి ఈడీకి కోర్టు అనుమతించింది. ప్రీలాంచ్ రియల్ ఎస్టేట్ స్కీం పేరిట తెలంగాణ, ఏపీలకు చెందిన అనేక మంది బాధితుల నుంచి దాదాపు రూ.3 వేల కోట్ల మేర డిపాజిట్లను సేకరించి లక్ష్మీనారాయణ బోర్డు తిప్పేసినట్టు ఆరోపణలున్నాయి. దీనిపై ఇప్పటికే హైదరాబాద్ నగర నేర పరిశోధక విభాగంలో కేసులు నమోదు కాగా.. ఈ కేసు ఆధారంతోనే ఈడీ కూడా లక్ష్మీనారాయణపై మనీలాండరింగ్ చట్టం కింద కేసుల ను నమోదు చేసి, ఇటీవలే నిందితుడిని అరెస్ట్ చేసిన విషయం విదితమే. కాగా, లక్ష్మీనారాయణ నుంచి అతని మోసపూరిత వ్యాపారాలకు సంబంధించి అనేక వివరాలు సేకరించాల్సి ఉన్నదనీ, అందుకు తదుపరి విచారణ చేపట్టటానికి తమ కస్టడీకి ఇవ్వాలంటూ ఈడీ అధికారులు నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌ను పరిశీలించిన న్యాయమూర్తి ఐదు రోజుల పాటు లక్ష్మీనారాయణను కస్టడీకి ఇస్తూ ఆదేశాలిచ్చారు.

వికలాంగుల సహకార సంస్థలో రూ.40 కోట్ల అవినీతి

- మాజీ మంత్రులు హరీశ్‌రావు, కొప్పుల అండతో నిధుల మళ్లింపు
- పదేండ్ల అక్రమాలపై విజిలెన్స్, ఏసీబీ విచారణ : వికలాంగుల సహకార సంస్థ చైర్మెన్ ముత్తినేని వీరయ్య

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



వికలాంగుల సహకార సంస్థలో గడిచిన పదేండ్లలో దాదాపు రూ.40 కోట్ల నిధులు దుర్వినియోగమయ్యాయని ఆ సంస్థ చైర్మెన్ ముత్తినేని వీరయ్య ఆరోపించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయం మీడియా పాయింట్ వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గత సర్కార్ హయంలో వికలాంగుల సంక్షేమ శాఖ, సహకార సంస్థలో జరిగిన అవినీతి, అక్రమాలపై విజిలెన్స్, ఏసీబీ విచారణ ఆదేశిస్తామని వెల్లడించారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, కొప్పుల ఈశ్వర్, సంస్థ మాజీ చైర్మెన్ వాసుదేవ రెడ్డి అండతో అధికారులు నిధులను దారి మళ్లిండంతో పాటు బినామి ఎకౌంట్లతో సొంతానికి వాడుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో 45 వేల మంది లబ్దిదారులకు పరికరాలు అందించారంటూ వారు చెబుతున్న లెక్కలకు వాస్తవ లెక్కలకు పొంతన లేదని చెప్పారు. ఏబీఎంఎస్ పోర్టల్‌లో గానీ, సంస్థ అధికారిక పోర్టల్‌లో గాని లబ్దిదారుల జాబితాను అప్‌లోడ్ చేయలేదని అన్నారు. ఇద్దరు మంత్రులు తమ సొంత నియోజకవర్గంలో బినామి పేర్లతో సంస్థ నిధులను లూటీ చేశారని విమర్శించారు. ఫలితంగా నిజమైన వికలాంగులకు అన్యాయం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. శిక్షణ కేంద్రాలను చడిచప్పుడు కాకుండా మూసేశారనీ, అందులోనూ కోట్ల రూపాయల నిధులు దుర్వినియోగమయ్యాయని చెప్పారు.2014-15 ఆర్థిక సంవత్సరంలో రూ. 5.54 కోట్ల క్లోజింగ్ బ్యాలెన్స్‌ను ఆడిట్ రిపోర్టులో చూపించగా, బ్యాంక్ ఖాతా ఎకౌంట్‌లో మాత్రం రూ.1.69 కోట్ల క్లోజింగ్ బ్యాలెన్స్ ఉందని పేర్కొన్నారు. ఈ ఒక్క ఏడాదిలోనే దాదాపు రూ.4 కోట్ల నిధులు దారి మళ్లాయని అన్నారు. 2014 నుంచి 2023 వరకు సంస్థకు కేటాయించిన నిధులు, వ్యయంపై ఇప్పటి వరకు అధికారులు సమాదానం చెప్పడం లేదన్నారు. ఈ విషయంపై సోషల్ ఆడిట్‌కూడా నిర్వహిస్తామని చెప్పారు. సంస్థకు ఐఏఎస్ అధికారి జేఎండీగా ఉండాల్సి ఉండగా గ్రూప్ 2 అధికారిని పైరవీతో నియమించారని అన్నారు. ఇందుకు సంబంధించి జేఎడీ ప్రమోషన్ ఇవ్వాల్సి ఉండగా,ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ ద్వారా ఇచ్చిన ఉత్తర్వులు సీఎంవో తిరస్కరించిందని గుర్తు చేశారు. సంస్థలో జరిగిన అవినీతిపై విచారణ చేయాలని ఆడిట్ రిపోర్ట్ సిఫారసు చేసిందని అన్నారు. గత సర్కార్ హయాంలో జరిగిన అవినీతి అక్రమాలకు పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఇందులో ఎవరి ప్రమేయమున్నా వదిలి పెట్టబోమని ఈ సందర్భంగా వీరయ్య హెచ్చరించారు.

రుణమాఫీపై చెప్పిందేంటి? చేసిందేంటి?

- వాస్తవాలపై బహిరంగ చర్చకు సిద్ధమా : ఏలేటి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రుణమాఫీ అంశంపై కాంగ్రెస్ చెప్పిందేంటి, చేసిందేంటి అనే వాస్తవాలపై బహిరంగ చర్చకు సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధమా అని బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సవాల్ విసిరారు. చర్చకు సిద్ధమైతే తేదీ, వేదిక చెప్పాలని కోరారు. బహిరంగ చర్చ వద్దనుకుంటే రుణమాఫీతో పాటు రైతులకిచ్చిన ఇతర హామీలపై చర్చించేందుకు తక్షణమే అసెంబ్లీని సమావేశ పరచాలని డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి 13 అంశాలతో ఆయన లేఖ రాశారు. పంటరుణాల మాఫీపై ప్రధాని మోడీకి వాస్తవాలను విస్మరించి లేఖరాయడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. మహారాష్ట్ర ఎన్నికల్లో లబ్దిపొందేందుకు కాంగ్రెస్ డ్రామాలు ఆడుతున్నదని ఆరోపించారు. ఒకే దఫాలో రూ.2 లక్షలలోపు రుణమాఫీ చేస్తామని ఎన్నికల ప్రచార సభలో రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చిన విషయం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. మాఫీకి రూ.49,500 కోట్లు అవసరమని ఎస్ఎల్బీసీ చెప్పిందనీ, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రూ.31 వేల కోట్లు అవసరమని చెప్పి రూ.17,869 కోట్లను మాత్రమే మాఫీ చేసి చేతులు దులుపుకున్నదని విమర్శించారు. ప్రభుత్వంపై ఆర్థిక భారాన్ని తగ్గించుకునేందుకు కుటుంబ నిర్ధారణ చేసే రేషను కార్డు లేదనో, ఆధార్ కార్డులో తప్పు ఉందనో, ఇంకా ఏవేవో సాంకేతిక కారణాలతో లక్షలాది రైతులకు రాష్ట్ర సర్కారు రుణమాఫీ ఎగ్గొట్టింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో సగం మందికిపైగా రుణమాఫీ జరగలేదని తెలిపారు. 50 రోజులైనా ఇంకా రుణ మాఫీ కావాల్సిన వారి వివరాలను అధికారులు సేకరించకపోవడం సర్కారు వైఫల్యం కాదా? అని నిలదీశారు.

అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ రేవంత్ రెడ్డి

- బాల్క సుమన్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ 10 నెలల పాలనలో ఒక్క నోటిఫికేషన్ ఇవ్వకుండా అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్‌లాగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శించారు. సోమవారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తామిచ్చిన నోటిఫికేషన్లకు రేవంత్ రెడ్డి ఈవెంట్ మేనేజ్ మెంట్ లాగా నియామకపత్రాలు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రతి ఏటా నోటిఫికేషన్లు, 18 ఏండ్లు నిండిన ఆడపిల్లలకు ఎలక్ట్రిక్ స్కూటీలు, మొదటి ఏడాది 2 లక్షల ఉద్యోగాల భర్తీ, ప్రభుత్వ రంగంలో ఒక లక్ష ఉద్యోగాలు అంటూ నమ్మించి మోసం చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలోనే 2.27 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చినట్టు తెలిపారు

భద్రతకు ప్రాధాన్యత ఇవ్వండి

- అధికారులకు ద.మ.రైల్వే జీఎమ్ ఆదేశాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రైలు ప్రయాణం, కార్యకలాపాల నిర్వహణలో సురక్షిత పని విధానాలను ఖచ్చితంగా పాటిస్తూ, భద్రతకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అన్నారు. సోమవారంనాడిక్కడి రైలు నిలయంలో ఆయన జోన్ ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగర్వాల్‌కూడా పాల్గొన్నారు. సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్, గుంటూరు, నాందేడ్ డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్‌లు వీడియో కాన్ఫరెన్స్‌లో భాగస్వాములు అయ్యారు. భద్రతకు సంబంధించిన సిగ్నలింగ్, ఇంజినీరింగ్ పరికరాలు, స్టేషన్ ఆస్తులు, వాటి పనితీరుపై క్షేత్రస్థాయి తనిఖీలు చేయాలని ఈ సందర్భంగా జీఎం చెప్పారు. రన్నింగ్ స్టాఫ్ పనివేళలు సమీక్షించాలనీ, సిబ్బందిపై అధిక పని వేళలను తగ్గించాలన్నారు.

771 ప్రత్యేక రైళ్ళు

పండుగ సీజన్ల సందర్భంగా ఈ ఏడాది అక్టోబర్ 1 నుంచి నవంబర్ 30 వరకు జోన్ పరిధిలో 771 ప్రత్యేక రైళ్లను నడిపేలా ప్రణాళికలు సిద్ధం చేశామని జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. కాకినాడ, తిరుపతి, విశాఖపట్నం, నాగర్‌సోల్, మాల్దా టౌన్, గోరఖ్‌పూర్, దానాపూర్, రక్సాల్, నిజాముద్దీన్, బెర్హంపూర్, హౌరా మార్గాల్లో ప్రత్యేక రైళ్లను నడుపుతున్నామని పేర్కొన్నారు.

అమెరికాలో ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు

- పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అమెరికాలోని గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్, వాషింగ్టన్ డీసీ చాప్టర్ ఆధ్వర్యంలో బతుకమ్మ, దసరా వేడుకలు వైభవంగా జరిగాయి. వర్జీనియాలోని అష్బర్న్ ఇండిపెండెన్స్ హైస్కూల్ ఆడిటోరియంలో నిర్వహించిన వేడుకలకు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన వేలాదిమంది ప్రవాసీయులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఉత్సవాల్లో పాల్గొన్నారు. మహిళలు, చిన్నారులు తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి ఆడిపాడారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ తెలంగాణ వాసులు ఎక్కడున్నా తమ సంస్కృతి, సాంప్రదాయాలను మరువకూడదనీ, భావితరాలకు వారసత్వంగా అందించాలన్నారు. .తెలంగాణ ఉద్యమంలో ఎన్ఆర్ఐలు అందించిన సహకారం మరువలేనిదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వర్జీనియా డెలిగేట్ శ్రీనివాసన్ కన్నన్, అటార్నీ జనరల్ జేసన్ ఎస్. మియారెస్, లౌడన్ కౌంటీ సూపర్వైజర్ లౌరా సావినో, లౌడన్ కౌంటీ స్కూల్ బోర్డు డాక్టర్ సుమేరా రషీద్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ జర్నలిస్టు ఇండ్ల పట్టాల రద్దు సరిగాదు : బండి సంజయ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



కరీంనగర్ జర్నలిస్టులకు గత ప్రభుత్వం ఇచ్చిన ఇండ్ల స్థలాలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయడం సరిగాదని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విజయదశమి, బతుకమ్మ పండుగల వేళ జర్నలిస్టు కుటుంబ సభ్యులైన మహిళల పేరిట ఇచ్చిన ఇండ్ల స్థలాలను రద్దు చేసి వారిని తీవ్ర మానసిక క్షోభకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. 118 జర్నలిస్టులకు భార్యల పేరిట 2023 అక్టోబర్ ఏడో తేదీన ప్రొసీడింగ్ ఇస్తూ కొత్తపల్లి మండలంలోని మల్కాపూర్, చింతకుంట వద్ద పట్టాలతో పాటు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు అర్హులను ఎంపిక చేస్తామని పేర్కొంటూ గత ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. కొందరు అనర్హులున్నారనే పేరుతో ప్రస్తుత ప్రభుత్వం అందరికీ అన్యాయం చేయడం తగదని సూచించారు. చాలామంది జర్నలిస్టుల ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమేననీ, అత్యధిక మంది జర్నలిస్టులు నేటికీ కిరాయి ఇండ్లల్లోనే జీవనం సాగిస్తున్న విషయం విదితమేనని పేర్కొన్నారు. అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలని గతంలోనూ పలుమార్లు సీఎంను కోరిన విషయాన్ని ప్రస్తావించారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించిన జర్నలిస్టులకు న్యాయం చేయాలని కోరారు. రద్దు చేసిన ఇండ్ల పట్టాలను వెంటనే పునరుద్ధరించడంతోపాటు ఆ స్థలాల్లో డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించి ఇవ్వాలని కోరారు. అర్హత ఉండి ఇండ్ల స్థలాలకు నోచుకోని మిగతా జర్నలిస్టులకు కూడా ఇంటి పట్టాలివ్వాలని విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే దసరా కానుక ఇదేనా? : మాజీ మంత్రి హరీశ్‌రావు

జర్నలిస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే దసరా కానుక ఇదేనా? అని మాజీ మంత్రి టి హరీశ్‌రావు ప్రశ్నించారు. గతంలో తమ బీఆర్ఎస్ ప్రభుత్వం కరీంనగర్‌లో 118 మంది జర్నలిస్టులకు కేటాయించిన ఇండ్ల స్థలాలను కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తీసుకోవడాన్ని ఆయన ఖండించారు. రాజకీయ కక్షలో భాగంగా బతుకమ్మ, దసరా పండుగల వేళ జర్నలిస్టుల కుటుంబాల్లో ఆవేదన మిగిల్చడం శోచనీయమని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం శ్రమించే జర్నలిస్టుల పట్ల కాంగ్రెస్ అనుసరిస్తున్న దుర్మార్గ వైఖరికి ఇది మరో నిదర్శనమని తెలిపారు. జర్నలిస్టులకు, వారి కుటుంబాలకు అన్యాయం చేయొద్దనీ, ప్రభుత్వం వెంటనే జర్నలిస్టుల ఇండ్ల స్థలాల రద్దు ప్రకటనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌వి మోసాలు..పచ్చి అబద్ధాలు

- కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాల మీద అబద్ధాలు చెబుతూ పోతున్నదనీ, అంకెల గారడీతో ప్రజలను నిట్టనిలువునా మోసం చేస్తున్నదని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రుణమాఫీ పేరిట అన్నదాతలను మోసం చేసిందని విమర్శించారు. అందరికీ రుణమాఫీ చేస్తే ఇంకా 16 లక్షలకుపైగా రైతులు ఎందుకు మిగిలారని నిలదీశారు. అందరికీ రూ.2 లక్షల రుణమాఫీ అని ఇప్పుడు కుటుంబానికి ఒక్కరికి మాత్రమే అని చెప్పడం దుర్మార్గమని పేర్కొన్నారు. రుణమాఫీ లెక్కలను రాష్ట్ర ప్రభుత్వం బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. బూటకపు హామీలివ్వడం, వాటిని అమలు చేయకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు పరాకాష్ట అని విమర్శించారు.

కాంగ్రెస్ అంటేనే క్రైసిస్

- ఏనుగులు రాకేష్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ అంటేనే క్రైసిస్ అని ఆ పార్టీలో పాలనలో ఉన్న రాష్ట్రాల్లో హిమాచల్ ప్రదేశ్, తెలంగాణలో ఆర్థిక సంక్షోభం వస్తున్నదని బీఆర్ఎస్ నేత ఏనుగులు రాకేష్‌రెడ్డి విమర్శించారు. సోమవారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో తలసరి ఆదాయం పెరిగితే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రియల్ ఎస్టేట్ కుప్పకూలిందనీ, టెక్స్‌టైల్ ఇండస్ట్రీ కుంటుపడిందనీ, టూరిజం ఇండస్ట్రీ కుదేలు అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.గ్రామ పంచాయతీ కార్మికులకు తొమ్మిది నెలలుగా జీతాలులేవనీ, ఎస్సీ,ఎస్టీ హాస్టల్స్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇప్పటి వరకు జీతాలు ఇవ్వలేదనీ, ఉద్యోగులకు ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. తొమ్మిది నెలల్లో ప్రభుత్వానికి రూ. 89 వేల కోట్లు రావాల్సి వుండగా రూ.73 వేల కోట్లు మాత్రమే వచ్చిందని చెప్పారు. ప్రక్షాళన చేయాల్సింది మూసీని కాదనీ, రేవంత్ రెడ్డి మైండ్ అంటూ విమర్శించారు.

హిమాచల్ ఆర్టీసీకి మరిన్ని ఒలెక్ట్రా బస్సులు

- 327 వాహనాల టెండర్ సొంతం

హైదరాబాద్ : హిమాచల్ రోడ్డు రవాణా సంస్థ (హెచ్ఆర్‌టిసి)కి ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ మరిన్ని బస్సులను సరఫరా చేయనుంది. విద్యుత్ బస్సుల కొనుగోలుకు తాజాగా పిలిచిన టెండర్లలో ఒలెక్ట్రా తక్కువ ధర కోట్ చేసి ఎల్ 1 బిడ్డర్ గా నిలిచింది. హెచ్ఆర్‌టిసి 327 విద్యుత్ బస్సుల కొనుగోలుకు తాజాగా టెండర్లు పిలిచింది. ఇందులో తొమ్మిది మీటర్ల బస్సులు 297, 12 మీటర్ల బస్సులు 30 ఉన్నాయి. ఒలెక్ట్రా గ్రీన్‌టెక్, స్విచ్ మొబిలిటీ టెండర్లలో పాల్గొన్నాయి. టెండర్ ప్రక్రియ అనంతరం నిర్వహించిన సాంకేతిక పరీక్షల్లో రెండు సంస్థలు అర్హత సాధించాయి. అయితే తక్కువ ధర కోట్ చేసి ఒలెక్ట్రా సంస్థ అంతిమంగా ఎల్1 గా నిలిచింది. హిమాచల్ రాష్ట్ర ప్రజల అవసరాల నిమిత్తం త్వరితగతిన బస్సులను కొనుగోలు చేయాలనే ఉద్దేశ్యంతో ఉన్న ఆర్‌టిసి త్వరలో ఆర్డర్ ఖరారు చేయనుంది. 2017లోనూ ఒలెక్ట్రా 25 బస్సులను అందించింది. వాటిని కులు మనాలి రోహ్తంగ్ మధ్య ఆర్ టి సి నడుపుతోంది. హిమాచల్ కొండల్లో పర్యావరణాన్ని పరిరక్షించడంలో ఒలెక్ట్రా బస్సులు కీలక పాత్ర పోశిస్తున్నాయని ఆ సంస్థ తెలిపింది.

విద్యుత్ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయండి

- వచ్చే ఏడేండ్ల సరఫరా ప్రణాళికలు సిద్ధం చేయండి : ట్రాన్స్‌కో సమీక్షా సమావేశంలో విద్యుత్‌శాఖ మంత్రి భట్టి విక్రమార్క

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడానికి విద్యుత్ రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకోవాలని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్, ఆర్థికశాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. సోమవారంనాడిక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఆయన టీజీట్రాన్స్‌కో ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంస్థలో డైరెక్టర్ నుంచి అసిస్టెంట్ ఇంజినీర్ వరకు ఎప్పటికప్పుడు సాంకేతికత పరిజ్ఞానాన్ని అప్‌డేట్ చేసుకోవాలనీ, అప్పుడే నూతన ఆవిష్కరణలు సాధ్యమవుతాయని చెప్పారు. దీనికోసం శిక్షణ తరగతులు నిర్వహించాలని సూచించారు. ట్రాన్స్‌కో బలంగా ఉంటేనే విద్యుత్ సరఫరా మెరుగ్గా ఉంటుందన్నారు. వచ్చే ఏండేండ్ల కాలానికి సంబంధించి పెరిగే కరెంటు డిమాండు దృష్ట్యా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రస్తుతం 15,700 మెగావాట్ల పీక్ డిమాండ్ ఉన్నదనీ, వచ్చే ఏడేండ్లలో ఇది 27వేల మెగావాట్లకు పెరిగే అవకాశం ఉందన్నారు. ఆ అంచనాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా ప్రణాళికలను రూపొందించి, కార్యాచరణను అమలు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో చేపడుతున్న సబ్‌స్టేషన్ల నిర్మాణ పనుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్దేశిత గడువును లక్ష్యంగా పెట్టుకొని పనిచేయాలని చెప్పారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో ద్వారా జరుగుతున్న విద్యుత్ సరఫరా, సబ్‌స్టేషన్ల నిర్మాణం తదితర అంశాలపై ఇంధనశాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో డిప్యూటీ సీఎం కార్యదర్శి కృష్ణభాస్కర్, ట్రాన్స్‌కో జేఎమ్‌డీ శ్రీనివాసరావు, డైరెక్టర్లు జీ నర్సింగరావు, జే సూర్య ప్రకాష్, బీ నర్సింగరావుతోపాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

స్పెషల్ ఎడ్యుకేషన్ అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన జరపండి

- విద్యాశాఖ కార్యాలయం వద్ద అభ్యర్థుల నిరసన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మిగిలిపోయిన జిల్లాల్లోనూ స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయ అభ్యర్థులకు 1:3 నిష్పత్తి చొప్పున ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించాలని కోరారు. ఇందుకు సంబంధించి సోమవారం పాఠశాల విద్యాశాఖ సంచాలకుల కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయ అభ్యర్థులకు సంబంధించి 20 జిల్లాల్లో ధ్రువపత్రాల పరిశీలన చేపట్టారని వివరించారు. మిగిలిన 13 జిల్లాల్లో మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు అభ్యర్థులు టెట్‌ను మినహాయించాలంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను ఆపాలంటూ ఎలాంటి స్టే లేదని అభ్యర్థులు వాపోయారు. కోర్టులో కేసు వేసిన అభ్యర్థులు ఉన్న జిల్లాల్లోనూ ధ్రువపత్రాల పరిశీలన జరిగిందని వివరించారు. అయితే మిగిలిన జిల్లాల్లో నిర్వహించకపోవడం వల్ల ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని న్యాయం చేయాలని కోరారు. కొందరు అభ్యర్థులు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డిని కలిశారు. హైకోర్టులో కేసు ఉన్నందున ధ్రువపత్రాల పరిశీలన చేపట్టడానికి అవకాశం లేదని వారు వివరించినట్టు తెలిసింది. ఈనెల 24న ఆ కేసు విచారణకు వస్తుందనీ, హైకోర్టు తీర్పు ఆధారంగానే ముందుకెళ్తామని చెప్పినట్టు సమాచారం. లేదంటే కోర్టును ఆశ్రయించిన అభ్యర్థులు ఆ కేసును ఉపసంహరించుకుంటే ధ్రువపత్రాల పరిశీలన చేపట్టి అభ్యర్థులను ఎంపిక చేయడానికి ఎలాంటి అడ్డంకులు ఉండబోవని స్పష్టం చేసినట్టు తెలిసింది. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో లక్ష్మీనారాయణ, భాస్కర్‌రావు, గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

గుంటూరులో పసికందు కిడ్నాప్

- కథ సుఖాంతం

గుంటూరు : గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో ఆదివారం అర్ధరాత్రి డెలివరీ అయిన బాలింత నుంచి పసికందును అపహరించిన ఘటన వెలుగుచూసింది. గుర్తు తెలియని మహిళ బాలింత కుటుంబ సభ్యుల నుంచి బేబీ బాగుందని చేతుల్లోకి తీసుకుంది. అనంతరం పక్కనే ఉన్న తన భర్తకు చూపించుకు వస్తానని పసికందును తీసుకొని వేగంగా వెళ్లింది. ఆ తర్వాత ఆమె మరో ఇద్దరితో కలసి ఆటో ఎక్కి పసికందుతో సహా ఉడాయించారు. కొద్దిసేపటికే విషయాన్ని తెలుసుకున్న బాలింత కుటుంబ సభ్యులు అధికారులకు ఫిర్యాదు చేశారు. గుంటూరు జీజీహెచ్ కాన్పుల వార్డులో గోరంట్లకు చెందిన షేక్ నసీమా (22)కి అబ్బాయి పుట్టాడు. బాలింత కుటుంబ సభ్యులను పరిచయం చేసుకొని సత్తెనపల్లికి చెందిన శిరీష మరో ఇద్దరితో కలిసి శిశువుని అపహరించారు. రంగంలోకి దిగిన కొత్తపేట పోలీసులు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి పసికందును గుర్తించటానికి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులు పల్నాడు జిల్లా అచ్చెంపేట మండలం కోనూరులో ఉన్నట్లు గుర్తించారు. శిరీష్ తో పాటు ఆమెకు సహకరించిన ప్రేమ రాజు, మంగమ్మలను కూడా పోలీసులు సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. పసికందును తల్లికి అప్పగించారు. గుంటూరు తూర్పు డిఎస్‌పి అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో గుంటూరు కొత్తపేట సిఐ వీరయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కరాచి ఎయిర్‌పోర్టు వెలుపల పేలుడు

- ఇద్దరు చైనీయులు మృతి, 8మందికి గాయాలు

కరాచి : కరాచి విమానాశ్రయం వెలుపల ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత తీవ్రమైన పేలుడు సంభవించింది. ఈ పేలుడులో ఇద్దరు చైనా జాతీయులు మరణించగా, మరో 8మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. విమానాశ్రయానికి వెలుపల నిలిపిన ట్యాంకర్ పేలిందని పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలంలో దట్టమైన పొగ కార్లను కమ్మేసింది. వెంటనే భద్రతా బలగాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. చమురు ట్యాంకర్ పేలినట్లు కనిపిస్తోందని, అయితే ఈ పేలుడుకు కారణాలేంటి, ఎలా జరిగిందనేది దర్యాప్తు చేస్తున్నామన్నారు. నిర్ధారణ కావడానికి కొంత సమయం పడుతుందని అన్నారు. గాయపడిన వారిలో పోలీసులు కూడా వున్నారు. అయితే విదేశీయులను లక్ష్యంగా చేసుకునే ఈ దాడి జరిగిందని ప్రావిన్షియల్ హోం మంత్రి జియా ఉల్ హసన్ మీడియాకు తెలిపారు. హోం మంత్రి, ఐజీలు కూడా సంఘటనా స్థలంలో పర్యటించారు కానీ వారు మీడియాతో మాట్లాడలేదు. విమానాశ్రయంలోని భవనాలన్నీ కంపించాయని, పేలుడు చాలా శక్తివంతమైందని అక్కడ పనిచేస్తున్న వ్యక్తి ఒకరు వ్యాఖ్యానించారు. పాకిస్తాన్‌లో వేలాదిమంది చైనీయులు పనిచేస్తుంటారు. వారిలో చాలామంది బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ పనుల్లో నిమగ్నమై వుంటారు.

మృతిచెందిన మావోయిస్టుల ఫొటోలు విడుదల

- 22 మంది గుర్తింపు



నవతెలంగాణ-చర్ల

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్-దంతేవాడ జిల్లాల సరిహద్దులోని అడవుల్లో ఎదురు కాల్పుల్లో మృతిచెందిన 31 మంది మావోయిస్టులను పోలీసులు గుర్తించారు. వారి ఫొటోలను సోమవారం దంతేవాడ జిల్లా ఎస్పీ గౌరవ్ రాయ్ విడుదల చేశారు. మృతుల్లో 22 మందిని గుర్తించినట్టు తెలిపారు. మృతుల్లో 13 మంది మహిళలు, 18 మంది పురుషులు ఉన్నారన్నారు. వారిలో నీతి అలియాస్ ఊర్మిళ డీకేఎస్‌జెడ్సీ, డీవీసీఎం ముగ్గురు, సీవైపీసి ఆరుగురు, పీపీసీఎంలు ఆరుగురు, ముగ్గురు ఏసీఎంలు, గార్డులు ఇద్దరు ఉన్నారని ఎస్పీ వివరించారు. ఇంకా 9 మంది మావోయిస్టులను పోలీసులు గుర్తించే పనిలో ఉన్నారని ఎస్పీ చెప్పారు.

ఆగని నరమేధం





గాజాలో దాడులకు ఏడాది పూర్తి

గాజా, బీరుట్ : సోమవారంతో గాజాలో ఇజ్రాయిల్ సాగించిన నరమేధానికి ఏడాది పూర్తయింది. అయినా ఇంకా ఇజ్రాయిల్ తన మారణహోమాన్ని ఆపలేదు. పైగా గాజా నుండి లెబనాన్‌కు పాకింది. గాజా, బీరుట్ సహా పలు ప్రాంతాల్లో ఇజ్రాయిల్ ఆర్మీ సాగించే దాడులతో ఆ ప్రాంతాలు రక్తమోడుతున్నాయి. అయినవారిని కోల్పోయిన కుటుంబాలు గూడు, నీడ కోల్పోయి రోడ్డున పడ్డాయి. లక్షలాదిమంది సురక్షిత ప్రాంతాలను వెతుక్కుంటూ ఇతర ప్రాంతాలకు, దేశాలకు పారిపోతున్నారు.

గతేడాది అక్టోబరు 7న హమాస్, ఇజ్రాయిల్‌లోని సంగీతోత్సవ కార్యక్రమంపై జరిపిన దాడితో రగిలిపోయిన ఇజ్రాయిల్, మొత్తంగా హమాస్‌ను మట్టుబెట్టే లక్ష్యంతో గాజాపై విరుచుకుపడింది. విచక్షణారహితంగా జరిగిన ఈ దాడుల్లో ఇప్పటికి 41,870మంది మరణించారని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. గాజాలోని 21లక్షల మందిలో 90శాతం మంది నిర్వాసితులయ్యారని ఐక్యరాజ్య సమితి అంచనా వేసింది. లెబనాన్‌లో ఇజ్రాయిల్ భూతల దాడుల్లో దాదాపు 2వేలమంది లెబనాన్ జాతీయులు మరణించారు. 19వేలమంది నిర్వాసితులయ్యారని అధికార గణాంకాలు తెలిపాయి.

కాగా ఈ సందర్భంగా కొవ్వొత్తుల ప్రదర్శనలు, సంస్మరణ సభలు, ప్రదర్శనలు ఇలా పలు కార్యక్రమాలు జరిగాయి. టెల్ అవీవ్ నుండి లండన్, పారిస్, బెర్లిన్ ఇలా ప్రపంచవ్యాప్తంగా పలు నగరాల్లో ప్రజలు పాలస్తీనియన్లకు తమ సంఘీభావం ప్రకటించారు. సెంట్రల్ టెల్‌అవీవ్‌పైకి రాకెట్లను ప్రయోగించినట్లు హమాస్ ప్రకటించింది.

జాబాలియాలోకి చొచ్చుకుపోతున్న బలగాలు

మరోవైపు గాజాలోని అతిపెద్ద పట్టణ ప్రాంత శరణార్థ శిబిరమైన జాబాలియాలోకి ఇజ్రాయిల్ బలగాలు చొచ్చుకువెళుతున్నాయి. వరుసగా దాడుల అనంతరం అక్కడి ప్రజలను ఖాళీ చేయాల్సిందిగా ఆర్మీ ఆదేశాలు జారీ చేసింది. అలాగే ఖాన్ యూనిస్‌నగరం నుండి కూడా వెళ్ళిపోవాల్సిందిగా ప్రజలను ఆదేశించింది. వైమానిక, భూతల దాడులు రెండూ కొనసాగుతున్నాయని ప్రజలు తెలిపారు. డజన్ల సంఖ్యలో మరణాలు సంభవించాయి. ఇదిలావుండగా లెబనాన్ దక్షిణ ప్రాంతంలో జరిగిన దాడిలో 10మంది అగ్నిమాపక సిబ్బంది మరణించారని లెబనాన్ ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. ఈ దాడిలో ఇంకా పలువురు శిధిలాల కింద చిక్కుకుపోయారని పేర్కొన్నారు. బారాచిట్ పట్టణంలోని మున్సిపాలిటీ భవనంలో సహాయక కార్యక్రమాల్లో పాల్గొంటున్న అగ్నిమాపక సిబ్బందిపై దాడి జరగడంతో వారు చనిపోయారని తెలిపారు.

పశ్చిమాసియాలో శాంతి పునరుద్ధరణ తక్షణావశ్యకత

దాడులతో ఏడాదిగా రగులుతున్న పశ్చిమాసియాలో శాంతి పునరుద్ధరణ తక్షణావశ్యకత అని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్ పేర్కొన్నారు. శాశ్వత శాంతి స్థాపనకు దౌత్య పరిష్కారమొక్కటే ఏకైక మార్గమన్నారు. గాజాలో దాడులకు ఏడాది పూర్తయని సందర్భాన్ని పురస్కరించుకుని కొవ్వొత్తులు వెలిగించడం, మొక్కలు నాటడం వంటి పలు కార్యక్రమాలు చేపట్టారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులిరువురు కూడా పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఏడాది పొడవునా సాగిన ఈ దాడుల్లో అనేకమంది సామాన్యులు ఇబ్బందులు పడ్డారని బైడెన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ దాడుల వల్ల మాటల్లో వర్ణించనలవి కాని దారుణాలు, అరాచకాలు చోటు చేసుకున్నాయన్నారు. అయితే హమాస్, హిజ్బుల్లా, ఇరాన్‌లకు వ్యతిరేకంగా ఇజ్రాయిల్ భద్రతకు అమెరికా పూర్తిగా కట్టుబడి వుందని ప్రకటించారు. అక్టోబరు 7న పాలస్తీనియన్లకు చీకటి రోజుగా అభివర్ణించారు. గాజాలో కాల్పుల విరమణ సాధించే వరకు తాము విరమించబోమని చెప్పారు. గాజాలో విధ్వంసాన్ని, ప్రాణ నష్టాన్ని చూసి తన మనస్సు కలిచివేసిందన్నారు.

ఇజ్రాయిల్ మూల్యం చెల్లించకతప్పదు : టర్కీ

గత ఏడాది కాలంగా సాగించిన నరమేధానికి ఇజ్రాయిల్ మూల్యం చెల్లించకతప్పదని టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ హెచ్చరించారు. ఈ రోజు కాకపోతే రేపైనా తాను చేసిన దారుణాలకు, అక్రమాలకు తగిన మూల్యాన్ని చెల్లిస్తుందని అన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు.నారా

19 నుంచి ఎప్‌సెట్ బైపీసీ కౌన్సెలింగ్

- ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలు
- 21 నుంచి ధ్రువపత్రాల పరిశీలన
- 25 వరకు వెబ్‌ఆప్షన్ల నమోదు
- 28న తొలివిడత సీట్ల కేటాయింపు
- షెడ్యూల్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి బీ ఫార్మసీ, ఫార్మా-డీ, బయో టెక్నాలజీ, బయో మెడికల్ ఇంజినీరింగ్, ఫార్మాసూటికల్ సైన్స్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఎప్‌సెట్ బైపీసీ విద్యార్థులకు ఈనెల 19వ తేదీ నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎప్‌సెట్ ప్రవేశాల కన్వీనర్ శ్రీదేవసేన సోమవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈనెల 19 నుంచి 22 వరకు ఆన్‌లైన్‌లో ప్రాథమిక సమాచారం అందుబాటులో ఉంటుందనీ, ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలనీ, హెల్ప్‌లైన్ సెంటర్లలో ధ్రువపత్రాల పరిశీలనకు వెళ్లేందుకు స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. అదేనెల 21 నుంచి 23 వరకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని తెలిపారు. అదే నెల 21 నుంచి 25 వరకు వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశముంటుందని వివరించారు. ఈనెల 28న తొలివిడత కౌన్సెలింగ్ ద్వారా అభ్యర్థులకు సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. అదేనెల 28 నుంచి 30 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించడంతోపాటు, ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందని వివరించారు.

నవంబర్ 4 నుంచి తుదివిడత కౌన్సెలింగ్

ఎప్‌సెట్ బైపీసీ విద్యార్థులకు తుదివిడత కౌన్సెలింగ్ ప్రక్రియ వచ్చేనెల నాలుగో తేదీ నుంచి ప్రారంభమవుతుందని శ్రీదేవసేన తెలిపారు. అదేనెల 4న ఆన్‌లైన్‌లో ప్రాథమిక సమాచారం అందు బాటులో ఉంటుందనీ, ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలనీ, హెల్ప్‌లైన్ సెంటర్లలో ధ్రువపత్రాల పరిశీలనకు వెళ్లేందుకు స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. 5న ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని వివరించారు. 5, 6 తేదీల్లో వెబ్‌ఆప్షన్లు నమోదు చేయాలని కోరారు. 9న తుదివిడత కౌన్సెలింగ్‌లో సీట్లు కేటాయిస్తామని తెలిపారు. వచ్చేనెల తొమ్మిది నుంచి 11 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించాలనీ, వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్‌రిపోర్టింగ్ చేయాలని కోరారు. అదేనెల 11, 12 తేదీల్లో కేటాయించిన కాలేజీల్లో అభ్యర్థులు రిపోర్టు చేయాలని సూచించారు.

ఇతర వివరాలు, సమాచారం కోసం మంగళవారం నుంచి https://tseapcetb.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

నవంబర్ 12న స్పాట్ అడ్మిషన్ల మార్గదర్శకాలు

ప్రయివేటు ఇంజినీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో ఎప్‌సెట్ బైపీసీ విద్యార్థుల స్పాట్ అడ్మిషన్లకు సంబంధించిన మార్గదర్శకాలను వచ్చేనెల 12న విడుదల చేస్తామని శ్రీదేవసేన తెలిపారు. ఇతర వివరాల కోసం https://tseapcetb.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

గాంధీభవన్‌కు వస్తే సమస్యలకు పరిష్కారం

- మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గాంధీభవన్‌కు వస్తే తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ప్రజలు తరలి వస్తున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం గాంధీభవన్‌లో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన పాల్గొని 95 అర్జీలను స్వీకరించారు. వీటిలో భూ సమస్యలు, ఉద్యోగాలు, పెన్షన్లు ,ఇందిరమ్మ ఇల్లు తదితర సమస్యలతో కూడిన వినతిపత్రాలున్నాయి. వీటిలో కొన్ని సమస్యలపై వెంటనే సంబంధిత కలెక్టర్లతో మాట్లాడి పరిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తలపెట్టిన ముఖాముఖి కార్యక్రమన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నట్టు తెలిపారు. బీఆర్ఎస్ రుణమాఫీ పేరుతో ప్రపంచాన్ని మోసం చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం 22 లక్షల మందికి రుణమాఫీ చేసి మరో 20 లక్షల మందికి రుణమాఫీ చేయనుందని చెప్పారు. ఒకవైపు ప్రజావాణి కార్యక్రమంలో వినతుల స్వీకరణ, మరోవైపు గాంధీభవన్‌లో ముఖాముఖిలో నేరుగా మంత్రులే వినతుల స్వీకరిస్తూ ప్రజాపాలనకు నిదర్శనంగా నిలిచినట్టు తెలిపారు. రైతుల నుంచి ప్రభుత్వంపై అసంత ప్తి లేదనీ, తాము నిత్యం వారి మధ్య తిరుగుతున్నామని చెప్పారు. అధికారం కోల్పోయిన బాధ ఒకరిదైతే, మరొకరిది అధికారంలోకి రావాలన్న బాధ అని బీఆర్ఎస్, బీజేపీలను విమర్శించారు. రాష్ట్రంలో రూ.18 వేల కోట్ల రుణమాఫీ ప్రధానమంత్రి మోడీకి కనిపించడం లేదా? బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రుణమాఫీ చేశారా? అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు ఎం. ఆర్.జి.వినోద్ రెడ్డి, గాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చర్చకు సిద్ధమా బాల్కసుమన్ చనగాని దయాకర్

ఉద్యోగాల భర్తీపై చర్చకు సిద్ధమా? అని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు సవాల్ విసిరారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ నిరుద్యోగులను మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గ్రూప్ 1 ప్రిలిమ్స్ నిర్వహణ డియస్సీ ద్వారా 11 వేల పోస్టులు, కానిస్టేబుల్ 15,000, గ్రూప్ 4 పోస్టులు 9,000 ఏఈఈ వెటర్నరీ సర్జన్ 1,600 తదితర పోస్టులను భర్తీ చేసినట్టు తెలిపారు. మరి కొన్ని పోస్టులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిందనీ, ఇంకా కొన్ని పోస్టులకు నోటిఫికేషన్లు ఇచ్చిందని చెప్పారు.

తొమ్మిదేండ్ల నిఘా !

- మొసాద్ కోవర్టు ఆపరేషన్ గుట్టు రట్టు
- బయటపెట్టిన వాషింగ్టన్ పోస్టు కథనం



వాషింగ్టన్ : హిజ్బుల్లా ఫైటర్లు ఉపయోగించే పేజర్లను పేలుడు పదార్థాలుగా మార్చడానికి ఇజ్రాయిల్ నిఘా సంస్థ మొసాద్ నిర్వహించిన కోవర్ట్ ఆపరేషన్ గుట్టును వాషింగ్టన్ పోస్ట్ బట్టబయలు చేసింది. ఈ మేరకు ఒక వార్తా కథనాన్ని వెలువరించింది. ఆ కథనం ప్రకారం, హిజ్బుల్లా కమాండర్లు, ఫైటర్లు ఉపయోగించే పేజర్లలో మొసాద్ పేలుడు పదార్థాలను చొప్పించింది. లెబనాన్‌వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పేలిన ఈ పేజర్ల దాడుల్లో మూడు వేల మందికి పైగా హిజ్బుల్లా కార్యకర్తలు మరణించారు. తామెంతగానో విశ్వసించే ఈ పేజర్లను ఇజ్రాయిల్ బాంబులతో నింపివేసిందని వారికేమాత్రం తెలియదు. తన సభ్యుల మధ్య సమాచార మార్పిడికి గానూ నమ్మకమైన కమ్యూనికేషన్ సాధనాలు కావాలని హిజ్బుల్లా 2022లో భావించింది. ఆ సమయంలో ఇజ్రాయిల్ సంస్థ అపోలో ఎఆర్924 పేజర్లను ప్రవేశపెట్టింది. ఈ పేజర్ కొంచెం పెద్దదిగా వున్నప్పటికీ వాటర్‌ప్రూఫ్ సామర్థ్యం కలిగి వుంటుంది. అదీగాక దీనికి గల పెద్ద బ్యాటరీ, నెలల తరబడి చార్జింగ్ చేయకపోయినా పనిచేసేలా వుంది. వీటన్నింటికన్నా తమ శత్రువు వాటిని కనిపెట్టలేరని హిజ్బుల్లా భావించింది. దాంతో ఏకంగా ఐదు వేల పేజర్లను కొనుగోలు చేసింది. వీటివల్ల తమ నిర్వహణా సామర్థ్యం పెరుగుతుందని అంచనా వేసింది. మధ్యస్థాయి ఫైటర్లకు, సపోర్ట్ సిబ్బందికి ఫిబ్రవరిలో అందచేసింది. వారికి తెలియని అంశమేమంటే, ఆ పేజర్లలో దాగి పేలుడు పదార్థాలు వున్నాయని, వాటిని ఉపయోగించడానికి సిద్ధపడగానే పేలిపోతాయని తెలియదు. అన్నింటికంటే ఈ పేజర్లను ఉపయోగించాల్సి వచ్చినప్పుడు రెండు చేతులతో ఆపరేట్ చేయాల్సి వచ్చేలా రెండంచెల డీ ఎన్‌క్రిప్షన్ పద్ధతిని అమలు చేశారు. ఫలితంగా వేలాదిమంది హిజ్బుల్లా ఫైటర్లు, మరికొంతమంది సామాన్యులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా అమలు చేయడంతో ఒక ఇంటెలిజెన్స్ సంస్థ, శత్రువును ఎదుర్కొన్న తీరు ఇటీవలి చరిత్రలో సంచలనం సృష్టించింది.

ఈ ఆపరేషన్ గురించి అనేక కొత్త విషయాలు బయటపడ్డాయి. ఇజ్రాయిల్, అరబ్, అమెరికా భద్రతా అధికారులు, రాజకీయ నేతలు, దౌత్యవేత్తలు ఇలా పలువురు ఇందుకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని పలు ఇంటర్వ్యూల్లో పంచుకున్నారు. లెబనాన్ అధికారులు, హిజ్బుల్లాకు సన్నిహితులు కూడా మరికొంత సమాచారాన్ని అందించారు. పేరు వెల్లడించకూడదనే షరతుపై అత్యంత సున్నితమైన ఈ నిఘా వ్యవహారం గురించి చర్చించారు. మొసాద్ ప్రధాన కార్యాలయంలో ఇందుకోసం ఏళ్ల తరబడి ప్రణాళికలు రూపొందించారు. పలు దేశాల్లో ఇందుకోసం మరికొంతమంది పనిచేశారు. అత్యంత సాహసోపేతంగా అమలు చేసిన ఈ కుట్ర వల్ల హిజ్బుల్లాకు చెందిన వేలాదిమంది కార్యకర్తలను హతమార్చడమే కాకుండా ఉన్నత నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకుని, పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మరింత విస్తరించడానికి కారణమైంది. ఇక వైమానిక దాడులు, ఆ తర్వాత నెమ్మదిగా భూతల దాడులతో హిజ్బుల్లాను క్షేత్ర స్థాయిలో తుడిచిపెట్టేయవచ్చని ఇజ్రాయిల్ పాలకవర్గం భావించింది. మొత్తంగా ఈ కుట్రకు 2022లోనే తెర తీసినా, అక్టోబరు 7నాటి దాడులకు సరిగ్గా ఏడాది ముందుగానే ఈ కుట్రలోని కొన్ని భాగాలు అమలు కావడానికి శ్రీకారం చుట్టారు. విదేశీ ముప్పులను మట్టుబెట్టడంలో సిద్ధహస్తులైన మొసాద్ వ్యూహకర్తలు ఎలక్ట్రానిక్ పర్యవేక్షణల ద్వారా, వేగుల ద్వారా శత్రు శిబిరంలోని కీలక సమాచారాన్ని సేకరించడానికి ప్రయత్నించారు. ఇక ఆ తర్వాత శత్రువుకు నమ్మకం కలిగించేలా కమ్యూనికేషన్ పరికరాలను రూపొందించడంపై దృష్టి పెట్టారు. దీనికి బీజం 2015లోనే పడింది. తొలుత వాకీటాకీలను లెబనాన్‌లోకి చొప్పించిన మొసాద్, పెద్ద సైజు బ్యాటరీతో టూ వే రేడియో కలిగిన మొబైల్‌లో పేలుడు పదార్థాలు, ట్రాన్స్‌మిషన్ వ్యవస్థను దాచివుంచారు. ఈ పరికరాలతో హిజ్బుల్లా సమాచారమంతా ఇజ్రాయిల్ చేతుల్లోకి వెళ్లిపోయింది.

ఇలా తొమ్మిది సంవత్సరాలు హిజ్బుల్లాపై పూర్తి స్థాయిలో నిఘా పెట్టిన మొసాద్ వాకీటాకీలను బాంబులుగా మార్చే అవకాశాన్ని అట్టిపెట్టుకుంది. ఈలోగా కొత్త అవకాశం వచ్చింది. పేజర్లు శక్తివంతమైన పేలుడు పదార్థాలుగా మారాయి. ఇజ్రాయిల్ విద్రోహక చర్యల గురించి అనుమానాలు వున్న హిజ్బుల్లా ఇజ్రాయిల్‌తో సంబంధమున్న ఏ దేశం నుంచి కూడా ఏవీ కొనుగోలు చేయరాదని భావిస్తున్న తరుణంలో ఇజ్రాయిల్‌తో, అలాగే యూదు ప్రయోజనాలతో ఏ మాత్రం సంబంధం లేని, పైగా మంచి గుర్తింపు కలిగిన తైవాన్ బ్రాండ్ అపోలో పేజర్ల కొనుగోలు కోసం 2023లో పెద్ద ఎత్తున విజ్ఞప్తులు అందాయి. ఆ కంపెనీకి కూడా ఈ ప్రణాళిక గురించి ఏ మాత్రమూ తెలియదు. తైవాన్ నుంచి వచ్చిన పేజర్లు ఇజ్రాయిల్‌లో అసెంబుల్ అయి లెబనాన్ చేరాయి.

రైతు ఉద్యమం..నిస్సహాయులకు ధైర్యం

- నల్లచట్టాల నుంచి మోడీ సర్కారును వెనక్కికొట్టాం
- కొత్త సమస్యలు ముందుకు.. వాటికి వ్యతిరేకంగా పోరాటం
- రైతుల్లారా..నవంబర్ ఒకటో తేదీ చలో ఢిల్లీని జయప్రదం చేయండి : ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎస్‌కేఎమ్ జాతీయ నాయకులు విజ్జూకృష్ణన్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎస్‌కేఎమ్ ఆధ్వర్యంలో రైతు ఉద్యమం సాధించిన విజయం నిస్సహాయులకు ధైర్యంగా నిలిచిందని ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎస్‌కేఎమ్ జాతీయ నాయకులు విజ్జూకృష్ణన్ చెప్పారు. ఎస్‌కేఎమ్ పిలుపులో భాగంగా నవంబర్ ఒకటో తేదీన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం కర్నాటక రాష్ట్ర రాజధాని బెంగుళూరులో ఎస్‌కేఎమ్ లీడర్‌షిప్ మీటింగ్ జరిగింది. అందులో తెలంగాణ రాష్ట్ర రిపోర్టును ఎస్‌కేఎమ్ నాయకులు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో విజ్జూకృష్ణన్ మాట్లాడుతూ..ఢిల్లీలో జరిగిన రైతు ఉద్యమాన్ని పంజాబ్ రైతులకే పరిమితం చేయాలని మోడీ సర్కారు ప్రయత్నించిందని విమర్శించారు. రైతులు మాత్రం ఇది దేశవ్యాప్త ఉద్యమం అని నిరూపించారన్నారు. ఈ విజయంతో అంతర్జాతీయ రైతు ఉద్యమాలు కూడా మనవైపు చూస్తున్నాయని చెప్పారు. లక్షలాది మందిని ఎలా సమీకృతం చేయగలిగారని ఆయా దేశాల రైతు ఉద్యమ నాయకులు ఆశ్చర్యపోతున్నారన్నారు. ఎస్‌కేఎమ్ పిలుపుతో చాలామేరకు గ్రామీణ ప్రాంతాల్లో రైతులు బీజేపీ ఓడించారని చెప్పారు. అయినా, ఇతర పార్టీల మద్దతులో అధికారంలోకి వచ్చిన మోడీ సర్కారు ఇప్పుడు కార్పొరేట్లకు అనుకూలంగా చట్టాలను తేవాలని చూస్తున్నదని విమర్శించారు. దక్షిణ భారతదేశంలో రైతులు మరింత ఐక్యంగా నిలబడి బలమైన ఉద్యమాలను నిర్మించాలని పిలుపునిచ్చారు. ఆ పోరాటంలో వ్యవసాయ కూలీలు, కార్మికులను కూడా కలుపుకుని ముందుకు సాగాలని సూచించారు. ఢిల్లీ రైతాంగం ఉద్యమం ద్వారా మూడు నల్లచట్టాలను వెనక్కి కొట్టగలిగినా ఇప్పుడు అనేక కొత్త సమస్యలు వచ్చిపడుతున్న తీరును వివరించారు. భూసేకరణ చట్టానికి తూట్లు పొడుస్తున్న తీరును ఎండగట్టారు. కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత, రుణవిముక్తి, కేరళ తరహాలో రుణ విముక్తి కమిషన్ ఏర్పాటు తదితర ఎస్‌కేఎమ్ డిమాండ్లను పక్కదోవ పట్టించాలని మోడీ సర్కారు చూస్తున్నదని విమర్శించారు. రాష్ట్రాల్లో ఏ పార్టీఅధికారంలో ఉన్నా రైతు సంక్షేమం కేంద్రంగా ఉద్యమాలను నిర్మించాలని పిలుపునిచ్చారు. కేరళలో పండ్లు, కూరగాయ పంటలకు కూడా ఎమ్ఎస్‌పీ ఇస్తున్నారనీ, తెలంగాణలో సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నారనీ, కర్నాటకలో రాగికి బోనస్ ఇస్తున్నారని వివరించారు. ఈ సమావేశంలో ఎస్‌కేఎమ్ కన్వీనర్ డాక్టర్ దర్శన్‌పాల్, శంకరన్(కేరళ), బడగలపుర నాగేంద్ర(కర్నాటక), జయరాజన్(కేరళ), వేములపల్లి వెంకటరామయ్య, ప్రభాకర్‌రెడ్డి(తెలంగాణ), తదితరులు పాల్గొన్నారు.

దసరా నాటికి మోడల్ స్కూల్ టీచర్లకు జీతాలివ్వాలి : పీఎంటీఏటీఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల వేతనాలు ఇంకా విడుదల కాలేదని పీఎంటీఏటీఎస్ రాష్ట్ర అధ్యక్షులు తరాల జగదీశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దసరా పండుగ సమయంలోనూ వేతనాలను ఆలస్యంగా ఇవ్వడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. డీఏ, పీఆర్సీ బకాయిలు కూడా నేటికీ రాలేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని దసరా పండుగ వరకైనా వేతనాలతోపాటు డీఏ, పీఆర్సీ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీని వేయాలని కోరారు. 010 పద్దు కింద వేతనాలను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

జేఎన్టీయూహెచ్‌లో కాంట్రాక్టు అధ్యాపకులకు 11 జీవోను అమలు చేయాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం హైదరాబాద్ (జేఎన్టీయూహెచ్)లోని కాంట్రాక్టు అధ్యాపకులకు 11 జీవోను అమలు చేయాలని కాంట్రాక్టు టీచర్ల సంఘం అధ్యక్షులు బి రాజేశ్‌ఖన్నా డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని జేఎన్టీయూహెచ్ ప్రాంగణంలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర విశ్వవిద్యాలయాల్లో అమలు చేసినట్టుగానే జేఎన్టీయూహెచ్‌లోనూ 11 జీవోను అమలు చేయాలని కోరారు. 224 మంది కాంట్రాక్టు అధ్యాపకులకు తగిన జీతం, ఉద్యోగ భద్రత కల్పించాలని సూచించారు. వారి జీవన పరిస్థితిని మెరుగుపర్చాలనీ, విద్యార్థుల భవిష్యత్‌కు తోడ్పాడే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె శ్రీనివాస్‌రెడ్డి, దేవేందర్, రాజేశ్, రమేష్, అశోక్, రంజిత్, కరుణాకర్, నరేందర్, చారి, యాదగిరి, నరేష్, మానస తదితరులు పాల్గొన్నారు.

'బానిస సుమన్‌కు బడితె పూజ'

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ బానిస సుమన్‌లాగా మాట్లాడుతున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకుంటే సుమన్‌కు బడితె పూజ తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలో ఉద్యోగాల జాతర కొనసాగుతుందని తెలిపారు. నియామకాల కోసం తెలంగాణ ఉద్యమం జరిగితే ఆ నియామాకలనే కేసీఆర్ నిర్లక్ష్యం చేస్తే నిరుద్యోగులు ఆయనపై తిరుగుబాటు చేశారని గుర్తుచేశారు.

మూసీ మూటల లెక్కలు చెప్పేందుకే

- సీఎం రేవంత్ హస్తిన పర్యటనపై కేటీఆర్ విమర్శలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మూసీ కొల్లగొట్టే వేల కోట్ల రూపాయల మూటల లెక్కలు చెప్పేందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హస్తిన పర్యటనకు వెళ్తున్నారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారకరామారావు ఆరోపించారు. సోమవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పేద ప్రజల గూడు చెదరగొట్టేందుకు ఢిల్లీలో రాహుల్‌గాంధీ, అధిష్టానంతో మంతనాలు జరుపుతున్నారని విమర్శించారు. పదినెలల్లో 23 సార్లు ఢిల్లీ సీఎం వెళ్లారనీ, ఐదేండ్లలో 125 సార్లు వెళ్తారేమో అని దెప్పిపొడిచారు. సీఎం పర్యటనల ద్వారా రాష్ట్రానికి ఎన్ని నిధులు వచ్చాయని ప్రశ్నించారు. కనీసం విమాన చార్జీల ఖర్చంత నిధులైనా వచ్చాయా? అని నిలదీశారు. ఢిల్లీ బాసులకు గులాంగిరీ చేస్తూ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. గెలిపించిన ప్రజలను కాదని సీటును కాపాడుకునేందుకు ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని ఆరోపించారు. బడేబాయ్‌ని ఒప్పించి ఎన్ని నిధులు తెచ్చారని నిలదీశారు. పదినెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లోకి కూరుకుపోయారని పేర్కొన్నారు.

జేఎన్టీయూహెచ్‌లో కాంట్రాక్టు అధ్యాపకులకు 11 జీవోను అమలు చేయాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం హైదరాబాద్ (జేఎన్టీయూహెచ్)లోని కాంట్రాక్టు అధ్యాపకులకు 11 జీవోను అమలు చేయాలని కాంట్రాక్టు టీచర్ల సంఘం అధ్యక్షులు బి రాజేశ్‌ఖన్నా డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని జేఎన్టీయూహెచ్ ప్రాంగణంలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర విశ్వవిద్యాలయాల్లో అమలు చేసినట్టుగానే జేఎన్టీయూహెచ్‌లోనూ 11 జీవోను అమలు చేయాలని కోరారు. 224 మంది కాంట్రాక్టు అధ్యాపకులకు తగిన జీతం, ఉద్యోగ భద్రత కల్పించాలని సూచించారు. వారి జీవన పరిస్థితిని మెరుగుపర్చాలనీ, విద్యార్థుల భవిష్యత్‌కు తోడ్పాడే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె శ్రీనివాస్‌రెడ్డి, దేవేందర్, రాజేశ్, రమేష్, అశోక్, రంజిత్, కరుణాకర్, నరేందర్, చారి, యాదగిరి, నరేష్, మానస తదితరులు పాల్గొన్నారు.

న్యాయవివాదాల్లేకుండా 317 జీవో ఉద్యోగుల కేటాయింపు

- మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 317 జీవోపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సమావేశమైంది. వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సభ్యులు మంత్రి డి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. స్థానికత ప్రకారం ఉద్యోగుల కేటాయింపుపై సుదీర్ఘంగా చర్చించారు. న్యాయ వివాదాలు తలెత్తకుండా 317 జీవోలో ఉద్యోగుల కేటాయింపు జరగాలని అభిప్రాయపడింది. స్థానికతకు అవరోధంగా ఉన్న నిబంధనలపై మంత్రులు దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబులు న్యాయ నిపుణులతో సుమారు మూడు గంటలకు పైగా చర్చించారు. ఈ కమిటీలో రాష్ట్రపతి ఉత్తర్వుల్లో స్థానికత అంశానికి అవరోధంగా ఉన్న చట్టపరమైన నిబంధనలను సవరించడానికి కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని న్యాయ నిపుణులైన ఏజీ, న్యాయ శాఖ అధికారులు క్యాబినెట్ సబ్ కమిటీ దృష్టికి తెచ్చారు. 317 జీవోలో భాగంగా స్పౌజ్, మ్యూచువల్, మెడికల్ గ్రౌండ్ లలో ఉద్యోగుల కేటాయింపుపై మంత్రివర్గ ఉపసంఘం సానుకూలత వ్యక్తం చేసింది. త్వరలో ఉద్యోగుల కేటాయింపుపై ఉత్తర్వులను వెల్లడించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించింది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి మహేష్ కుమార్ ఎక్కా, విద్యాశాఖ డైరెక్టర్ వెంకట నరసింహారెడ్డి, పీఆర్సీ చైర్మెన్ శివశంకర్, న్యాయశాఖ అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వచ్చే నెల 5న గుగులోత్ ధర్మా ప్రథమవర్ధంతి

- ఖమ్మంలో రాష్ట్రస్థాయి గిరిజన సమ్మేళనం :

కరపత్రాన్ని ఆవిష్కరించిన రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రజా ఉద్యమాల సారథి, గిరిజన సంఘం వ్యవస్థాపక నాయకులు గుగులోత్ ధర్మా ప్రథమ వర్ధంతిని వచ్చేనెల 5న నిర్వహించనున్నారు. ఆ సందర్భంగా తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో వచ్చే నెల రెండు రోజుల పాటు (5,6 తేదీల్లో) ఖమ్మంలో నిర్వహించనున్నట్టు తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాం నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం అవిష్కరించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం ధర్మ నాయక్, ఆహ్వాన సంఘం చైర్మెన్ బానోత్ విజయ బాయి, ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం, బానోత్ బాలాజీ, భూక్యా కృష్ణ, మూడ్ గన్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గుగులోత్ ధర్మా ప్రజా నాయకుడని తెలిపారు. రాష్ట్ర స్థాయి గిరిజన సమ్మేళనానికి తాను కచ్చితంగా హాజరవుతానని హామీ ఇచ్చారు.

ఏపీ మద్యం షాపుల డ్రాలో ఇతర రాష్ట్రాల వారికీ అవకాశం

అమరావతి: నూతన మద్యం షాపుల డ్రాలో ఇతర రాష్ట్రాల వారు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని ఎక్సైజ్‌శాఖ నిర్ణయించింది. ఈ మేరకు ఆ శాఖ ముఖ్యకార్యదర్శి ముకేష్ కుమార్ మీనా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇతర రాష్ట్రాల వారు దరఖాస్తు చేసుకునేందుకు, అక్కడి బ్యాంక్‌లలో తీసిన రూ.2 లక్షల నాన్ రిఫండబుల్ డిడిలు, సిఎఫ్ఎంఎస్ అందించిన సిటిజన్ చలాన్‌లను ఆమోదించాలని క్షేత్రస్థాయి నుంచి అభ్యర్థనలు రావడంతో ఈ మేరకు నోటిఫికేషన్‌లో సవరణలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కేంద్రం మద్దతు, హామీకి థ్యాంక్స్

- డిసెంబర్‌లో వైజాగ్ రైల్వే జోన్‌కు శంకుస్థాపన
- పోలవరం అంచనాలకు క్యాబినెట్ ఆమోదానికి ధన్యవాదాలు
- ప్రధాని మోడీతో ఏపీ సీఎం చంద్రబాబు సుదీర్ఘ భేటీ
- కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో భేటీ



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం ఇస్తోన్న మద్దతు, హామీకి కృతజ్ఞతలు తెలిపానని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు అన్నారు. డిసెంబర్‌లో వైజాగ్ రైల్వే జోన్‌కు శంకుస్థాపన చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే పోలవరం ప్రాజెక్టు సవరించిన అంచనాలకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపినందుకు ప్రధాని మోడీకి ధన్యవాదాలు తెలిపారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా సోమవారం ఢిల్లీకి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రధాని మోడీ, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో వేర్వేరుగా భేటీ అయ్యారు.

తొలుత ప్రధాని మోడీతో 7 లోక్ కళ్యాణ్ మార్గ్‌లో ఆయన నివాసంలో భేటీ అయ్యారు. దాదాపు గంట సేపు జరిగిన భేటీలో రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. బుడమేరు వరదలపై నివేదిక ఇచ్చిన తరువాత తొలిసారి ప్రధాని మోడీతో భేటీ అయిన సీఎం చంద్రబాబు వరదలకు నష్టపోయిన రాష్ట్రానికి మరిన్ని నిధులు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. అలాగే పోలవరం ప్రాజెక్ట్ పనులు తిరిగి ప్రారంభించాలని, మరో సీజన్ నష్టపోకుండా నవంబర్‌లో వరద తగ్గుముఖం పట్టగానే కొత్త డయాఫ్రంవాల్ నిర్మాణ పనులు ప్రారంభించి వేసవి కల్లా పూర్తిచేసేలా సహకరించాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. భేటీ అనంతరం "ప్రధానితో ఫలవంతమైన సమావేశం జరిగింది. పోలవరం ప్రాజెక్టు రివైజ్డ్ వ్యయ అంచనాలకు క్యాబినెట్ ఆమోదం తెలిపినందుకు అయనకు కృతజ్ఞతలు తెలిపాను. ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న పరిణామాలను ఆయనకు వివరించాను.అని చెప్పారు. చంద్రబాబు వెంట కేంద్ర మంత్రులు కె.రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయులు ఉన్నారు.

ఏపీలో రైల్వే రూ. 73,743 కోట్ల పెట్టుబడి

కేంద్ర రైల్వే, ఐటీ, సమాచార శాఖల మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. ఈ భేటీ మాత్రం రాష్ట్ర ముఖ్యమంత్రి అధికారిక నివాసం 1 జన్‌పథ్‌లో గంటసేపు భేటీ జరిగింది. వైజాగ్‌ని ప్రధాన కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటుకు సంబంధించిన దీరకాలంగా పెండింగ్‌లో ఉన్న హామీని ముందుకు తీసుకెళ్లినందుకు ధన్యవాదాలు తెలిపాను. డిసెంబరు నాటికి కొత్త జోన్‌కు శంకుస్థాపన చేస్తారని ఆశాభావం ఉంది. ఆంధ్రప్రదేశ్ అంతటా వివిధ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో రైల్వే రూ. 73,743 కోట్ల పెట్టుబడి పెడుతుందని రైల్వే మంత్రి తెలియజేశారు. ఈ ప్రాజెక్టులలో ఆంధ్రప్రదేశ్‌లో హౌరా-చెన్నై మధ్య నాలుగు లైనింగ్, 73 స్టేషన్లను ఆధునీకరించడం, మరిన్ని లోకల్ రైళ్లను ప్రవేశపెట్టడం ఉన్నాయి. ఏపీలో లాజిస్టికల్ అండ్ కమ్యూటర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను బలోపేతం చేయడానికి ఇండియన్ రైల్వేలతో భాగస్వామ్యం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎదురుచూస్తోంది" అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

మెడికల్ కోర్సుల్లో ఈడబ్ల్యూఎస్ కోటా అమలు చేయడం లేదు

- కామారెడ్డి ఎమ్మెల్యే కోర్టు ధిక్కరణ పిటిషన్
- అధికారులకు హైకోర్టు నోటీసులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ మెడికల్ కోర్సుల్లో ఈడబ్ల్యూఎస్ (ఆర్థికంగా వెనుకబడిన తరగతుల) రిజర్వేషన్‌లు అమలు చేయడం లేదంటూ బీజేపీ కామారెడ్డి ఎమ్మెల్యే కె వెంకట రమణారెడ్డి కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను దాఖలు చేశారు. హైకోర్టు చీఫ్ జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె శ్రీనివాసరావులతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఈడబ్ల్యూస్ రిజర్వేషన్లను ఎందుకు అమలు చేయడం లేదని అధికారులను హైకోర్టు ప్రశ్నించింది. అమలు చేయకపోవడంపై కోర్టు ధిక్కరణ కింద ఎందుకు పరిగణించరాదో చెప్పాలని నోటీసులు జారీ చేసింది. కోర్టుకు హామీ ఇచ్చి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను అమలు చేయకపోవడం కోర్టుధిక్కారమే అవుతుందనీ, కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించడాన్ని కోర్టు ధిక్కరణ కింద ఎందుకు పరిగణించరాదో తెలియజేస్తూ పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. వైద్యఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తు, కాళోజీ నారాయణరావు వైద్యవిశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్ సంధ్యలకు నోటీసులు జారీ చేసింది. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) నిబంధనల ప్రకారం ఈడబ్ల్యూఎస్‌కు రిజర్వేషన్‌లు కల్పిస్తామంటూ ప్రభుత్వం హైకోర్టుకు ఇచ్చిన హామీ అమలు చేయలేదని పిటిషనర్ న్యాయవాది వాదించారు. 2024-25 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్, పీజీ కోర్సుల్లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను అమలు చేయాలంటూ ఆగస్టు 28న పిటిషనర్ వినతిపత్రం సమర్పించినా చర్యలు తీసుకోలేదంటూ పిటిషన్ దాఖలు చేశారన్నారు. ఆ పిటిషన్‌ను గతంలో విచారించిన హైకోర్టు గతనెల 20న మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎన్ఎంసీ) మార్గదర్శకాల ప్రకారం ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ మెడికల్ కోర్సుల్లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కల్పిస్తామన్న అడ్వకేట్ జనరల్ ఎ సుదర్శన్‌రెడ్డి హామీ ఇచ్చినప్పటికీ అమలు చేయలేదన్నారు. ఏజీ హామీని హైకోర్టు నమోదు చేసిన ఆ పిటిషన్‌పై విచారణను మూసివేసిందన్నారు. మెడికల్ అడ్మిషన్లలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేయలేదన్నారు. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై ఈమెయిల్ ద్వారా పిటిషనర్ నోటీసులు పంపినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కోర్టు ఉత్తర్వులను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించిన అధికారులను కోర్టు ధిక్కరణ కింద శిక్షించాలని కోరారు. వాదనలను విన్న హైకోర్టు, అధికారులకు కోర్టు ధిక్కరణ చర్యలు ఎందుకు తీసుకోరాదో చెప్పాలంటూ నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

ఇంజినీరింగ్ కాలేజీల సీట్లపైనా కోర్టు ధిక్కరణ పిటిషన్లు

ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో సీఎస్ఈలో సీట్ల పెంపునకు అనుమతించాలంటూ గతంలో హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులు అమలు చేయలేదంటూ పలు ఇంజినీరింగ్ కాలేజీలు కోర్టు ధిక్కరణ వ్యాజ్యాలను దాఖలు చేశాయి. వీటిని చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె శ్రీనివాస్‌రావులతో కూడిన ద్విసభ్య ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. కోర్టు ఉత్తర్వులను ఎందుకు అమలు చేయలేదో చెప్పాలని అధికారులకు నోటీసులు జారీ చేసింది. హైకోర్టు ఉత్తర్వులను సుప్రీం కోర్టు సమర్థించిన తర్వాత కూడా ఎందుకు అమలు చేయలేదో చెప్పాలని కోరింది. కోర్టు ఆదేశాలను అమలు చేయకపోవడాన్ని కోర్టు ధిక్కరణగా ఎందుకు పరిగణించరాదో వివరించాలని ఆదేశించింది. ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, సాంకేతిక విద్య కమిషనర్ ఎ శ్రీదేవసేన, ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్, టీజీఈఏపిసెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్‌లకు నోటీసులు జారీ చేసింది. సమగ్ర వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో ఏఐసీటీఈ, జెఎన్టీయూలు ఆమోదించిన ప్రకారం కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్, ఇతర కోర్సుల్లో సీట్ల పెంపునకు అనుమతించాలనీ, వాటి భర్తీకి మాప్ అప్ కౌన్సెలింగ్ నిర్వహించాలని సెప్టెంబరు తొమ్మిదిన హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వులను అమలు చేయకపోవడంపై కేఎంఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ, ఎంఎల్ఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఎంజీఆర్, సీఎంఆర్ ఇంజినీరింగ్ కాలేజీ, చంద్రమ్మ ఎడ్యుకేషనల్ సొసైటీ, మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ, విద్యాజ్యోతి ఎడ్యుకేషనల్ సొసైటీ తదితర కాలేజీలు కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశాయి. అధికారులకు నోటీసులు జారీ చేసిన హైకోర్టు విచారణను వాయిదా వేసింది.

ఆ రూల్స్ అమలుచేస్తే మెడికల్ అడ్మిషన్లలో స్థానిక కోటాకు అర్హుడే

నిబంధనల ప్రకారం తెలంగాణలో వరుసగా నాలుగేండ్లు నివాసం ఉండి, అర్హత పరీక్ష నీట్ రాసినట్లయితే మెడికల్ అడ్మిషన్లలో స్థానిక కోటా కింద పరిగణించాలని కాళోజీ నారాయణరావు వైద్య విశ్వవిద్యాలయానికి హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. 2019 నుంచి తెలంగాణలో ఉంటూ ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించినప్పటికీ స్థానిక కోటా కింద పరిగణించకపోవడం అన్యాయమంటూ అనమ్తా ఫరూక్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె శ్రీనివాసరావులతో కూడిన ద్విసభ్య ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది వాదనలు వినిపిస్తూ పిటిషనర్ పదో తరగతి వరకు దుబాయ్‌లో చదువుకున్నారనీ, 2019లో తెలంగాణకు వచ్చి ఇక్కడే ఇంటర్మీడియట్ పూర్తి చేశారని చెప్పారు. నాలుగేండ్లు స్థానిక నివాసానికి సంబంధించి జులై 17న శేరిలింగంపల్లి ఎమ్మార్వో నివాస ధ్రువీకరణ పత్రాన్ని కూడా ఇచ్చారని వివరించారు. అయినప్పటికీ పిటిషనర్‌ను స్థానికేతర కోటా కింద చూపడం చట్ట వ్యతిరేకమని ప్రకటించాలని కోరారు. వాదనల తర్వాత హైకోర్టు, నిబంధనల ప్రకారం తెలంగాణలో వరుసగా నాలుగేండ్లు చదివి ఉండటంగానీ, నివాసంగానీ ఉండాలనీ, దీంతోపాటు నీట్ అర్హత పరీక్ష తెలంగాణలో ఉత్తీర్ణత సాధించి ఉండాలనే నిబంధనలను గుర్తు చేసింది. దీని ప్రకారం పిటిషనర్ వరసగా నాలుగేండ్లు తెలంగాణలో నివాసం ఉండటంతోపాటు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత, నీట్ తెలంగాణలో ఉత్తీర్ణత సాధించినందున మెడికల్ అడ్మిషన్లలో స్థానిక కోటా కింద పరిగణించాలని ఆదేశించింది.

భూకేటాయింపు ప్రభుత్వ విధానం 2007 పిల్‌లో తీర్పు

ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన భూముల కేటాయింపులను సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌లో ఉత్తర్వుల జారీకి హైకోర్టు నిరాకరించింది. భూకేటాయిపులనేది ప్రభుత్వ విధానమని వెల్లడించింది. విధాన నిర్ణయాల్లో కోర్టులు జోక్యం చేసుకోబోవని తెలిపింది. ఇండస్ట్రియల్, ఐటీ కారిడార్స్ డెవలప్‌మెంట్ కోసం ప్రభుత్వం భూమి కేటాయించిన తర్వాత కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయనీ, వేలమందికి ఉపాధి కల్పన జరిగిందని తెలిపింది. భూమి కేటాయింపుల తర్వాత పరిశ్రమలను ఏర్పాటు చేయని కంపెనీల కేటాయింపులను రద్దు చేయాలంది. 2007 నాటి పిల్‌పై విచారణను సోమవారం మూసి వేసింది. 2001 నుంచి 2006 మధ్య పలు పరిశ్రమలు, సంస్థలు, వ్యక్తులకు నాలుగున్నర వేల ఎకరాల భూమి కేటాయింపు చేయడాన్ని సవాల్ చేసిన పిల్‌పై చీఫ్ జస్టిస్ బెంచ్ తీర్పు చెప్పింది. ఇందూటెక్, బ్రాహ్మణి ఇన్‌ఫ్రాటెం లిమిటెడ్ సహా జెటీ హోల్డింగ్స్, స్టార్గ్ ప్రాపర్టీస్, అనంత టెక్నాలజీస్‌లకు భూమి కేటాయింపుల తర్వాత ఏవిధమైన నిర్మాణాలు చేయనందున ఆ కేటాయింపులను రద్దు ప్రక్రియ నాలుగు నెలల్లో పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇతర భూముల్లో ఏర్పాటైన కంపెనీల వల్ల ఎంతోమందికి ఉపాధి లభించిందనీ, వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపింది. కాబట్టి భూకేటా యింపుల్లో జోక్యం చేసుకోబోమని తీర్పు చెప్పింది.

వన్యప్రాణుల రక్షణ.. మనిషి బాధ్యత

- ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

అమరావతి : వన్యప్రాణులను రక్షించుకోవడం మనిషి బాధ్యత అని ఉప ముఖ్యమంత్రి, అటవీశాఖ మంత్రి పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. మనపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ఇతర జీవ రాశులన్నింటినీ రక్షించుకుంటేనే మనిషి జీవితం స్వచ్ఛంగా సాగిపోతుందని అన్నారు. మంగళగిరిలోని అరణ్య భవన్‌లో జరిగిన 70వ వన్యప్రాణి వారోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. వన్యప్రాణులు, సముద్ర జీవులు, ఇతర జీవరాశి పూర్తి మనుగడలో ఉంటేనే మనిషికి స్వచ్ఛమైన గాలి, నీరు అందుతుందని తెలిపారు. ఇతర జీవుల మనుగడపై మన ఉనికి ఆధారపడి ఉందనే విషయం నిత్యం గుర్తుంచుకోవాలని సూచించారు. పర్యావరణ, వన్యప్రాణుల సంరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. వన్యప్రాణుల రక్షణ అనేది జీవన విధానంలో భాగం కావాలని సూచించారు. సముద్ర జీవుల్ని రక్షించడానికి ప్రత్యేకంగా ఓ సంస్థ పనిచేయడం తనకు ఆనందం కలిగించిందన్నారు. కొన్ని అవసరాల రీత్యా సముద్ర జీవులను మనిషి వేటాడుతున్నారని, విశిష్టమైన జాతులను మెడిసన్ కోసం, ఇతర అవసరాల కోసమంటూ సేకరిస్తున్నారని తెలిపారు. సేకరించే మనిషే వాటి జాతిని పెంచేందుకు కూడా ఆలోచన చేయాలని అన్నారు. లేదంటే భవిష్యత్తు తరాలకు ఈ విశిష్టమైన, అరుదైన సంపదను ఇవ్వలేని పరిస్థితులు ఏర్పడతాయని చెప్పారు. భవిష్యత్తు తరాలకు బంగారం లాంటి పర్యావరణాన్ని అందించాలంటే చిన్నప్పటి నుంచే వారికి ప్రకృతి ప్రాధాన్యం, పర్యావరణ అవసరాలను తెలియజేయాలని అన్నారు. పర్యావరణాన్ని కాపాడాలంటే తమ వంతుగా రోజువారీ వాడుతున్న ప్లాస్టిక్‌ను క్రమంగా తగ్గించాలని, మొక్కల పెంపకం జీవన విధానంలో భాగం కావాలని చెప్పారు. పిల్లల నుంచి పెద్దల వరకు పర్యావరణ హితం కోసం ఆలోచించి ప్రతి పని చేయాలన్నారు. పర్యావరణాన్ని రక్షించడం రోజువారీ జీవన విధానంలో భాగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ఎయిర్‌షో మృతుల కుటుంబాలకు
రూ.5 లక్షల పరిహారం

చెన్నై : చెన్నై ఎయిర్‌షోలో అస్వస్థతకు గురై మరణించిన ఐదుగురి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించనున్నట్లు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ప్రకటించారు. విపరీతమైన వేడి, ఇతర వైద్య కారణాల వల్ల ఐదుగురు తమ విలువైన ప్రాణాలు కోల్పోవడం విచారకరమని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఆదివారం నిర్వహించిన ఎయిర్‌షోకు సంబంధించి ఐఎఎఫ్ అభ్యర్థనకు మించి ప్రభుత్వం సహకరించిందని, పోలీస్, ఫైర్ అండ్ రెస్క్యూ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్లు, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్, హెల్త్ డిపార్ట్‌మెంట్ సమన్వయం చేసుకుని అవసరమైన ఏర్పాట్లు చేయడం వల్లే తొక్కిసలాట జరగలేదని తెలిపారు. ఊహించినదానికంటే ఎక్కువమంది తరలిరావడంతో వారు తమ వాహనాల వద్దకు, బస్సుల వద్దకు వెళ్లడానికి ఇబ్బందిపడ్డారని వివరించారు. ఈ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటామని పేర్కొన్నారు.

'అభయ' కేసులో సీబీఐ చార్జిషీట్

కోల్‌కతా : కోల్‌కతా ట్రైనీ వైద్యురాలు (అభయ) హత్య కేసులో సీబీఐ చార్జిషీట్ నమోదు చేసింది. సోమవారం మధ్యాహ్నం సీల్డ్ కవర్‌లో చార్జ్‌షీట్‌ను ప్రత్యేకోర్టుకు సమర్పించింది. నిందితుడు సంజయ్ రాయ్ వైద్యురాలిని అత్యాచారం చేసి హత్య చేసినట్లు చార్జ్‌షీటులో పేర్కొన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. వైద్యురాలు సెమినార్ హాల్‌లో నిద్రిస్తున్న సమయంలో నిందితుడు ఈ ఘాతుకానికి పాల్పడినట్టు పేర్కొన్నాయి. సంజయ్ రాయ్ ప్రధాన నిందితుడని 200 మంది ఇచ్చిన వాంగ్మూలాలను నమోదు చేసినట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. ఇంకా అనుమానితులు ఉన్నారా, సామూహిక లైంగికదాడి కేసా? అన్న అంశంపై ఇంకా దర్యాప్తు జరుగుతోందని పేర్కొన్నాయి.

ఆగస్టు 9న ఆర్‌జి కర్ ఆస్పత్రి మెడికల్ కళాశాలలో అత్యవసర విభాగంలో నైట్ డ్యూటీ చేసిన 31 ఏండ్ల జూనియర్ వైద్యురాలు విశ్రాంతి తీసుకోవడానికి వచ్చినప్పుడు ఈ దారుణ ఘటన జరిగిన విషయం విదితమే.

ఏపీలో పిడుగుపాటుకు ఇద్దరు మృతి



సంబేపల్లి : అన్నమయ్య జిల్లాలో పిడుగుపాటుకు ఇద్దరు కార్మికులు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. సంబేపల్లి మండలం శెట్టిపల్లి గ్రామానికి చెందిన పలువురు వ్యవసాయ కార్మికులు ఎస్.సోమవరం గ్రామానికి చెందిన రైతు పొలంలో టమోటా పంట కోసేందుకు కూలి పనులకు వెళ్లారు. భారీ ఈదురుగాలులకు తోడు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి పిడుగు పడింది. దీంతో కార్మికులు శెట్టిపల్లి మల్లీశ్వరమ్మ (43), శెట్టిపల్లి శంకరమ్మ (40) అక్కడికక్కడే మృతి చెందారు. కార్తీక్, రెడ్డమ్మ, మంగమ్మ, జయమ్మ, అమర్నాథ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కార్తీక్ పరిస్థితి విషమంగా ఉండడంతో కడప రిమ్స్‌కు తరలించారు. మృతుల కుటుంబ సభ్యులను, గాయపడిన వారిని అన్ని విధాలా ఆదుకుంటామని విజయవాడ క్యాంపు కార్యాలయం నుంచి మృతుల కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడి భరోసానిచ్చారు. మృతుల కుటుంబాలకు రూ.పది లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గడికోట శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.

'గ్యాస్' గ్యాంబ్లింగ్..!

ఆరు గ్యారంటీలలో ఒక్కటైన మహాలక్ష్మీ పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ గ్యాస్ పక్కదారి పట్టినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. రేషన్ కార్డుదారులకు ఇస్తున్న రూ.500 గ్యాస్ సిలిండర్లను కొందరు అక్రమార్కులు వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారు. చివరికి గ్యాస్ ఏజెన్సీలు సైతం డెలివరీ బాయ్స్ ద్వారా ఈ దందా నడుపుతున్నట్టు వార్తలు వస్తున్నా.. పౌర సరఫరాల శాఖ పట్టనట్టే ఉండటం అనుమానాలకు తావిస్తోంది.

- రూ.500 సబ్సిడీ సిలిండర్ల దందా
- ఖమ్మంలో ఇష్టారాజ్యంగా వాణిజ్య అవసరాలకు వినియోగం
- విచ్చలవిడిగా రీ ఫిల్లింగ్ సెంటర్లు
- పౌర సరఫరాల శాఖ కనుసన్నల్లోనే ఈ వ్యవహారం..?

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/ ఖమ్మం

'కంచె చేను మేసిన చందం'గా ఏజెన్సీలే సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను పక్కదారి పట్టిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ప్రయివేటు వ్యక్తులు, డెలివరీ బాయ్స్‌ను అడ్డుపెట్టుకుని డీలర్లు ఈ దందా నడుపుతున్నట్టు తెలుస్తోంది. రూ.500 సబ్సిడీ గ్యాస్ సిలిండర్ ఒక్కోదానికి రూ.150-200 అదనంగా చెల్లించి వినియోగదారుల పేరిట డ్రా తీస్తున్నట్టు తెలిసింది. తక్కువ వినియోగం ఉన్న లబ్దిదారులను ఎంచుకొని వారి ప్రమేయం లేకుండానూ ఈ వ్యవహారం నడుపుతున్నట్టు సమాచారం. వినియోగదారుల ప్రమేయం ఉన్నా లేకున్నా రిజిస్టర్ మొబైల్ నంబర్లకు మెసేజ్‌లు వచ్చి గ్యాస్ సిలిండర్ల గ్యాంబ్లింగ్ కొనసాగుతున్నా పౌరసరఫరాల శాఖ పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. దీనిని ఆదిలోనే ఆపకపోతే రాష్ట్రవ్యాప్తంగా 42.90 లక్షల మంది రూ.500 గ్యాస్ వినియోగదారులపై ప్రభావం పడే ప్రమాదం ఉందన్న అభిప్రాయం వ్యక్తమౌతోంది.

విచ్చలవిడిగా రీ ఫిల్లింగ్ సెంటర్లు

ఖమ్మం, వరంగల్, కరీంనగర్ తదితర నగరాలు, కొత్తగూడెం, ఇల్లెందు, సత్తుపల్లి, మధిర, మణుగూరు తదితర పట్టణాల్లో విచ్చలవిడిగా గ్యాస్ రీ ఫిల్లింగ్ సెంటర్లు ఉన్నాయి. ఖమ్మంలోని కమాన్‌బజార్, కస్బాబజార్, బ్రాహ్మణబజార్, నర్సింహస్వామి టెంపుల్, రమణగుట్ట, ముస్తఫానగర్ తదితర అనేక చోట్ల రీ ఫిల్లింగ్ సెంటర్లలో అక్రమ వ్యవహారం నడుస్తున్నట్టు ఆరోపణలున్నాయి. ఇవేకాక పలు హోటల్స్, కార్లకు సైతం గృహ వినియోగ సిలిండర్ల నుంచి గ్యాస్ బదలాయిస్తున్నారు. పండుగలు, శుభకార్యాల సీజన్ కావడంతో ఈ అక్రమ వ్యవహారం మరింతగా సాగుతోంది.



ధాన్యం.. గ్యాస్‌లోనూ అదే తంతు..!

ఇప్పటికే సీఎంఆర్ ధాన్యం బకాయిల్లో ఖమ్మం జిల్లాలో రూ.300 కోట్ల వరకు అవకతవకలు చోటు చేసుకున్నట్టు పౌరసరఫరాల శాఖపై ఆరోపణలు ఉన్నాయి. సీజ్ చేసిన ఒక్క మిల్లు నుంచే రూ.82 కోట్ల అక్రమం వెలుగుచూసింది. జిల్లా పౌరసరఫరాల శాఖలోని ఓ ముఖ్య అధికారి ప్రమేయంపై ప్రధానంగా ఆరోపణలు ఉన్నాయి. గ్యాస్ అక్రమ వ్యవహారంలోనూ ఆ అధికారి ప్రమేయమే ముఖ్యంగా ఉండొచ్చనే ప్రచారం జరుగుతోంది. గతంలో తహసీల్దార్‌గా ఉన్నప్పుడు రూ.వందల కోట్ల అక్రమార్జన గావించినట్టు ఆరోపణలు ఉన్న ఆ అధికారిని పౌరసరఫరాల శాఖకు బదిలీ చేశారు. ఇక్కడ కూడా ఆ అధికారి అదే పంథాను కొనసాగిస్తున్నట్టు చర్చ సాగుతోంది.

తక్కువ వినియోగించే వారే లక్ష్యం

ఏటా రెండు నుంచి మూడు సిలిండర్లను మాత్రమే బుక్ చేసుకునే వినియోగదారులను డీలర్లు గుర్తిస్తున్నారు. వారి ప్రమేయం లేకుండానే వారి పేరిట బుక్ చేసి బ్లాక్‌లో విక్రయిస్తున్నారు. ఈ సమయాన వినియోగదారుడి సెల్ నంబర్‌కు బుక్ చేసినట్టు, డెలివరీ అయినట్టు మెసేజ్‌లు, ఓటీపీలు వస్తుంటాయి. కానీ వీటి కోసం ఎవరూ ఫోన్ చేయరు. ఇవేవీ లేకుండానే పని కానిస్తున్నారు. ఉదాహరణకు ఖమ్మం రూరల్ మండలం కరుణగిరి ప్రాంతానికి చెందిన ఓ వినియోగదారునికి తన ప్రమేయం లేకుండా క్యాష్ మెమో రూ.837.5 బిల్లు జనరేట్ అయింది. 2788 ఓటీపీ నంబర్ వచ్చింది. సాయంత్రం 7.18 గంటలకు బిల్లు జనరేట్ అయితే.. అదేరోజు 7.49 గంటలకు డెలివరీ అయినట్టు మెసేజ్ వచ్చింది. ఇందులో ఎక్కడా వినియోగదారుని ప్రమేయం లేకపోవడం గమనార్హం.

ఫిర్యాదులొస్తే చర్యలు తీసుకుంటాం

వినియోగదారుల ప్రమేయం లేకుండా గ్యాస్ బుకింగ్, డెలివరీ, క్యాష్ మెమోలకు సంబంధించిన మెసేజ్‌లపై ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటాం. డొమెస్టిక్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వాడకుండా చూస్తున్నాం. ఎప్పటికప్పుడూ తనిఖీలు చేపడుతున్నాం.

-చందన్‌కుమార్, డీఎస్‌వో, ఖమ్మం